ఈనాడు

విజయవాడ 1-3-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 200

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈనాడు



విజయవాడ 1-3-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 200
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 18+28
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



వేట్లపాలెంలోని బాణసంచా పరిశ్రమ వద్ద ఎగసిపడుతున్న మంటలు. అంతర చిత్రంలో పేలుడు జరిగిన రేకులషెడ్

మృత్యు విస్ఫోటం

బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

20 మంది సజీవ దహనం ● మరో 10 మందికి తీవ్ర గాయాలు

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో పెను విషాదం ● పేలుడు ధాటికి చెల్లాచెదురైన శరీర భాగాలు

5 కి.మీ. దూరం వరకు వినిపించిన శబ్దాలు ● సంఘటనాస్థలికి హుటాహుటిన సీఎం ● ప్రధాని మోదీ సంతాపం



వెలుగులు విరజిమ్మే బాణసంచా అంతులేని అంధకారం మిగిల్చింది.. వేడుకల్లో ఘనంగా పేలే మందుగుండు శ్మశాన నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టింది.. బాణసంచా తయారీలో నిర్లక్ష్యం నిండు ప్రాణాల్ని నిర్దాక్షిణ్యంగా బలిగొంది. కాళ్లూ చేతులూ తెగిపడి.. మాంసం ముద్దల్లా మారిన మృతదేహాలను చూసి బాధిత కుటుంబాల గుండె పగిలింది.

- వివరాలు 3 లో



సామర్లకోట సీహెచ్‌సీ వద్ద బాధితులను పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబు

మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం

ఆర్డీఓ, డీఎస్పీ, అగ్నిమాపక, కార్మికశాఖ అధికారుల సస్పెన్షన్

సీఎం చంద్రబాబు ప్రకటన

కాకినాడ జీజీహెచ్‌లో బాధితులకు పరామర్శ

ప్రమాదంపై కథనాలు 10లో



వేట్లపాలెంలో పేలుడు జరిగిన బాణసంచా పరిశ్రమ వద్ద మృతదేహాల మధ్య కుటుంబ సభ్యుల రోదనలు

యుద్ధ జ్వాల

ఇరాన్‌పై విరుచుకుపడిన అమెరికా, ఇజ్రాయెల్

ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ క్షిపణుల వర్షం

ఇరాన్ రక్షణ మంత్రి, ఐఆర్‌జీ కమాండర్ హతమైనట్లు రాయిటర్స్ కథనం

201 మంది మృతి.. అందులో 86 మంది విద్యార్థినులే..

దుబాయ్, టెల్ అవీవ్, వాషింగ్టన్: పశ్చిమాసియాలో మరో భీకర యుద్ధం మొదలైంది. గల్ఫ్ అంతటా యుద్ధాగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఇరాన్ లక్ష్యంగా శనివారం అమెరికా, ఇజ్రాయెల్ భారీ దాడులకు దిగాయి. ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో దాడి చేసింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అగ్రరాజ్యం చేపట్టిన ఈ దాడులతో దేశమంతా అట్టుడికింది. ఈ దాడుల్లో ఇరాన్ రక్షణ శాఖ మంత్రి అమీర్ నసీర్జాదే, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్


(మిగతా 15లో)



ఇరాన్ క్షిపణుల దాడితో ఇజ్రాయెల్‌లోని లాట్రూన్‌లో వంతెన కింద తన బిడ్డతో తలదాచుకున్న మహిళ

ఖమేనీ చనిపోయినట్లే!

ఆ మేరకు సంకేతాలున్నాయి: నెతన్యాహు



ఖమేనీ

జెరూసలెం: వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం నాయకుడు ఖమేనీ నివాస ప్రాంగణం నేలమట్టమైనట్లు ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు పేర్కొన్నారు. "ఇప్పటివరకూ అందిన సంకేతాల ప్రకారం ఆ నిరంకుశుడు జీవించి ఉండకపోవచ్చు" అని ఆయన తెలిపారు. ఖమేనీ ప్రాంగణంపై శనివారం ఉదయం 30 బాంబులను ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. అయితే ఖమేనీ సురక్షితంగానే ఉన్నారని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ దళం స్పష్టంచేయడం గమనార్హం.



ఇజ్రాయెల్ క్షిపణి దాడితో ఇరాన్‌లోని మినాబ్‌లో ధ్వంసమైన పాఠశాల



ఇరాన్ క్షిపణులు ప్రయోగించడంతో బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం వద్ద ఉవ్వెత్తున ఎగసిన పొగ

త్వరలో 'ఏఐ డాక్టర్' సేవలు

- కర్నూలులో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్
- దిగ్గజ సంస్థల రాకతో ఉత్తరాంధ్రలో పేదరికం దూరం
- గంజాయి బ్యాచ్, రౌడీలూ.. ఖబడ్దార్!
- రావివలస ప్రజావేదికలో సీఎం చంద్రబాబు
- పేదల ఇళ్లకు వెళ్లి, సామాజిక పింఛన్ల పంపిణీ

13 లో



విజయనగరం జిల్లా రావివలస పంచాయతీ పైలపేటలో పింఛను లబ్ధిదారు రొంగలి ఎల్లయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం

"పేదలు ఎక్కడుంటే నేనూ అక్కడుంటా. పేదరికంపై పోరాడుతూనే అన్నివర్గాలకూ అండగా నిలిచేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఏటా 67 లక్షల మందికి పింఛన్ల కోసం రూ.33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఆడబిడ్డల రక్షణకు అగ్ర ప్రాధాన్యమిస్తాం. కేంద్రం అన్నివిధాలా సహకరిస్తోంది. – చంద్రబాబు



రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో జరిగిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ

దేశవ్యాప్తంగా మొదలైన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

అజ్‌మేర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

రూ.5,456 కోట్లతో తితిదే వార్షిక బడ్జెట్

హుండీ ఆదాయం రూ.1,880 కోట్లు అంచనా

లోపలి పేజీల్లో »

సీఎస్‌గా సాయిప్రసాద్ బాధ్యతల స్వీకరణ 13లో

ఇదీ సంగతి!



నా మాట వింటావా.. లేదా..?!

పెట్టుబడిదారులు.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు లోకేశ్, రవీంద్ర, ఎమ్మెల్యే విజయ్‌కుమార్, పరిశ్రమ ప్రతినిధులు

- ఉత్తరాంధ్రను ఎకనమిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి

రాంబిల్లిలో బ్లూజెట్ హెల్త్‌కేర్ యూనిట్‌కు శంకుస్థాపన

ఈనాడు డిజిటల్, అనకాపల్లి: 'ఒకసారి మా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న తర్వాత అది మీ ప్రాజెక్టు కాదు.. మా సొంత ప్రాజెక్టుగా భావిస్తాం. పెట్టుబడిదారులను బయట వ్యక్తుల్లా కాకుండా అభివృద్ధి భాగస్వాములుగా చూస్తాం' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సీతపాలెంలో ప్రముఖ ఫార్మా సంస్థ బ్లూ జెట్ హెల్త్ కేర్ యూనిట్‌కు శనివారం లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

(మిగతా 3లో)

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా తెట్టు రైల్వేస్టేషన్ సమీపంలో చెవురు గ్రామం వద్ద రామాయపట్నం కార్గో రైల్ టెర్మినల్‌కు 153.77 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఏపీ మారిటైమ్ బోర్డు ఈ భూములను సేకరించి, ఏపీఐఐసీకి ఇస్తే, ఆ సంస్థ నుంచి ఆర్‌సీఆర్‌టీకి భూములు బదలాయించేలా ఉత్తర్వు ఇచ్చారు.

FORM IV
(See rule 8)

1. Place of Publication	:	Vijayawada, Hyderabad, Visakhapatnam, Kadapa, Tirupati, Anantapuram, Karimnagar, Rajahmundry, Suryapet, Guntur, Nellore, Kurnool, Srikakulam, Tadepalligudem, Warangal, Nizamabad, Khammam, Ongole, Mahabubnagar, Chennai, Bangalore.
2. Periodicity of its Publication	:	Daily
3. Printer's Name	:	M.NAGESWARA RAO
Whether Citizen of India	:	Yes
(If foreigner, state the country of origin)	:	-
Address	:	8-3-167/R/76/403, Sri Sai Balaji Nivas, Road No.2, Rajeev Nagar, Yousufguda, Hyderabad- 500 045. Telangana State
4. Publisher's Name	:	M.NAGESWARA RAO
Whether Citizen of India	:	Yes
5. Editor's Name	:	M.NAGESWARA RAO
Whether Citizen of India	:	Yes
(If foreigner, state the country of origin)	:	-
Address	:	8-3-167/R/76/403, Sri Sai Balaji Nivas, Road No.2, Rajeev Nagar, Yousufguda, Hyderabad- 500 045. Telangana State
6. Name and addresses of Individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the total capital	:	Ushodaya Publications (A Division of Ushodaya Enterprises Private Ltd.) Regd. Office: 3rd Floor, Corporate Building, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District, Telangana State-501 512. RAMOJI RAO HUF Ramoji Film City Ranga Reddy District-501 512. M/s MARGADARSI CHIT FUND PVT. LTD., 5-10-195, Fateh Maidan Road, Saifabad, Hyderabad-500 004. M/s USHAKIRON MOVIES PVT. LTD., Ramoji Film City, Ranga Reddy District - 501 512 M/s COLORAMA PRINTERS PVT. LTD., Plot No. 15/A/1, Sri Venkateswara Co-Operative Industrial Estate, Jeedimetla, Hyderabad - 500 055. M/s NETWORK 18 MEDIA & INVESTMENTS LIMITED 1st Floor, Empire Complex, 414-Senapati Bapat Marg, Lower Parel, Mumbai - 400 013. M/s SIDDHANT COMMERCIALS PVT. LTD. 606, Capstone, Kalgi Cross Road Ellisbridge Ahmedabad - 380006

I, M.Nageswara Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

March 1st 2026 — Sd/- M.NAGESWARA RAO, Publisher

రెరాలో నమోదు కాని ప్రాజెక్టుల్లో కొనొద్దు

- 'ఈనాడు స్థిరాస్తి-క్రెడాయ్ హైదరాబాద్' వెబినార్‌లో టీజీ రెరా ఛైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ



ఈనాడు, హైదరాబాద్: 'జీవితంలో కష్టపడి కూడబెట్టిన సొమ్ముతో స్థిరాస్తి కొనుగోలు చేసేటప్పుడు రెరాలో నమోదైన ప్రాజెక్టులనే ఎంచుకోండి. అన్ని వివరాలు పరిశీలించాకే కొనుగోలు నిర్ణయం తీసుకోండి. రెరాలో నమోదైతే పారదర్శకత, జవాబుదారీతనం, కొనుగోలుదారులకు హక్కులు ఉంటాయి. అలా కాకుండా ప్రీలాంచ్, ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్, కలెక్షన్ ఆఫ్ టోకెన్ ఇలా ఏ పేరుతో విక్రయాలు చేపట్టినా అవి చట్టవిరుద్ధం. వీటిలో కొని మోసపోవద్దు' అని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ఛైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ అన్నారు. 'ఈనాడు స్థిరాస్తి-క్రెడాయ్ హైదరాబాద్' శనివారం నిర్వహించిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. ''598 చదరపు అడుగులు/8 యూనిట్లకు పైన ఉండే నిర్మాణాలన్నీ రెరా పరిధిలోకి వస్తాయి. నివాసమే కాదు వాణిజ్య భవనాలు, కార్యాలయాలు కూడా రెరా పరిధిలోకి వస్తాయి. ఇప్పటివరకు ఇందులో 10,605 ప్రాజెక్టులు రిజిస్టర్ అయ్యాయి. 2686 ఫిర్యాదులు రాగా.. 1767 పరిష్కరించాం. 11 ప్రాజెక్టులను రద్దు చేశాం'' అని తెలిపారు.

వెబ్‌సైట్‌లో 18 అంశాలు

'రెరాలో నమోదు సమయంలోనే.. ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తారు? ఎప్పుడు అందజేస్తారు? సౌకర్యాలు, నాణ్యత, వాటి ప్రమాణాలతోపాటు టైటిల్ వివరాల వరకు 18 అంశాలను రెరా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ప్రాజెక్టు రిజిస్ట్రేషన్ నంబరు ద్వారా పై వివరాలన్నీ కొనుగోలుదారులు తెలుసుకోవచ్చు. అగ్రిమెంట్ ఆఫ్ సేల్, బుకింగ్ లెటర్, సేల్ డీడ్ నమూనాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయి. వీటి ప్రకారం చేస్తేనే చెల్లుతుంది. ఏ ప్రాజెక్టు ఆలస్యమైనా రెరాకు ఫిర్యాదు చేయవచ్చు. మరీ ఆలస్యమైతే బిల్డర్‌ను డిఫాల్టర్‌గా ప్రకటించి.. కొనుగోలుదారులు, అధికారులు, నిర్మాణ సంఘాల ప్రతినిధులతో అసోసియేషన్ ఏర్పాటు చేసి.. నిర్మాణ బాధ్యత వారికే అప్పగిస్తున్నాం. చట్టం రాకముందు అనుమతులు పొంది.. ఇప్పటికీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రాని ప్రాజెక్టులు సైతం రెరా పరిధిలోకి వస్తాయి'' అని సత్యనారాయణ తెలిపారు.

కొనేటప్పుడు బిల్డర్ ట్రాక్ రికార్డు చూడండి

– ఎన్.జైదీప్‌రెడ్డి, అధ్యక్షుడు, క్రెడాయ్ హైదరాబాద్



హైదరాబాద్‌లో సొంత ఇల్లు కోరుకునే వారి కోసం వెయ్యి చదరపు అడుగుల నుంచి 15 వేల చదరపు అడుగుల వరకు నివాసాలు అందుబాటులో ఉన్నాయి. ప్రీమియం నివాసాలే కాకుండా.. పోచారం, మేడ్చల్, పటాన్‌చెరు, ఆదిభట్ల, శంషాబాద్ వంటి శివారు ప్రాంతాల్లో అందుబాటు ధరల్లో ఉన్నాయి. భూముల ధరలు పెరగడంతో ఆకాశహర్మ్యాలను కట్టేందుకు బిల్డర్లు మొగ్గు చూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుబాటు ధరల ఇళ్లకు ప్రోత్సాహకాలిస్తే.. ఈ విభాగంలో మరిన్ని ఎక్కువ నివాసాలను బిల్డర్లు నిర్మించడానికి అవకాశం ఉంటుంది.

కొనే ముందు ఏం చూడాలంటే..: ప్రాజెక్టుకు అన్ని అనుమతులు ఉన్నాయా? లేవా? రెరాలో నమోదైందా? నిర్మాణ సంస్థ, బిల్డర్ చరిత్ర, గత ప్రాజెక్టుల ట్రాక్ రికార్డు చూసి సంతృప్తికరం అనిపిస్తేనే ఇళ్లను కొనుగోలు చేయండి. అనుమతులు లేని ప్రీ లాంచ్ వంటి పథకాల్లో చేరి మోసపోవద్దు.

✦ 'ఈఎంఐ భారం లేకుండా అద్దె చెల్లిస్తాం' వంటి పథకాల విషయానికి వస్తే.. బిల్డర్లకు బ్యాంకులు 10-12 శాతం వడ్డీకి రుణాలు ఇస్తాయి. అదే గృహ కొనుగోలుదారుడికి 8 శాతానికే రుణం వస్తుంది. ఆ రకంగా తమపై భారం తగ్గుతుంది కనుక అద్దె చెల్లిస్తామంటూ ఆఫర్లు పెడుతున్నామని బిల్డర్లు అంటున్నారు. అయితే నిర్మాణ సంస్థ/ బిల్డర్ గత చరిత్ర చూసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

తనఖాలో ఉన్నవాటి కొనుగోలు చెల్లదు

– ప్రముఖ న్యాయవాది ఎం.వి.దుర్గాప్రసాద్



అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్, విల్లా, లేఅవుట్ ప్రాజెక్టులకు అనుమతులిచ్చే ప్రభుత్వ సంస్థలు.. ఆ ప్రాజెక్టులో 10 శాతం భాగాన్ని తనఖా పెట్టుకుంటాయి. దేశంలోనే ఎక్కడా లేని ఈ నిబంధన కారణంగా.. తెలుగు రాష్ట్రాల్లో చాలావరకు ఉల్లంఘనలు తగ్గాయి. ఇలాంటి తనఖా స్థిరాస్తిని కొనుగోలు చేయవచ్చా? అంటే ఇప్పటికే స్థానిక సంస్థలకు తనఖా పెట్టినందున దాన్ని కొనుగోలు చేయడం చెల్లదు.

✦ రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టుల్లో కొంటే చిక్కులు తప్పవు. చట్టం రక్షణ ఉండదు. రెరాలో నమోదైన వాటినే కొనుగోలు చేయండి.

✦ రెరాలో నమోదు కాని ప్రాజెక్టులో ఇప్పటికే కొన్న వారికి ఇబ్బంది లేదురైతే.. సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చు. మోసం ఉంటే క్రిమినల్ కేసు పెట్టవచ్చు. ఆ సంస్థకు రిజిస్ట్రేషన్ లేనందున నిబంధనలు ఉల్లంఘన కింద రెరాకు ఫిర్యాదు చేయవచ్చు.

✦ ఫామ్‌ల్యాండ్ లేఅవుట్‌లు చట్టబద్ధం కావు.

✦ సాగునీటిశాఖ, సిటీలో అయితే హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చి, విచారణ చేపట్టిన తర్వాతే.. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కాకపోయినా హైడ్రా కంచెలు వేస్తోంది. ప్రభుత్వమే పట్టాలిచ్చి.. ఇప్పుడు ఎఫ్‌టీఎల్‌లో భూములున్నాయని అంటే.. మీ వద్ద ఉన్న పత్రాలతో అధికారులను సంప్రదించండి.



రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరికి 'లాక్ ఎన్ ఎస్కేప్' విశేషాలను వివరిస్తున్న జయ్

రామోజీ ఫిల్మ్‌సిటీలో మరో కొత్త ఆకర్షణ

- లాక్ ఎన్ ఎస్కేప్ అందుబాటులోకి..
- ప్రారంభించిన ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రఖ్యాత సినీ స్టూడియో, పర్యాటకుల స్వర్గధామం రామోజీ ఫిల్మ్‌సిటీలో మరో ఆకర్షణ వచ్చి చేరింది. పర్యాటకులను అలరించేలా కొత్తగా ఏర్పాటు చేసిన 'లాక్ ఎన్ ఎస్కేప్'ను రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ సీహెచ్ విజయేశ్వరి శనివారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. లాక్ ఎన్ ఎస్కేప్ డైరెక్టర్ జయ్‌తోపాటు ఫిల్మ్‌సిటీలోని ఆయా విభాగాల ప్రతినిధులను ఆమె అభినందించారు. అనంతరం విజయేశ్వరి స్వయంగా ఫ్లోర్‌లోని 10 విభిన్న సెర్చ్ ఎక్స్‌పీరియన్స్ థీమ్‌లను పరిశీలించి.. విశేషాలను తెలుసుకున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చే పర్యాటకులను లాక్ ఎన్ ఎస్కేప్ బాగా ఆకట్టుకుంటుందని, ఇందులోని థీమ్‌లకు సందర్శకుల నుంచి ఆదరణ ఉంటుందని ఆమె ఆకాంక్షించారు.

ఆద్యంతం ఆకట్టుకునేలా: లాక్ ఎన్ ఎస్కేప్‌లో మొత్తం 10 థీమ్స్ ఉంటాయని.. ప్రతి థీమ్ 15 నిమిషాల్లో పూర్తి చేసేలా రూపొందించినట్లు జయ్ వివరించారు. సినిమాటిక్‌గా ఉండే లాక్ ఎన్ ఎస్కేప్ అన్ని వయసుల వారిని ఆకట్టుకుంటుందని, ప్రతి థీమ్‌లో లభించే క్లూస్ ఆధారంగా శోధిస్తూ.. ఉత్సాహంగా ముందుకు సాగడం థ్రిల్‌ను పంచుతుందని తెలిపారు.



మెరుగైన సమాజం కోసం ఇవి పాటించండి

✦ మీ ప్రతి పనికీ మీరు బాధ్యత వహించడం నేర్చుకోండి. ✦ ప్రకృతి, మనుషుల నుంచి మీరు తీసుకున్నదానికన్నా ఎక్కువగా తిరిగివ్వడం నేర్చుకోండి. ✦ ప్రతి ఒక్కరి పట్ల దయ, గౌరవంతో వ్యవహరించండి. ✦ మూక మనస్తత్వాన్ని విడనాడి, సమాజంపై మీదైన ముద్ర వేయడానికి ప్రయత్నించండి.

– రాబిన్ శర్మ, రచయిత

గ్రహం అనుగ్రహం

1–3–2026 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
త్రయోదశి: రా. 7-04 తదుపరి చతుర్దశి
పుష్యమి: ఉ. 8-39 తదుపరి ఆశ్లేష
వర్జ్యం: రా. 9-02 నుంచి 10-35 వరకు
అమృత ఘడియలు: తె. 6-20 నుంచి
దుర్ముహూర్తం: సా. 4-28 నుంచి 5-15 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.23; సూర్యాస్తమయం: సా.6.02

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	18.0	32.0
తాడేపల్లిగూడెం	22.0	33.0
గుంటూరు	22.0	34.0
కడప	22.0	36.0
రాజమహేంద్రవరం	22.0	37.0
తిరుపతి	22.5	35.5
శ్రీకాకుళం	23.0	30.0
విశాఖపట్నం	23.0	33.0
విజయవాడ	23.0	33.6
ఒంగోలు	23.2	32.5
అనంతపురం	23.2	37.3
కర్నూలు	23.4	36.5

మృత్యు విస్ఫోటం



బాణసంచా పరిశ్రమ పేలుడులో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుణ్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఈనాడు- కాకినాడ, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే- సామర్లకోట గ్రామీణం: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శనివారం పెను విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటం జరిగి 20 మంది సజీవ దహనమయ్యారు. తీవ్ర గాయాలపాలైన మరో పది మందిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)కి తరలించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. పేలుళ్ల ధాటికి అందులో పనిచేస్తున్న కార్మికుల శరీర భాగాలు చెల్లాచెదురైపోయాయి. కాళ్లు, చేతులు తెగి సమీపంలో ఉన్న చెట్లపై పడడంతో ఆ ప్రాంతమంతా భీతావహ పరిస్థితి నెలకొంది. చనిపోయిందెవరో గుర్తుపట్టలేనంతగా మృతదేహాలున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 70 శాతానికిపైగా కాలిన గాయాలతో ఉన్న 9 మందిని జీజీహెచ్‌కు, మరొకరిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారందరి పరిస్థితీ విషమంగానే ఉంది.

కళ్లముందే కాలిపోతున్నా ఆపలేక..

ఘటనా స్థలంలో పనిచేస్తున్న వ్యక్తులు బయటకు రాలేక కళ్లముందే కాలిపోతున్నా వారిని కాపాడే పరిస్థితి లేకపోయింది. ఒక్కపక్క ఎగసిపడుతున్న మంటలు, మరోవైపు భారీ పొగతో ఏం జరుగుతుందో, మంటల్లో ఎంతమంది ఉన్నారో అంచనా వేయలేని స్థితి నెలకొంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను కొంతమేర అదుపులోకి తెచ్చిన తరువాత తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న 10 మందిని గుర్తించి అంబులెన్స్‌ల్లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాణసంచా ముడిసరకు నిల్వలు భారీ ఎత్తున ఉండటంతో మంటలు సుమారు రెండుగంటలకు పైగా మండుతూనే ఉన్నాయి.

ఆ ప్రదేశం మొత్తం పొగ కమ్మేయడం, వరుస పేలుళ్లతో అసలు ఏం జరుగుతుందో తెలియనంత గందరగోళం నెలకొంది.

గాల్లో ఎగిరిపడ్డ శరీర భాగాలు

పేలుడు ధాటికి అక్కడ పనిచేస్తున్న పలువురి శరీర భాగాలు గాలిలో ఎగిరిపడ్డాయి. ఒక మహిళ పుర్రె భాగం పేలిపోయింది. మరో మృతదేహం పేలిపోయి మాంసం ముద్దగా పక్కనే ఉన్న పొలంలో ఎగిరిపడింది. మరో వ్యక్తి మృతదేహం సుమారు 50 మీటర్ల దూరం ఎగిరి పక్కనే ఉన్న పంట కాలువలో పడిపోయింది. శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఘటనా స్థలంలో కాళ్లు, చేతులూ, ఇతర శరీరభాగాలు విడిపోయి, చెల్లాచెదురుగా పడి ఉండడంతో భీతావహ వాతావరణం నెలకొంది. ఇంతటి దారుణం ఎప్పుడూ చూడలేదని స్థానికులు విలవిల్లాడిపోయారు.

మృతదేహాల కోసం పొలాల్లో వెతుకులాట

సుమారు ఎకరన్నర ప్రాంతంలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. షెడ్లలో పని చేసే వారు అక్కడకక్కడే చనిపోయి కాలిపోయి పడి ఉండగా మరికొందరు గాయాలతో ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నంలో పంట పొలాల వెంట పరుగులు తీశారు. కొందరు పొలాల్లోనే కుప్పకూలి మృతి చెందారు. చనిపోయింది ఎవరో తెలియడానికి, వారి మృతదేహాలు ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవడానికే సాయంత్రమైంది. పంట పొలాలు, కాలువలు, ఘటనా స్థలంలో ఉన్న మృతదేహాలన్నీ ఒకచోటకు చేర్చారు. 20 మంది మృతి చెందారని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.



ఘటనా స్థలం నుంచి సమీప పొలాల్లోకి ఎగిరిపడిన మృతదేహాన్ని తీసుకువస్తున్న సహాయక బృందం



వేట్లపాలెంలోని బాణసంచా పరిశ్రమ వద్ద భీతావహ పరిస్థితి

పచ్చని పొలాల్లో భారీ పేలుడు

వేట్లపాలేనికి సమీపంలోని పంట పొలాల మధ్య సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పేరుతో కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. స్థానికులు టపాసుల తయారీ పనులు చేస్తుండగా మధ్యాహ్నం 2 గంటల వేళ భారీ పేలుడు చోటుచేసుకుంది. ఆ శబ్దానికి సమీప గ్రామాల్లో ఇళ్లు కంపించాయి. పైకప్పు పెంకులు ఎగిరిపడ్డాయి. ఇళ్లలో సీలింగ్‌లు ఊడిపడ్డాయి. ఐదు కిలోమీటర్ల దూరంలోని సామర్లకోట, పెద్దాపురం ప్రజలకూ శబ్దాలు వినిపించాయంటే పేలుళ్ల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.

మృతులు వీరే..

గండి మంగ (36), వల్లూరి రవి (35), కడింపల్లి కృపామణి (50), బిక్కిన కరుణ సుబ్బారావు (45), సాధనాల సత్యవేణి (44), గొడత నాని (26), తుంపాల లోవ (38), చింతల రమణమ్మ (60), మందపల్లి చిన్ని (44), గొడత మహేష్ (41), నూకళ్ల దేవి (45), గొడత వీరవెంకటరమణ (48), కడింపల్లి ధనరాజు (55), సాకుమళ్ల రాఘవ (50), అడబాల శ్రీనివాసరావు (55)(వేట్లపాలెం).. దర్శిపాటి నాని (38), ఏడిద సంపత్ కుమార్ (25) (సామర్లకోట), మకర రాఘవమ్మ (55) (పెదబ్రహ్మదేవం), గంపల మంగమ్మ(45), గంపల నాగరాజు(57)

కాకినాడ జీజీహెచ్‌లో 9 మంది క్షతగాత్రులు

90 శాతానికి పైగా కాలిన గాయాలు.. విషమంగా పరిస్థితి

కాకినాడ (మసీదుసెంటర్), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన 9 మంది క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ ట్రామాకేర్, అత్యవసర విభాగాల్లో వారికి వైద్యసేవలు అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో 8 మందికి 90 శాతానికి పైగా, ఒకరికి 70 శాతానికి పైగా కాలిన గాయాలైనట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి తెలిపారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉందన్నారు. అన్ని విభాగాల వైద్యులు, సిబ్బందితో పాటు ఔషధాలను, అవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్సులు అందుబాటులో ఉంచామన్నారు. బాధితుల సమాచారం తెలియజేసేందుకు ఆసుపత్రిలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. మంత్రి కందుల దుర్గేష్ ఆసుపత్రికి వచ్చి బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, కాకినాడ గ్రామీణం ఎమ్మెల్యే పంతం నానాజీ, జేసీ అపూర్వభరత్ తదితరులు ఆసుపత్రిలో వైద్యసేవలను పర్యవేక్షించి బాధితులను పరామర్శించారు.

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నవారు

సప్పా సత్యవేణి (34), చిటికెల లక్ష్మి (45) (వేట్లపాలెం), మోర్త శ్రీను (30) (పెద్దాపురం), కాతేటి శ్రీను (33), దర్శిపాటి రాజు (రాజేష్) (30), వేమగిరి లోవరాజు (35), వేమగిరి దావీదు (38), పల్లపాటి వీరశ్రీను (40), దర్శిపాటి లోవరాజు (40) (సామర్లకోటలోని కుమ్మరవీధి).



చింతల రమణమ్మ | తుంపాల లోవ | గంపల మంగమ్మ | గంపల నాగరాజు | గండి మంగ | దర్శిపాటి నాని | సాకుమళ్ల రాఘవ | నూకళ్ల దేవి | ఏడిద సంపత్‌కుమార్



గొడత మహేష్ | గొడత నాని | కడింపల్లి ధనరాజు | గొడత వీర వెంకటరమణ | మందపల్లి చిన్ని | అడబాల శ్రీనివాసరావు | సాధనాల సత్యవేణి | వల్లూరి రవి | కడింపల్లి కృపామణి | బిక్కిన కరుణ సుబ్బారావు | మకర రాఘవమ్మ

నిర్లక్ష్యమే నిప్పురవ్వై..

- చిచ్చుబుడ్లలో మందు దట్టించి.. ఇనుప దిమ్మతో మోదిన కార్మికులు
- నిప్పురవ్వలు రేగి పడి భారీ పేలుడు

ఈనాడు- కాకినాడ, రాజమహేంద్రవరం: చిన్నపాటి నిర్లక్ష్యం వేట్లపాలెంలో భారీ ప్రమాదాన్ని తెచ్చిపెట్టినట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. చిచ్చుబుడ్లలో మందును దట్టించి, ఇనుప దిమ్మతో మోదడంతో నిప్పురవ్వలు రేగి పక్కనున్న బాణసంచా ముడిసరుకులో పడ్డాయి. క్షణాల్లో మంటలు వ్యాపించి, అక్కడే నిల్వ ఉన్న బాంబులన్నీ ఒక్కసారి పేలడంతో భారీ విస్ఫోటం జరిగింది. తయారీ కేంద్రంలో షెడ్లు ఇరుకిరుగ్గా ఉండటంతో ఇద్దరు, ముగ్గురు పనిచేసేచోట పది మంది కూర్చొని తయారుచేస్తున్నారు. దీంతో మంటలు రేగి పేలుళ్లు జరిగినప్పుడు ఆ షెడ్ల నుంచి బయటకు రాలేక వారు అక్కడే సజీవ దహనమైపోయారు. పేలుడు తీవ్రత కారణంగానే శరీరాలు ఛిద్రమైపోయాయని పోలీసులు చెబుతున్నారు. బాణసంచాలో సల్ఫర్‌ను తప్పుడు విధానంలో ఉపయోగించడంతో పేలుడు చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అక్కడ రసాయనాలు, మందుగుండు సామగ్రి నమూనాలను ఫోరెన్సిక్ నిపుణులు తీసుకువెళ్లారని, పూర్తిస్థాయిలో పరీక్షించిన తర్వాతే పేలుడుకు కారణం చెప్పగలమని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఘటనా స్థలానికి వెళ్లినప్పుడు తమ సమీపంలోనే రెండుసార్లు చిన్నపాటి పేలుళ్లు జరిగాయని చెప్పారు.

ప్రమాదం జరిగిన సూర్యశ్రీ ఫైర్ క్రాకర్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ యజమాని అడబాల అర్జున్, సోదరుడు వీరబాబు (నాని) పరారయ్యారు. ప్రత్యేక బృందాలు వారిని గాలించి పట్టుకున్నాయి. వీరి తండ్రి అడబాల శ్రీనివాసరావు (55) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి అప్పగించే ప్రక్రియ శనివారం రాత్రి ప్రారంభించారు.

పోటీల కోసం భారీగా తయారీ

పండుగలు, పర్వదినాలకు బాణసంచా కాల్చడం సాధారణంగా మారిపోయింది. బాణసంచా కాల్చడంలో పోటీల నేపథ్యంలో అధిక మోతాదులో పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నారు. గోకవరం మండలంలో జరగనున్న ఓ వేడుకలో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు భారీ ఎత్తున మందుగుండు సామగ్రి ఇక్కడ తయారుచేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నిల్వలు అధికంగా ఉన్నాయి. పేలుడు ధాటికి సమీపంలోని జొన్నలదొడ్డి ప్రాంతంలో పెంకుటిల్లు పైకప్పులు ధ్వంసం కాగా ఇళ్లలోని ఫాల్స్ సీలింగ్‌లు ఊడిపడిపోయాయి. పలు ఇళ్లలోని అద్దాలు, తలుపులు పగిలిపోయాయి.

ఉపాధ్యాయుల హాజరు నిబంధనలు కఠినతరం

- బడికి ఉదయం 9 గంటలు దాటివస్తే గైర్హాజరైనట్లే

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల హాజరు నిబంధనలను పాఠశాల విద్యా శాఖ కఠినతరం చేసింది. టీచర్లు బడులకు ఉదయం 9 గంటల తరువాత వస్తే ఆలస్యంగా (లేట్ ఇన్) పరిగణిస్తామని పేర్కొంది. 10 నిమిషాల వెసులుబాటు సమయం (గ్రేస్ పీరియడ్) ఉన్నప్పటికీ.. అది నెలలో ఒకట్రెండు రోజులు మాత్రమేనని స్పష్టం చేసింది. ఉదయం సెలవు పెట్టి మధ్యాహ్నం పాఠశాలకు వచ్చేవారు ఒంటి గంట లోపు రావాలని, ఆ తర్వాత హాజరు నమోదు చేస్తే లేట్‌ఇన్‌గా తీసుకుంటామంది. ఉదయం పాఠశాలకు హాజరై, మధ్యాహ్నం సెలవు పెట్టినవారు 12.30 గంటల కంటే ముందుగా ఔట్‌టైం నమోదు చేస్తే వేగంగా వెళ్లిపోయినట్లు అని తెలిపింది. ప్రాథమిక పాఠశాలల్లో సాయంత్రం 3.30 గంటల కంటే ఒక నిమిషం ముందు, ఉప ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సాయంత్రం 4 గంటల కంటే ఒక్క నిమిషం ముందు ఔట్ టైం నమోదు చేసినా అది ఏర్లీ ఔట్‌గా పరిగణిస్తామని వెల్లడించింది. ఎవరైనా ఉదయం ఇన్‌టైం నమోదు చేసి, ఔట్ టైం నమోదు చేయకపోతే.. ఉదయం హాజరు నమోదు చేసిన వెంటనే పాఠశాల ప్రాంగణాన్ని విడిచి వెళ్లిపోయినట్లుగా పరిగణిస్తామని తెలిపింది.

600 ఎకరాల్లో హార్సిలీహిల్స్ అడవి దగ్ధం



సూరపువారిపల్లె సమీప గట్టుకొండలో చెలరేగిన మంటలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సెక్షన్ పరిధిలోని అడవుల్లో మంటలు వ్యాపించాయి. కొండ దిగువన ఉన్న సెరికల్చర్ ఫాం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. నాయనిబావి, గట్టు, సూరపువారిపల్లె అటవీ ప్రాంతాలు అగ్నికి ఆహుతయ్యాయి. గుట్టల్లో మంటలు ప్రారంభమై క్రమంగా గట్టుకొండ, ముక్కొండ, గుర్రపుగుట్టల వరకు విస్తరించాయి. ఎండిన ఆకులు, బోద, గడ్డి అధికంగా ఉండటంతో మంటలు శరవేగంగా విస్తరించి రాత్రి వరకు 600 ఎకరాలకు పైగా అడవి దగ్ధమైందని స్థానికులు చెప్పారు. మంటల ధాటికి తట్టుకోలేక జంతువులు పరుగులు తీస్తున్నాయని, కొన్ని మంటల్లో కాలిపోతున్నాయని వెల్లడించారు. అటవీశాఖ సెక్షన్ అధికారి శివకుమార్ మాట్లాడుతూ.. సెరికల్చర్ ఫాం వద్ద మంటలు పూర్తిగా ఆర్పివేశామని, మిగిలినచోట్ల అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

చనిపోతావని జ్యోతిష్కుడు చెప్పడంతో ఉరేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

- బెంగళూరులో దారుణం



ఆత్మహత్యకు పాల్పడిన విద్యాజ్యోతి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఆమె ఓ మంచి సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. కొడగు ప్రాంతానికి చెందిన ప్రేమించిన యువకుడితో తొమ్మిది రోజుల కిందటే వివాహం జరిగింది. అయితే ఓ జ్యోతిష్కుడు వెల్లడించిన అంశాలతో తీవ్రంగా భయపడిన ఆమె చివరకు ప్రాణాలు తీసుకుంది. బెంగళూరు బాగలకుంటె ఎంఈఐ లేఔట్‌కు చెందిన విద్యాజ్యోతి (29) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. "నువ్వు ఎక్కువ కాలం భూమ్మీద మనుగడ సాగించలేవు. త్వరలోనే నూకలు చెల్లుతాయి" అని వర్క్ ఫ్రం హోంలో ఉన్న ఆమెకు ఓ జ్యోతిష్కుడు చెప్పాడు. అక్కడితో ఆగకుండా.. 'ఈ తొమ్మిది రోజులూ పూజలు చేయి. ఆఖరి రోజైన.. శుక్రవారం నీ తాళి తీసి అమ్మవారికి సమర్పించు. ఆపై నీకు మంచి జరుగుతుంది'' అని తెలిపాడు. ఆయన మాటలకు విపరీతంగా భయపడిపోయిన ఆమె అలానే పూజలు చేసి.. తొమ్మిదో రోజు అమ్మవారికి తాళి తీసివ్వడానికి ముందు గదిలోకి వెళ్లింది. అనంతరం తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుంది.

పెట్టుబడిదారులు.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు

(మొదటి పేజీ తరువాయి)

'ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ఈ పరిశ్రమ ఏర్పాటు ఓ మైలురాయి. ఆధునిక ఫార్మాస్యూటికల్ రంగంలో రాష్ట్రాన్ని మరింత కీలక గమ్యస్థానంగా మారుస్తుంది. బ్లూ జెట్ హెల్త్‌కేర్ సంస్థ రూ.2,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశ్రమతో 1750 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా అమలుకు ప్రాధాన్యం ఇస్తున్నాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

మాటిస్తే నిలబెట్టుకుంటాం

'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత ఉంది. మన రాష్ట్రం మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని పెట్టుబడిదారులు నమ్ముతున్నారు. అదే మన బలం. రాష్ట్రానికి ప్రాజెక్టులు వస్తే.. కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన గ్రౌండింగ్ అవుతున్నాయి. బ్లూజెట్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం కోసం అతి తక్కువ కాలంలోనే రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్కులో 102 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాం. అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ త్వరితగతిన అందించాం' అని లోకేశ్ తెలిపారు.

పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానంగా ఉత్తరాంధ్ర

'ఉత్తరాంధ్రను ఎకనమిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్, టీసీఎస్, కాగ్నిజెంట్ ఐటీ పెట్టుబడులతో ఉత్తరాంధ్ర పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానంగా మారుతోంది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ఫార్మాస్యూటికల్స్, మెడికల్ ఉపకరణాలు, పెట్రోకెమికల్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతాన్ని ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. విశాఖ పోర్టు ద్వారా కనెక్టివిటీ, విస్తారమైన భూమి లభ్యత, నైపుణ్యం కలిగిన మానవవనరులు ఉత్తరాంధ్ర ప్రాంతానికి బలం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేశ్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, బ్లూజెట్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అక్షయ్ అరోరా, మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, వైస్ ప్రెసిడెంట్ వేణుబాబు, సహ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేష్ షా తదితరులు పాల్గొన్నారు.



బ్లూజెట్ హెల్త్ కేర్ యూనిట్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి లోకేశ్. చిత్రంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మంత్రి రవీంద్ర, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, పరిశ్రమ ప్రతినిధులు

ఈనాడు

సరికొత్త ఆకాశవాణి

వ్యాసభారతాన్ని తెనుగు చేస్తూ తిక్కన చెప్పిన 'సారపు ధర్మమున్ విమల సత్యము...' అనే ఉద్యోగపర్వంలోని పద్యం పండితుల విశేష ప్రశంసలకు నోచుకుంది. 'అధర్మం చేతిలో ధర్మం, అసత్యం బలం ముందు సత్యం కృశిస్తున్న దుస్థితిని- సమర్థులు స్వయంగా పూనుకుని ఎదుర్కోకుంటే, సమాజం భ్రష్టుపడుతుంది. అది వారికి కూడా చేటు తెస్తుంది...' మూలభారతంలో ఉన్నది ఇంతవరకే. మరి నిస్సహాయుల సంగతి ఏమిటి? సమాజంలో అందరూ సమర్థులే ఉండరు కదా... అని ఆలోచించిన తిక్కన- ఆ భావాన్ని కొనసాగిస్తూ, దక్షులైనవారు ఉపేక్ష వహించినా, సత్యధర్మాలకు- దైవం రక్షణగా నిలుస్తాడని కృష్ణుడి నోట అభయం ఇప్పించాడు. అది బలహీనులకు భగవంతుడి భరోసా. తిక్కన కలిగించిన ఆశ. యుగధర్మాన్ని అనుసరిస్తూ, తిక్కన చేసిన ఈ జోడింపు, మార్పు- ఆ పద్యంలోని అఖండ ధర్మదీపం వత్తిని ఎగదోసింది. వెలుగులు పెంచింది. తిక్కన- అమాత్యుడు(మంత్రి) కాబట్టి సమాజహితాన్ని దృష్టిలో పెట్టుకుని మూలభారతాన్ని దాటి మరో అడుగు ముందుకు వేశాడు. ప్రతి యుగంలోనూ మనిషి పాటించాల్సిన ధర్మ సూక్ష్మాన్ని నిర్దేశించాడు.

ధర్మ అధర్మాలకు, సత్య అసత్యాలకు మధ్య ఘర్షణ ఏర్పడిన సందర్భాల్లో దైవం ఆకాశవాణి రూపంలో పరిష్కారం చూపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. భరతుడు- శకుంతలకు దుష్యంతుడితో కలిగిన సంతానమే. అదే సత్యం. దాన్ని కాదన్నాడు దుష్యంతుడు. శంకించాడు శకుంతలను. 'ఆమె కందె డెందమున... ఆ ఇల్లాలి మనసు గాయపడింది' అన్నాడు నన్నయ. నిజానికి గాయమైంది- సత్యానికి. 'దివ్యవాణి వినిచె- వీడు నీకును శకుంతలకున్ ప్రియ నందనుండు, చేకొనుము' అని. సత్యానికి రక్షణ దొరికింది. సమస్య సమసిపోయింది. మృత్యుభీతి ఆవరించిన కంసుడు దేవకీదేవికి పుట్టిన పసికూనలను అడ్డంగా నరికేస్తున్నాడు. చివరికి యోగమాయ అడ్డుకుంది. 'నా సరసన్ జనించి నిన్ చంపెడి వీరుడొక్క దెస సత్కృతిన్ ఒందెడువాడు... మరోచోట క్షేమంగా గారాబంగా పెరుగుతున్నాడు' అంటూ కంసుడి భయాన్ని మరింతగా పెంచింది. చంపిన లేత దేహాల్లోంచే కంసుడి చావు జీవం పోసుకుందని హెచ్చరించింది. యోగమాయ ధైర్యం చెప్పింది దేవకికి కాదు- ధర్మానికి. భారత భాగవతాలను విశ్వసించే వారికి ఆకాశవాణి- ఒక సత్యం. కానివారికది- కల్పన!

ఈ ద్వంద్వాలు ప్రతియుగంలోనూ సర్వసహజం. ప్రతి పరిష్కారం అంచునా మరో సంక్షోభం వేలాడుతూనే ఉంటుంది. అద్దేపల్లి ప్రభు చెప్పినట్లు 'మనం ఎక్కడికీ పారిపోలేం.' పంజరాన్ని గుర్తించిన పావురమే- తన రెక్కల బలాన్ని గమనిస్తుంది. ఆశావాది విమానాన్ని కనుగొంటే- నిరాశావాది పారాచూట్‌ను ఊహిస్తాడు. ఇద్దరినీ కలుపుకొంటూ కాలం ముందుకు సాగిపోతూ ఉంటుంది. మధ్యమధ్యలో సందేహాలకు శంకలకు భయాలకు నివారణ కావాలంటే- మనిషి ధర్మాన్ని, సత్యాన్ని ఆశ్రయించాలి. 'జాబిల్లీ! నువ్వు సముద్రం మీద చేసే సంతకాన్ని గాలి చెరిపేయకుండా కాలమే కాపలా కాస్తుంది లే!' అన్నారు శ్రీశ్రీ. సత్యధర్మాలే జాబిల్లి వెలుగులు. సమర్థులు విస్మరించిన బాధ్యతను కాలం తన భుజాలకు ఎత్తుకుంటుంది. దిల్లీలో ఇటీవల జరిగిన కృత్రిమ మేధ(ఏఐ) ఇంపాక్ట్ సమిట్‌లో... ధర్మం అంటే ఏమిటి? మనిషికి అసలైన శత్రువు ఎవరు? సమస్యలను ఎదుర్కొనేదెలా.. వంటి ప్రేక్షకుల ప్రశ్నలకు- కృష్ణార్జునులు డిజిటల్ రూపాల్లో వచ్చి బదులిచ్చారు. సాంకేతికత రూపంలో కాలం జనానికి చేరువ అవుతోందంటున్నారు పరిశీలకులు. కాకపోతే, ఆ ధర్మలిపి ఆకాశవాణిలా సత్యంలో ముంచి రాసింది అవ్వాలంతే!




చుట్టూ ఉన్న ప్రపంచం ఎన్నో రూపాల్లో మన ఏకాగ్రతను భగ్నం చేస్తుంది. లక్ష్యం మీది నుంచి దృష్టిని మళ్లిస్తుంది. ఏమరుపాటుగా దానికి లొంబడిపోయామంటే ఆ తరవాత మనకంటూ ఏ గుర్తింపూ మిగలదు.

– మేరీ కోమ్

కాలజ్ఞానం

కాలప్రవాహంలో క్షణాలు, గంటలు, దినాలు, సంవత్సరాలు దొర్లిపోతూనే ఉంటాయి. ఈ అనంత కాలవాహినిలో బుద్బుదప్రాయమైన జీవితపు ఆవలితీరం చేరుకోవడానికి మనిషి సమయాన్ని తెలివిగా వాడుకోవాలి. ఎరుక లేకుండా ఎదురీదితే చివరికి మిగిలేది ప్రయాస, నిరాశే. ఎరుకతో జీవించడం తెలియకపోతే ఆయుర్దాయం ఎంతైనా వృథానే. ఆత్మజ్ఞానంతో నిర్మలమైన ఆనందాన్ని అందుకోవడమే జీవిత పరమార్థము.

కాలస్వరూపుడైన పరమాత్మ తనను తెలుసుకోవడానికి సృష్టించిన కొలమానాలే ఏడు వారాలు. సోమవారం నుంచి ఆదివారం వరకు భగవద్భక్తి కలిగి, జ్ఞానవైరాగ్యాలతో జీవిస్తూ, కర్మలు చేయడమే మనిషి కర్తవ్యం. అప్పుడు నిజంగానే పరమార్థం బోధపడుతుంది. జన్మ సార్థకమవుతుంది. ఆయా వారాల విశేషాలను పరికిస్తే- సోమవారం సోమునివారం. సోముడంటే మనసుకు సంకేతమైన చంద్రుడు. మనసుకి మిత్రుడైనా శత్రువైనా మనసే. దాన్ని అదుపులో పెట్టుకోగలిగితే, అంతకు మించిన హితుడు ప్రపంచంలో మరొకరుండరు.



అంతర్యామి

గాడితప్పితే అంతకుమించిన శత్రువూ ఉండరు. ప్రతి సోమవారం ఉదయం లేవగానే ఈ విషయాన్ని గుర్తుచేసుకోవాలి. ఇంద్రియాలను అదిలేని మనసును మంగళకరమైన వస్తువులపైకి మళ్లించడం మంగళవారపు బాధ్యత. కళ్లకు భక్తిభావనను సుందర దృశ్యాలు కలిగించాలి. చెవులకు భక్తిరస గానామృతాలను, ముక్కుకు సుగంధ పరిమళాలను అందించాలి. నోటి భగవన్నామంతోపాటు తీయని మాటలు పలికించాలి. నిత్యమంగళ స్నానాలతో శరీరాన్ని పరిశుద్ధంగా ఉంచుకోవాలి. కాళ్లకు పుణ్యస్థల సందర్శన, చేతులకు దానధర్మాలు అలవడాలి. బుధవారాన్ని సౌమ్యవారం అంటారు. మంగళాచరణం వల్ల మనసు తేటపడి ప్రశాంతత నెలకొంటుంది. నేనెవరిని? ఇక్కడికెలా వచ్చాను? ఎక్కడికి పోతాను? ఇలాంటి జిజ్ఞాసాపూరితమైన ప్రశ్నలు ప్రశాంతమైన మనసులోనే ఉదయిస్తాయి. బుధవారం నాడు సావధానంగా ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆలోచించాలి.

గురువారం- బృహస్పతి వారం. బుద్ధికి బృహస్పతి అంటారు. బృహస్పతి దేవగురువు. మనిషిలో జ్ఞానదీపాన్ని వెలిగించే ప్రత్యక్ష దైవం గురువు. గురువారంనాడు బుద్ధివికాసానికి, మోక్షమార్గాన్ని చూపగల గురువును భక్తిశ్రద్ధలతో సేవించాలి. శుక్రవారం- భృగువాసరం. శుక్రం అంటే వెలుగు, భృగువు అంటే శివుడు. శివపార్వతులు ఆది దంపతులు. దాంపత్యజీవనం వెలిగించి, జీవితసాఫల్యం అందుకోవాలంటే, గృహస్థ ధర్మంతోపాటు, దానధర్మాలు ఆచరిస్తూ మిగతా ఆశ్రమధర్మాలను నిర్వర్తించాలి. అందుకని శుక్రవారం అమ్మవారిని సేవించాలి. శనివారం- స్థిరవారం. బుద్ధిబలంతో మనసును లొంగదీసుకుంటే, అదే యోగస్థితి కలిగిస్తుంది. చిత్తవృత్తి నిరోధమే యోగమని, యోగసిద్ధికి ఏకాగ్రత అవసరమని పతంజలి మహర్షి చెప్పారు. సూర్యుడికి ప్రీతికరమైనది కాబట్టి ఆదివారాన్ని భానువారం, ఆదిత్యవారం అంటారు. ఆత్మవిచారానికి అనుకూలమైన రోజు ఇది. దాన్ని అలసత్వంతో, తాత్కాలిక సుఖసంతోషాలకోసం వినియోగించకూడదు. ఆత్మస్థితి చేరుకొనేలా దారి చూపమని కర్మసాక్షి అయిన సూర్యనారాయణస్వామిని త్రికరణశుద్ధిగా అర్థించాలి. ఏడువారాల సమాహారాన్ని ఆహార, మైథున, నిద్ర, భయాలకే పరిమితం చేయకుండా పరమార్థ సాధనకు ఉపకరణంగా వాడుకోవాలి.


– ఉప్పు రాఘవేంద్రరావు



మానవ అక్రమ రవాణాపై ఏఐ నిఘా

అధునాతన రవాణా, కమ్యూనికేషన్ సాంకేతికతలు, సౌకర్యాలతో ప్రపంచ దేశాలు దగ్గరైపోయాయి. ప్రయాణాలు తేలికయ్యాయి. సంభాషణలు సులభమయ్యాయి. ఇదే అదనుగా మహిళలను వ్యభిచారం కోసం, బాలలను వెట్టిచాకిరీ కోసం, పేదలను నిర్బంధ శ్రమ కోసం అక్రమంగా దేశాల సరిహద్దులు దాటించే ముఠాలు చెలరేగిపోతున్నాయి. అవయవాల అక్రమ వ్యాపారమూ వాటికి తోడైంది. ఈ క్రమంలో సరిగ్గా వాడుకుంటే నేరగాళ్ల వేటలో కృత్రిమ మేధ మెరుగైన అస్త్రమవుతుంది.

జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2023లో నమోదైన మానవ అక్రమ రవాణా కేసులు 2,183 కాగా, 6,288 మందిని బాధితులుగా గుర్తించారు. వీరిలో 42శాతానికి పైగా మైనర్లున్నారు. 2018-2022 మధ్య కాలంలో నమోదైన 10,659 కేసుల్లో 26,840 మందిని అరెస్టు చేసినా, 1,031 మందికే శిక్ష పడింది. 2025లో సుమారు 2,227 మానవ అక్రమ రవాణా కేసులు నమోదు అయ్యి ఉండొచ్చని అంచనా. మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ నేరాలు ఎక్కువగా వెలుగు చూడవచ్చునని భావిస్తున్నారు. అక్రమ రవాణాదారులు తమ కార్యకలాపాలకోసం సామాజిక మాధ్యమాలను, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలనూ, ఇతర ఆన్‌లైన్ వేదికలను వాడుకుంటున్నారు. దీంతో నేరగాళ్ల కట్టడికి కృత్రిమ మేధ(ఏఐ)ను ఆయుధంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది. ఏఐ సాయంతో రియల్ టైమ్ అనాలిసిస్ ద్వారా నేరాలు, బాధితులు, నేరస్థుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుకుంటూ తక్షణ చర్యలు తీసుకోవచ్చు. సమాచారం(డేటా)లో పరస్పర పొంతన, క్రమానుగతి ఉన్న అంశాలను వేగంగా గుర్తించడం (ప్యాటర్న్ రికగ్నిషన్) ద్వారా నేరాలను ముందుగానే పసిగట్టడం వల్ల నేరగాళ్ల పనిపట్టడం వీలవుతుంది. ఏఐ అందించే మెషీన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, బయోమెట్రిక్ సామర్థ్యాలు నేర నిరోధానికి అమోఘ అస్త్రాలవుతాయి. అయితే, ఏఐ తెస్తున్న మార్పులను అందుకుని చర్యలు తీసుకునే స్థాయికి మన చట్టాలు ఇంకా చేరుకోలేదు. ఫలితంగా చట్టం అమలులో ఏఐ దుర్వినియోగమయ్యే ప్రమాదమూ లేకపోలేదు.



ముందే పసిగట్టేందుకు...

ఆన్‌లైన్‌లో నేరగాళ్ల కదలికలు, సంభాషణలను, పరస్పరం పంపుకొనే సందేశాలను నిశితంగా గమనిస్తే వారు చేయబోయే నేరాలను ముందే పసిగట్టవచ్చు. సీసీటీవీ కెమేరాలు నేరగాళ్లపై నిఘా పెట్టడానికి వీలు కల్పిస్తున్నాయి. ఏఐ సాయంతో ఇలాంటి సమాచారాన్ని ఒడిసిపట్టి విశ్లేషించడాన్ని ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్‌గా వ్యవహరిస్తారు. ఆన్‌లైన్‌లో జరిగే సంభాషణల్లో అనుమానాస్పదమైన వాటిని వెంటనే గుర్తించడానికి ఏఐ ఉపకరిస్తుంది. అక్రమ రవాణాదారులు తరచూ ఉపయోగించే ఆన్‌లైన్ వేదికలు, వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాలపై ఏఐ సాయంతో నిరంతర నిఘా వేయవచ్చు. డార్క్‌వెబ్‌లో నేరగాళ్ల మధ్య సంభాషణలను ఆలకించి, వారి గూడుపుఠాణిలను ముందే పసిగట్టి నివారించడానికి ఏఐ తోడ్పడుతుంది. కొన్ని సాంకేతికతలు లక్షలాది ఆన్‌లైన్ ప్రకటనలను చిటికెలో స్కాన్ చేయగలవు. ప్రకటనల్లోని భాషలో అనుమానాస్పద అంశాలను, చిత్రాలను ముఖగుర్తింపు సాధనాలతో ఆరాతీసి అధికారులను హెచ్చరించగలవు.

మానవ అక్రమ రవాణా ముఠాల చేతికి చిక్కి అదృశ్యమైనవారు ఎక్కడైనా తారసపడితే ముఖగుర్తింపు సాంకేతికతతో వెంటనే కనిపెట్టవచ్చు. అలాగే రికార్డులకెక్కిన నేరగాళ్లను కనిపెట్టడానికీ ఇది తోడ్పడుతుంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో సీసీటీవీ కెమేరాల సాయంతో అక్రమ రవాణాదారులనూ, వారి చేతచిక్కిన అభాగ్యులను ముఖగుర్తింపు టూల్స్‌తో గుర్తుపట్టి అడ్డుకోవచ్చు. రవాణా కేంద్రాల దగ్గర కాగ్నిటివ్ బయోమెట్రిక్స్‌ను ఏర్పాటు చేస్తే ముఖకవళికలు, శారీరక భాషల పరిశీలన ద్వారా గుర్తించవచ్చు. తద్వారా బాధితులనూ పసిగట్టవచ్చు. వారి వెంట ఉండే నేరగాళ్లను పోలీసు రికార్డుల్లోని సమాచారం ఆధారంగా గుర్తించవచ్చు. ఈ ప్రక్రియను రైల్వే స్టేషన్లలో నెలకొల్పాలనే ప్రతిపాదన వచ్చింది. మానవ అక్రమ రవాణా పెద్దయెత్తున జరుగుతున్న మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాలు, ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా, బిహార్ రైల్వే స్టేషన్లలో ఇందుకు శ్రీకారం చుట్టాలి. దీనికి కావాల్సిన సాంకేతికతలు, పరికరాలను ఐబీఎం, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఏఐ ఆధారిత అనువాద సాధనాలు, చాట్‌బాట్స్ బాధితులకు అధికారులను సంప్రదించే అవకాశాన్ని ఇస్తాయి. నేరగాళ్ల నుంచి తప్పించుకుని సురక్షిత స్థలాలకు చేరుకోవడానికీ, చట్టపరమైన సాయం పొందడానికి తోడ్పడతాయి. వారికి ఆన్‌లైన్‌లో, ఫోన్‌లో మానసిక అండనూ ఇస్తాయి. ఏఐ సాయంతో నేరగాళ్ల ఆట కట్టించడానికి, బాధితులను ఆదుకోవడానికి బిహార్ పోలీసు బలగాలు 'ఆపరేషన్ నయా సవేరా', రైల్వే భద్రతా దళం 'ఆపరేషన్ నన్హే ఫరిష్తే'లను చేపట్టాయి.

బాధ్యతాయుతంగా వాడుతూ..


మానవ అక్రమ రవాణా నిరోధానికి అమెరికా, కెనడా, ఐరోపా దేశాలు ఉపయోగిస్తున్న టూల్స్‌ను ఇండియాఅందిపుచ్చుకోవాలి. అక్కడి చట్టాల్లోని విలువైన అంశాలను గుర్తించాలి. సర్వశ్రేయస్సుకు ఏఐ అంటూ ఐరాస చేపట్టిన కార్యక్రమం అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహిస్తోంది. అందులో భాగస్వామిగా మారి, చట్టాలకు పదును పెట్టుకోవాలి. పెండింగులో ఉన్న మానవ అక్రమ రవాణా నిరోధ బిల్లుకు మోక్షం కల్పించాలి. వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు కార్యరూపం కల్పించాలి. ఏఐసాయంతో నిఘాను పెంచే క్రమంలో వ్యక్తుల గోప్యతకు భంగం కలుగనీయకూడదు. ముఖగుర్తింపు సాంకేతికతలను దుర్వినియోగం చేయరాదు. డేటా సేకరణలో పక్షపాతం దొర్లకుండా చూడాలి. అక్రమ రవాణాదారులు బాధితులను ఎంచుకోవడానికీ, డీప్-ఫేక్స్ ద్వారా బ్లాక్‌మెయిల్ చేయడానికి ఏఐని వాడుతున్నారు, మరోవైపు, అదే ఏఐ సాంకేతికత పోలీసు, భద్రతా సంస్థల నిఘా సామర్థ్యాన్నీ పెంచుతోంది. మానవ అక్రమ రవాణా సవాలును సమర్థంగా ఎదుర్కోవడానికి పోలీసులు, స్వచ్ఛంద సంస్థలకు ఏఐలో నిరంతర శిక్షణ అవసరం. నిధుల కొరత, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయ లోపం, చట్టపరమైన అడ్డంకులు వంటివి ఉన్నా- వ్యక్తిగత గోప్యతను, మానవ హక్కులను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ఏఐని ఉపయోగించి, నేరగాళ్లపై పోరులో విజయం సాధించాలి.



డాక్టర్ రావెళ్ల భానుకృష్ణ కిరణ్
అంతర్జాతీయ న్యాయ, భద్రతా వ్యవహారాల నిపుణులు

పండంటి జీవితానికి 12 సూత్రాలు

జీవితంలో చాలా సందర్భాల్లో దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంటుంది. ఎవరైనా చేయి పట్టుకుని 'ఇది సరైన దారి' అని చూపిస్తే బాగుండనిపిస్తుంది. ఈ పుస్తకం ఆ పనిచేస్తుంది. చదివి అర్థం చేసుకుంటే లోలోపల ఏదో మథనం మొదలై తీరుతుంది. దాన్ని ఆచరణలో పెడితే జీవితంలో స్పష్టమైన మార్పును చూడవచ్చు. పుస్తకం పేరు '12 రూల్స్ ఫర్ లైఫ్: యాన్ యాంటిడోట్ టు కేయోస్'. రాసింది కెనడియన్ క్లినికల్ సైకాలజిస్ట్ జోర్డాన్ పీటర్సన్. కోరాలో నెటిజెన్ల ప్రశ్నలకు సమాధానాలివ్వడం ఆయనకు హాబీ. అలా ఒకసారి జీవితంలో తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అత్యంత విలువైన విషయాలేంటి అన్న ప్రశ్న రాగా,



అప్పుడాయన 42 రూల్స్ చెప్పారట. వాటిలో ముఖ్యమైన పన్నెండింటితో పుస్తకం రాసి, దానికి సీక్వెల్‌గా 'బియాండ్ ఆర్డర్: 12 మోర్ రూల్స్ ఫర్ లైఫ్' కూడా రాశారు. ఒక్కో రూలూ ఒక్కో అధ్యాయంగా ఉంటుంది మొదటి పుస్తకంలో!

1. భుజాల్ని వెనక్కి లాగి నిటారుగా నిలబడమంటారు రచయిత. దానికి అర్థం మనకు నిలబడటం చేతకాదని కాదు, అలా నిటారుగా నిలబడినప్పుడు సవాళ్లను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం వస్తుంది. ధీమాగా కనిపించే మిమ్మల్ని చూసి ఎదుటివారు జంకుతారు.
2. మీ పిల్లల్నో, అమ్మానాన్నల్నో చూసుకున్నంత బాగా మిమ్మల్ని మీరు చూసుకోవాలి.
3. మన ఎదుగుదలను మనసారా కోరుకునే స్నేహితుల్నే చుట్టూ ఉంచుకోవాలి.
4. ఇతరులతో కాకుండా నిన్నటి మీతో ఇవాళ్టి మిమ్మల్ని పోల్చుకోవాలి.
5. నలుగురిలో ఉన్నప్పుడు మీ పిల్లల్ని చూసి మీరు చిన్నబుచ్చుకుంటున్నారూ అంటే వాళ్లను మీరు బాధ్యతగా పెంచలేదని అర్థం.
6. ఎదుటివారిని విమర్శించే ముందు ఎవరూ మిమ్మల్ని వేలెత్తి చూపించకుండా మిమ్మల్ని, మీ ఇంటిని దిద్దుకోండి.
7. ఇతరులు మీనుంచి ఆశించేది కాకుండా మీకు నచ్చిందీ చేతనైందీ మాత్రమే చేయండి.
8. నీతి, నిజాయతీలకు నిబద్ధులై ఉండండి.
9. మంచి శ్రోతలైన వారికే కొత్త విషయాలు తెలుస్తాయి.
10. స్పష్టంగా, క్లుప్తంగా మాట్లాడేవాళ్ల మాటకే విలువెక్కువ.
11. పిల్లలకు ఊహ తెలిసేవరకు భద్రంగా పెంచాలి. ఆ తరవాత అనుభవంతో నేర్చుకునేలా వదిలేయాలి. ఎదురుదెబ్బలు తగలకుండా పెంచాలనుకుంటే వారికెప్పటికీ పరిగెత్తడం రాదని గుర్తుంచుకోవాలి.
12. మీరెంతో కష్టంలో ఉండొచ్చు. అంతమాత్రాన శోకదేవతలా తిరిగితే కష్టం పారిపోదు. దాన్ని మర్చిపోయి చిన్న చిన్న ఆనందాలను ఆస్వాదించండి. రోడ్డుమీద ఓ పాపాయి ఎదురొస్తే చిరునవ్వుతో పలకరించండి. ఓ కుక్కపిల్ల కనపడితే ప్రేమగా నిమరండి.

వీటన్నింటినీ ఉదాహరణలతో చాలా వివరంగా చెబుతారు రచయిత. మచ్చుకు రెండో పాయింట్ చూడండి. మనల్ని మనం ఎందుకు పట్టించుకోమూ అనుకుంటాం కదా? సైకాలజిస్ట్ అయిన రచయిత ఏమంటారంటే- మన బలహీనతలేంటో మనకు తెలుసు కాబట్టే మనల్ని మనం నిర్లక్ష్యం చేస్తామట. అలాగే ఆరోది... లేచిందగ్గర్నుంచి మనం కుటుంబసభ్యులతో మొదలుపెట్టి ఎంతమందిని, ఎన్ని విషయాల్ని, ఎన్నిరకాలుగా విమర్శిస్తాం? ఒక్కసారి అవే మాటల్ని మనకి వర్తించి చూసుకుంటే..? ఈ తరహా ఆలోచన రేకెత్తించి మనిషి తనని తాను మార్చుకునేలా చేయడమే ఈ పుస్తకం ఉద్దేశం.

– మిహిర

సామాన్యులకు న్యాయం...

ఎప్పుడూ ఎండమావేనా?



ఇంకెందుకు చట్టాలు, మరెందుకు ఘనత వహించిన దర్యాప్తు యంత్రాంగాలు... పదిహేడేళ్ల అమ్మాయి పాశవిక హత్యకు గురై పద్దెనిమిదేళ్లు దాటినా ఇప్పటికీ అసలు దోషులను గుర్తించలేదంటే, అవి ఉండీ ఏం చేస్తున్నట్లు! సమాజంలో అరాచకం ప్రబలకుండా చూడటానికి, ప్రజలు శాంతి సామరస్యాలతో జీవించడానికి చేసిన చట్టాలు ఎందుకూ కొరగానివి అవుతుంటే ఇక సామాన్యులకు న్యాయం ఎక్కడ దొరుకుతుంది? ఆధునిక సాంకేతికతల సాయంతో దేశం బాగా అభివృద్ధి చెందుతోందన్న భారీ ప్రకటనలు ఒకవైపు మోతెక్కుతుంటే- ప్రగతికి అర్థం మార్చేస్తూ క్రూర నేరగాళ్లు అంగ అర్థ బలాలతోనో పోలీసుల బాధ్యతారాహిత్యంతోనో శిక్షల నుంచి తప్పించుకుపోతున్నారు. ఇలాంటి దుర్భర వాతావరణం మన కళ్ల ముందే దట్టంగా పరుచుకుంటున్నప్పటికీ నిర్లిప్తంగా చూస్తూ ఉండిపోతున్నందుకు అందరం తలదించుకోవాల్సిందే! ఆయేషా మీరా దారుణోదంతంలో కొత్త సాక్ష్యాలేవీ లేవని సీబీఐ నివేదిక సమర్పించడంతో తాజాగా ఆ కేసు ముగిసిపోయింది. ఆది నుంచి ఎన్నో అనూహ్య మలుపులు తిరిగి మూడు సార్లు దర్యాప్తులు జరిగిన కేసు చివరికి ఇలా చిక్కువీడని పజిల్‌గా మిగిలిపోవడం అందరి గుండెలను బరువెక్కిస్తోందిప్పుడు!

విజయవాడ శివారు ఇబ్రహీంపట్నంలోని ఒక ప్రైవేటు వసతి గృహంలో 2007 డిసెంబరు 27న ఆయేషా మీరాను కిరాతకులెవరో ఘోరంగా చంపేశారు. ఈ కేసులో నిందితులూ దర్యాప్తు అధికారులూ పదేపదే మారిపోయిన దరిమిలా చివరికి సత్యంబాబును పోలీసులు తెరపైకి తెచ్చారు. విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టు అతణ్ని దోషిగా తేల్చుతూ 2010లో యావజ్జీవ శిక్ష ఖరారు చేసింది. 2017లో హైకోర్టు సత్యంబాబును నిర్దోషిగా విడుదల చేస్తూ కీలక ప్రశ్నలెన్నింటినో సంధించింది. సాక్షుల వాంగ్మూలం, అభియోగపత్రాల్లోని అంశాల్లో పొంతన లేకపోవడాన్ని తూర్పారపట్టిన ఉన్నత న్యాయస్థానం- కోర్టును తప్పుదోవ పట్టించేందుకు పోలీసులే అత్యాచార కథను అల్లారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయేషా తల్లి అనుమానించిన వ్యక్తికి నార్కో అనాలిసిస్ పరీక్ష నిర్వహించేందుకు న్యాయస్థానం అనుమతించినా పోలీసులు ఎందుకు చేపట్టలేదని నిగ్గదీసింది. అసలు దోషి సత్యంబాబు కాదని ఆయేషా తల్లిదండ్రులు మొదటినుంచీ మొత్తుకుంటున్నా ఆలకించే నాథుడు కరవయ్యాడు. అనంతర కాలంలో వచ్చిన సిట్, సీబీఐ దర్యాప్తులూ నిష్ఫలమయ్యాయి. పద్దెనిమిదేళ్ల సుదీర్ఘ పోరాటం తరవాతా తమ బిడ్డకు తగిన న్యాయం జరగక గుండెలవిసేలా రోదిస్తున్న ఆ తల్లిదండ్రులకు ఎవరు సమాధానం చెబుతారు? ఏమని ఓదార్చుతారు? సామాన్యులకు న్యాయం ఎండమావేనన్నది ఇలాంటి సందర్భాల్లో వాస్తవంగా కనపడుతున్నప్పుడు, అది అంతిమంగా వ్యవస్థలపై విశ్వాసరాహిత్యానికి, సామాజిక అశాంతికి దారితీస్తుంది!

ధనవంతులకు, బలవంతులకు కొమ్ముకాస్తూనో లేదా నిర్లక్ష్యపూరితంగానో పోలీసులు దర్యాప్తులు చేస్తే ఏం జరుగుతుంది? దీనికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సమాధానమిచ్చారు. అసలైన దోషులు తప్పించుకుని నేరన్యాయ వ్యవస్థ పట్ల సమాజంలో నమ్మకం పోయి,



చివరికి అది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు గొడ్డలిపెట్టు అవుతుందని ఆయన హెచ్చరించారు. దశాబ్దాలుగా దేశంలో అదే జరుగుతోంది. రాజస్థాన్‌లో ఒక బాల్యవివాహాన్ని అడ్డుకున్నారన్న కోపంతో 1992లో ఓ మహిళపై స్థానిక ఆధిపత్య వర్గాలకు చెందిన కిరాతకులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ దారుణోదంతంలో దోషులకు శిక్షలు పడేలా చేయడంలో పోలీసులు విఫలమయ్యారు. ఆ మహిళకు జరిగిన అన్యాయంపై ఆందోళన వ్యక్తం జేస్తూ సామాజిక కార్యకర్తలు సుప్రీంకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేయడంతో పనిప్రదేశాల్లో మహిళల భద్రతకు సంబంధించి న్యాయపాలిక కీలక ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆపై ముప్పై ఏళ్లకు కూడా బాధితురాలికి వ్యక్తిగతంగా న్యాయం జరగలేదు. నేరగాళ్లకు కొమ్ముకాస్తున్న కొందరు ఖాకీలు, మొక్కుబడి దర్యాప్తుల మూలంగానే దేశవ్యాప్తంగా ఎన్నో బాధిత కుటుంబాలు కన్నీటి సంద్రంలో మునిగిపోతున్నాయి. ముంబయిలో దారుణ హత్యకు గురైన మచిలీపట్నం యువతి కేసు విషయంలో ప్రాసిక్యూషన్ లోపాలను పట్టిచూపుతూ చంద్రభాన్ సనప్ అనే వ్యక్తికి పడిన మరణశిక్షను సుప్రీంకోర్టు నిరుడు రద్దు చేసింది. పదేళ్ల తరవాత కూడా నిజమైన నేరగాడు ఎవరో తేలకపోవడంపట్ల యువతి తండ్రి నిర్వేదంతో 'మాకు న్యాయం మీద నమ్మకం లేదు. ఆర్థిక స్థోమత, ఆరోగ్యం సహకరించట్లేదు. అంతా దేవుడికే వదిలేస్తున్నాం' అంటూ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం హామీ ఇస్తున్న చట్టబద్ధమైన పాలనకు విలువలేని చోట అభాగ్య బాధితులు ఇంకేం మాట్లాడగలరు? రెండు దశాబ్దాల కిందట ఉమ్మడి ఏపీని కుదిపేసిన సినీ నటి ప్రత్యూష మరణంలో నిందితుడు సిద్ధార్థరెడ్డికి తెలంగాణ హైకోర్టు విధించిన రెండేళ్ల శిక్షను ఇటీవల సుప్రీంకోర్టు ఖరారు చేసింది. తన కుమార్తె అత్యాచారానికి, హత్యకు గురైందని ప్రత్యూష తల్లి ఆది నుంచి ఆరోపిస్తున్నారు. దోషికి యావజ్జీవ శిక్ష పడి ఉంటే, ఇన్నేళ్ల ఒంటరి పోరాటానికి తగిన సంతృప్తి దొరికి ఉండేదని ఆమె వాపోతున్నారు. బిడ్డ మరణం విషయంలో సంపూర్ణ న్యాయం జరగలేదని ఆమె కన్నీటి పర్యంతమవుతున్నారు.

చేయని నేరానికి ఏ నిర్దోషికీ శిక్ష పడకూడదన్నది ఎంత ముఖ్యమో, విచారణ ప్రక్రియలో లొసుగుల వల్ల ఒక్క దోషీ చట్టం నుంచి తప్పించుకోకూడదన్నది అంతే ప్రధానమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. అందుకు విరుద్ధంగా నేరగాళ్లు తప్పించుకుంటే- అలాంటి ప్రతి ఉదంతమూ సమాజ భద్రతకు ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. దర్యాప్తు అన్నది నేరన్యాయ వ్యవస్థకు పునాది అని, అది తప్పుల తడకగా ఉంటే నేరన్యాయపాలన అభాసుపాలు అవుతుందని తెలంగాణ హైకోర్టు సైతం నిరుడు స్పష్టం చేసింది. ఈ హెచ్చరికలను పోలీసులు చెవికెక్కించుకోకపోతే- ప్రజాభద్రత అనేది మేడిపండు చందమవుతుంది. డబ్బూ అధికారం ఉంటే చాలు... తాము ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనుకునే దుర్మార్గులు బోరవిరుచుకుని తిరుగుతుంటే- అది ఆటవిక రాజ్యమవుతుంది. అసలు అత్యాచార కేసులు ఒక పట్టాన కొలిక్కి రాక, ఎంతోమంది బాధితులు న్యాయం కోసం దీనంగా ఏళ్లకేళ్లు చూస్తున్న దురవస్థలో నిజమైన మహిళా సాధికారత ఎప్పటికి సాకారమవుతుంది?

– వేణుబాబు మన్నం

పుణ్యభూమి

నగరం... కథేమిటి?

ఫ్రెండ్స్.. మనం ఇప్పుడు చూస్తున్న మహానగరాలు చాలా సౌకర్యాలతో అద్భుతంగా ఉంటాయి కదూ! మరి, ఇలాంటి నగరాలకు ఎప్పుడు పునాది పడింది, అవెలా మొదలయ్యాయనేది ఆసక్తికరమేగా! ఆ విశేషాలేంటో తెలుసుకుందాం.

నగరాలనేవి నాగరికతలో భాగం. సిటీ, సివిలైజేషన్ అనే రెండు పదాలూ లాటిన్ పదమైన 'సివిస్' నుంచి వచ్చినవే. ఒక వ్యక్తి తాను నివసించే చోటుకు సంబంధించిన బాధ్యతలను, విశేషాధికారాలను పంచుకోవడమే దీనర్థం. విభిన్న వర్గాలకు చెందిన ప్రజలు కలిసి పనిచేయడంతో నగరాలు వచ్చాయి. నగరం, పట్టణం, గ్రామానికి మధ్య ముఖ్యమైన తేడా వాటి పరిమాణమే. చాలా వరకు నగరాలన్నీ ఒకప్పటి గ్రామాలే. మొదటి సిటీ ఎప్పుడు, ఎక్కడ మొదలైందనేది కచ్చితంగా తెలియదనే చెప్పాలి. సంచార మానవ సమూహం తాము స్థిరంగా



ఒకచోట ఉండటానికి అనువైన ప్రదేశాన్ని గుర్తించి, అక్కడే ఉండిపోయినప్పుడు ఊరు ఎదిగి ఉండొచ్చు. ప్రారంభ దశలో మనుషులు జంతువులను మచ్చిక చేసుకుంటే ఆహారం కోసం ప్రతిసారీ వెతుక్కునే అవసరం ఉండదని గుర్తించారు. దానివల్ల ఆకలైన ప్రతిసారీ అడవుల వెంట తిరుగుతూ జంతువులను వేటాడాల్సిన పని ఉండదని అర్థమైంది. అలాగే, మొక్కల్ని పెంచితే మరిన్ని పండ్లు, గింజలను సమకూర్చుకోవచ్చనీ గ్రహించారు. ఈ క్రమంలో వ్యవసాయాన్ని మొదలుపెట్టారు. దాంతో అగ్రికల్చర్, పశువుల పెంపకం మొదలయ్యాయి. సంచార జీవనం చేస్తుంటే వ్యవసాయం చేయడం కుదరదని, పశువుల పెంపకం కూడా సాధ్యం కాదని అర్థమైంది. పంటలు పండించాలంటే ఒక్కచోటే స్థిరంగా ఉండాలని తెలిసొచ్చింది. పశువుల మందలతో సంచార జీవనం కష్టమనీ తేలింది. దాంతో సంచార జీవులు కాస్తా ఒక్కచోటే ఉండి, వ్యవసాయాన్ని, పశుపోషణను మొదలుపెట్టడంతో గ్రామాలు, పట్టణాలకు బీజం పడింది.

హాయ్! బుజ్జీ!!

ప్రారంభ దశలోని గ్రామాలు ఎలా ఉండొచ్చనే దానికి ఆనవాళ్లేమీ మిగల్లేదు. ఎందుకంటే, అప్పటి నిర్మాణాలన్నీ తోలు, కర్ర, బురదతో నిర్మించినవే. తరవాత దీర్ఘకాలం మన్నికగా ఉండే వస్తువులతో నిర్మాణాలు చేపట్టడం మొదలవడంతో గ్రామాలు కాస్తా పట్టణాలు, నగరాలుగా రూపాంతరం చెందాయన్న మాట!

– శ్రీజన్

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ముగిసే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

ఇల్లు	సూర్యుడు	వారధి
కుర్చీ	ఊరు	చేప
కత్తి	సమయం	కాలు

యువ మేధస్సు.. నవ ఉషస్సు

భళా... సితార్–2026 టెక్నో ఫెస్టివ్

సాంకేతిక విద్యార్థులు.. సరికొత్త ఆవిష్కరణలతో భళా అన్పించారు. మేధస్సును రంగరించి.. సమాజంలో సమస్యల పరిష్కారానికి త్రికరణ శుద్ధిగా శ్రమిస్తున్నారు. నదుల స్వచ్ఛత.. ప్రమాదాల గుర్తింపుతో ప్రాణ రక్షణ.. ముచ్చటైన హరితదనం.. వాహన సామర్థ్యానికి వెన్నుదన్ను.. వనరుల పొదుపు వాడకంతో మేలు చేకూరే ప్రాజెక్టులను తీర్చిదిద్దారు. విజయవాడలోని పీవీపీ సిద్ధార్థలో శనివారం నిర్వహించిన సితార్- 2026 టెక్నో ఫెస్టివ్‌లో సాంకేతిక విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో ముచ్చటైన ప్రాజెక్టులను రూపొందించారు. సమస్యలను సాంకేతికతతో పరిష్కరించేలా వీరు తీర్చిదిద్దిన ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. హోరాహోరీగా జరిగిన ఈ ప్రాజెక్టు ఎక్స్‌పోలో... సాంకేతిక సమరాన్ని చాటేలా తలపడ్డారు.

ఆటోమెటిక్ లాన్ మూవర్..



ఇంటి పరిసరాల్లో లేదా లాన్‌లో ఉండే గడ్డిని కత్తిరించే ఆటోమెటిక్ లాన్ మూవర్ రూపొందించారు... ఈఈఈ విద్యార్థులు భవానీ, స్నేహితలు. వీరు సీ... పైతాన్ ప్రోగ్రామ్‌లతోపాటు.. ఆర్డినో యూనోను పరికరాన్ని కంట్రోల్ చేయటానికి, అల్ట్రాసోనిక్ సౌండ్ సిస్టమ్ పరికరానికి దిశను నిర్దేశించటానికి వినియోగించారు. రూ.8 వేలతో తీర్చిదిద్దిన దీనిని లాన్‌లోకి వదిలి, దిశను నిర్దేశిస్తే దానంతట అదే అక్కడ గడ్డిని కత్తిరించేస్తుంది.

బ్రేకులు పడాల్సిందే..

ఎలక్ట్రోమాగ్నెట్ బ్రేక్ అప్లైయింగ్ పరికరాన్ని రూపొందించారు మెకానికల్ విద్యార్థులు వినయ్, చక్రి. మామూలుగా బైకులు, కార్లు, బస్సులు బ్రేకులు వేసినప్పుడు కొంత ఉష్ణం వెలువడుతుంది. అది మిగిలిన వాటిపై ప్రభావం చూపుతుంది. దీనిని అధిగమించేలా బ్రేక్ సిస్టమ్‌ను రూపొందించారు. వీరు షాఫ్ట్, మోటారు, ఎలక్ట్రో మాగ్నటిక్ ఫోర్సు వినియోగించి. రూ.5 వేలతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దారు.



ప్రమాదాలు గుర్తించే హెల్మెట్..



మైనింగ్ చేసే కార్మికులు భూమి లోపలకు వెళ్లినప్పుడు ప్రమాదకర గ్యాస్‌లతో ప్రాణాలు పోయే వీలుంది. లోపలకు వెళ్లే కొద్దీ ఆక్సిజన్ తగ్గి సమస్యలు తలెత్తుతాయి. వీటిని ముందే గుర్తించేలా స్మార్టు హెల్మెట్ రూపొందించారు ఈఈఈ విద్యార్థులు కావ్యశ్రీ, జయశ్రీ. దీని తయారీకి రూ.5 వేలు వెచ్చించి... ఎంక్యూ, టెంపరేచర్, హ్యుమిడిటీ, గ్యాస్ సెన్సార్లు వాడారు. దీనిని కార్మికుడు ధరించి భూమి లోపలకు వెళ్లినప్పుడు ప్రమాదకర గ్యాస్‌లు ఉంటే బీప్‌సౌండ్ చేసి హెచ్చరిస్తుంది.

ఏసీ బిల్లు తగ్గించేద్దాం...



వేసవి వచ్చిందంటే ఏసీలు తిరగాల్సిందే.. బిల్లులు మోత మోగాల్సిందే. అలాకాకుండా కూలింగ్ ప్యానల్ ఫర్ ఎఫెక్టివ్ డొమెస్టిక్ కూలింగ్ ప్రాజెక్టు రూపొందించారు మెకానికల్ విద్యార్థులు భార్గవి, అంజలి. ఇందులో స్నెయిల్ షెల్‌పౌడర్, టెర్రాకాట్ స్ట్రక్చర్, హనీ జీఎంటీ స్ట్రక్చర్, కాయిర్‌ఫైబర్ స్ట్రక్చర్‌లు వాడారు. ఈ పరికరాన్ని ఏసీలో నిక్షిప్తం చేయాలి. ఏసీ ఆఫ్ చేసిన గంట వరకు కూడా ఈ పరికరం పనిచేస్తూ చల్లదనం ఇస్తుంది. దీంతో ఎక్కువ బిల్లురాదు. ఈ చిన్న పరికరం ఎక్కువసేపు చల్లదనం ఇవ్వటానికి ఉపకరిస్తుంది.

– న్యూస్‌టుడే – కానూరు, పోరంకి, తాడిగడప

సౌరశక్తిని ఒడిసిపట్టేద్దాం...



సౌరశక్తిని ఒడిసి పట్టే అధునాతన ప్రాజెక్టును తీర్చిదిద్దారు.. మెకానికల్ విద్యార్థులు ప్రదీప్, రామకృష్ణ. ఉదయం వేళ ఎక్కువ సౌరశక్తిని ప్యానెల్స్ గ్రహిస్తాయి. సూర్యుడి దశ దిశ మారేకొద్దీ సౌరశక్తిని ప్యానెల్స్ తక్కువగా గ్రహిస్తాయి. అందుకే సూర్యుడిని ట్రాకింగ్ చేసి ఎటుంటే అటు ప్యానెల్స్ తిరిగి పూర్తిస్థాయిలో సౌరశక్తిని గ్రహించేలా ప్రాజెక్టును రూపొందించారు. రూ.1,500 వెచ్చించి.. ఆర్డినో యూనో, 3డి ప్రింటింగ్ టెక్నాలజీ, డ్యూయల్ యాక్సెస్ ప్యానెల్స్ వాడారు.

రోబో చొరవతో.. మురిసి "నది"

నదులు చెత్తాచెదారంతో నిండిపోవటం సహజం. కొంతమేరకు మానవ వనరులు వీటిని తొలగిస్తాయి. నది మధ్యలో ఉండే చెత్త, వ్యర్థాలు తొలగించేలా రోబోను రూపొందించారు... ఈఈఈ విద్యార్థులు దివ్యతులసి, వీరేంద్రలు. వీరు ఈ రోబో రూపకల్పనకు సోలార్ ప్యానెల్, పీఐఆర్ సెన్సార్లు, కన్వేయర్ బెల్టు, మోటార్లు, బ్యాటరీ, బ్లూటూత్ వాడారు. రూ.7 వేలు ఖర్చు చేశారు. ఈ రోబోను నదిలో నీటి ఉపరితలంపై ఉంచితే అక్కడ ఉన్న చెత్తను ఇట్టే తొలగిస్తుంది.



సకల సౌకర్యాలు.. పచ్చందాలు

న్యాయ అకాడమీ నిర్మాణం ★ శంకుస్థాపన నేడు

ఈనాడు, అమరావతి: ప్రజా రాజధాని అమరావతిలో ఏపీ న్యాయ అకాడమీ కార్యాలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరగనుంది. ఆధునిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీన్ని నిర్మించనున్నారు. హైకోర్టు భవనం నుంచి కేవలం 5.7 కిలోమీటర్ల దూరంలోనే ఇది ఏర్పాటవుతోంది. 50 మీటర్ల వెడల్పు రహదారులతో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానానికి అనుసంధానంగా ఉంటుంది. ప్రతి విభాగం స్వతంత్రంగా పని చేసేలా డిజైన్ చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్యేకతలు.. పిచ్చుకలపాలెం పరిధిలో 4.83 ఎకరాల్లో నిర్మాణం ✪ బేస్‌మెంట్‌తో పాటు జీ+3 తరహాలో ఉంటుంది. ✪ హాస్టల్ భవనం బ్లాక్ జీ+8 ✪ ఇండోర్ స్పోర్ట్స్, అతిథుల బ్లాక్ జీ+3లో నిర్మిస్తారు. ✪ ఒకేసారి 120 మంది న్యాయమూర్తులకు శిక్షణతో పాటు 60 మంది ఫ్యాకల్టీ, ఇతర సిబ్బందికి వసతులు. ✪ విస్తీర్ణంలో 31% భవనాలకు, 69% పచ్చదనానికి

ఏమేం ఉంటాయంటే.... ✪ అకడమిక్ బ్లాక్‌లో 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం. ✪ సెమినార్ హాల్, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, ఫోరెన్సిక్ ల్యాబ్, గ్రంథాలయం, రీడింగ్ రూమ్ ✪ న్యాయమూర్తులకు విశాలమైన లాంజ్ ✪ డైరెక్టర్, పరిపాలన కార్యాలయాలు ✪ చర్చలకు ఛాంబర్స్ ✪ బోధన సిబ్బందికి ప్రత్యేక గదులు ✪ హెల్త్ యూనిట్, శిశువులకు క్రెచ్ సదుపాయం ✪ 3 మీటర్ల వెడల్పుతో కారిడార్లు ✪ సెంట్రలైజ్డ్ లిఫ్ట్ లాబీలు

హాస్టల్ బ్లాక్‌లో.... ✪ న్యాయాధికారులు, శిక్షణ న్యాయమూర్తులు, శిక్షణార్థులకు నిర్మిస్తున్నారు. ✪ ప్రతీ అంతస్తులో లాంజ్, విశ్రాంతి ప్రదేశాలు, ప్యాంట్రీ.

ఇండోర్ స్పోర్ట్స్, రిక్రియేషన్ బ్లాక్‌లో... డైనింగ్ హాల్, వీఐపీ డైనింగ్ హాల్, వంటశాల, స్క్వాష్ కోర్ట్, జిమ్, యోగా హాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ కోర్ట్, మల్టీపర్పస్ హాల్, స్విమ్మింగ్ పూల్.

రంజాన్ వేళలు



ఇఫ్తార్: (ఆదివారం) సాయంత్రం: 6.19

సహరి: (సోమవారం) ఉదయం:5.08

దండిగా రండి..



వైబ్రెంట్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబోయే ప్రపంచంలోనే అతి పెద్ద మాదక ద్రవ్యాల వ్యతిరేక ఉద్యమం దండి మార్చ్ 2.0 కోసం ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరుతూ ప్రకాశం బ్యారేజీపై 1.2 కి.మీ పొడవైన త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. - ఈనాడు, అమరావతి

నిర్లక్ష్యమే.. పెనునిప్పు

ఆవాసాల మధ్యే బాణసంచా నిల్వలు

★ దీపావళికి మించి.. ఏడాదంతా మోత మోగిస్తున్నారు...

"విజయవాడలోని గాంధీనగర్ జింఖానా మైదానంలో మూడేళ్ల కిందట బాణసంచా దుకాణాల్లో జరిగిన అగ్నిప్రమాదం నేటికీ కళ్ల ముందు కదులుతోంది. తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంలో నిద్రలో ఉన్న బ్రహ్మం, కాశయ్య సజీవ దహనమయ్యారు. సురక్షితం కాని ప్రదేశం, అనధికారింగా... నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తయారుచేసిన నాటు చిచ్చుబుడ్లే దుర్ఘటనకు కారణం. అగ్నిమాపక, పోలీసు, నగరపాలక, విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడింది. మంటలు ఆకాశాన్ని తాకేలా ఎగిసిపడినా.. అదృష్టవశాత్తూ సమీపంలోని జనావాసాలు, పెట్రోల్ బంకు వరకూ రాలేదు. లేదంటే.. కనీవిని ఎరగని ఘోరం జరిగేది."

ఉమ్మడి కృష్ణా జిల్లాలో పట్టణాల నుంచి పల్లెల వరకు వేడుక ఏదైనా.. బాణసంచా మోత మోగిస్తున్నారు. దీంతో మతాబులకు గిరాకీ భారీగా పెరిగింది. గతంలో దీపావళి సందర్భంగా నాలుగైదు రోజుల విక్రయాలకు మాత్రమే బాణసంచాను పెద్దఎత్తున దిగుమతి చేసేవాళ్లు. దానిని గోదాముల్లో దాచి.. విక్రయించేవారు. తెచ్చిన సరకు ఆ ఏడాదికే అమ్మేవాళ్లు. అరకొర మిగిలితే గోదాముల్లో దాచేవాళ్లు. కానీ.. ప్రస్తుతం బాణసంచాకు డిమాండ్ పెరిగింది. అందుకే ఏడాది మొత్తం విక్రయాలు జరిపే దుకాణాలు పుట్టుకొచ్చాయి. వీటిలో వచ్చే లాభం కూడా 30-50 శాతం ఉండడంతో.. చాలామంది బాణసంచా వ్యాపారులు పుట్టుకొచ్చారు. ఒక్క పెనమలూరు వంటి నియోజకవర్గంలోనే ఏటా కనీసం రూ.10 కోట్ల మతాబుల విక్రయాలు కొనసాగుతున్నాయి.



మూడేళ్ల కిందట జింఖానామైదానంలో ప్రమాద తీవ్రత

విజయవాడ, మచిలీపట్నం శివార్లలో పలు ప్రాంతాల్లో రహస్య గోదాములు...

తాడిగడప, ఉయ్యూరు చుట్టుపక్కల నివాస గృహాల మధ్యే బాణసంచా నిల్వ చేస్తున్నారు. తారా జువ్వలు, ఆకాశంలోకి దూసుకుపోయి పేలే థౌజండ్ వాలాలు, భారీ శబ్దంతో పేలే బాంబులు.. లాంటివే అధికంగా ఉంటున్నాయి. అన్ని వేడుకల్లోనూ బాణసంచాకు ప్రస్తుతం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నారు. బాగా పేలాలి, ఆకాశంలోకి దూసుకెళ్లి మిరుమిట్లు గొలపాలని అడిగేవాళ్లే ఎక్కువ ఉండడంతో.. వ్యాపారులు సైతం అలాంటివే అధికంగా తెచ్చి.. కనీసం విద్యుత్తు సౌకర్యం కూడా లేని చీకటి గోదాముల్లో ఉంచుతున్నారు. కంకిపాడుకు చెందిన కొందరు వ్యాపారులు తమ ఇంటిలోనే బాణసంచా దాచేందుకు ప్రత్యేకంగా గదులను కేటాయిస్తున్నారు.

మామూళ్లు ఇస్తే చాలు..

రెవెన్యూ, పంచాయతీ, అగ్నిమాపక, పోలీస్‌శాఖల అనుమతితోనే బాణసంచా విక్రయాలు జరగాలి. కానీ.. దీపావళి రోజునే అధికార యంత్రాంగం.. హడావుడి కనిపిస్తోంది. మిగతా ఏడాదంతా 'ఎంతైనా అమ్ముకోండి.. మాకు మామూళ్లు ఇవ్వండనేలా' అధికారుల తీరు ఉంటోంది. అందుకే.. కనీస నిబంధనలను సైతం వ్యాపారులు పాటించడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే.. పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటుంది.

–ఈనాడు, అమరావతి – కంకిపాడు, న్యూస్‌టుడే

పరీక్షల భయాన్ని తరిమికొట్టేయండి..!

పదో తరగతి విద్యార్థుల కోసం ఉచిత వెబినార్ 1న

ఈనాడు ప్రతిభ | శ్రీచైతన్య విద్యాసంస్థలు

ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. చదువుల్లో విద్యార్థి సామర్థ్యానికి టెన్త్ క్లాస్ ఒక ప్రమాణాన్ని నిర్దేశిస్తుంది. అందుకే పదో తరగతి వార్షిక పరీక్షలనగానే విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. అధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతోపాటు తమపై తల్లిదండ్రులకు ఉండే అంచనాలను అందుకోవాలనే తపన ఆందోళనను పెంచేస్తుంది. పరీక్ష తేదీలు దగ్గర పడుతున్న కొద్దీ కొందరిలో భయం పెరిగి జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోతుంటుంది. ఇలాంటి అనవసర భయాలను, ఆందోళనలను పోగొట్టి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు శ్రీ చైతన్య విద్యాసంస్థలు, 'ఈనాడు-ప్రతిభ' సంయుక్తంగా ఉచిత వెబినార్ నిర్వహిస్తున్నాయి. పరీక్షల ఒత్తిడిని ఎలా జయించాలో వివరిస్తూ, అత్యుత్తమ మార్కులు సాధించడానికి ఈ వెబినార్ మార్గదర్శనం చేస్తుంది. ప్రముఖ సబ్జెక్టు నిపుణులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తక్కువ సమయంలో సిలబస్‌ను ఏ విధంగా రివిజన్ చేయాలో తెలియజేస్తారు. పరీక్షల భయాన్ని పోగొట్టి, మానసిక స్థితిని స్థిరపరిచేందుకు సైకాలజిస్టులు సూచనలు చేస్తారు. గత ఏడాది టాపర్లుగా నిలిచిన విద్యార్థులు తమ అనుభవాలను వివరించి స్ఫూర్తిని నింపుతారు. టెన్త్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకూ ఈ వెబినార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



ఇదిగో ఈ అంశాలపైనే సూచనలు

- యాక్టివ్ రీకాల్, మైండ్ మ్యాపింగ్ ద్వారా క్లిష్టమైన అంశాలను ఎలా గుర్తుంచుకోవాలి?
- గణితం, సైన్స్‌లో స్కోరింగ్ పాయింట్లు, ప్రజెంటేషన్ టిప్స్.
- ఏకాగ్రతను పెంచే చిన్న చిన్న వ్యాయామాలు.
- పరీక్ష గదిలో టైం మేనేజ్‌మెంట్.
- ఆరోగ్యం, ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.
- విద్యార్థులు అడిగే సందేహాలకు నిపుణుల సమాధానాలు.

జూమ్ మీటింగ్, యూట్యూబ్ లైవ్, ఈనాడు.నెట్ ద్వారా వెబినార్‌లో జాయిన్ కావచ్చు

వెబినార్ తేదీ:	మార్చి 1, 2026 (ఆదివారం)
సమయం:	ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు

జూమ్ మీటింగ్ కోసం... | యూట్యూబ్ లైవ్ కోసం...

Join from PC, Mac, iPad, or Android:
Zoom - https://hov.to/b2c7ec22
Youtube Live - https://hov.to/d4ce0f1a
Zoom ID - 953 5694 9081 Passcode: 115422

సైబర్ నేరాల కట్టడికి.. మేముసైతం!

స్వచ్ఛంద సేవకు అ"విశ్రాంత" సేవ

ఈనాడు, అమరావతి: రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల కట్టడికి విశ్రాంత పోలీసు అధికారులు తోడ్పాటు ఇవ్వనున్నారు. ఇప్పటికే నగర పోలీసులు ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి.. బ్యాంకుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాకే.. పెద్దమొత్తంలో నగదు లావాదేవీలు అనుమతిస్తున్నారు. అదనంగా పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులతోనూ అవగాహన క్రతువు నిర్వహించనున్నారు. పోలీసు శాఖలో అధికారులుగా పనిచేసి రిటైరై నగరంలో స్థిరపడిన వారు 200 మంది వరకు ఉన్నారు. వీరికి రెండు సంఘాలు ఉన్నాయి. సర్వీసులో ఉండగా వివిధ హోదాల్లో పనిచేసిన వీరి సేవలను సైబర్ నేరాల నియంత్రణలో ఉపయోగించాలని సీపీ రాజశేఖరబాబు నిర్ణయించారు. ఈమేరకు ఇటీవల వారిని సంప్రదించగా.. ఇందుకు సమ్మతించారు. దీనికి కొనసాగింపుగా శనివారం విశ్రాంత అధికారులతో సమావేశమై.. వీరి సేవలను ఎలా వినియోగించుకోవాలనే దానిపై ప్రణాళిక సిద్ధం చేశారు.

సైబర్ సురక్ష'లో భాగస్వామ్యం... సైబర్ సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే పోలీసు బృందాలు అవగాహన కల్పిస్తున్నాయి. ప్రతి స్టేషన్‌లో ఒక ఎస్సై ఆధ్వర్యంలో ఇద్దరు, ముగ్గురు కానిస్టేబుళ్లతో 'సైబర్ టీమ్'ను వేశారు. వీరికి అదనంగా మరింత పక్కాగా కార్యక్రమాల నిర్వహణకు విశ్రాంత అధికారుల సాయం తీసుకుంటున్నారు. వీరుండే ప్రాంతాల్లో కొన్ని బ్యాంకులను కేటాయిస్తారు. బ్యాంకు సిబ్బంది, పోలీసులతో కలసి వీరు సమన్వయంతో సాగుతారు. ఏఐ ఆధారంగా పనిచేసే వెబ్‌పై బ్యాంకులకు వచ్చే ఖాతాదారులకు వారి మొబైళ్లను తెరిచి అవగాహన కల్పిస్తారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు పెద్దఎత్తున నగదు బదిలీ చేసే వారిని గుర్తించి.. ఆ వెబ్‌సైట్‌లో అంశాలను చదివించి.. వారి అంగీకారాన్ని తీసుకుంటారు. విద్యాసంస్థలకూ వెళ్లి అవగాహన కల్పిస్తారు.



విశ్రాంత పోలీసు అధికారులతో సమావేశమైన సీపీ

సీసీ కెమెరాల నిర్వహణలోనూ.. కమిషనరేట్‌లో సీసీ కెమెరాల నిర్వహణలోనూ విశ్రాంత ఉద్యోగులు సాయం చేయనున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో 600 నిఘా నేత్రాలున్నాయి. ఇవి మరమ్మతులు, సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు విశ్రాంత అధికారులు.. సంబంధిత ఏజెన్సీలు, దాతల సాయంతో వీటిని సరిదిద్దుతారు.

పేదల గూడు.. పట్టని గోడు!

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం – న్యూస్‌టుడే, కలెక్టరేట్

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు అదనపు సాయం చేస్తున్నా.. ఆశించిన ప్రగతి కనిపించడం లేదు. ఉగాది నాటికి ఉమ్మడి కృష్ణా జిల్లాలో 44,687 గృహాలు పూర్తి చేయాలనే లక్ష్యానికి జగనన్న కాలనీల్లో వసతుల లేమి అడ్డంకిగా మారింది. తరచూ కలెక్టర్లు సమీక్షిస్తున్నా.. పురోగతి కనిపించడం లేదు.

40 వేల గృహాల రద్దు

★ వైకాపా ప్రభుత్వ హయాంలో కొంతమంది నాయకులు, అధికారుల అక్రమార్జన కోసం నిర్మాణానికి అనువుగా లేని భూములు కొని ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నామని ఊదరగొట్టారు. కేంద్రం ఇచ్చిన రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టుకోవాలని చెప్పి వదిలేశారు. మెరక పేరుతో దొంగ బిల్లులు పెట్టి రూ.కోట్లు కొల్లగొట్టారు. భవన నిర్మాణ సామగ్రి పక్కదారి పట్టించారు. దాదాపు అన్ని లేఔట్లు చెరువును తలపిస్తున్నాయి. కొందరు లబ్ధిదారులు అప్పు చేసి పనులు ప్రారంభించినా.. పునాదుల్లోనే వదిలేశారు. ఉమ్మడి జిల్లాలో వివిధ కారణాల వల్ల సుమారు 40 వేల గృహాలు రద్దయ్యాయి. ★ వైకాపా ప్రభుత్వంలో అవసరానికి మించి ఇష్టారీతిన నిర్మాణ సామగ్రి కొని వృథాగా పడేశారు. సొమ్ము మాత్రం లబ్ధిదారుల ఖాతాల నుంచి మినహాయించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఇస్తోంది. అదనపు సాయం అందుతున్నా.. ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి నెలకొంది. స్వల్ప వ్యవధిలో ఆర్థిక లబ్ధి పొందకుంటే.. అసంపూర్తి నిర్మాణాలకు గ్రహణం పట్టినట్టే.

ఇళ్ల సమాచారం	ఎన్టీఆర్	కృష్ణా
మంజూరు	65,482	65,054
పూర్తయినవి	....	33,847
పురోగతిలో	62,414	29,367
మొదలుకానివి	3068	1840



గుడివాడలో అసంపూర్తిగా ఇళ్లు

గడువు దాటితే బిల్లులు పడవు

గృహ నిర్మాణ బిల్లులు మార్చి 31 లోపు అనుమతించే పరిస్థితి ఉంది. తరువాత బిల్లులు వచ్చే అవకాశం ఉండదు. లబ్ధిదారులు అప్రమత్తమై నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి. లేఔట్లలో సదుపాయాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. **- వెంకట్రావు, రజనీకుమారి, గృహ నిర్మాణ సంస్థ పీడీలు**

బోటనీ.. చరిత్ర పరీక్షలకు 186 మంది గైర్హాజరు

మాచవరం, న్యూస్‌టుడే : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బోటనీ, చరిత్ర సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 6,154 మందికిగాను.. 5,968 మంది విద్యార్థులు హాజరయ్యారు. 186 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆయన పేర్కొన్నారు.


మహాకుంభాభిషేక ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడిలో మహాకుంభాభిషేక ఏర్పాటు పనులను ఈవో శీనానాయక్ శనివారం పరిశీలించారు. క్యూలైన్లో వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని తాగునీటిని భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. కనకదుర్గానగర్ నుంచి రథం సెంటరు వరకు పార్కింగ్ సదుపాయాలను మెరుగు పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వెంకట రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ట్రస్టుబోర్డు సభ్యులు శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

మహానంది దేవస్థానానికి రూ.30 లక్షల విరాళం

మహానంది, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానందిలోని ప్రధాన ఆలయానికి విజయవాడకు చెందిన దాత వైభవ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి రూ.80 లక్షలు విరాళంగా ఇవ్వడానికి అంగీకరించారు. ముందస్తుగా శనివారం రూ.30 లక్షలను దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధుకు అందజేశారు. మహానందికి దైవ దర్శనార్థం వచ్చారు. గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు, నామార్చనలు చేసుకున్నారు. విరాళంతో ఆలయంలో ఇత్తడి గేట్లు, గ్రిల్స్ ఏర్పాటు చేయించడానికి నిపుణులను రప్పించి పనులను ప్రారంభించారు.


మహానందిలో దాతను సత్కరిస్తున్న దేవస్థానం అధికారులు

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దౌర్జన్యం

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆటో డ్రైవర్లు దౌర్జన్యం చేసిన ఘటన శనివారం సిటీ బస్ పోర్ట్ వద్ద చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం ఆటోనగర్ నుంచి జక్కంపూడి కాలనీ వెళ్తున్న సిటీ బస్సు.. బస్‌పోర్ట్ నుంచి బయటకు వచ్చే సమయంలో అడ్డదిడ్డంగా మలుపు తిరుగుతున్న ఆటోకు బస్సు రాసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన స్థానిక ఆటో చోదకులు బస్సు డ్రైవరు, కండక్టర్లపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో సిటీ బస్‌పోర్ట్‌లో గంటకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం డ్రైవర్ ఫిర్యాదు చేసేందుకు కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.


డ్రైవర్‌ను లాక్కెళుతున్న ఆటోడ్రైవర్లు

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

ఆత్మీయ వీడ్కోలు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి.. చిత్తశుద్ధితో సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీ కె.జి.వి.సరిత.. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఆత్మీయంగా పలకరించి.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎస్సైలు కె.కోటేశ్వరరావు, వి.జయమ్మ, ఏఎస్సై పి.శ్రీనివాసరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎన్. మధుబాబు, హోంగార్డు చిలక జ్యోతిలకు శాలువాలు కప్పి సత్కరించారు.


ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సరిత, ఇతర అధికారులు

జలవనరుల శాఖ ఎస్‌ఈ..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ జలవనరుల శాఖ సర్కిల్ ఎస్‌ఈ ఆర్. మోహనరావు శనివారం పదవీ విరమణ చేశారు. రైతు శిక్షణ కేంద్ర భవనం (ఎఫ్‌టీసీ)లో ఆయన్ని ఘనంగా సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. మోహనరావు స్థానంలో ఇంకా ఎవరినీ నియమించ లేదు. నూతన ఎస్‌ఈగా పలువురి పేర్లు వినిపిస్తున్నప్పటికీ.. సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.


ఎస్‌ఈ మోహనరావు

కుటుంబ కలహాలు.. భార్యపై గొడ్డలితో దాడి

జి.కొండూరు, న్యూస్‌టుడే : కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త గొడ్డలితో భార్యపై దాడికి పాల్పడిన సంఘటన ఇది. పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని చెరువు మాధవరం గ్రామానికి చెందిన మరీదు నాగరాజు, వీరులపాడు మండలం జుజ్జూరుకు చెందిన భూలక్ష్మీకి ఇరవై ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇరువురు కుమార్తెలు. భార్యాభర్తలు తరచూ గొడవలు పడుతుంటారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి జరిగిన గొడవలో నాగరాజు విచక్షణ కోల్పోయి భార్యపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు అక్కడికి రాగానే నాగరాజు పరారయ్యాడు. స్థానికులు గాయపడిన భూలక్ష్మీని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ కేసు నమోదు చేసి, నాగరాజును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని నూజివీడు సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.


బాధితురాలిని విచారిస్తున్న ఎస్సై సతీష్ కుమార్

కాల్వలకు నీటి విడుదల కొనసాగింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్షాల ప్రభావంతో ... కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి శనివారం 3,520 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 1,702, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 1,818 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్‌కు 1,200, కేఈబీ 302, బందరు కాల్వకు 200 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు. బ్యారేజీ వద్ద పూర్తి స్థాయిలో 12 అడుగుల నీటి మట్టం ఉంది.

రాష్ట్రంలో జాతీయ షూటింగ్ బాల్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ జూనియర్, సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ సంఘం అధ్యక్షుడు ... నగరంలోని ఒక హోటల్‌లో శనివారం జాతీయ షూటింగ్ బాల్ సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ... జాతీయ సీనియర్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్‌ను మహారాష్ట్ర ... దిల్లీ హైకోర్టులో కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ ... షూటింగ్ బాల్ ... పోటీలు ... పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఉన్నత ఆశయాలతో ముందుకెళ్తేనే మేలు

కొండపల్లి: విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. కొండపల్లిలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువులు పూర్తి చేయడం, డిగ్రీలు సంపాదించడంతోనే సరి పెట్టుకోకుండా సమాజానికి మన వల్ల ఎంత మేలు జరుగుతుందో గ్రహించుకొని దాన్ని నిర్వహించాలన్నారు. కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, కూటమి నాయకులు, రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

జమాలాపురం మేజర్ కాలువలో రైతుల నిరసన

ఎ.కొండూరు : మండల పరిధిలోని జమాలాపురం మేజర్ కాలువ చివరి వరకు సాగునీరు అందించాలని కోరుతూ శనివారం పలువురు రైతులు కాలువలో నిరసన చేపట్టారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వరరావు, కేశవులు, బాబూరావు, రమేష్, రాజా, అభిలాష్, నవీన్ పాల్గొన్నారు.

నకిలీ మందులతో ప్రజల ప్రాణాలకు ముప్పు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ప్రభుత్వం మెడికల్ మాఫియాపై తక్షణ చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగుల్‌మీరా కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని ఊటుకూరులో ఆందోళన చేశారు. నకిలీ మందులతో జనాల ప్రాణాలు, ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఆసుపత్రులు, మందుల మాఫియాపై దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



ఊటుకూరులో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ✤ తిరువూరు 5, 8 వార్డుల్లోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికులు నాగబాబు, రసూల్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు

✤ నరసాపురం ఉప్పర బజారులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారులకు తెలిపారు. ఈవో జి.స్వాతి స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, విస్సన్నపేట

? వెల్లటూరు శివారు భీమవరప్పాడులో పత్రియ ఇంటి సమీపంలోని చేతి పంపు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నాం. - **శివయ్య, గ్రామస్థుడు** ✔ సమస్య తెలిసింది. సిబ్బందిని పంపి తక్షణమే మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. - **రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, జి.కొండూరు

రాజ్యాంగ పరిరక్షణకు కృషి


రాజేంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని

గొల్లపూడి : రాజ్యాంగ పరిరక్షణకు మాజీ రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ విశేష కృషి చేశారని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. మాజీ రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ వర్ధంతిని గొల్లపూడిలోని కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నిధుల కేటాయింపులే.. పనుల్లేవ్..!

జి.కొండూరు, న్యూస్‌టుడే

మండు వేసవి ఇంకా సమీపించనే లేదు.. అప్పుడే మండలంలోని గ్రామాల్లో ప్రజలు దాహం కోసం అవస్థలు పడుతున్నారు. దీంతో జల్‌జీవన్ మిషన్ నిధులు కేటాయింపులే తప్పా పనులు చేసేందుకు అక్కరకు రావడం లేదని తెలుస్తోంది. మండలంలో ఒక వైపు కందులపాడు- గంగినేనిపాలెం-ఎర్రుపాలెం(కేజీవై) ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండటమే దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గడ్డమణుగు, చెరువు మాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుర్గిరాలపాడు వరకు వెళ్లాల్సిన కృష్ణా జలాల సరఫరా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా ఆయా గ్రామాలకు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరో వైపు చెవుటూరు, గుర్రాజుపాలెం తదితర గ్రామాలకు నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని ప్రజలు మండిపడుతున్నారు. పలు చోట్ల పైపులైను లీకై ప్రధాన రహదారి వెంబడి అర కిలోమీటరు మేర నీరంతా వృథాగా పోతూ దర్శనమిస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


జి.కొండూరు- చెవుటూరు మధ్య వృథాగా పోతున్న కృష్ణా జలాలు

వారం రోజులుగా నీరందక..

గుర్రాజుపాలెంలో వారం రోజులుగా కృష్ణా జలాల సరఫరా నిలిచిపోయి అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. మైలవరం వైపు వెళ్లే కృష్ణా జలాలను గుర్రాజుపాలెం సంపులో నింపి మోటారుతో గ్రామంలో సరఫరా చేస్తున్నారు.

గ్రామాల్లో ఆరంభమైన దాహం కేకలు

వారం కిందట సంపులోని మోటారు కాలిపోవడంతో నీటి సరఫరా ఆగిపోయిందని వాపోతున్నారు. ఈ క్రమంలో కొందరు సంపు మూత పగలకొట్టి నీరు ముంచుకొని వెళ్తున్నారు. సంపు ఎత్తు తక్కువగా ఉండడంతో మూత పగలకొట్టడం వల్ల నీరు కలుషితమవుతోందని చెబుతున్నా అధికారుల పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంపు మోటారుకు మరమ్మతులు చేయించాలని, సంపునకు పటిష్ఠమైన మూత ఏర్పాటు చేసి కృష్ణా జలాలు కలుషితమవ్వకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

✤ ఈ సమస్యపై సంబంధిత సహాయక ఇంజినీర్ దయానంద్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇలా స్పందించారు. మోటారుకు మరమ్మతులు చేయిస్తున్నామని, పూర్తి కాగానే నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

వైద్య శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు


నేత్ర పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మైలవరం, న్యూస్‌టుడే : లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వాసన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పలువురికి నేత్ర పరీక్షలు చేశారు. నాగభూషణం, వెంకటేశ్వరరావు, చంద్రం, విష్ణు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయండి మహాప్రభో..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : వేమిరెడ్డిపల్లి నుంచి పుట్రేల వెళ్లే రహదారికి మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. నాగరాజు, రామారావు, ధనలక్ష్మి, కోటేశ్వరరావు, చెన్నారావు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యేలు కృష్ణప్రసాద్, మాలకొండయ్య, పోలీసు అధికారులు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు యువత శ్రమించాలని మైలవరం, చీరాల ఎమ్మెల్యేలు కృష్ణప్రసాద్, మాలకొండయ్య అన్నారు. 'డ్రగ్స్‌పై దండయాత్ర' అవగాహన కార్యక్రమాన్ని కేతనకొండ ఆరేక్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్‌ను సరదా అలవాటు చేసుకొని ఎందరో తమ జీవితాలను నాశనం చేసుకొన్నారని తెలిపారు. మహిళా పోలీసులు రేవతి, హైమావతి, తేజ, త్రివేణి, ప్రియాంక 36 రోజుల్లో 500 కి.మీ సైకిల్ యాత్ర చేస్తూ మత్తు పదార్థాలపై అవగాహన కల్పించడం సంతోషకర విషయమన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కూటమి నాయకులు, ఏసీపీ దుర్గారావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవడంలోనే విజయం


మాట్లాడుతున్న జిల్లా పర్యాటక శాఖ అధికారిణి శిల్ప

కొండపల్లి, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా గ్లోబల్ పరిధిని విస్తరించి కొయ్య బొమ్మల ఎగుమతులను పెంచుకోవచ్చని జిల్లా పర్యాటక శాఖ అధికారిణి శిల్ప అన్నారు. శక్తి వృద్ధి, ఈ- కామర్స్ స్వీకరణ అవగాహన వర్క్‌షాపును కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకోవడంలోనే కొంత విజయం దాగి ఉందన్నారు. వాల్‌మార్ట్ ఈ- కామర్స్ నిపుణులు, కొండపల్లి ఆర్ట్స్, క్రాఫ్ట్స్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

టెండర్ విధానాన్ని రద్దు చేయండి

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుల నిర్వహణకు నిర్వహిస్తున్న టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సుధాకర్ కోరారు. ఈ మేరకు శనివారం పంచాయతీ కార్మిక సంఘ నాయకులతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వీరమ్మ, చంద్రరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస స్వామికి ప్రత్యేక అలంకరణ

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని మెట్టగుట్టలో గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో శనివారం ప్రధానార్చకుడు శ్యామసుందరాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


మెట్టగుట్టలో..


వేణుగోపాల స్వామి

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జి.కొండూరు : వెల్లటూరు వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు వంశపారంపర్య అర్చకుడు కోమలి వెంకటాచార్యులు తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా ఆరేటమ్మ తల్లి ఉత్సవాలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధి కొత్త నాగులూరులోని శ్రీబాల ఆరేటమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా సాగాయి. అయిదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శనివారం మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పాల్గొని పూజలు చేశారు. నాయకులు విజయబాబు, వేణుగోపాలరెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కంభంపాడులో శ్రీభూనీలేశ్వరీ దేవి, ముత్యాలమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎ.కొండూరు ఎస్సై గంధం. మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ సామాజిక భరోసాతో భద్రత


కేతనకొండలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్


తిరువూరులో ఎమ్మెల్యే శ్రీనివాసరావు..

న్యూస్‌టుడే బృందం : తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రతి కుటుంబానికి భద్రతగా మారిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా చేసుకొని పాలన సాగిస్తోందన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు పర్యటించి 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 8,93,385 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆ గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

'పోరాటం చేసినా ఫలితం శూన్యం'

కొండపల్లి, న్యూస్‌టుడే : సుదీర్ఘకాలం న్యాయ పోరాటం సాగించినా నేరస్థులు తప్పించుకోవడం విచారకరమని, ఆయేషా మీరా అస్థికలు కాకుండా న్యాయాన్ని సమాధి చేశారని ముస్లిం మత పెద్దలు అల్తాఫ్ రజా అన్నారు. ఈ విషయమై ఆయన కొండపల్లిలో శనివారం మాట్లాడారు. సాంకేతిక రంగం ఇంతగా అభివృద్ధి చెందిన రోజుల్లో ఫార్మసీ విద్యార్థినికి న్యాయం జరగకపోవడం దుర్మార్గమన్నారు.

హద్దులు దాటిన.. రేషన్ మాఫియా

ఎ.కొండూరు, న్యూస్‌టుడే

పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న చౌక బియ్యం అక్రమంగా రేషన్ మాఫియా చేతుల్లోకి వెళ్తున్నట్లు ప్రతి నిత్యం మండలంలో ఏదో ఒక చోట నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనాలకు అందాల్సిన బియ్యం, పంచదార వంటి నిత్యావసర సరకులను కొందరు దళారులు మండల పరిధిలోని కొంత మంది రేషన్ డీలర్ల సాయంతో పక్కదారి పట్టిస్తున్నట్లు సమాచారం. మండలంలో మొత్తం 32 రేషన్ దుకాణాలు ఉండగా 250 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. కానీ వీటిలో చాలా వరకు లబ్ధిదారులకు అందడం లేదు. ఈ నేపథ్యంలో పలువురు కొంత బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. లబ్ధిదారులు బియ్యం తక్కువగా ఇచ్చారు? ఏమిటని ప్రశ్నిస్తే స్టాక్ తగ్గింది, సర్వర్ పని చేయడం లేదని డీలర్లు సమాధానం ఇస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

పలు అంశాలు వెలుగులోకి..

ఇటీవల మండలంలోని కొన్ని గ్రామాల్లో అధికారులు తనిఖీలు చేసినప్పుడు చౌక బియ్యం నిల్వలు గోదాముల్లో కనిపించకపోవడం, రికార్డుల్లోని లెక్కలు సరిపోకపోవడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనాలు కోరుతున్నారు. ప్రతి దుకాణంలో డిజిటల్ తూకాలు, నిఘా నేత్రాలు, స్టాక్ వివరాల ప్రదర్శన తప్పనిసరి చేయాలని, గ్రామ స్థాయిలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై పీడీయస్ డీటీ శ్వేతని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఈ విషయం అధికారుల దృష్టిలో ఉందన్నారు. అక్రమంగా బియ్యం విక్రయించే వారు పక్కాగా దొరికితే వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్ షిప్ రద్దు చేస్తామన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని డీఈవో చంద్రకళ శనివారం తనిఖీ చేశారు. తుది పరీక్షలు సమీపిస్తున్నందున పది విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.


విద్యార్థిని సామర్థ్యం పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

ప్రతిభావంతురాలికి అధికారుల అభినందన

జి.కొండూరు : విజయవాడలోని సీవీఆర్ జీఎం ఉన్నత పాఠశాలలో డీఈవో చంద్రకళ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భాషోత్సవాల్లో జి.కొండూరులోని ఎస్ఎస్ఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముప్వా దీపిక ప్రతిభ చాటి ద్వితీయ స్థానం పొందింది. ఈ మేరకు ఆమెకు డీఈవో చంద్రకళ జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. విద్యార్థినికి, ఆమెకు శిక్షణ ఇచ్చిన గైడ్ టీచర్ జక్కా రామకృష్ణకు హెచ్‌ఎం శ్రీలత, ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెలగలేరులో చనుమోలు ఫకీర్రాయుడు జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చనుమోలు లక్ష్మీకాంతమ్మ వెంకట్రామయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.91 వేలు విలువైన నగదు బహుమతులను గతేడాది పదో తరగతిలో ప్రతిభ చాటిన 11 మంది విద్యార్థులకు అందజేశారు. వీటిని పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చనుమోలు అనిల్ కుమార్(బాబ్జీ), ట్రస్ట్ సభ్యురాలు విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం పద్మ తెలిపారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : చనుమోలు లక్ష్మీకాంతమ్మ, వెంకటరామయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలను శనివారం అందజేశారు. కొత్తూరు తాడేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులకు నగదు బహుమతులు ఇచ్చారు. ట్రస్ట్ సభ్యులు చనుమోలు అనిల్ కుమార్, హెచ్‌ఎం కె.బాబూరావు, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ కె.విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన బెంగుళూరు నగరం గురురెడ్డి లేఅవుట్, 8వ క్రాస్ నెం.32 కాపురస్థులు పత్తిపాటి పాపయ్య గారి కుమారుడు పత్తిపాటి నరసింహారావు గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని గొల్లపూడి, సాయిపురం కాలనీ, సాయితేజ రెసిడెన్సీ, ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్.2 కాపురస్థులు సూరపనేని వెంకటరామారావు గారి కుమారుడు సూరపనేని యోగేంద్రబాబు గారు అమ్మజూపగా, నా క్లయింటు అయిన పత్తిపాటి నరసింహారావు గారు సదరు ఆస్తిని కొనుగోలు నిమిత్తం కొంత సొమ్మును ఏక్సిస్ బ్యాంక్ చెక్కు నెం. 235101, ది.12.02.2026 న పార్టు పేమెంటుగా చెల్లించి, విక్రయ ఖరారు ఎగ్రిమెంటును చేయించుకునియున్నారు.

ఈరోజు లగాయతు 10 రోజులలోపు దిగువ షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ, ఎటువంటి చెల్లదగిన ఆక్షేపణలుగాని, క్రయములుగాని, హామీలు మరి ఏ యితరమైన చెల్లదగిన బాకీలు గాని ఉన్నయెడల దిగువ తెల్పిన అడ్రసుకు వ్రాత పూర్వకముగా తిరుగు రశీదుతో తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవని యిందుమూలముగా తెలియజేయటమైనది.

షెడ్యూల్ : యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి పరిధిలోని నున్న సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ రూరల్ మండలం, తాడేపల్లి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కొత్తూరు గ్రామ రీ సర్వే నెం. 23/2ఐ2, యల్.పి.నెం.1077 దాఖలా ప్రస్తుత రికార్డు ప్రకారం ఉన్న య. 1-97 శెంట్లు శేరి మెరక భూమికి **హద్దులు తూర్పు :** సప్లయి ఛానల్, **దక్షిణం :** చనుమోలు భాస్కరరావు గారు లోగడ యితరులకు విక్రయించిన భూమి, **పడమర :** చనుమోలు అనిల్ కుమార్ గారు లోగడ యితరులకు విక్రయించిన భూమి, **ఉత్తరం :** గూడూరు శివయ్య గారు లోగడ యితరులకు విక్రయించిన భూమి.

కాకేపల్లి చిరంజీవి, అడ్వకేటు
డోర్ నెం. 76-6-22, భగత్‌సింగ్ రోడ్, భవానీపురం,
విజయవాడ-520 012. సెల్ నెం. 95507 59010.

ప్రకటన

నా క్లయింటు అయిన బెంగుళూరు నగరం గురురెడ్డి లేఅవుట్ 8వ క్రాస్ నెం.32 కాపురస్థులు పత్తిపాటి పాపయ్య గారి కుమారుడు పత్తిపాటి నరసింహారావు గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని వెలగలేరు, కొల్లేటిగూడెం, డోర్ నెం. 4-28 కాపురస్థులు సూరపనేని వెంకట రామారావు గారి కుమారుడు సూరపనేని నాగేంద్ర గారు అమ్మజూపగా, నా క్లయింటు అయిన పత్తిపాటి నరసింహారావు గారు సదరు ఆస్తిని కొనుగోలు నిమిత్తం కొంత సొమ్మును ఏక్సిస్ బ్యాంక్ చెక్కు నెం. 235100, ది.12.02.2026న పార్టు పేమెంటుగా చెల్లించి, విక్రయ ఖరారు ఎగ్రిమెంటును చేయించుకునియున్నారు.

ఈరోజు లగాయతు 10 రోజులలోపు దిగువ షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ, ఎటువంటి చెల్లదగిన ఆక్షేపణలుగాని, క్రయములుగాని, హామీలు మరి ఏ యితరమైన చెల్లదగిన బాకీలుగాని ఉన్నయెడల దిగువ తెల్పిన అడ్రసుకు వ్రాత పూర్వకముగా, తిరుగు రశీదుతో తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవని యిందుమూలముగా తెలియజేయటమైనది.

షెడ్యూల్ : యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి పరిధిలోని నున్న సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ రూరల్ మండలం, తాడేపల్లి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కొత్తూరు గ్రామ రీ సర్వే నెం.23/2ఐ2 యల్.పి.నెం.1076 దాఖలా ప్రస్తుత రికార్డు ప్రకారం ఉన్న య. 1-94 శెంట్లు శేరి మెరక భూమికి **హద్దులు తూర్పు :** సప్లయి ఛానల్, **దక్షిణం :** సూరపనేని యోగేంద్రబాబు గారి నుండి మీరు విక్రయ ఖరారు పొందిన భూమి హద్దు, **పడమర :** చనుమోలు అనిల్ కుమార్ గారు లోగడ యితరులకు విక్రయించిన భూమి, **ఉత్తరం :** గూడూరు పకీరమ్మ గారు లోగడ యితరులకు విక్రయించిన భూమి.

కాకేపల్లి చిరంజీవి, అడ్వకేటు
డోర్ నెం. 76-6-22, భగత్‌సింగ్ రోడ్, భవానీపురం,
విజయవాడ-520 012. సెల్ నెం. 95507 59010.


జి.కొండూరులో వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తూ..

సేవలు అభినందనీయం

జి.కొండూరు : జి.కొండూరు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు శనివారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దంపతులను ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, సర్పంచి మండల అరుణ, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు సత్కరించారు. సేవలు అభినందనీయమని కొనియాడారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం ఆదిశేషు, ఎంఈవో కేశవరావు సమక్షంలో ఆంగ్లం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, సత్యవేణి ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వీరిని ఘనంగా సన్మానించారు.


కంభంపాడులో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో..

ఘనంగా దర్జీల దినోత్సవం

గంపలగూడెం, న్యూస్‌టుడే : స్థానిక దర్జీల ఆధ్వర్యంలో గంపలగూడెం నుంచి తోటమూల వరకు శనివారం ప్రదర్శన నిర్వహించారు. సమీపంలోని మామిడితోటలో సమావేశమై కుట్టు మిషన్ రూపకర్త విలియన్స్ హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ దర్జీలు ఎస్.కోటేశ్వరరావు, జె.శ్రీనివాసరావును సత్కరించారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణ టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్‌లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడి దర్జీల సంఘం ఆధ్వర్యంలో విలియన్స్ హోవే చిత్రపటానికి దర్జీలు నివాళులర్పించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు, సభ్యులు హనుమంతరావు, బాషా, ముస్తఫా, సాంబశివరావు, అలీ పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు శివారు శివసాయి హోటల్ ఎదురుగా ఉన్న మామిడి తోటలో జీవన జ్యోతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ దినోత్సవం జరుపుకొన్నట్లు అధ్యక్షుడు పజ్జూరు వెంకటేశ్వరరావు తెలిపారు. సీనియర్ టైలర్స్‌ను సన్మానించారు.


గంపలగూడెంలో దర్జీల ప్రదర్శన


గొల్లపూడిలో విలియన్స్ హోవే చిత్రపటానికి నివాళి

రీసర్వే తెచ్చిన తంటా..

మైలవరం, న్యూస్‌టుడే : వైకాపా హయాంలో అడ్డదిడ్డంగా సాగిన భూముల రీసర్వేలో.. సమస్యలే కాదు, సరిహద్దుదారుల మధ్య కొట్లాటలకు దారితీస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే. . మండలంలోని కనిమెర్ల తండాలో మూడు కృష్ణ, లక్ష్మి దంపతులకు, అజ్మీరా పవన్ కుటుంబానికి సర్వే నంబరు 321-5లో కొంత అసైన్డు వ్యవసాయ భూమి ఉంది. నాలుగేళ్ల కిందట రీసర్వే సమయంలో వారి పొలాలను కొలతలు వేసి, కృష్ణకు చెందిన కొంత భూమి పవన్ స్వాధీనంలో ఉందని రెవెన్యూ సిబ్బంది చెప్పారు. అప్పటి నుంచి సరిహద్దుదారుని ఆధీనంలోని భూమి తమదేనంటూ ఇరువర్గాలు తరచూ గొడవలు పడుతున్నారు. దీనిపై ఆరు నెలల కిందట స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం పొలానికి వెళ్లిన తనను, సరిహద్దుదారులైన పవన్, అతని కుమారుడు కృష్ణకుమార్ దాడి చేసి కొట్టి గాయపరిచారంటూ మూడు కృష్ణ భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా మరోసారి కేసు నమోదు చేశామని ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. తరచూ గొడవలు పడుతున్నందున తహసీల్దార్ ఎదుట వారిని బైండోవర్ చేయనున్నట్లు చెప్పారు.


మైలవరం ఎల్బీఆర్‌సీఈలో విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు


కొండపల్లిలో మాట్లాడుతున్న సీతారామయ్య

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు


జి.కొండూరులో ప్రదర్శన తిలకిస్తూ..


తిరువూరు మండలం మునుకుళ్లలో..

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


సత్యాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

ఆయా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, బృందం

దేవదాయ ధర్మదాయ శాఖ

టెండర్-కమ్-బహిరంగ లీజు వేలం ప్రకటన

కొండపల్లి, ఎన్టీఆర్ జిల్లా శ్రీ గిరి వీరేశ్వర విశ్వేశ్వర స్వామి దేవస్థానమునకు సర్వ సంపూర్ణ భుక్తల గల ఈ దిగువ షెడ్యూల్ దాఖలా దేవాలయము ఆవరణ నందుగల రెండు షాపులకు ది.16-03-2026, సోమవారం ఉ॥ గం॥ 10.00 ని॥లకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున దేవాలయ ఆవరణలో లీజు దరఖాస్తులకు టెండర్-కమ్-బహిరంగ వేలం పాట జరుపబడును.

వ. నెం.	షాపు నెం.	విస్తీర్ణము చ॥అ॥	ప్రథమ ధరావత్తు	లైసెన్స్ కాలపరిమితి
1.	1	12x15 (180 చ॥అ॥)	10,000/-	స్వాధీన పరచిన తేదీ నుంచి మూడు సంవత్సరముల కాలపరిమితికి
2.	2	11x15 (165 చ॥అ॥)	10,000/-	

మిగిలిన పాట షరతులు దేవాలయం నందు సంప్రదించి తెలుసుకోగలరు.

ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్
తేది : 01-03-2026 మద్దు వెంకట రామలింగేశ్వరరావు
సెల్ : 99890 86755

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

EICHER TIPPERS FLEET for Sale Pro 6028T (500 CFT) 8Nos & Pro 2055T (100 CFT) 6Nos Good Condition. Ph: 97046 99042.

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted Investors in Vijayawada for India's Fastest Growing Education Institutions. Contact: 95425 13426

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ కొరకు మీ ప్రాంతములో ప్రైవేట్ స్కూల్స్ పరిచయం ఉండి అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఉమా పబ్లిషర్స్, గుంటూరు @ 98493 70729.

రూ/పు 2,50,000 పెట్టుబడితో మీ ఆఫీసు/ ఇంటివద్దే Dr.Tea/ Dr. Coffee/ Dr.Cool Drink యొక్క ఫ్రాంఛైజీ నిర్వహిస్తూ, ప్రతినెల 25,000/- ఫిక్స్‌డ్ అలవెన్సు + అన్‌లిమిటెడ్ వీక్లీ ఆదాయం కలదు. ✆ 78420 02046/ 63095 72064

అతి తక్కువ పెట్టుబడితో లైఫ్‌టైమ్ ఆదాయం, ప్రముఖ కంపెనీ బిజినెస్ ఫ్రాంఛైజ మార్చి 30లోపు తీసుకునే వారికి 30% డిస్కౌంట్‌కు ఇస్తుంది. ✆ 90909 00069

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. Household Goods Shifting any Time any where ✆ 97043 64389

BUILDING CONSTRUCTION

Raghava Associates. We do Building Contracts for VMC/ APCRDA/ LRS/ BPS Approvals, Elevations & Structural Designs. ✆ 98851 12999

TDR
AP & TELANGANA BONDS BUY & SALE
KAMESH
92 92 15 15 15

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 yrs Exp. ★ 5 yrs Warranty ★ Bathroom Leakage Grouting Epoxy Works. ✆ 94940 02285, 99516 07504

EDUCATION

ADMISSION GUIDANCE
M.D/ M.S
Seats Available in A.P.
✆ 76600 33344

SPOKEN HINDI

Learn Online/Office line Spoken Hindi/English, French& German within 30Days. 100% Guarantee for all Ages. Free Demo. ✆ 98495 42456

HOME TUITIONS

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG All Objective సబ్జెక్ట్స్. NEET, IIT ట్యూటర్స్‌కు. ✆ 92900 05677, 74165 35749.

DISTANCE EDUCATION

Distance Edu. online BA, B.Com, BBA, M.Sc, B.Tech, All Stream, Diploma, UGC Aicte Apvd. Universities, Nic Dist. College. 88011 38000

FINANCIAL SERVICES

We Deal with All Type of Loans Secure & Unsecured Business, Personal, Startup, Hospitals, Doctors. Cont:- 77802 98176

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్సుపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలలోపు. అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్, ✆ 93969 99669

మీ ఇళ్ళు, బిల్డింగ్స్, కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ.1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంక్‌లో ఉన్ననూ విడిపించబడును. ✆ 83099 11995.

FOOD

PICKLES

అన్నపూర్ణాస్ వెజ్ & నాన్‌వెజ్ కర్రీలు, పచ్చళ్ళు 100% పూర్తి ఇంటి తరహాలో ఆర్డర్లుపై చేసి ఇవ్వబడును. Min:1KG ★ క్యాటరింగ్ చేయబడును. Min 25 Nos ★ గోంగూర బోటి మాప్రత్యేకత. VJA. ✆80195 99799

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువుపెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు, విజయవాడ శ్రీశరణంలాడ్జి, పాతబస్టాండ్ ఎదురుగా, బందర్‌రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు.

HOME NEEDS

PEST CONTROL

Tarun Pest ★25yrs Exp. 5yrs Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest & Other Insects Control). ✆ 9494002285, 9951607504

ప్రియాంక పెస్ట్ & బాత్‌రూమ్ లీకేజ్ వర్క్స్ 30సం|| అనుభవం 5సం|| గ్యారంటీ, వాసన లేని బేయర్స్ కెమికల్స్‌తో చెదలు, బొద్దింకలు నివారించు సంస్థ ✆ 94924 82494, 93932 30136

INDUSTRY

విజయవాడ మరియు సరిహద్దు ప్రాంతాల్లో 10,000- 12,000 SFT, 3Phase Power కలిగి ఉన్న ఇండస్ట్రియల్ షెడ్ రెంటుకి కావలెను. ✆ 88866 10123

MARRIAGE SERVICES

FUNCTION HALLS

ఈవెంట్స్ ఆర్గనైజర్‌కు అధిక ఆదాయం పొందటానికి శుభవార్త. తాడేపల్లి, నులకపేట సెంటర్‌లో 5,700 గ||లో ఉన్న SSSV AC & గార్డెన్ కళ్యాణ మండపము. అతిథుల కొరకు 15 AC రూమ్స్, 100 కార్ల పార్కింగ్ స్థలం, ఈవెంట్స్ ఆర్గనైజర్స్‌కు ప్రత్యేక తగ్గింపు. ✆ 94935 02289, 99499 11302

PEOPLE CARE

OLD AGE HOME

నెస్ట్ కేర్ హోమ్ వృద్ధాశ్రమం, కానూరు. వృద్ధులకు, బెడ్ పేషెంట్‌లకు ఆహ్లాదకరమైన ఇంటి వాతావరణంలో మంచి ఆహారం, సేవలు కలవు. ✆ 98483 40496

REAL ESTATE

Machilipatnam Port Area 200 Ft Road Commercial Lands for Sale & 424 Sqyds House Sale in Pammaru Town. ✆ 98852 17967

పోరంకి, కంకిపాడు, కోలవెన్నులలో 50 సెంట్లు, 90 సెంట్లు, 1400 చ||గ|| ప్లాట్లు అమ్మకానికి కలవు. ✆ 93922 72888, 96407 84953.

గుంటూరుసిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్డు, ఇన్నర్‌రింగ్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్ర: 93999 55545.

అమరావతి రాజధానిలో గల ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు, పొలాలు విజయవాడ - గుంటూరు మధ్య అన్నివెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన Ph: 77949 12324.

గుంటూరు సిటీ, గోరంట్ల, రెడ్డిపాలెం, లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, నంబూరు, పెదకాకాని, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అమ్మాలన్నా/ కొనాలన్నా ✆: 7382396677.

ఇన్వెస్ట్‌మెంట్‌కు ఓపెన్ ప్లాట్స్ & ధర తక్కువ సెకండ్ హ్యాండ్ అపార్ట్‌మెంట్స్, ఇండివిడ్యువల్ హౌసెస్ అమ్మబడును. ✆ 80089 75044.

పటమట NTR సర్కిల్ రవి స్వీట్స్ ప్రక్కన 233 చ||గ|| ఖాళీ స్థలం, Medplus ప్రక్కన భాగ్యయ్య వీధిలో 228 చ||గ||, 300 చ||గ|| పాత బిల్డింగులు అమ్మబడును. 63000 65270.

FLAT FOR SALE

KANURU

3BHK - 1470Sft North, 2BHK- 1240Sft East, Full cupboards, ready to move at Srinivasa Residency, Near Sitapuram Colony, Aravapalli Purnaiah Veedi, Opposite Priya Foods, Poranki, VJA. Ph: 77028 76445

100% బ్యాంక్ లోన్‌తో కానూరు బల్లెంవారి వీధిలో Occupancyకి సిద్ధంగా ఉన్న న్యూ 2BHK & 3BHK తూర్పు ఫేస్ Flats అమ్మకం. ✆ 81214 07585.

3BHK న్యూ డీలక్స్‌ఫ్లాట్స్ అన్నిసౌకర్యాలు గల 100%బ్యాంక్ లోన్‌తో గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. బల్లెంవారివీధి, కానూరు. ✆ 97017 98726, 89196 79256

కానూరు, మురళీనగర్ బల్లెంవారివీధిలో అక్షయ మెడోస్‌నందు న్యూ 3 BHK (1400 Sft) ఫ్లాట్స్ అన్ని సౌ||తో 53 లక్షలు. 89195 70872, 96428 47736.

TADIGADAPA

LUXURY 3 BHK FLAT
పోరంకి కామినేని హాస్పిటల్ దగ్గర మంచి పేరు ప్రఖ్యాతులు గల బిల్డరు KMV VIVAN వారిచే విజయవాడ సిటీ మొత్తంలో అత్యంత ఎత్తైన (హై రైజ్) నిర్మించబడిన గేటెడ్ కమ్యూనిటీలో క్లబ్ హౌస్, జిమ్, స్పా, స్విమ్మింగ్ పూల్, హెలిపాడ్, స్కైవాక్, ఇంకా అనేక అధునాతన వరల్డ్ క్లాస్ సౌకర్యాలు కలిగిన 2,133 S.Ft, 3 BHK, 2 కార్ల పార్కింగ్‌గల ఫ్లాట్ రీజనబుల్ ధరకు అమ్మకంనకు కలదు.
సంప్ర: సూర్యవంశీ
70134 40880

బందరు రోడ్డు, సిద్ధార్థ Engg. కాలేజ్ ఎదురు, తాడిగడప, పద్మజానగర్ కాలనీలో న్యూ 3BHK ఫ్లాట్ 1800S.Ft. అమ్మకం. (ఫ్లోర్‌కిఒకఫ్లాట్) ✆ 94400 31268

తాడిగడప, మనోజ్‌నగర్, సాయిబాబాగుడికి ఎదురు వెంకటకృష్ణా రెసిడెన్సీలో ఫ్లోర్‌కి 1చొప్పున న్యూ 3BHK (2150S.Ft) ఫ్లాట్స్ అన్ని సౌ|| అమ్మకు ✆ 98483 31213

PENAMALURU

న్యూ 3BHK ఫ్లాట్స్
బందరురోడ్డుకి 100 అ|| దగ్గరగా గోసాల సెంటర్‌కి అతి సమీపముగా
1700 S.Ft.తో న్యూ 3 BHK ఫ్లాట్స్ అమ్మకం.
✆ 94852 90846

TADEPALLI

తాడేపల్లి: CSR కళ్యాణ మండపం & ఆశ్రమం రోడ్డులో 2 BHK (1233 S.Ft.) ఫ్లాట్ అమ్మకం. 100% వాస్తు, Car పార్కింగ్. ✆ 90000 64949.

NUNNA ROAD

సింగ్‌నగర్, నందమూరినగర్, సీతారామరాజు st, శ్రీ దుర్గ ఎన్‌క్లేవ్, ఫ్లాట్స్ 2BHK, లిఫ్ట్ అమ్మకమునకు కలవు. సంప్ర: 83411 32777, 99898 92474.

SATYANARAYANAPURAM

2BHK Flat in SN Puram, VJA For Sale, 24yrs old, Around 1350 Sq.feet including Free Space. No car Parking. ✆ 81798 00259

VJA సత్యనారాయణపురం 1200S.Ft., ప్రీమియం న్యూ 2BHK ఫ్లాట్స్ కార్‌పార్క్, లిఫ్ట్, సీసీటీవి, జనరేటర్‌తో BRTS రోడ్ దగ్గరలో అమ్మకానికి కలవు. ✆91818 15555

GENERAL

Ready to Move in Geted Community 2,3,4 BHK Flats for Sale in Currency Nagar. 100% Loan. ✆ 86884 66789

3BHK, Duplex, 30 Yrs. Old Apt, UDS 48 Sq.yds. Polyclinic Road Facing 25K Rent with Car Parking. Urgent Sale ✆ 73860 42345.

4 BED ROOM LUXURY FLATS
SITE 1477 YARDS
TOTAL FLATS 10 ONLY
EACH FLAT 4260 Sq FEET
UDS 137 YARDS (INCLOUD 3 CAR PARKINGS)
20X15 BED ROOMS 4
10X15 &10X8 BATH ROOMS 4
20X15 KITCHAN
20X15 DINNING HALL
20X15 DRAWINING HALL
20X10 HOME THEATER
60X17 LIVING HALL
Prime Locality Beside SIT Office Prathuru Road,Tadeplli
CONTACT gn-fab DOORS&WINDOWS 92464 95788 / 99

Flat for Sale: C9 3BHK Venkata Balaji Towers, Jammichettu Centre, 1035 S.Ft., 51.33 Sq.Y., Car Parking. Contact: 98482 83529, 97033 99955.

సింగ్‌నగర్ తోటవారివీధి 9వ లైన్ శ్రీలక్ష్మీనరసింహ రెసిడెన్సీలో న్యూ 2BHK ఫ్లాట్ వెస్ట్ ఫేసింగ్‌తో తక్కువ ధరకే అమ్మకం. ✆ 98662 01239.

VJA, LICకాలనీ జయప్రకాష్‌నగర్, 1stలైన్ లగ్జరీ 3BHK ఫ్లాట్స్, ఏలూరురోడ్ సీతారామపురం చాపరాలవారివీధిలో 3BHK ఫ్లాట్ అమ్మకం. ✆ 90305 06249

1170 Sft.తో 3వ ఫ్లోరులో E/F, 2వ ఫ్లోరులో W/Fగల 2BHK 2ఫ్లాట్లు అన్ని సౌ.లతో అమ్మకం.తోటవారివీధి, 9వలైన్, సింగ్‌నగర్, VJA ✆85238 71971

'బాణసంచా తయారీలో వాడే సామగ్రి చాలా ప్రమాదకరమైనది. ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణం. సాంకేతికంగానూ దీనిపై విచారణ జరగాలి. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ఆర్డీవో, డీఎస్పీ, జిల్లా కార్మికశాఖ అధికారి, అగ్నిమాపకశాఖ అధికారిని సస్పెండ్ చేస్తున్నాం. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తాం. మిగిలిన బాధ్యులపైనా చర్యలు ఉంటాయి. సంబంధిత యజమాని ఎక్కడ ఉన్నా పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకొంటాం. అవసరమైతే ఆయన ఆస్తులు జప్తు చేసి, బాధితులకు అందజేస్తాం. బాధితుల్లో చాలామంది తమకు ఊహ తెలిసినప్పటి నుంచి ఇక్కడే పని చేస్తున్నామని తెలిపారు. రోజుకు రూ.700 వస్తుందని, అదే ఉపాధి పనిలో రూ.300 మాత్రమే వస్తుందని చెబుతున్నారు. 'నరేగాలో 125 రోజులు పని కల్పిస్తున్నాం. ఈ ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ చేయిస్తాం' అని ముఖ్యమంత్రి అన్నారు. సీఎం వెంట మంత్రులు అనిత, కందుల దుర్గేష్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు సానా సతీష్, ఉదయశ్రీనివాస్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

ప్రొటోకాల్ పక్కన పెట్టి..

వేట్లపాలెంలో బాణసంచా పేలుడు ఘటన సమాచారం తెలిసిన వెంటనే.. విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రత్యేక దళాల భద్రత మధ్య బుల్లెట్‌ప్రూఫ్ వాహనంలో పర్యటనలు సాగించే సీఎం సామర్లకోట చేరుకున్న వెంటనే అందుబాటులో ఉన్న కలెక్టర్ వాహనంలో మామూలు భద్రత మధ్య మట్టిరోడ్డుపై ఘటనా స్థలానికి వెళ్లారు. పేలుడు జరిగిన ప్రాంతంలో అప్పటికే చీకటిపడినా, అక్కడక్కడా ఉన్న విద్యుద్దీపాల వెలుగులో బురదలోనూ నడుచుకుంటూ వెళ్లి తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లారు. వ్యవసాయ పనులు సరిగా లేకపోవడంతో బాణసంచా తయారీకి కూలీలుగా వెళ్తున్నామని, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని బాధిత కుటుంబాలవారు సీఎంను కోరారు.



కాన్వాయ్, బులెట్‌ప్రూఫ్ కారు లేకుండా కలెక్టర్ వాహనంలో పేలుడు ప్రాంతానికి వచ్చి తిరిగి వెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

దురదృష్టకరం: మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

వేట్లపాలెంలో బాణసంచా పేలుడు జరిగి 20 మంది చనిపోవడం అత్యంత బాధాకరం. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి బాణసంచా తయారీ, నిల్వలు ఉండడమే ప్రమాద తీవ్రతకు కారణంగా తెలుస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి.

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

ఈనాడు, దిల్లీ: కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణసంచా కర్మాగారంలో జరిగిన దుర్ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌లు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు చనిపోయారన్న విషయం అత్యంత దుఃఖాన్ని కల్గించిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్'లో వేర్వేరుగా పేర్కొన్నారు.

- పేలుడు ఘటన పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లాలోని కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో ప్రాణనష్టం సంభవించడం బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల ఎక్స్‌గ్రేషియాను పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి ప్రకటిస్తున్నా' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.
- ఏపీలో జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

గవర్నర్ దిగ్భ్రాంతి

వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విచారం

వేట్లపాలెంలో బాణాసంచా తయారీ కర్మాగారంలో జరిగిన పేలుడుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

– ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

'వేట్లపాలెంలో బాణసంచా పరిశ్రమలో చోటుచేసుకున్న భారీ విస్ఫోటనంలో అనేక మంది మరణించారని తెలిసి దిగ్భ్రాంతి చెందాను. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం. ఈ దుర్ఘటన గురించి కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నా. మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను ఘటనా స్థలానికి వెళ్లాలని సూచించాను'.

మాటలకందని విషాదం: మంత్రి లోకేశ్

'బాణసంచా కేంద్రంలో పేలుడు ఘటనలో పలువురు మృత్యువాతపడటం మాటలకందని విషాదం. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం'.

ప్రమాదానికి కారణాలను వెలికితీయాలి

– వైకాపా అధ్యక్షుడు జగన్

'పేలుడు ఘటనపై దర్యాప్తు చేపట్టాలి. ప్రమాదానికి గల కారణాలను వెలికితీయాలి. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం ప్రకటించాలి. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలి'.

రూ.50 లక్షల చొప్పున అందించాలి

– ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

'బాణసంచా పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించాలి'.



విమానాశ్రయంలో ఎదురుపడిన సీఎం, డిప్యూటీ సీఎం

రాజమహేంద్రవరం విమానాశ్రయంలో శనివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పరస్పరం ఎదురయ్యారు. కాకినాడలో బాధిత కుటుంబాలు, క్షతగాత్రులను పరామర్శించిన తర్వాత సీఎం అమరావతికి పయనమయ్యారు. అదే సమయంలో కాకినాడలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు పవన్ కల్యాణ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ ఘటనపై ఇద్దరూ అక్కడే చర్చించుకున్నారు. పురపాలకశాఖ మంత్రి నారాయణ కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నారు.

దేవుడా.. మా అమ్మెక్కడ?



వేట్లపాలెంలోని దుర్గానగర్‌కు చెందిన కార్మికురాలు నూకళ్ల దేవికి ఇద్దరు కుమార్తెలు. దేవి బాణసంచా దుకాణంలో పనికి వెళ్లారు. ప్రమాదం తర్వాత ఆమె ఆచూకీ లేదు. చాలా సేపటి వరకూ ఆమె చనిపోయినట్లు సమాచారమూ లేదు. దీంతో అక్కడికి చేరుకున్న దేవి ఇద్దరు కుమార్తెలు.. మా అమ్మెక్కడ అంటూ వెక్కివెక్కి ఏడుస్తూ కన్పించారు. అక్కడికి వచ్చిన వారంతా అదే ఆవేదనలో ఉండటంతో ఈ ఆడపిల్లలను ఓదార్చేవారూ లేకుండాపోయారు. వారిద్దరే ఒకరినొకరు పట్టుకొని విలపించారు.

రెప్పపాటులో కుప్పకూలిన బతుకులు

మృతుల్లో ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ!

పెదపూడి: వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో మృతులంతా సామర్లకోట మండలంలోని వేట్లపాలెం, గూడపర్తి, పెదబ్రహ్మదేవం, జి.మేడపాడు, సామర్లకోట పరిధిలోని కుమ్మర వీధికి చెందిన వారే.

గొడత మహేశ్

గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ బాణసంచా దుకాణంలోనూ పనిచేస్తున్నారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు చదువుకుంటున్నారు.

కడింపల్లి ధనరాజు

ఇతని భార్య పదేళ్ల క్రితం చనిపోయారు. కుమారుడికి పెళ్లి కాగా, కుమార్తె అవివాహిత. ఆమె వయసు పెరిగినా, మానసికంగా ఎదగలేదని స్థానికులు చెప్పారు. తల్లిదండ్రుల్లేని అనాథగా మిగిలింది.

మందపల్లి చిన్ని

ఈమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమ్మాయికి వివాహమైంది. బాణసంచా దుకాణంలో కూలీగా పనిచేస్తున్నారు.

సాధనాల సత్యవేణి

ఈమె భర్త లారీ డ్రైవర్. కుటుంబ పోషణార్థం దుకాణంలో పనిచేస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె.

వల్లూరి రవి

ఈయనకు వివాహమైంది. ఒక కుమారుడు ఉన్నాడు. ఆ కుటుంబానికి రవియే జీవనాధారం. కూలీగా వెళ్లి విగతజీవిగా మారారు.

గొడత నాని

దుకాణంలో పని చేయడంతో పాటు వ్యవసాయ పనులకు వెళ్తారు. ఇతనికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు చిన్నవయసులోనే తండ్రిని కోల్పోయారు.

గొడత వెంకటరమణ

రోజువారీ కూలి. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తుండగా ఈ ఘోరం జరిగింది.

అడబాల శ్రీనివాసరావు

ఇతనే బాణసంచా దుకాణం యజమాని. ఇతనికి ఇద్దరు కుమారులు. వారికి వివాహాలయ్యాయి. నిబంధనల ప్రకారమే దుకాణం నిర్వహిస్తున్నామని, అకస్మాత్తుగా మంటలు సంభవించడంతో ఘోరం జరిగిందని శ్రీనివాసరావు కుటుంబసభ్యులు చెబుతున్నారు.

కడింపల్లి కృపామణి

ఈమె భర్త వ్యవసాయ కూలి. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరంతా అప్పుడప్పుడు ఈ దుకాణంలో పనికి వెళ్తారు. శనివారం కృపామణి ఒక్కరే వెళ్లగా, ప్రమాదంలో చనిపోయారు.



నా బిడ్డ కుటుంబాన్ని ఆదుకోండి

నా కుమారుడు సంపత్ చనిపోయినట్లు తెలిసింది. వాడి భార్య, ఇద్దరు పిల్లలను ఎవరు పోషించాలి? నా బిడ్డ కుటుంబానికి న్యాయం చేయాలి. వాడు వేరే పనులేవీ దొరక్క ఈ బాణసంచా కంపెనీలో కూలీకి వెళ్లాడు.

–ఏడిద పోతురాజు, వేట్లపాలెం

అమ్మానాన్నలు ఇద్దరూ చనిపోయారు



మా అమ్మానాన్నలు గంపల మంగ, నాగరాజు ఇద్దరూ ఈ ప్రమాదంలో చనిపోయారు. వారి శవాలు మాడి మసైపోయాయని చెబుతుంటే మా గుండెలు అవిసిపోతున్నాయి. మేమిద్దరం ఆడపిల్లలం, ఒక తమ్ముడు ఉన్నాడు. మా పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీర్చేందుకు అమ్మానాన్న దుకాణంలో పనికి వెళ్తున్నారు. పదేళ్లుగా అదే పనిలో ఉన్నారు. మా కుటుంబానికి న్యాయం చేయాలి.

– దివ్య (పిఠాపురం మండలం భోగాపురం), రాణి (రామచంద్రాపురం)

మా అత్తగారు ఈరోజే వెళ్లారు



మా అత్తగారు చింతల రమణమ్మ రెండేళ్ల పాటు ఇదే కంపెనీలో, యాజమాని ఇంటి దగ్గర కూడా పని చేసేవారు. మా మామ అప్పారావు గతేడాది డిసెంబర్‌లో చనిపోగా, అప్పటి నుంచి పని మానేశారు. మళ్లీ శనివారమే వెళ్లారు. మొదటి రోజే ఘోరం జరిగిపోయింది.

–కాళ్ల గోవింద్, వేట్లపాలెం

మా కుటుంబంలో చీకట్లు



మాది సామర్లకోట. నా పేరు దర్శిపాటి సత్యానందం. గతంలో వాకతిప్ప వద్ద జరిగిన ప్రమాదంలో మా అత్తగారు, ఆమె వదిన, మరదలు చనిపోయారు. ఇప్పుడు వేట్లపాలెం దుర్ఘటనలో పెదనాన్న కొడుకు దర్శిపాటి నాని చనిపోయాడు. బాణసంచా ప్రమాదాలు మా కుటుంబంలో విషాదం నింపాయి. గతంలో పరిహారం కూడా సరిగ్గా రాలేదు. ఇప్పుడైనా ఆ కుటుంబాలను ఆదుకోవాలి.

–దర్శిపాటి సత్యానందం, సామర్లకోట

మార్చురీ వద్ద మిన్నంటిన ఆర్తనాదాలు

పిఠాపురం, న్యూస్‌టుడే: బాణసంచా పేలుడు ఘటనలో మృతదేహాలను శనివారం సాయంత్రం సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలోని మార్చురీకి తరలించారు. మహాప్రస్థానం వాహనాల్లో రెండుమూడు మృతదేహాల చొప్పున ఘటనాస్థలం నుంచి ఇక్కడకు తీసుకొచ్చారు. మృతుల కుటుంబసభ్యులు, బంధువులు సాయంత్రం 6 గంటల నుంచి మార్చురీ వద్దకు భారీగా చేరుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో వారి రోదనలు, ఆర్తనాదాలు మిన్నంటాయి. మృతుల వివరాలను పిఠాపురం తహసీల్దార్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఆర్ఐ వెంకటేశ్, ఆరుగురు వీఆర్వోలు సేకరించారు. వారి ఆధార్ కార్డులు, ఇతర వివరాలు తీసుకుని మార్చురీ గదిలోకి పోస్టుమార్టం కోసం పంపించారు. మృతదేహాలను బంధువులకు అప్పగించే బాధ్యతను కాకినాడ ఆర్డీవో మల్లిబాబు సిబ్బందికి అప్పగించారు. రాత్రి 9 గంటల వరకూ మృతదేహాలను అప్పగించలేదు.

రసాయనాల నిర్వహణలో తప్పిదాలే..

- భారీ విస్ఫోటానికి కారణమై ఉండొచ్చు
- ప్రాథమికంగా గుర్తించిన అగ్నిమాపక శాఖ

ఈనాడు, అమరావతి: బాణసంచా తయారీలో వాడే రసాయనాల నిర్వహణలో తప్పిదాలే (మిస్‌హ్యాండ్లింగ్ ఆఫ్ ది ప్రొడక్ట్స్ ఇన్ ది ప్రాసెస్ ఆఫ్ మేకింగ్) వేట్లపాలెంలోని శ్రీసూర్య ఫైర్‌వర్క్స్‌లో భారీ విస్ఫోటానికి కారణమై ఉండొచ్చని అగ్నిమాపక శాఖ ప్రాథమికంగా గుర్తించింది. ప్రధానంగా మెగ్నీషియం పౌడర్, పొటాషియం క్లోరైట్, పొటాషియం నైట్రేట్, అల్యూమినియం పౌడర్, చార్ కోల్ వంటి రసాయనాలను టపాసుల తయారీలో వినియోగిస్తారు. అవి కలిపేటప్పుడు, దట్టించేటప్పుడు జరిగిన తప్పిదమే ప్రమాదానికి దారితీసిందని అగ్నిమాపక శాఖ అంచనాకొచ్చింది. కార్మికులు బాణసంచా తయారీ చేస్తున్నప్పుడే పేలుడు సంభవించినట్లు భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ తయారీ కేంద్రంలో 10 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నట్లు అగ్నిమాపక శాఖాధికారులు గతంలోనే గుర్తించి, యజమానికి హెచ్చరికలు జారీ చేసినట్లు నివేదికలో పేర్కొంది. శ్రీసూర్య ఫైర్‌వర్క్స్ వేట్లపాలేనికి చెందిన అడబాల అర్జున్ పేరిట ఉంది. కోనసీమ జిల్లా రాయవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో గతేడాది అక్టోబరులో ప్రమాదం జరిగాక.. ఇక్కడ మిగతా శాఖలతో కలిసి సంయుక్త తనిఖీలు చేసినట్లు నివేదికలో వివరించింది.

తరచూ ప్రమాదాలు.. ప్రాణాలు బుగ్గిపాలు

- అక్రమ తయారీ, అశాస్త్రీయ పద్ధతులు, అజాగ్రత్తలతో బాణసంచా పేలుళ్లు
- 1990 నుంచి చిన్నాపెద్దా కలిపి వందల్లో ఘటనలు
- ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాలోనే అత్యధికం

ఈనాడు, అమరావతి: బాణసంచా తయారీలో అశాస్త్రీయ పద్ధతులు, శిక్షణ లేని కార్మికులు, అక్రమ నిల్వలు, అనుమతులు లేని ప్రాంగణాలు వెరసి తయారీ కేంద్రాల్లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. 1990 నుంచి ఇప్పటి వరకు చిన్నాపెద్దా కలిపి వందల్లో ప్రమాదాలు చోటుచేసుకొన్నాయంటేనే ప్రమాద తీవ్రత అర్థమవుతోంది. ముఖ్యంగా ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లోనే ఈ ఘటనలు ఎక్కువగా సంభవిస్తున్నాయి.

రాష్ట్రంలో 1990 నుంచి బాణసంచా తయారీ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలు

సంవత్సరం	ప్రాంతం	జిల్లా	మరణాలు	ఘటన నేపథ్యం
2026	వేట్లపాలెం	కాకినాడ	20	సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు
2025	కైలాసపట్నం	అనకాపల్లి	8	ఏప్రిల్ 13న భారీ యూనిట్‌లో పేలుడు
2025	రాయవరం	అంబేడ్కర్ కోనసీమ	8	అక్టోబర్ 8న లక్ష్మీగణపతి ఫైర్‌వర్క్స్ యూనిట్‌లో పేలుడు
2023	వెదురుపాక	తూర్పుగోదావరి	2	ఎండకు రసాయనాలు మండి పేలుడు సంభవించినట్లు గుర్తించారు
2021	లింగంపాలెం	పశ్చిమగోదావరి	5	బాణసంచా నిల్వ కేంద్రంలో పేలుడు
2019	గుల్లేపల్లి	అనకాపల్లి	7	అనధికారికంగా బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి
2017	విజయనగరం	విజయనగరం	3	రసాయనాలు కలిపే సమయంలో పేలుడు
2016	పొర్లకట్ట	నెల్లూరు	2	బాణసంచా తయారీ యూనిట్‌లో భారీ అగ్నిప్రమాదం
2015	శ్రీకాకుళం	శ్రీకాకుళం	4	బాణసంచా నిల్వ ఉంచిన ఇంట్లో పేలుడు
2014	వాకతిప్ప	కాకినాడ	17	తయారీ కేంద్రంలో భారీ పేలుడు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే
2009	పల్లెపాలెం	తూర్పుగోదావరి	12	అనధికారిక యూనిట్‌లో పేలుడు
2004	అనకాపల్లి	అనకాపల్లి	6	అక్రమ తయారీ కేంద్రంలో ప్రమాదం
1998	విజయనగరం	విజయనగరం	10	తయారీ కేంద్రంలో మంటలు చెలరేగి భారీ పేలుడు
1990	వాకతిప్ప	కాకినాడ	20 మందికిపైగా	ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద ప్రమాదాల్లో ఒకటి

ప్రమాదాల నివారణకు 11 సూత్రాలు

- 'రాయవరం' ప్రమాదంపై ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సులు
- అమల్లోకి రాకముందే మరో దుర్ఘటన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో బాణసంచా తయారీ కేంద్రాల్లో జరుగుతున్న ప్రమాదాల నివారణకు 11 సూత్రాలు పాటించాలని గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సు చేసింది. 2025 అక్టోబరు 8న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బిక్కవోలు మండలం రాయవరం వద్ద గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో భారీ ప్రమాదం సంభవించగా, ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ తరహా ప్రమాదాల నివారణకు సిఫార్సులు చేయాలంటూ ప్రభుత్వం పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఈగల్ విభాగం ఐజీపీ ఆకే రవికృష్ణ సభ్యులుగా 2025 అక్టోబరు 9న కమిటీ ఏర్పాటు చేసింది. అదే ఏడాది నవంబరులో కమిటీ నివేదిక సమర్పించింది. ఆయా సిఫార్సులపై రాష్ట్ర విపత్తులు, అగ్నిప్రమాద నివారణ శాఖ అంతర్గతంగా మరో కమిటీ ఏర్పాటు చేసింది. సిఫార్సుల్లో కొన్నింటిని తాము అమలు చేస్తామని, మిగిలినవి ఇతర ప్రభుత్వ శాఖలు చేయాల్సినవి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నివేదికను అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్.. 2026 జనవరి 6న హోం శాఖ ముఖ్య కార్యదర్శికి సమర్పించారు. వీటిని అమలు చేయకముందే.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో మరో భారీ బాణసంచా పేలుడు జరిగింది.

కమిటీ సూచించిన విధానపరమైన నిర్ణయాలు

1. ఏపీ ఫైర్‌వర్క్స్ లైసెన్సింగ్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పేరుతో ఆన్‌లైన్ వ్యవస్థ నెలకొల్పాలి. బాణసంచా ముడి పదార్థాల కొనుగోలు నుంచి తయారీ, విక్రయాల వరకూ ప్రతి దశనూ అందులో నమోదు చేయాలి.
2. కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాణసంచా రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి. మూడు నెలలకోసారి ఈ కమిటీలు తనిఖీలు చేయాలి. మాక్‌డ్రిల్ నిర్వహించాలి.
3. బాణసంచా నిల్వ పరిమాణం, తయారీ ప్రక్రియలో క్లిష్టత ఆధారంగా తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలి. దీనికోసం ఫైర్‌వర్క్స్ రిస్క్ ఇండెక్స్ ప్రవేశపెట్టాలి.
4. లైసెన్సు పొందిన తయారీ కేంద్రాల్లో సీసీ టీవీ పర్యవేక్షణ ఉండాలి. ఇవన్నీ జిల్లా ఆర్‌టీజీఎస్ వ్యవస్థతో అనుసంధానమై ఉండాలి. ఆయాచోట్ల సురక్షిత విధానాలు పాటిస్తున్నారా లేదా అనేది గుర్తించేందుకు ఏఐ సాయం తీసుకోవాలి.
5. కార్మికులకు బీమా చేయాలి. వారికి శిక్షణ ఇవ్వాలి.
6. క్రమం తప్పకుండా మూడో పక్షంతో బాణసంచా తయారీ కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి.
7. ప్రాసెస్ షెడ్లు, నిల్వ షెడ్ల మధ్య కనీసం 45 మీటర్ల దూరం పాటించాలి.
8. ప్రతి యూనిట్‌లో పెసో ధ్రువీకృత ఫోర్‌మెన్ తప్పనిసరి.
9. ఆరు నెలలకోసారి మాక్‌డ్రిల్ చేయాలి. అత్యవసర సమయాల్లో ఏం చర్యలు తీసుకోవాలన్న దానిపై ప్రణాళికలు అవసరం.
10. లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేయాలి.
11. ఏపీ పర్యావరణ నియంత్రణ మండలి ద్వారా పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకోవాలి.

కలెక్టర్లే నోడల్ అధికారులుగా..: బాణసంచా తయారీ కేంద్రాల్లో ప్రమాదాల నివారణకు 11 సిఫార్సులు అమలు చేసేందుకు ప్రభుత్వమే తగిన చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అంతర్గత కమిటీ సూచించింది. ఆన్‌లైన్ వ్యవస్థ ఏర్పాటుకు అగ్నిమాపక శాఖ వద్ద సాంకేతిక నైపుణ్యం లేదని పేర్కొంది. కమిటీ చేసిన సిఫార్సులను జిల్లాల్లో అమలు చేయాలంటే కలెక్టర్లతోనే సాధ్యమవుతుందని, వారే బాణసంచా తయారీ కేంద్రాలకు లైసెన్సులు జారీ చేస్తారని.. వారితోనే సిఫార్సుల అమలు సాధ్యమని తెలిపింది. సంబంధిత అన్ని అంశాల్లోనూ ప్రభుత్వం కలెక్టర్లకు తగిన ఆదేశాలివ్వాలని కమిటీ అభిప్రాయపడింది.

వసుంధర

vasundhara@eenadu.in

పొదుపులోని కొద్ది మొత్తం... ఓ ఔత్సాహిక మహిళా వ్యాపారికి మదుపుగా మారితే, వేతనంలోని ఒక్క శాతం ఓ అమ్మాయి చదువుకి ఉపకార వేతనంగా అందితే... అద్భుతమే కదా! మన నైపుణ్యం నిరుద్యోగ యువతికి పాఠమైతే, అనుభవం యువ ఉద్యోగినులకు మార్గనిర్దేశమైతే ఎంతటి మార్పుని చూస్తాం. అందుకే ఈ ఏడాది 'గివ్ టు గెయిన్' అన్న థీమ్‌ని ఎంపికచేసింది 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' నిర్వాహక సంస్థ.



పంచుతూ పెరుగుదాం!



అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా

మానవ జాతి మనుగడకి మహిళే కీలకం. పిల్లల్ని కనేదీ, పెంచి పెద్ద చేసేదీ, ఇంట్లో పెద్దల బాధ్యత మోసేదీ మనమే. అయినా, తరాలుగా వివక్షని ఎదుర్కొంటున్నాం. చదువుల్లో కొలువుల్లో వేతనాల్లో ఇంకా వెనకబడే ఉంటున్నాం. దీన్ని అడ్డుకోవాలంటే...

మనం ఏం చేయాలి?

ఇవ్వడం అంటే కేవలం డబ్బు రూపంలోనే అన్నది కాదు, ఎన్నో రూపాల్లో ఉంటుంది. సాటి మహిళకు గౌరవం, గుర్తింపు, ఉనికి, పెట్టుబడి, న్యాయం, వనరులు, మద్దతుగా గొంతు, రక్షణ, సమయం, మెంటారింగ్... ఇలా ఎన్నో చేయొచ్చు. ముఖ్యంగా మహిళలపైన ఉండే చిన్నచూపు పోగొట్టాలి. వివక్షను ప్రశ్నించాలి. లైంగిక హింసనీ ట్రాఫికింగ్‌నీ అడ్డుకోవాలి. మహిళల విజయాలను కొనియాడాలి.

✦ విజ్ఞానాన్ని పంచుకుని, ఆ రంగంలో అమ్మాయిల్ని ప్రోత్సహించడం, అవకాశాలు కల్పించడమూ గొప్ప విషయమే.

✦ ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ప్రపంచవ్యాప్తంగా మహిళాభివృద్ధికి పని చేస్తున్నాయి. ఆ సంస్థలకు ఆర్థిక మద్దతు ఇవ్వొచ్చు. విరాళాల సేకరణలో భాగం కావొచ్చు.

...ఇలా ఇంట్లో, ఆఫీసులో, సమాజంలో సాటి మహిళకు అండగా ఉన్నప్పుడే లింగ సమానత్వం, సాధికారతను సాధించగలం. మహిళ- ప్రగతి అంటే ఆమె ఒక్కరిదే కాదు... కుటుంబం ఆనందంగా ఉంటుంది. పిల్లల భవిష్యత్తు బాగుంటుంది. దేశం ఆర్థికంగా బలపడుతుంది. అందుకే, మనకోసం మనం చేయీచేయీ కలుపుదాం... కలిసి ఎదుగుదాం.

ఇది అందరి బాధ్యత!

ప్రపంచ వెనకబాటుకి కారణం సంపద, విజ్ఞానం, వనరులు లేక కాదు... అవి కొందరి దగ్గరే ఉండిపోవడంవల్ల. ముఖ్యంగా ఇవి మహిళలకు దూరంగా ఉన్నాయి. ఆకాశంలో సగంగా ఉన్న మహిళలకు అవకాశాల్లో మాత్రం పావు వాటా కూడా దక్కడంలేదు. అందుకే, విద్య, ఉద్యోగం, నాయకత్వం... ఎక్కడ చూసినా ప్రాతినిధ్య తూకంలో తేలిపోతున్నారు. పర్యవసానంగా వాళ్లు మాత్రమే కాదు, మొత్తంగా మానవాళి వెనకబడుతోంది. దీనికి పరిష్కారమే 'గివ్ టు గెయిన్'.

✦ విమెన్ పెనాల్టీ, మ్యారేజ్ పెనాల్టీలు మహిళల కెరియర్‌కు ఆటంకం కలిగించకుండా వెసులుబాటు కల్పించాలి.

✦ చదువు, ఉద్యోగం, లక్ష్యం, డ్రెస్సింగ్... అన్నింటినీ గౌరవించాలి.

✦ మహిళల పనికి సమాన వేతనం, విలువ లభించడం లేదు. ఈ అసమానత్వం వాళ్లను ఆర్థికంగా ఎదగనీయకుండా ఆపుతోంది. దాంతో కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఒకరిపైన ఆధారపడాల్సి వస్తుంది. తక్కువ వేతనంవల్ల పని చేస్తున్నప్పుడే కాదు, రిటైర్మెంట్ తర్వాతా సామాజిక భద్రత ఉండదు. రక్షణ, భద్రత లేకపోవడంవల్ల చాలామంది మహిళలు కలలు కనడమే మానేస్తున్నారు. లక్ష్యాల్ని కుదించుకుంటున్నారు. అలా కానివ్వకుండా భరోసా కల్పించాలి.

✦ మహిళల నాయకత్వంలో కంపెనీలు ఎక్కువగా విజయవంతం అవుతున్నాయని అధ్యయనాలూ చెబుతున్నాయి. అందుకే ఆమెకు వనరులు కల్పించాలి. శిక్షణ ఇవ్వాలి, వర్క్‌షాపులు నిర్వహించాలి, ధైర్యంగా మాట్లాడనివ్వాలి. అభిప్రాయాలకి విలువనివ్వాలి. ఆమె నైపుణ్యాల్ని, నాయకత్వాన్ని ప్రశంసించాలి.

✦ ఇంట్లో, పని ప్రదేశంలో, సామాజికంగా... ఒకచోటని కాదు, వీలున్న ప్రతి చోటా వ్యక్తులు, సంస్థలు, సామాజిక బృందాలు మహిళలకు అండగా ఉండాలి. హక్కులకోసం, న్యాయం కోసం నిలబడాలి. అప్పుడే మహిళకు సరైన గుర్తింపు, గౌరవం, సమన్యాయం దక్కినట్లు.

అంతేనా.. 'ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును' అన్నట్టుగా మహిళాభివృద్ధికి చేసే సాయం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తిరిగి సమాజానికే లబ్ధి చేకూరుస్తుంది.

అవును మరి... విద్యతో ఆమె ఎదుగుతుంది,
అవకాశం ఇస్తే ఆమెలోని సృజన బయటపడుతుంది.
సమాన హోదాని కల్పిస్తే సంపదని సృష్టిస్తుంది...
అలాంటి సమాజంలో... ప్రత్యేకంగా మహిళా దినోత్సవాల అవసరమే ఉండదు. ఏమంటారు?

ఫొటో పంచుకోండి...

ఇవ్వడానికైనా, తీసుకోవడానికైనా చేతులు చాపుతాం. మనసారా ఇస్తున్నట్టు గుండెలమీద చేయిపెడతాం. ఇలాంటి పోజులతో ఫొటో దిగి... 'గివ్ టు గెయిన్' ఉద్దేశం మరింత మందికి చేరువయ్యేలా మీ వంతు ప్రయత్నించండి.



మెరుగైన సమాజం చూడాలని...



'దాతృత్వం వెనక ఉద్దేశం చాలా ప్రధానం. మన సమాజంలో అవకాశాల లేమిని చిన్నప్పట్నుంచీ గమనిస్తూ వచ్చా. దాంతో ఇవ్వాలనే భావన నా జీవితంలో చాలా చిన్న వయసులోనే మొదలైంది. అవకాశం రాగానే మొదట అమ్మాయిల చదువులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చాను. దేశంలో సగం మంది అవకాశాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా విద్యతోపాటు తాగునీరు, పర్యావరణం, సమన్యాయం, కళలు, సంస్కృతి తదితర రంగాలపైన దృష్టి పెట్టా. సమాజంలో బలహీన వర్గాలకు శక్తిసామర్థ్యాలను అందించి తమ సమస్యల్ని వాళ్లే పరిష్కరించుకునేలా చేస్తున్నా. మీ సమయం, ప్రతిభ, హృదయాన్ని సమాజానికి కేటాయించడంకంటే విలువైనదేదీ ప్రపంచంలో లేదు. – రోహిణీ నిలేకని

ఆహ్వానం

ప్రతి మగవాడి విజయం వెనకా ఓ మహిళ ఉంటుందంటారు. కానీ ప్రతి ఆడపిల్ల జీవితంలోనూ అమ్మ, స్నేహితురాలు, ఉపాధ్యాయురాలు, రచయిత్రి... ఇలా ఎన్నో రూపాల్లో మరో స్త్రీ తోడుంటుంది. మిమ్మల్ని నడిపించిన అలాంటి వాళ్లెవరైనా ఉన్నారా? ఒక సలహా, హెచ్చరిక, ఓదార్పు... ఇలా ఏదో ఒక తీరులో మీ మార్గం మార్చినా, మీ జీవితాన్ని తీర్చిదిద్దినా వాళ్లనోసారి తలచుకోండి. వాళ్లు మీకు అండగా నిలిచిన విధానాన్ని మాతో పంచుకోండి. 'వసుంధర'లో ప్రచురిస్తాం. మీ పేరు, ఊరు, ఫొటోతోసహా క్లుప్తంగా వాళ్ల గురించి పంపండి.

మెయిల్: vasundhara@eenadu.in, వాట్సప్ నం: 9154091911

ఈ ఏడాది మహిళా దినోత్సవ నినాదం 'గివ్ టు గెయిన్'... దీన్ని ఏనాడో పాటించి చూపించారు గాంధేయవాది ఇలా భట్. అసంఘటిత, స్వయం ఉపాధి రంగాల్లోని మహిళలకు చేయూతనిచ్చి వారి ఉద్యోగాలకు భద్రత కల్పించారు. వారి హక్కులను సంరక్షించారు.



మహిళా కార్మికులకోసం ట్రేడ్ యూనియన్!



అహ్మదాబాద్‌లో జన్మించారు ఇలా భట్. లాయర్‌గా, సామాజిక కార్యకర్తగా, గాంధేయవాదిగా... నిరంతరం ఆమె పోరాటం మహిళల హక్కులకోసమే. అయితే, ఇది పూర్తిగా అహింసా మార్గంలోనే సాగింది.

1970లలో ఇలా భట్ అహ్మదాబాద్‌లోని టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్‌లో పని చేశారు. ఆ సమయంలో టెక్స్‌టైల్ మిల్లులతో పాటు బీడీ రోలర్లు, ఇంటి పనివారు, వీధివ్యాపారులు, రైతు కూలీలుగా అసంఘటిత రంగాల్లో పని చేసే మహిళలకు కనీస వేతనాలు, హక్కులు వంటివి లేవనే విషయాన్ని ఆమె గుర్తించారు. ముఖ్యంగా వీళ్లకు యూనియన్లు లేవు. బ్యాంకులోన్లు రావు. సామాజిక భద్రత అసలే లేదు. దీంతో పనిచేసే ఆడవాళ్లు అన్యాయంగా దోపిడీకి గురవుతున్నారని తెలుసుకున్నారు. దాంతో సెల్ఫ్ ఎంప్లాయిడ్ విమెన్స్ అసోసియేషన్(సేవ)అనే ట్రేడ్ యూనియన్‌ని స్థాపించారు.

'సేవ' ఏం చేస్తుంది?

'సేవ' సంస్థ ప్రపంచంలోనే అతి పెద్ద మహిళా ట్రేడ్ యూనియన్. ప్రస్తుతం ఇందులో సుమారు 29 లక్షలమంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. 18కి పైగా రాష్ట్రాల్లో దీని కార్యకలాపాలు విస్తరించాయి. ఇది ట్రేడ్ యూనియన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌లా పనిచేస్తుంది. చేసిన పనికి న్యాయంగా రావాల్సిన జీతాలు, పని చేసేందుకు అనువైన పరిస్థితుల కల్పన... వంటి వాటి కోసం పోరాడుతుంది. ఆపై అంటే... 1974లో ఈ సంస్థ కింద సేవా కో-ఆపరేటివ్ బ్యాంకు ఏర్పాటైంది. దీని ద్వారా సూక్ష్మరుణాలు, పొదుపు, బీమా, పెన్షన్ వంటివి మహిళలకు అందుబాటులోకి వచ్చాయి. నైపుణ్యాల శిక్షణ, టెక్నాలజీ-మార్కెట్ లింకేజీతో పాటు... సభ్యులందరికీ ఆరోగ్య బీమా, చైల్డ్ కేర్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందిస్తుంది. ఈ కృషికే ఇలాను పద్మశ్రీ, పద్మభూషణ్, రామన్ మెగసెసే వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులెన్నో వరించాయి. ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కింది.

ఏ రంగంలోనైనా మహిళల భాగస్వామ్యం ఉంటేనే స్వావలంబన సాధ్యం అని చెప్పిన ఇలా భట్ 89 ఏళ్ల వయసులో మరణించారు. ఆమె లేకపోతేనేం... ఇలా అందించిన స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగుతున్నారు.

జుట్టు పెరగదా?

మా పాపకి పదేళ్లు. వెంట్రుక సన్నం. ఈ మధ్య జుట్టు ఊడిపోతోంది. మందం పెరిగేలా, సమస్య తగ్గేలా ఏం చేయాలి? - అను, హైదరాబాద్

మీ అమ్మాయి జుట్టు ముందు నుంచీ సన్నగానే ఉంటుందని రాశారు. జన్యుపరంగా కుటుంబంలో ఎవరికైనా జుట్టు పల్చగా ఉంటే అది వచ్చి ఉండొచ్చు. ఇలాంటివారికి మనం ఏ మందులు వాడినా జుట్టు మందంగా మారే అవకాశం ఉండదు. ఇక, ఇప్పుడు మీరు పాపకి జుట్టు రాలుతుందని చెబుతున్నారు. ఈ వయసులో ఈ పరిస్థితికి పోషకాల లోపం కారణం. ఎదిగే వయసు కాబట్టి ప్రొటీన్, మినరల్స్, విటమిన్లు, ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు వంటివి సరిగా అందకపోతే కూడా శిరోజాలు రాలతాయి. థైరాయిడ్ లోపం ఉన్నా, పాపకి తీవ్రమైన జ్వరం లేదా ఒత్తిడిబారిన పడ్డా ఇలా జరుగుతుంది. దీన్నే టెలోజెన్ ఎఫ్లూవియం అంటాం. రక్తపరీక్షల ద్వారా నిర్ధారణ చేసుకున్నాక, ఆమె తినే ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండేలా చూడాలి. పప్పు దినుసులు, పనీర్, చికెన్, గుడ్డు... వంటివి పెట్టాలి. ఖనిజాల కోసం డ్రైఫ్రూట్స్, నట్స్; ఐరన్ లోపాన్ని తగ్గించుకోవడానికి బెల్లం, ఖర్జూరాలు, ఆకుకూరలు ఇవ్వాలి. మాడుమీద దురద, మంట ఉన్నాయేమో అడగండి. తగిన షాంపూలు వాడండి. పెద్దవాళ్లకు వాడే స్టిమ్యులేషన సీరమ్స్ అయిన మినాక్సిడిల్, పెప్టైడ్స్ వంటివి చిన్నారులకు ఇవ్వడం మంచిది కాదు. ఆహారంతోనే శిరోజాలూ ఆరోగ్యంగా ఉంటాయి.

డియర్ వసుంధర



- సూరపనేని పద్మావతి
డెర్మటాలజిస్ట్

మీకు తెలుసా!

1910లో కోపెన్ హెగన్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్ట్ సమావేశంలో మహిళల హక్కుల పోరాటానికి ప్రపంచవ్యాప్తంగా మహిళలకు ప్రత్యేకంగా ఒకరోజు ఉండాలని నిర్ణయించుకున్నారట. ఆ కార్యక్రమంలో పాల్గొన్న జర్మన్ సోషలిస్ట్, స్త్రీవాది క్లారా జెట్కిన్ దీనికి పిలుపునిచ్చారు. 17 దేశాల నుంచి 100 మందికి పైగా మహిళలు ఏకగ్రీవంగా దీన్ని ఆమోదించారు. అలా 1911లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం మొదలైంది.

ఆ మార్పు కోసమే...





మహిళలు, బాలికలపైన హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో పోరాడుతోన్న సంస్థ బ్రేక్ త్రూ. 2000 సంవత్సరంలో భారతీయ-అమెరికన్ మానవ హక్కుల కార్యకర్త మల్లికాదత్ దీన్ని స్థాపించారు. మొదట్లో 'మన్‌కే మంజీరే' అనే ఆల్బమ్, మ్యూజిక్ వీడియోతో ఈ సేవా ప్రయాణం ఆరంభమైంది. దశాబ్దాలుగా మహిళలపై హింస, బాల్య వివాహాలు, లింగ ఆధారిత అబార్షన్లు, వివక్షపై పోరాడుతోంది. అయితే, ఈ సంస్థ సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా మీడియా, మ్యూజిక్, యానిమేషన్, డిజిటల్ క్యాంపెయిన్‌ల ద్వారా యువతలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. ఇలా ఇప్పటివరకూ 23 లక్షల మంది యువతీ యువకులకు చేరువైంది. సుమారు 20 కోట్లమందికి అవగాహన కల్పించింది.

బ్రేక్ త్రూ సంస్థ... టీచర్లకు జెండర్ సెన్సిటివిటీ మీద శిక్షణ అందిస్తోంది. తరగతి గది నుంచే లింగ బేదాలు లేకుండా చూడటంపై దృష్టిపెట్టింది. లింగ వివక్షపై చర్చించడం, మల్టీమీడియా క్యాంపెయిన్లతో యువతను ఆకర్షిస్తోంది. యువ నాయకత్వాన్ని తయారు చేయడం, ప్రభుత్వాలతో కలిసి ఆడపిల్లలకు సమానత్వం, జెండర్ ఎడ్యుకేషన్ అమలు చేయడం వంటివి చేస్తోంది. 'కేవలం మహిళల హక్కుల కోసం మాత్రమే పనిచేస్తే సరిపోదు... యువతను, మగవాళ్లను కూడా భాగస్వాములను చేయాలి. అప్పుడే లింగ వివక్షని రూపుమాపగలం' అంటారు మల్లిక.

మల్లికాదత్‌ది కోల్‌కతా. చిన్నప్పటి నుంచే సామాజికాంశాల పట్ల అవగాహన కలిగి ఉన్నారామె. ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో బీఏ, న్యూయార్క్ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ తీసుకున్నారు. ఆపై కొలంబియా యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ చేశారు. మల్లిక డిబెవాయిస్, ప్లింప్టన్ అనే ప్రముఖ లా ఫర్మ్‌లో అసోసియేట్‌గా కెరియర్ ఆరంభించారు. కానీ కొన్నాళ్లకే మానవహక్కులు, సామాజిక న్యాయం వైపు అడుగులు వేశారు. మొదట సఖి ఫర్ సౌత్ ఏషియన్ విమెన్ పేరుతో ఎన్జీవో స్థాపించారు. ఆపై బ్రేక్‌త్రూ అనే గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ సంస్థను ప్రారంభించారు. ఇది భారతదేశంతో పాటు న్యూయార్క్‌లోనూ పనిచేస్తుంది. ప్రస్తుతం సోహినీ భట్టాచార్య ఈ సంస్థకు సీఈవోగా వ్యవహరిస్తున్నారు.

విద్య... అందరికీ చేరువ కావాలి!

సమాజంలో విద్య... గౌరవం... అందరికీ సమానంగా దొరకడం లేదు. ఈ అసమానతలు తగ్గించి అందరికీ వాటిని చేరువ చేయాలంటారు షాహీన్ మిస్త్రీ. ఆ లక్ష్యంతో 'టీచ్ ఫర్ ఇండియా'ని మొదలుపెట్టి పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో అవార్డుల్నీ అందుకున్నారు.



షాహీన్ ముంబయిలో పుట్టినప్పటికీ తండ్రి ఉద్యోగ రీత్యా ఆమె బాల్యమంతా విదేశాల్లోనే గడిచింది. 18 ఏళ్ల వయసులో ఇండియాకి వచ్చి ముంబయి విశ్వవిద్యాలయంలో సోషియాలజీలో బీఏ పూర్తిచేశారు. ముంబయి మురికివాడల్లో ప్రజల్ని గమనించిన ఆమె వారి జీవితాల్లో మార్పు తేవాలనుకున్నారు. 'విద్యతో మాత్రమే వాళ్ల జీవితాల్ని మార్చాలనుకున్నా. కుటుంబంలో ఒక్కరు చదువుకున్నా సమాజంలో పెద్ద మార్పే వస్తుంది. అందుకే వాళ్లకు చదువు చెప్పాలనుకున్నా' అంటారు షాహీన్. ఇందుకు 1989లో ఆకాంక్ష ఫౌండేషన్‌ని మొదలుపెట్టారు. కాలేజీ అయ్యాక మురికివాడలకు వెళ్లి అక్కడి పిల్లలకు పాఠాలు చెప్పేవారు. 15 మంది పిల్లలతో దీన్ని మొదలుపెట్టారు షాహీన్. ఆర్థికంగా వెనకబడిన పేద విద్యార్థులకు విద్యను అందించడమే దీని ప్రధాన ఉద్దేశం. తన ఆశయం నచ్చడంతో ఆమె స్నేహితులు కూడా తనతో చేయి కలిపారు. నెమ్మదిగా విద్యార్థుల సంఖ్యా పెరిగింది. అయితే దీన్ని ముంబయికి మాత్రమే పరిమితం చేయాలనుకోలేదు షాహీన్. ఎక్కువ మంది విద్యార్థులకు చేరువ చేయాలనుకున్నారు. దానికోసం దేశం మొత్తమ్మీదా ఎనిమిది నగరాల్లో 900 సహచరులు, 250 మంది సిబ్బందితో 2008లో 'టీచ్ ఫర్ ఇండియా'ని స్థాపించారు. ఇప్పటి వరకూ పది లక్షల మంది ప్రత్యక్షంగా, 33లక్షల మంది విద్యార్థులకు పరోక్షంగా విద్యను అందించారు. 'గ్రామంలో ప్రతి చిన్నారి చదువుకోవాలి' అనే షాహీన్ టీఎఫ్ఐఎక్స్.టీచ్ ఫర్ ఇండియా.ఆర్గ్ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇదొక ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చదువును చేరువ చేస్తున్నారు. దీంట్లో పిల్లలు పాఠాలను వాళ్ల ప్రాంతీయ భాషల్లో వినొచ్చు. వివిధ ఆమె చేసిన సేవలకిగాను అశోక ఫెలో, బియాండ్ బిజినెస్, ఈటీ ప్రైమ్ ఉమెన్ లీడర్‌షిప్ అవార్డులతోపాటు పలు ప్రశంసలూ అందుకున్నారు.

పచ్చ బంగారం... ఈశాన్య రాష్ట్రాల్లో వెదురుకు ఉన్న పేరు ఇది. పండుగలు, వేడుకల సమయాల్లో దీనికి డిమాండూ ఎక్కువే. అలాంటి దాంతో ఆదాయం సమకూర్చుకోవడమే కాదు, ఉపాధినీ కల్పిస్తున్నారు మేఘలి దాస్!

పచ్చ బంగారం ఉపాధినిస్తోంది!





ఈటీవీ భారత్

మేఘలిది అసోంలోని గువాహటి. వాళ్లకి వెదురు ఎక్కువగా లభిస్తుంది. దాంతో ఫర్నిచర్, వస్త్రాలు, హస్తకళలు... ఇలా ఎన్నింటినో తయారు చేస్తుంటారు. అయిదేళ్ల క్రితం దాంతో నగల తయారీ ప్రారంభించారు మేఘలి. వాటికి ఆదరణ ఎక్కువగా ఉండటంతో ఇతర మహిళల్నీ భాగస్వాముల్ని చేయాలనుకున్నారామె. అందుకని ఓ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి, మారుమూల పల్లెలకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. నేర్చుకున్న వాళ్లకి సంబంధిత మెటీరియల్, పరికరాలు అన్నీ ఆమే అందిస్తారు. ఉత్పత్తుల మార్కెటింగ్ బాధ్యతనీ చూసుకుంటారు. అసోంలోని జైళ్లలో ఉన్న ఖైదీలకూ వెదురు ఆభరణాల తయారీలో శిక్షణనిస్తున్నారు. తాజాగా 'బాంబూ ఫ్యాషన్' పేరుతో ఒక షోరూమ్‌నీ ఏర్పాటు చేశారు మేఘలి. ఈశాన్య రాష్ట్రాల్లో ఈ తరహా ఇదే తొలి షోరూం. ఆభరణాలను అమ్మడమే కాదు, ఆర్డర్లు తీసుకుని నచ్చినట్టుగానూ చేసి ఇస్తున్నారు. తన దగ్గర శిక్షణ తీసుకున్న వాళ్లు రూపొందించిన వాటినీ ఇక్కడ అమ్ముకునే అవకాశమిస్తున్నారు మేఘలి. 'వెదురుతో పాటు స్థానికంగా లభించే వివిధ రకాల పూసలతో ఈ ఆభరణాలను తయారు చేస్తున్నాం. తయారీ ప్రక్రియలో ఎలాంటి రసాయనాలనూ ఉపయోగించం. వెదురుకి మా ప్రాంతంలో ఆదరణ ఎక్కువ. పండుగలు, శుభకార్యాల్లో తప్పక ఉపయోగిస్తుంటారు. వీటి తయారీకి పెద్ద పెద్ద పరికరాల అవసరం ఉండదు. డిజైన్ బట్టి రూ.5000 పలికేవీ ఉంటాయి. ఇంటి దగ్గరే ఉండి చక్కగా సంపాదించుకోవచ్చు. అందుకే మహిళలకు నేర్పుతున్నా. ఇప్పుడు మా కేంద్రంలోనే శిక్షణిస్తున్నాం. పల్లెలకు వెళ్లి మరీ నేర్పాలన్నదే నా ఆశ' అంటారు మేఘలి.

ఇంట్లో మన దగ్గర మాట్లాడటం, చదవడం, చదివినవి గుర్తుపెట్టుకోవడం... ఇలా అన్నింట్లో చురుగ్గా ఉంటారు పిల్లలు. కానీ పాఠశాలలో, నలుగురు మధ్యా ఏదైనా చెప్పాలంటేనే భయపడుతుంటారు. అలాంటి వాళ్లకి ఈ గ్యాడ్జెట్లను బహుమతిగా ఇచ్చి చూడండి, ఈ నైపుణ్యాలన్నీ ఆటలుగా మారి వాళ్లకు సులువుగా అలవడతాయి.

బహుమతులతో నైపుణ్యాలు!

కిడ్స్ కార్నర్


సులువుగా మాట్లాడతారు...



ఇంట్లో గలగలా మాట్లాడే పిల్లలు... సబ్జెక్ట్ తెలిసినా, వాళ్లకు వచ్చిన అంశమే అయినా స్టేజ్ ఎక్కి మాట్లాడమంటే భయపడుతుంటారు. తప్పులు దొర్లుతాయేమో, తోటి స్నేహితులు హేళన చేస్తారేమో, అందరూ నావైపే చూస్తారు లాంటి భయాలు. వాటిని పోగొట్టాలంటే ఈ 'ఎక్స్6 రాబిట్ కిడ్స్ మైక్రోఫోన్'ను ఇచ్చి చూడండి. ఇది వైర్‌లెస్. మైక్రోఫోన్, బ్లూటూత్ స్పీకర్‌గా పనిచేస్తుంది. వాయిస్‌నీ రికార్డు చేస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే... సుమారు 5-6 గంటల వరకూ పనిచేస్తుంది. దీంతో ఆడుతూ పాడుతూ పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాల్ని ఇట్టే నేర్చుకుంటారు పిల్లలు. వాయిస్ రికార్డు చేసుకునే వెసులుబాటూ ఉంది కాబట్టి తమ గొంతు తామే వింటూ ఇంకా ఉత్సాహంగా మాట్లాడుతుంటారు. ఒక మంచి వ్యాసం ఇచ్చి దాన్ని ఇంటి దగ్గరే ప్రాక్టీసు చేయిస్తే... వక్తృత్వ పోటీల్లో పాల్గొనే ధైర్యాన్ని నేర్చినవారవుతారు.



భయం పోగొట్టేలా...



హోంవర్క్, క్లాస్ వర్క్ అన్నీ బాగా చేస్తారు. పరీక్షల్లోనూ మంచి మార్కులే తెచ్చుకుంటారు. కానీ టీచర్ ప్రశ్న అడిగినప్పుడు, లెక్క బోర్డు మీద ఇచ్చి... 'సమాధానం ఎవరు రాస్తారు?' అన్నప్పుడు మాత్రం చాలా మంది పిల్లలు భయపడతారు. కారణం... వేదిక మీదకు వెళ్లే ధైర్యం లేకనే. ఈ భయం వాళ్లని తరగతులు పెరిగినా వెంటాడుతుంటుంది. అలాకాకుండా మీ పిల్లలు తరగతి గదిలో చురుకుగా వ్యవహరించాలంటే వాళ్లకి ఈ 'వుడెన్ టు ఇన్ వన్ బోర్డు'ను బహుమతిగా ఇవ్వండి. ఇంట్లో చదువుకునేటప్పుడు దీన్ని ఉపయోగించమని చెప్పండి. దీనివల్ల వాళ్లకు బోర్డు మీద రాసే భయం పోతుంది. ఫోల్డబుల్ మోడల్‌లో వస్తున్నాయి కాబట్టి స్థలాభావ సమస్య కూడా ఉండదు.



ఫొటోగ్రఫీ మీద ఆసక్తి పెంచేలా...



ఇదంతా డిజిటల్ యుగం. చిన్నపిల్లలూ ఇన్‌ఫ్లూయెన్సర్లుగా మారిపోతున్నారు. నచ్చిన వీడియోలు, ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంటున్నారు. కానీ దీనివల్ల సమస్యలే ఎక్కువే. తెరలకు బానిసలవుతున్నారు. మీ పిల్లలు అలా కాకూడదంటే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ మీద వాళ్లకున్న ఆసక్తిని కోల్పోకుండా ఈ 'కెనాన్ పవర్‌షాట్ ఏ70' కెమెరాను ఇచ్చి చూడండి. ఇది రెట్రో లుక్ ఫొటోలని ఇస్తుంది. ఆప్టికల్ జూమ్ లెన్స్, ఏఏ సైజ్ బ్యాటరీలతో పనిచేస్తుంది. వీటిని పిల్లలకు ఇవ్వడం వల్ల ప్రపంచాన్ని ఓ కొత్త కోణంలో చూపించిన వారవుతారు. పిల్లల్లో సృజనాత్మకత, ఫొటోలను చూపిస్తూ స్టోరీ టెల్లింగ్, ఏకాగ్రత, అబ్జర్వేషనల్ నైపుణ్యాల్ని నేర్పినవారవుతారు. ఇదో పాత వెర్షన్ కెమెరా... దాంతో ఫొటోలను జూమ్ చేయడం, ఫ్లాష్ ఆన్, ఆఫ్ చేయడం, సెట్టింగ్స్ వంటి టెక్నాలజీపైనా పిల్లలకు అవగాహన వస్తుంది.



టీ20 ధమాకా ఛాంపియన్స్

ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

అభిమానుల చూపంతా అటువైపే. టీమ్‌ఇండియాకు ఇక చావో రేవో! ఈ టీ20 ప్రపంచకప్‌లోనే తనకు అత్యంత కీలకమైన పోరుకు డిఫెండింగ్ ఛాంపియన్ సిద్ధమైంది. క్వార్టర్‌ఫైనల్ లాంటి సూపర్ 8 మ్యాచ్‌లో నేడు వెస్టిండీస్‌ను ఢీకొంటుంది. గెలిస్తే సెమీఫైనల్‌కు లేదంటే టోర్నీ నుంచి బయటికే. గత మ్యాచ్‌తో బ్యాటుతో ఫామ్‌ను అందుకున్న భారత జట్టుకు బౌలింగ్ మాత్రం ఇంకా సమస్యగానే ఉంది. భారత్‌లాగే కరీబియన్ జట్టులోనూ భారీ హిట్టర్లకు కొదవలేదు. ఈ నేపథ్యంలో బంతితో పుంజుకోవడం ఆతిథ్య జట్టుకు చాలా ముఖ్యం.

దక్షిణాఫ్రికా × జింబాబ్వే: వేదిక: దిల్లీ; మ: 3 నుంచి


సూర్యకుమార్

కోల్‌కథ సుఖాంతమా!

వెస్టిండీస్‌తో భారత్ కీలక పోరు నేడు


రాత్రి 7 నుంచి

విండీస్ ఆటగాళ్లు

కోల్‌కతా: రసవత్తర సమరానికి వేళైంది. టీ20 ప్రపంచకప్ గ్రూప్-1 సూపర్ 8 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఆదివారం వెస్టిండీస్‌ను ఢీకొట్టనుంది. దక్షిణాఫ్రికా చేతిలో విండీస్ ఓడిపోవడం, జింబాబ్వేపై భారత్ ఘన విజయంతో ఈ పోరు క్వార్టర్‌ఫైనల్‌గా మారిపోయింది. ఈ టోర్నీలో రెండు జట్లు కూడా ఒక్కో ఓటమి చవిచూశాయి. రెండు జట్ల బ్యాటింగ్ బలంగా ఉంది. సిక్సర్ల హోరు ఖాయం. దీంతో పోరు చాలా ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మ్యాచ్‌లో విజేత మార్చి 5న ముంబయిలో జరిగే సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌ను ఢీకొంటుంది.

ఈడెన్‌లో మనమే..

1983 నుంచి ఈడెన్ గార్డెన్స్‌లో ఏ అంతర్జాతీయ మ్యాచ్‌లోనూ భారత్‌ను వెస్టిండీస్ ఓడించలేదు. ఇక్కడ విండీస్‌తో ఆడిన నాలుగు టీ20 మ్యాచ్‌ల్లోనూ టీమ్‌ఇండియానే గెలిచింది.

బంతితో పుంజుకోవాలి

టోర్నీ ఆరంభం నుంచి బ్యాటింగ్‌లో ఏదో తడబాటు. భారత్ గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచినా.. బ్యాటుతో ఆ జట్టులో సాధికారత లోపించింది. సూపర్ 8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోవడం పెద్ద షాక్. కానీ జింబాబ్వేతో పోరులో టీమ్‌ఇండియా బ్యాటింగ్ మళ్లీ గాడినపడింది. టాప్-6 సమష్టిగా రాణించారు. బరిలోకి దిగిన ప్రతి బ్యాటరూ బ్యాట్ ఝుళిపించడంతో బ్యాటింగ్‌పై ఆందోళనలు తొలగిపోయాయి. 24 పరుగులే చేసినా, ఓపెనర్ సంజు శాంసన్ ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. అభిషేక్ శర్మ కూడా చక్కని అర్ధశతకంతో ఫామ్‌ను అందుకున్నాడు. తిలక్ వర్మ, హార్దిక్, సూర్యకుమార్ చూపుడైన ఇన్నింగ్స్‌లు జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. ఇషాన్ కూడా లయలోనే ఉన్నాడు. అయితే బ్యాటర్లు మరోసారి గర్జించడానికి సిద్ధమవుతున్నారు. కానీ బౌలింగ్ ఆందోళన కలిగిస్తోంది. అది పూర్తిగా గాడినపడలేదు. గత మ్యాచ్‌లో జింబాబ్వేపై సూపర్‌గా బౌలింగ్ చేసిన అర్ష్‌దీప్ మూడు వికెట్లు పడగొట్టాడు. బుమ్రా, హార్దిక్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. అయితే బుమ్రా పొదుపుగానే బౌలింగ్ చేస్తున్నా.. మరిన్ని వికెట్లు పడగొట్టాల్సిన అవసరం ఉంది. భారత్‌కు అసలు చిక్కంతా స్పిన్‌తోనే. ముఖ్యంగా వరుణ్ చక్రవర్తి పేలవ ఫామ్ జట్టుకు ప్రతికూలంగా మారింది. ఆ మిస్టరీ స్పిన్నర్ మ్యాజిక్ ఎటు పోయిందో తెలియడం లేదు. దక్షిణాఫ్రికాపై 4 ఓవర్లలో 47 పరుగులిచ్చాడు. జింబాబ్వేపైనా ప్రభావం చూపలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో అతడు పుంజుకోవడం జట్టుకు ఎంతో అవసరం. గత మ్యాచ్‌లో అక్షర్ పటేల్ కూడా 35 పరుగులిచ్చాడు. మరో వైపు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ దూబెపై ఏమాత్రం ఆధారపడలేని పరిస్థితి. జింబాబ్వేపై అతడు రెండు ఓవర్లలోనే 46 పరుగులు సమర్పించుకున్నాడు. తన మీడియం పేస్‌తో అతడు విండీస్ బ్యాటర్లను కట్టడి చేయగలడా అన్నది అనుమానమే. ఈ మ్యాచ్‌కు భారత తుది జట్టులో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు.

బలంగా విండీస్ బ్యాటింగ్

గత మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ వెస్టిండీస్ జట్టు మంచి ఫామ్‌లోనే ఉంది. హిట్టర్లతో ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ భీకరంగా కనిపిస్తోంది. విండీస్ వ్యూహం స్పష్టం. అర్ధ భాగం వరకు ఇన్నింగ్స్‌ను చక్కగా నిర్మించడం.. ఆఖరి ఓవర్లలో విధ్వంసం సృష్టించడం. ఈ వ్యూహంతో ఆ జట్టు అలవోకగా భారీ స్కోర్లు చేస్తోంది. ఈ ఫార్ములాతో ఆ జట్టు వరుస విజయాలు సాధించింది. దక్షిణాఫ్రికాతో ఓడిపోయిన మ్యాచ్‌లోనూ ఆ జట్టు బ్యాటింగ్ లోతు స్పష్టంగా కనిపించింది. 11 ఓవర్లలో 83/7తో నిలిచిన ఆ జట్టు.. ఆ తర్వాత అద్భుతంగా కోలుకుని, 176/8తో ఇన్నింగ్స్‌ను ముగించింది. 9వ స్థానంలో వచ్చిన రొమారియో షెఫర్డ్ అజేయ అర్ధశతకం సాధించాడు. హెట్‌మయర్‌ను మూడో స్థానంలో ఆడిస్తుండడం ఆ జట్టుకు సత్ఫలితాలనిస్తోంది. ఈ నేపథ్యంలో విండీస్ మరోసారి బ్యాటింగ్ ప్రధాన బలంగా బరిలోకి దిగుతోంది. అయితే ఆ జట్టు కూడా బంతితో పుంజుకోవాల్సివుంది.

పిచ్ ఎలా ఉందంటే..

ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. భారీ స్కోర్లు నమోదు కావచ్చని భావిస్తున్నారు. ఇదే పిచ్‌పై ఇటలీపై స్కాట్లాండ్ 4 వికెట్లకు 207 పరుగులు చేసింది. బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు గంగూలీ పిచ్‌ను పరిశీలించాడు. అతడు పిచ్‌పై సంతృప్తిగా ఉన్నట్లు కనిపించాడని ప్రధాన క్యురేటర్ సుజన్ ముఖర్జీ చెప్పాడు. బౌలర్లకు కూడా కొంత సహకారం లభిస్తుందని అతడు తెలిపాడు. మంచు ప్రభావం ఉంటుందని చెప్పాడు. మ్యాచ్‌కు ఎలాంటి వర్షం ముప్పు లేదు.

తుది జట్లు (అంచనా)... భారత్: అభిషేక్, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్, హార్దిక్, దూబె, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి; **వెస్టిండీస్:** బ్రెండన్ కింగ్, షై హోప్, హెట్‌మయర్, రోమన్ పావెల్, చేజ్, రూథర్‌ఫర్డ్, షెఫర్డ్, హోల్డర్, ఫోర్డ్, మోటీ, షామర్ జోసెఫ్.

క్రికెట్ టోర్నీల స్థాయి ఏదైనా సరే.. నామమాత్రంగా పాల్గొనే జట్లు కొన్ని ఉంటాయి. వాటి పని పోటీ పడడం వరకే ఉంటుంది. ఎప్పుడో ఒకసారి ఒకట్రెండు సంచలన విజయాలు సాధించడం.. కాస్త మెరుగైన ప్రదర్శన చేయడమే. బహుమతులు గెలవడం, టైటిల్‌ను సాధించడం వాటికి అలవాటుండదు. అందుకే ఆ జట్లను ప్రత్యర్థులు చాలా తేలిగ్గా తీసుకుంటాయి. భారత దేశవాళీ అత్యున్నత టోర్నీ రంజీ ట్రోఫీలో ఈసారి అలాంటి జట్టే.. ఫైనల్‌కు దూసుకొచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతటితో ఆగకుండా ఇప్పుడు ఏకంగా రంజీ ట్రోఫీని సొంతం చేసుకుని అబ్బురపరిచింది. జమ్మూకశ్మీర్.. కర్ణాటకతో ఫైనల్లో భారీ స్కోరు సాధించిన ఆ జట్టు.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా రంజీ విజేతగా నిలిచింది.


18 రంజీ ట్రోఫీ గెలిచిన 18వ జట్టు జమ్మూకశ్మీర్

ఔను.. వాళ్లు అద్భుతం చేశారు

జమ్మూకశ్మీర్ చేతిలో రంజీ ట్రోఫీ ● ఫైనల్లో కర్ణాటకపై పైచేయి

హుబ్బళి: జమ్మూకశ్మీర్ అద్భుతం చేసింది. తొలిసారిగా రంజీ ట్రోఫీ విజేతగా నిలిచింది. 67 ఏళ్ల తన రంజీ చరిత్రలో దాదాపుగా ప్రతిసారీ ఏ అంచనాలు లేకుండా, పసికూనగా బరిలోకి దిగుతూ వచ్చిన ఆ జట్టు.. ఈసారి కూడా అలాగే టోర్నీలో అడుగు పెట్టి, మహామహా జట్లను వెనక్కి నెట్టి ఛాంపియన్ అయింది. కర్ణాటకతో ఫైనల్లో బ్యాటుతో, బంతితో తిరుగులేని ఆధిపత్యం చలాయించిన ఆ జట్టు.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విజేతగా నిలిచింది. జమ్మూకశ్మీర్‌కే ట్రోఫీ దక్కబోతోందని ముందే తేలిపోగా.. ఆ జట్టు చివరి రోజు లాంఛనాన్ని ముగించింది. 186/4తో శనివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన జమ్మూకశ్మీర్.. మరో వికెట్ కోల్పోకుండా మ్యాచ్ ముగిసే సమయానికి 342/4తో నిలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్ (160 నాటౌట్; 16×4, 3×6), సాహిల్ లోత్రా (101 నాటౌట్; 226 బంతుల్లో 8×4, 3×6) సెంచరీలతో అజేయంగా నిలిచారు. వీళ్లిద్దరూ అభేద్యమైన అయిదో వికెట్‌కు 197 పరుగులు జోడించారు. 94 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన కమ్రాన్.. ఉదయం ఆట ఆరంభమైన కాసేపటికే శతకాన్నందుకున్నాడు. ఆ తర్వాత అతను ధాటిగా బ్యాటింగ్ చేశాడు. 32 పరుగులతో క్రీజులోకి అడుగు పెట్టిన లోత్రా.. ధాటిగా సెంచరీ పూర్తి చేశాడు. లోత్రా శతకం పూర్తి కాగానే మ్యాచ్ ముగిసింది. ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో తొలి ఇన్నింగ్స్ ఆధారంగా జమ్మూకశ్మీర్ రంజీ విజేతగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూకశ్మీర్ 584 పరుగుల భారీ స్కోరు సాధించగా.. కర్ణాటక 293 పరుగులకే ఆలౌటైంది. దీంతో జమ్మూకశ్మీర్‌కు ఏకంగా 291 పరుగుల ఆధిక్యం దక్కింది. ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన శుభమ్ పుందిర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవగా.. ఈ రంజీ సీజన్లో 60 వికెట్లు పడగొట్టడమే కాక, 245 పరుగులు చేసిన ఆకిబ్ నబి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా ఎంపికయ్యాడు.

జమ్మూకశ్మీర్ తొలి ఇన్నింగ్స్: 584; **కర్ణాటక తొలి ఇన్నింగ్స్:** 293; **జమ్మూకశ్మీర్ రెండో ఇన్నింగ్స్:** 342/4 డిక్లేర్డ్ (కమ్రాన్ ఇక్బాల్ 160 నాటౌట్, సాహిల్ లోత్రా 101 నాటౌట్; ప్రసిద్ధ్ కృష్ణ 2/42)

"ఇదొక చరిత్రాత్మక విజయం. తొలి సారి రంజీ ట్రోఫీ సాధించిన జమ్మూకశ్మీర్ జట్టుకు నా శుభాభినందనలు. జమ్మూకశ్మీర్ ప్రజలందరికీ ఇది గర్వించదగ్గ తరుణం. ఆటగాళ్ల క్రమశిక్షణ, క్రికెట్‌పై వారికున్న ప్రేమ, గెలవాలన్న పట్టుదల ఈ విజయంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ గెలుపు ఎందరో యువ ఆటగాళ్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది"

– ప్రధాని నరేంద్ర మోదీ

కూన.. శిఖరాన

పసికూనలుగా పేరున్న జట్లు పెద్ద టోర్నీల్లో ఒకట్రెండు సంచలనాలు నమోదు చేయడం ఏ టోర్నీలో అయినా జరిగేదే. కానీ ఓ చిన్న జట్టు ఫస్ట్‌క్లాస్ ఫార్మాట్లో నాలుగైదు రోజులు ఉత్తమ ప్రదర్శన చేసి పెద్ద జట్లను ఓడించడమంటే చిన్న విషయం కాదు. అందులోనూ నెలల తరబడి సుదీర్ఘంగా సాగే రంజీ ట్రోఫీ లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో నిలకడగా ఆడి కప్పు గెలవడమంటే అది అద్భుతమే. జమ్మూకశ్మీర్ ఈ సీజన్లో ఆ అద్భుతమే చేసింది.

ఈనాడు క్రీడావిభాగం


ఆకిబ్ నబి

కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, కరుణ్ నాయర్, దేవ్‌దత్ పడిక్కల్, ప్రసిద్ధ్ కృష్ణ.. ఇంతమంది టీమ్ ఇండియా ఆటగాళ్లున్న జట్టు కర్ణాటక. వీరికి తోడు ఈ రంజీ సీజన్లో అదరగొట్టిన రవిచంద్రన్ స్మరణ్, శ్రేయస్ గోపాల్, విజయ్‌కుమార్ వైశాఖ్ లాంటి పేరున్న క్రికెటర్లు ఆ జట్టు సొంతం. ఇలాంటి జట్టు మీద ఒక్క టీమ్ ఇండియా ఆటగాడు కూడా లేని జమ్మూకశ్మీర్ రంజీ ట్రోఫీ ఫైనల్లో పైచేయి సాధించి కప్పు ఎగరేసుకుపోయింది. అయిదు రోజుల మ్యాచ్‌లో కనీసం ఒక్క సెషన్‌లోనూ కర్ణాటకకు అవకాశం ఇవ్వలేదు జమ్మూకశ్మీర్. అయిదు రోజులూ పూర్తి ఆధిపత్యంతో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆ జట్టే పైచేయి సాధించింది. ఎనిమిదిసార్లు ఛాంపియన్‌గా నిలిచిన కర్ణాటకపై దాదాపు 600 స్కోరు, సుమారు 300 ఆధిక్యం సాధించడం జమ్మూకశ్మీర్ ఎంత గొప్పగా ఆడిందో చెప్పడానికి నిదర్శనం. ఫైనల్ అనే కాదు.. ఈ సీజనంతా పెద్ద జట్లకు చెక్ పెడుతూనే ఆ జట్టు ముందుకు సాగింది. క్వార్టర్స్‌లో మధ్యప్రదేశ్‌పై 5 వికెట్ల తేడాతో, సెమీఫైనల్లో బెంగాల్‌పై 6 వికెట్ల తేడాతో సాధికార విజయాలు సాధించింది. సెమీస్‌లో ప్రత్యర్థికి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయినా ఆ జట్టు వెరవలేదు.

వీళ్లే హీరోలు...: జమ్మూకశ్మీర్ గెలుపు మంత్రం సమష్టితత్వమే. స్టార్లు లేకపోయినా.. కలిసికట్టుగా ఆడడం ద్వారా ఆ జట్టు ఈ అద్భుత ఘనతను సొంతం చేసుకుంది. అయితే కొందరు ఆటగాళ్లు అసాధారణ ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. అందులో ముందుగా చెప్పుకోవాల్సింది ఫాస్ట్‌బౌలర్ ఆకిబ్ నబి గురించి. కొన్ని నెలల ముందు ఐపీఎల్ వేలంలో దిల్లీ క్యాపిటల్స్ జట్టు.. ఈ కుర్రాడిని ఏకంగా రూ.8.4 కోట్లు పెట్టి సొంతం చేసుకుంది. టోర్నీలో అత్యధిక వికెట్ల వీరుడు అతడే. 10 మ్యాచ్‌లు.. 60 వికెట్లు.. 12.56 సగటు.. 2.65 ఎకానమీ.. ఏడుసార్లు 5 వికెట్ల ప్రదర్శన.. అత్యుత్తమం 7/24. ఈ గణాంకాలు చూస్తేనే నబి ఎంత గొప్పగా రాణించాడో అర్థమవుతుంది. ఫైనల్లో 5 వికెట్లతో కర్ణాటక నడ్డి విరిచింది అతనే. సునీల్ కుమార్ (9 మ్యాచ్‌ల్లో 31 వికెట్లు), యుధ్వీర్ సింగ్ (7 మ్యాచ్‌ల్లో 21 వికెట్లు), అబిద్ (10 మ్యాచ్‌ల్లో 20 వికెట్లు) కూడా బౌలింగ్‌లో రాణించారు.

ప్రైజ్‌మనీ

రంజీ ట్రోఫీ విజేత జమ్మూకశ్మీర్ రూ.5 కోట్లు నగదు బహుమతిని సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన కర్ణాటక రూ.3 కోట్లు అందుకుంది.

ఐపీఎల్‌తో వెలుగులోకి వచ్చిన అబ్దుల్ సమద్.. జమ్మూకశ్మీర్ తరపున బ్యాటింగ్‌లో ఉత్తమంగా నిలిచాడు. అతను 10 మ్యాచ్‌ల్లో 57.53 సగటుతో 748 పరుగులు సాధించాడు. కెప్టెన్ పరాస్ డోగ్రా కూడా నిలకడగా రాణించాడు. అతను 10 మ్యాచ్‌ల్లో 42.46 సగటుతో 637 పరుగులు చేశాడు. అందులో 2 శతకాలు, 4 అర్ధశతకాలు ఉన్నాయి. 41 ఏళ్ల పరాస్.. రంజీ ట్రోఫీ చరిత్రలో పది వేల పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా ఈ సీజన్‌లోనే ఘనత సాధించాడు. ఇంకా కన్హయ్య వద్వాన్ (10 మ్యాచ్‌ల్లో 474), కమ్రాన్ ఇక్బాల్ (6 మ్యాచ్‌ల్లో 471) కూడా సత్తా చాటారు. ఫైనల్లో శుభమ్ పుందిర్ (121), కమ్రాన్ ఇక్బాల్ (160 నాటౌట్), యావర్ హసన్ (88), సాహిల్ లోత్రా (72, 101 నాటౌట్), కన్హయ వద్వాన్ (70) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. జట్టులో కెప్టెన్ డోగ్రా ఒక్కడే వలస ఆటగాడు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన అతను తప్పితే.. మిగతా ఆటగాళ్లందరూ జమ్మూకశ్మీర్‌కు చెందిన వాళ్లే కావడంతో ఈ ప్రదర్శన తాలూకు ఘనత ఆ రాష్ట్రానికే చెందుతుంది.

అలాంటి చోటి నుంచి...: దేశంలో క్రికెట్ ఆడడానికి అనువైన పరిస్థితులు లేని రాష్ట్రాల్లో జమ్మూకశ్మీర్ ముందు వరుసలో ఉంటుంది. ఎత్తుపల్లాలతో ఉండే ఆ రాష్ట్రంలో క్రికెట్ మైదానాలు, వసతులు అంతంతమాత్రం. దశాబ్దాలుగా హింసకు, ఉగ్రవాద ఘటనలకు నెలవుగా మారిన ఆ రాష్ట్రంలో ఆటలు ఆడడం, కెరీర్‌గా ఎంచుకోవడం ఎంత కష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గత కొన్నేళ్లలో వసతులతో పాటు పరిస్థితులూ మెరుగుపడ్డప్పటికీ.. మిగతా ఏ రాష్ట్రంతో పోల్చి చూసినా జమ్మూకశ్మీర్‌కు ఉన్న ఇబ్బందులు తక్కువ కాదు. 1959-60 సీజన్లో తొలి సారిగా రంజీ ట్రోఫీలో ఆడిన ఆ జట్టు.. 23 ఏళ్లకు కానీ గెలుపు ఖాతా తెరవలేకపోయింది. 2001-02 సీజన్లో తొలిసారి రంజీల్లో నాకౌట్ చేరిన జమ్మూకశ్మీర్.. 2012-13లో ఇంకోసారి ఆ ఘనత సాధించింది. 2015-16లో దిగ్గజ జట్టు ముంబయిని ఓడించడంతో పర్వేజ్ రసూల్ సారథ్యంలోని జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు పేరు మార్మోగింది. కానీ ఆ తర్వాత ఆ జట్టు నిలకడగా ఆడలేకపోయింది. ఈ సీజన్ ముంగిట జమ్మూకశ్మీర్‌పై ఎలాంటి అంచనాలు లేవు. కానీ సమష్టి ప్రదర్శనతో ఒక్కో అడుగు ముందుకు వేస్తూ.. నాకౌట్‌లో హేమాహేమీ జట్లను మట్టికరిపిస్తూ కప్పు ఎగరేసుకుపోయింది.

లంకను ఆపలేక..

● గెలిచినా పాక్ ఔట్
● సెమీస్‌లో కివీస్


శానక ఫర్హాన్

పల్లెకెలె: గెలిచిన జట్టుకు ఆనందం లేదు.. పోరాడిన జట్టుకు ఉపయోగం లేదు. కానీ మైదానంలో లేని టీమ్ గంతులు వేసి ఉంటుంది. పాకిస్థాన్-శ్రీలంక గ్రూప్-2, సూపర్-8 మ్యాచ్‌లో పరిస్థితి ఇది. విజయం సాధించినా టీ20 ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ (3 మ్యాచ్‌ల్లో 3 పాయింట్లు) నిష్క్రమించక తప్పలేదు. సెమీస్ చేరాలంటే 147 స్కోరులోపు శ్రీలంకను కట్టడి చేయడంలో విఫలమైన ఆ జట్టు రన్‌రేట్ (-0.123)లో వెనుకబడి ఇంటిముఖం పట్టింది. పాక్ మాదిరే 3 మ్యాచ్‌ల్లో 3 పాయింట్లే సాధించినా.. మెరుగైన రన్‌రేట్‌తో న్యూజిలాండ్ (1.390) సెమీఫైనల్ బెర్తు దక్కించుకుంది. శనివారం మొదట పాక్ 8 వికెట్లకు 212 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫర్హాన్ (100; 60 బంతుల్లో 9×4, 5×6) మెరుపు సెంచరీ చేశాడు. ఫకార్ జమాన్ (84; 42 బంతుల్లో 9×4, 4×6) కూడా రాణించాడు. ఛేదనలో లంక 6 వికెట్లకు 207 పరుగులే చేసింది. కెప్టెన్ శానక (76 నాటౌట్; 31 బంతుల్లో 2×4, 8×6), రత్నాయకే (58; 37 బంతుల్లో 4×4, 3×6) పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు.

శానక, రత్నాయకే బాదినా...: పవర్‌ప్లేలోపు నిశాంక (3), మిషారా (26)ల వికెట్లు కోల్పోయిన లంక 5 ఓవర్లకు 37/2తో నిలిచింది. ఈ దశలో పవన్ రత్నాయకే నిలిచాడు. మొదట అసలంక (25), తర్వాత శానకతో కలిసి అతడు స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే 16వ ఓవర్లో 147 స్కోరును దాటిన లంక.. పాక్ సెమీస్ ఆశలపై నీళ్లు చల్లింది. 19వ ఓవర్లో శానక రెండు సిక్స్‌లు బాదడంతో చివరి ఓవర్లో 28 పరుగులు అవసరమయ్యాయి. షహీన్ వేసిన ఆఖరి ఓవర్లో శానక 4, 6, 6, 6 బాదేయడంతో సమీకరణం (2 బంతుల్లో 6) తేలికైపోయింది. కానీ తర్వాతి రెండు బంతులకు పరుగులు రాకపోవడంతో లంకకు ఓటమి తప్పలేదు. అంతకుముందు పాక్ ఓపెనర్లు ఫర్హాన్, ఫకార్ జమాన్ పోటీపడి ఆడడంతో ఆ జట్టు స్కోరుబోర్డు పరుగులెత్తింది. శ్రీలంక పేలవ బౌలింగ్, ఫీల్డింగ్ పాక్‌కు కలిసొచ్చింది. 12 ఓవర్లకు 102/0తో పాక్ భారీ స్కోరు దిశగా సాగింది. అయితే జమాన్ ఔటయ్యాక.. పాక్ అనూహ్యంగా తడబడింది. నఫే (2), షాదాబ్ (7), నవాజ్ (0), ఆఘా (0) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. దీంతో పాకిస్థాన్ అనుకున్న దానికంటే తక్కువ స్కోరుకే పరిమితమైంది.

పాయింట్ల పట్టిక సూపర్-8 గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
ఇంగ్లాండ్	3	3	0	0	6	1.096
న్యూజిలాండ్	3	1	1	1	3	1.390
పాకిస్థాన్	3	1	1	1	3	-0.123
శ్రీలంక	3	0	3	0	0	-1.950

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

పాకిస్థాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ (బి) జనిత్ లియనాగే (బి) మదుశంక 100; ఫకార్ జమాన్ (బి) చమీర 84; ఖవాజా నఫే (సి) అసలంక (బి) మదుశంక 2; షాదాబ్ ఖాన్ రనౌట్ 7; మహ్మద్ నవాజ్ (సి) తీక్షణ (బి) శానక 0; సల్మాన్ ఆఘా (సి) తీక్షణ (బి) శానక 0; ఉస్మాన్ ఖాన్ నాటౌట్ 8; షహీన్‌షా అఫ్రిది ఎల్బీ (బి) మదుశంక 4; నసీమ్ షా రనౌట్ 1; అబ్రార్ అహ్మద్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **212**; **వికెట్ల పతనం:** 1-176, 2-179, 3-198, 4-199, 5-199, 6-203, 7-207, 8-210; **బౌలింగ్:** మదుశంక 4-0-33-3; చమీర 4-0-48-1; తీక్షణ 4-0-35-0; శానక 4-0-42-2; వెల్లలాగే 3-0-37-0; జనిత్ లియనాగే 1-0-14-0

శ్రీలంక ఇన్నింగ్స్: నిశాంక (సి) నవాజ్ (బి) నసీమ్ 3; మిషారా (బి) అబ్రార్ 26; అసలంక (బి) అబ్రార్ 25; రత్నాయకే (సి) అయూబ్ (బి) అఫ్రిది 58; కమిందు (బి) అబ్రార్ 3; లియనాగే (బి) నవాజ్ 5; శానక నాటౌట్ 76; వెల్లలాగే నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **207**; **వికెట్ల పతనం:** 1-8, 2-33, 3-75, 4-94, 5-101, 6-162; **బౌలింగ్:** అఫ్రిది 4-0-48-1, నసీమ్ 4-0-36-1, అబ్రార్ 4-0-23-3, తారిఖ్ 4-0-43-0, నవాజ్ 2-0-21-1, షాదాబ్ 2-0-33-0

ఆఖరిదైనా గెలవాలని..

● నేడు ఆస్ట్రేలియాతో భారత్ ఢీ
● ఉదయం 9.20 నుంచి

హోబర్ట్: ఆస్ట్రేలియాతో తొలి రెండు వన్డేల్లో ఓడి.. ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కోల్పోయిన భారత మహిళల జట్టు.. మరో సవాల్‌కు సిద్ధమైంది. ఆదివారం సిరీస్‌లో చివరిదైన మూడో వన్డేలో ఆసీస్‌తో హర్మన్‌ప్రీత్ బృందం తలపడనుంది. ప్రపంచ ఛాంపియన్ హోదాలో బరిలో దిగిన భారత్.. తొలి రెండు వన్డేల్లో బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. తొలి వన్డేలో 214 పరుగులు, రెండో వన్డేలో 251 పరుగులే చేసింది. బలమైన భాగస్వామ్యాలు నెలకొల్పడంలో జట్టు విఫలమవుతోంది. హర్మన్‌ప్రీత్ (53, 54), స్మృతి మంధాన (31, 58) మాత్రమే స్థిరంగా ఆడుతుండగా.. మిగిలిన బ్యాటర్లు సత్తా చాటలేకపోతున్నారు. బౌలింగ్‌లో శ్రీచరణి, దీప్తి, క్రాంతి గౌడ్, కశ్వీ గౌతమ్ కీలకం.

దుబాయ్‌లో చిక్కుకున్న సింధు

దిల్లీ: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయింది. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం ఆమె ఇంగ్లాండ్ వెళ్తోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు రద్దు కావడంతో సింధు ప్రయాణం ఆగిపోయింది. "తదుపరి నోటీసు వరకు అన్ని సర్వీసులను రద్దు చేశారు" అని సింధు సోషల్ మీడియాలో పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ శనివారం ఇరాన్‌పై దాడికి దిగాయి. గల్ఫ్ ప్రాంతంలో గగనతలాన్ని మూసివేయడంతో అనేక విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది.

ఆసియా బాక్సింగ్ బరిలో నిఖత్

దిల్లీ: తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో బరిలో దిగుతోంది. ఈనెల 28న మంగోలియాలో ఆరంభమయ్యే ఈ టోర్నీలో నిఖత్ 51 కేజీల విభాగంలో పోటీపడుతోంది. మహిళల విభాగంలో ఒలింపిక్ పతక విజేత లవ్లీనా (75 కేజీ), ప్రీతి (54 కేజీ) కూడా బరిలో ఉన్నారు.

గుకేశ్ ఓటమి

ప్రేగ్: ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ నిరాశపరిచాడు. ప్రేగ్ అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్ విభాగం మూడో రౌండ్లో ఓడిపోయాడు. తొలి రెండు గేమ్‌లను డ్రాతో సరిపెట్టుకున్న గుకేశ్.. మూడో రౌండ్లో జోర్డెన్ (హాలెండ్) చేతిలో పరాజయం చవిచూశాడు. గుకేశ్ (1 పాయింట్) ఎనిమిదో స్థానంలో ఉన్నాడు.

హెచ్‌సీఏ కార్యదర్శి, కోశాధికారి పదవులకు 12న ఎన్నికలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం ఈ నెల 12న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల్లో పోటీపడేందుకు, ఓటు వేసేందుకు అర్హులైన సభ్యుల జాబితాను హైకోర్టు నియమించిన పాలకుడి ఆమోదంతో సిద్ధం చేశారు. నిరుడు జులై 19న జరిగిన ఏజీఎంకు హాజరయ్యేందుకు ఆహ్వానం పొందిన క్లబ్‌ల ప్రతినిధుల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ నెల 5, 6వ తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 9న నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

93వ గ్రాండ్‌మాస్టర్‌గా ఆరవ్


ఆరవ్

చెన్నై: భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ల జాబితాలో మరో ఆటగాడు చేరాడు. తాజాగా ముంబయికి చెందిన 17 ఏళ్ల ఆరవ్ జీఎం హోదా దక్కించుకున్నాడు. మన దేశం నుంచి గ్రాండ్‌మాస్టర్ అయిన 93వ ఆటగాడిగా ఆరవ్ ఘనత సాధించాడు. బోస్నియాలో జరిగిన జీఎం మిక్స్ బిజెల్‌జినా టోర్నీలో విజేతగా నిలవడం ద్వారా.. గ్రాండ్‌మాస్టర్ హోదాకు అవసరమైన చివరి నార్మ్‌ను ఆరవ్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 2506 ఎలో పాయింట్లు ఉన్నాయి. ఆరవ్ 2022లో ఫిడే మాస్టర్, 2024లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాలు దక్కించుకున్నాడు.

హక్కుల వినియోగంలో బాధ్యతతో మెలగాలి

- వాక్ స్వాతంత్ర్యం, నియంత్రణ మధ్య సమతుల్యం అవసరం
- 'సోషల్ మీడియా దుర్వినియోగం' సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి





సదస్సులో ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి. వేదికపై ఐజీ(ఈగల్) ఆకె.రవికృష్ణ, సీనియర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, హైకోర్టు న్యాయవాది రవితేజ ★ జస్టిస్ జేకే మహేశ్వరికి జ్ఞాపిక అందజేస్తున్న స్వేచ్ఛ-ది ఫ్రీడమ్ ఫౌండేషన్ సభ్యులు

ఈనాడు, అమరావతి: రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును వినియోగించుకునేటప్పుడు ఇతరుల హక్కులకు భంగం కలగకుండా పౌరులు బాధ్యతాయుతంగా మెలగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి పేర్కొన్నారు. డిజిటల్ విప్లవం మొదలయ్యాక.. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తి ఒక ప్రసారకర్తగా, ఒక ప్రచురణకర్త(బ్రాడ్‌కాస్టర్), గ్లోబల్ వ్యాఖ్యాతగా మారిపోయారు.. ఉన్మత్త ఆలోచనలు సృష్టించే పోస్టులు క్షణాల్లో ప్రపంచాన్ని చుట్టేస్తున్నాయని గుర్తుచేశారు. సోషల్ మీడియా యుగంలో వాక్ స్వాతంత్ర్యానికి మనస్సాక్షి తోడవ్వాలని అన్నారు. వాక్ స్వాతంత్ర్యం, నియంత్రణ మధ్య సమతుల్యతను పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

సీనియర్ మీడియా ఏపీ అకాడమీ, స్వేచ్ఛ-ది ఫ్రీడమ్ ఫౌండేషన్ సహకారంతో 'సామాజిక మాధ్యమాల దుర్వినియోగం-భావప్రకటన స్వేచ్ఛ, నియంత్రణ మధ్య సమతుల్యత' అనే అంశంపై శనివారం విజయవాడలోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హైకోర్టు న్యాయవాది పవని రవితేజ సమన్వయకర్తగా వ్యవహరించారు.

వారిని రక్షించడానికి చట్టాలు రూపొందించలేదు

సదస్సులో జస్టిస్ జేకే మహేశ్వరి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'విమర్శ అనుమతించదగినదే అయినా.. స్వేచ్ఛ ముసుగులో చేసే నేరపూరిత, హాని కలిగించే, చట్ట విరుద్ధమైన మాటలు, ఉపన్యాసాలను ప్రత్యేకించి చూడాలి. ఈ విధమైన వ్యాఖ్యల చేసిన వారిని రక్షించడానికి చట్టాలు రూపొందించలేదు. స్వేచ్ఛకు బాధ్యత అనే చట్రం తోడైనప్పుడే దేశం గమ్యం చేరుకుంటుంది. దేశంలో ప్రస్తుతం 75 కోట్ల కంటే ఎక్కువమంది ఇంటర్నెట్, 50 కోట్ల కంటే ఎక్కువ మంది వాట్సప్ వినియోగదారులు ఉన్నారు. సామాజిక మాధ్యమాల్లో అల్గారిథమ్‌లు సత్యానికన్నా అత్యంత వేగంగా వ్యాప్తి చేయడానికి ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రజల్లో భయాన్ని, ఆవేశాన్ని, ఆసక్తులను ఎక్కువ ప్రచారం చేస్తున్నాయి.

నేనూ బాధితుడినే

సుప్రీంకోర్టు జడ్జినైనా నేనూ సోషల్ మీడియా బాధితుడినే. సామాజిక మాధ్యమాల్లో నాపై తప్పుడు ప్రచారం చేశారు. వాటిని తొలగించడానికి ఎంతో కృషి చేయాల్సి వచ్చింది.

మంచి ఉంది.. చెడు ఉంది

ప్రజాస్వామ్యం బలోపేతానికి సామాజిక మాధ్యమాలు ఓ వైపు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పౌర పాత్రికేయం ద్వారా అవినీతి, అక్రమాలను బయటపెట్టడానికి దోహదపడుతున్నాయి. కొన్ని సామాజిక మాధ్యమాలు ప్రమాదకరమైన తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నాయి. మహిళా జర్నలిస్టుల గొంతునొక్కడానికి వేదికలవుతున్నాయి. మత మార్పిడికి కారణమవుతున్నాయి. డిజిటల్ యుగంలో ప్రజల దృష్టిని ఆకర్షించే వేగంలో సత్యం మరుగున పడుతోంది. భావి జర్నలిస్టులు వేగం కంటే.. వాస్తవాల నిర్ధారణకు వాస్తవాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

సత్యాన్నే పలుకు..

నేటి సామాజిక మాధ్యమ కాలానికి అన్వయిస్తూ మనుస్మృతిలోని ఓ శ్లోకాన్ని జస్టిస్ జేకే మహేశ్వరి గుర్తుచేశారు. 'సత్యాన్నే పలుకు. సంతోషకరమైన, ఇంపైన వాటినే మాట్లాడు. ఇతరులకు కీడు చేసేది, సంతోషకరంకానిది, అవతలి వ్యక్తి మనసుకు గాయం చేసేదైతే వాస్తవమైనా, అవాస్తవమైనా మాట్లాడొద్దు. ఇదే ఎప్పటికీ నిలిచి ఉండే ధర్మం' అని జస్టిస్ జేకే మహేశ్వరి పేర్కొన్నారు.

జ్ఞాపిక అందజేత

ఈ కార్యక్రమానికి ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్, ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు, శిక్షణ సంస్థల అభ్యర్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరికి స్వేచ్ఛ సంస్థ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. శాలువాలు కప్పి సత్కరించారు.

వాక్ స్వాతంత్ర్యం దుర్వినియోగంతో కీడు

సీనియర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. 'సామాజిక మాధ్యమాల వేదికగా రాజకీయ పార్టీలను, సంస్థలను లక్ష్యం చేసుకుంటున్నారు. విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. కొన్ని సోషల్ మీడియా సంస్థలు సమాజ హితం కోసం కాకుండా డబ్బు సంపాదన కోసం నడుస్తున్నాయి. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తే సమాజానికి చెడు జరుగుతుంది' అన్నారు.

– ఆలపాటి సురేష్‌కుమార్, సీనియర్ మీడియా అకాడమీ ఛైర్మన్

లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీకి సవాళ్లుగా మారాయి

రాజకీయ ప్రత్యర్థులు, మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకోవడానికి సామాజిక మాధ్యమాలు చాలా మందికి ఆయుధాలుగా మారాయి. వీటిని కట్టడి చేయాలి. అభ్యంతరకర పోస్టులను తొలగించాలని విదేశాల్లోని సామాజిక మాధ్యమ సంస్థలు తక్షణం స్పందించాలి. సోషల్ మీడియాలో పోస్టులు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీకి పెను సవాళ్లుగా మారాయి.

– ఆకె. రవికృష్ణ, ఐజీ(ఈగల్)

మహిళా రైతుల గొంతునొక్కేందుకు కుట్ర

అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలంటూ ఉద్యమంలో పాల్గొన్న మహిళా రైతుల గొంతునొక్కడానికి అప్పటి రాజకీయ పార్టీ సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసింది. సోషల్ మీడియా ద్వారా ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి ఎలా బయటపడాలనే విషయం చాలా మందికి తెలీదు. వీటిపై అవగాహన కలిగించాలి. సోషల్ మీడియా పోస్టుల కొన్ని సార్లు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి.

–రాయపాటి శైలజ, ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్

త్వరలో 'ఏఐ డాక్టర్' సేవలు

- రావివలస ప్రజావేదికలో సీఎం చంద్రబాబు
- పేదల ఇళ్లకు వెళ్లి, సామాజిక పింఛన్ల పంపిణీ

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, చీపురుపల్లి, చీపురుపల్లి గ్రామీణం, గరివిడి: ప్రజల ఆరోగ్య ప్రమాణాలు పెంచేందుకు అత్యాధునిక వైద్యసేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యరంగాన్ని బలోపేతం చేస్తున్నామని, ఇప్పటికే సంజీవని పేరిట డిజిటల్ హెల్త్ రికార్డుల నమోదు చేపట్టామని గుర్తుచేశారు. త్వరలో 'ఏఐ డాక్టర్' ద్వారా రోగులకు ప్రాథమిక అంశాల్లో సందేహాలు నివృత్తి చేస్తామని, అవసరమైతే చికిత్స కూడా జరిగేలా చూస్తామన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించారు. తొలుత చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రావివలస గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రజావేదిక సభలో చంద్రబాబు మాట్లాడారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..

దిగ్గజ సంస్థలు వస్తున్నాయ్..

గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ ఐటీ సంస్థలు ఉత్తరాంధ్రకు వస్తున్నాయి. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విజయనగరం జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణం త్వరలో పూర్తవుతుంది. ఉత్తరాంధ్ర తీరంలో అపారంగా ఖనిజ నిక్షేపాలున్నాయి. సంబంధిత పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు వస్తాయి. పేదరికం దూరమవుతుంది. గత ప్రభుత్వం భూ రికార్డులను మార్చేసింది. అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేసి, రెవెన్యూ రీసర్వే చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ వంటి ఫీచర్లతో పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తున్నాం.

దేవుడికి ద్రోహం చేస్తే క్షమించను

తప్పుచేసిన వారెవరైనా వదిలిపెట్టను. దేవుడికి ద్రోహం చేస్తే అస్సలు క్షమించను. గత ప్రభుత్వంలో రసాయనాలతో నెయ్యి తయారుచేసి తిరుమలలో స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారంటే.. ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో అర్థం చేసుకోవాలి. వైకాపా ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలపై చర్చించడానికి శాసనసభకు రాకుండా.. అడ్డదారుల్లో మాట్లాడుతున్నారు. వారి ఐదేళ్ల పాలనలో రౌడీయిజం పరాకాష్ఠకు చేరింది. నేడు రాష్ట్రంలో రౌడీలకు చోటులేదు. గంజాయి బ్యాచ్.. ఖబడ్దార్!

బాధితుల్లో మహిళలే ఎక్కువ..

దేశంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచితంగా వేసేలా ప్రధాని మోదీ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2012 నాటి నివేదికల ప్రకారం రాష్ట్రంలో 29 వేల మందికి పైగా క్యాన్సర్ బాధితులుండగా, 2025 నాటికి ఆ సంఖ్య 32 వేలకు మించింది. మహిళలు ఎక్కువగా దీని బారినపడుతున్నారు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా ఇస్తున్నాం. ఒక డోస్‌కు రూ.4 వేల వరకు ఖర్చవుతుంది. ప్రభుత్వం ఉచితంగానే అందిస్తోంది. ఇప్పటికే 1.72 కోట్ల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశాం. 5.07 లక్షల మందికి నోటి క్యాన్సర్ రావొచ్చని ఫలితాల్లో వెల్లడైంది. 2.58 లక్షల మందికి రొమ్ము, మరో 3.40 లక్షల మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని తేలింది. రోగులకు చికిత్స, పరిశోధనల కోసం కర్నూలులో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నాం. తాజా బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి రూ.19,300 కోట్లు కేటాయించాం. పేదలకు రూ.2.5 లక్షల ఆరోగ్య బీమా అందించాలన్నది ప్రణాళిక. బీమా కంపెనీల ద్వారా 2.5 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తాం. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రూ.25 లక్షల వరకు బీమా కల్పిస్తాం. పంటలకు పురుగు మందులు మోతాదుకు మించి వాడొద్దు. అధిక యూరియా వినియోగం క్యాన్సర్‌కు కారణమవుతోంది.





ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు ★ ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వేదికపై ఎంపీ అప్పలనాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, పింఛను లబ్ధిదారు, ఎమ్మెల్యే కళావెంకటరావు, మంత్రి వంగలపూడి అనిత, వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్

లబ్ధిదారులతో మాటామంతీ

రావివలస పంచాయతీ పైలపేటలో పింఛన్ లబ్ధిదారులైన రెండు కుటుంబాలతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. వారి యోగక్షేమాలు, కుటుంబ పరిస్థితులు, ఆదాయ మార్గాలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత వెదురు బుట్టలు అల్లుతూ జీవనోపాధి పొందుతున్న రొంగలి ఎల్లయ్య, నారాయణమ్మ దంపతుల ఇంటికి వెళ్లారు. వీరికి ఐదుగురు సంతానం కాగా, ముగ్గురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశారు. చిన్న కుమారుడు తమ యోగక్షేమాలు చూస్తున్నట్లు వారు సీఎంకు వివరించారు. తమకు సొంత స్థలం లేదని, ఇతరుల జాగాలో పాక వేసుకున్నట్లు చెప్పగా, ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యతను సీఎం.. కలెక్టర్‌కు అప్పగించారు. అనంతరం పైల రామారావు కుటుంబసభ్యులతో ముచ్చటించారు. వారు తమకున్న కొద్దిపాటి పొలంలో వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు చెప్పగా, పండ్ల తోటలు వేస్తే ఎక్కువ ఆదాయం వస్తుంది కదా అని సీఎం సూచించారు. వారికి ఉద్యాన పంటల సేద్యంలో తగిన సలహాలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు.



పైల రామారావు దంపతులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



మార్గదర్శి, బంగారు కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు

అనాథలైన అక్కాచెల్లెళ్లకు అండ

రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన మార్గదర్శి

సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి, పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పీ-4 రూపొందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు ఎంపిక చేసిన బంగారు కుటుంబం, మార్గదర్శితో సీఎం ప్రజావేదికపై ముఖాముఖిగా మాట్లాడారు. చీపురుపల్లి మండలం విజయరాంపురం గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు హారిక, అఖిల తల్లిదండ్రులు రెండున్నరేళ్ల క్రితం చనిపోయారు. తాతయ్య, నానమ్మ సంరక్షణలో వారిద్దరూ బీఎస్సీ చదువుతున్నారు. వీరికి ఉద్యోగం లభించే వరకు మార్గదర్శిగా ఉండేందుకు గరివిడి మండలం కొండదాడి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పచ్చమట్ల సాయిరాజు ముందుకొచ్చారు. ఇద్దరు బాలికల పేరిట చెరో రూ.3 లక్షలు చొప్పున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్లు ప్రకటించారు. సాయిరాజును వేదికపై సీఎం అభినందించారు. బాలికలిద్దరితో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన సీఎం



విద్యార్థినికి టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది, చిత్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, చీపురుపల్లి/గ్రామీణం: భవిష్యత్తులో క్యాన్సర్ రహిత సమాజానికి అందరం పాటుపడదామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో శనివారం ఆయన ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో ఈ ప్రక్రియ తీరును పరిశీలించారు. 14 ఏళ్ల బాలికలు ఎ.పావని, పి.కౌశల్యకీర్తి, కె.లావణ్య, పి.జోషికకు టీకాలు వేయించారు. అనంతరం వారితో మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్, డైరెక్టర్ కె.పద్మావతి, రాష్ట్ర ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌గా సాయిప్రసాద్ బాధ్యతల స్వీకరణ

జలవనరులు, రెవెన్యూ శాఖలు ఆయన వద్దే..



సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జి.సాయి ప్రసాద్. చిత్రంలో కె.విజయానంద్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సచివాలయంలోని తన కార్యాలయంలో తితిదే, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేదపండితుల ఆశీర్వచనాల మధ్య, ప్రత్యేక పూజల అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ సీఎస్‌గా సేవలందించిన విజయానంద్ శనివారం ఉదయం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో సాయిప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్ఎస్ రావత్, ఎంటీ కృష్ణబాబు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ముఖ్య కార్యదర్శులు ముఖేశ్‌కుమార్ మీనా, కాంతిలాల్ దండే తదితరులు, సచివాలయం సహా వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ సహా వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్‌లు సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మరోవైపు, జి.సాయిప్రసాద్‌ను జలవనరులు, రెవెన్యూ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల పోస్టుల్లోను (పూర్తి అదనపు బాధ్యత) కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం చెన్నిపాడు గ్రామం వద్ద పాలేరు నదిపై రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి మిగిలిన పనులకు నిధులు మంజూరయ్యాయి. వాటికి రూ.166.40 కోట్లు మంజూరు చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శనివారం పాలనామోదం ఇచ్చారు.



సన్నద్ధత మెరుగ్గా ఉంటేనే అద్భుత ఫలితాలు

మనం చదివే వైవిధ్యమైన పుస్తకాలు మన ఆలోచనలు, సంభాషణల్లోని లోతును పెంచుతాయి. మనం పాటించే కఠిన ఆరోగ్య సూత్రాలు మనలోని శక్తిని ఉత్తేజితం చేస్తాయి. సాకులు చెప్పకుండా మనం స్థిరత్వంతో చేసే పని మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. మన సన్నద్ధత ఎంత మెరుగ్గా ఉంటే, మనకొచ్చే ఫలితాలు అంత అద్భుతంగా ఉంటాయి.

– అదితి చౌధరి, లాయర్

స్త్రీశక్తి బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

ఇతర బస్సుల్లో 50 శాతం రాయితీ కొనసాగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వు జారీచేసింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా, వీటిలో దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం వర్తింపజేసింది. 40 శాతం, అంతకంటే ఎక్కువ శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని పేర్కొంది.

డిసెంబరులో సీఎం హామీ..

గత ఏడాది డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. వారికి ఇంద్రధనస్సు పేరిట ఆరు పథకాలు ప్రకటించారు. అందులో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కూడా ఒకటి. ఫిబ్రవరి 24న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఉత్తర్వు జారీచేశారు.

- ★ ప్రస్తుతం దివ్యాంగులకు మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, నాన్ స్టాప్, అంతర్‌రాష్ట్ర (ఇంటర్‌స్టేట్), సప్తగిరి ఎక్స్‌ప్రెస్ (తిరుమల ఘాట్‌లో తిరిగేవి), అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసుల్లోని టికెట్ ఛార్జీలో 50 శాతం రాయితీ ఇస్తున్నారు.
- ★ విజయవాడ, విశాఖపట్నం నగరాల్లోని సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం ఉంది.
- ★ తాజా ఉత్తర్వు నేపథ్యంలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తారు.
- ★ మిగిలిన నాన్‌స్టాప్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసుల్లో ఇప్పుడున్నట్లే 50 శాతం రాయితీ కొనసాగుతుంది.
- ★ రాష్ట్రంలో 11 లక్షల మంది దివ్యాంగులు ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు ఆర్టీసీకి వివరాలు అందజేశారు.
- ★ ప్రస్తుతం ఆర్టీసీలో 2 లక్షల మంది దివ్యాంగులు మాత్రమే పాస్ వినియోగించుకుంటున్నారు.

జనసేన కార్యాలయంలో దాడి ఘటన..

భద్రతా సిబ్బందిపై చర్యలు

మంగళగిరి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పని చేసే భద్రతా సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఐదుగురు సిబ్బందిని వారి మాతృ విభాగానికి తిరిగి పంపారు. శుక్రవారం (27వ తేదీ) ఓ వ్యక్తి కార్యాలయంలోకి ప్రవేశించి రెండు కార్లు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో కార్యాలయంలో భద్రతా లోపాలు వెలుగు చూడటంతో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు నలుగురు కానిస్టేబుళ్లను వారి మాతృ విభాగంలో రిపోర్టు చేయాలని అధికారులు ఆదేశించారు. జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడిన వ్యక్తిని శ్రీకాకుళం జిల్లా ఖాజూరుకు చెందిన నారద నీలాద్రిగా గుర్తించి, పోలీసులు కేసు నమోదు చేశారు.

★ జనసేన ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఖండించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని 'ఎక్స్' వేదికగా కోరారు. 'దాడి వెనుక దాగి ఉన్న శక్తులపై కొరడా ఝుళిపించాలి. శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ మనందరి బాధ్యత' అని మాధవ్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి కార్యాలయంలోకి విజయానంద్

- సీఎంకు ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియామకం
- రవిచంద్రకు తితిదే ఈవోగా పూర్తిస్థాయి బాధ్యతలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన కె.విజయానంద్‌ను ముఖ్యమంత్రికి ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయానంద్ శనివారమే పదవీ విరమణ చేశారు. ఆ వెంటనే ఆయన పునర్నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పూర్తి అదనపు బాధ్యత), ఏపీట్రాన్స్‌కో సీఎండీ పోస్టుల్లోను కొనసాగుతారు. సంవత్సర కాలం లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఆయన ఆ పోస్టుల్లో కొనసాగుతారని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రను తితిదే కార్యనిర్వహణాధికారిగా బదిలీ చేసింది. కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో అనిల్ కుమార్‌సింఘాల్‌ను తితిదే ఈవో పోస్టు నుంచి బదిలీ చేశాక... ముద్దాడ రవిచంద్రకు పూర్తి అదనపు బాధ్యతగా ఆ పోస్టు అప్పగించింది. ఇప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయంలో రవిచంద్ర స్థానంలో విజయానంద్‌ను నియమించడంతో, ఆయనను తితిదేకి పూర్తిస్థాయి ఈవోగా బదిలీ చేసింది.

చికెన్ మసాలా పౌడర్ ఎలా చేయాలంటే..

ఇన్‌స్టంట్



మాంసాహార వంటలకు.. అంత అమోఘమైన రుచి వచ్చేది వాటిల్లో వేసే మసాలా పొడితోనే. ఆ పౌడర్‌ను ఇంట్లోనే చేసుకుని.. హోటల్ టేస్టును ఆస్వాదిద్దామా..

చికెన్ మసాలా పౌడర్ కోసం.. ఎండుమిర్చి - 15, ధనియాలు - అర కప్పు, జీలకర్ర - 2 టేబుల్ స్పూన్లు, దాల్చినచెక్క - రెండంగుళాల ముక్క, బిర్యానీ ఆకులు - 3, స్టార్ మొగ్గలు - 2, జాజికాయ - చిన్న ముక్క, జాపత్రి - కొద్దిగా, డ్రై జింజర్, గార్లిక్ పౌడర్లు, పసుపు, సోంపు, మిరియాలు, లవంగాలు, యాలకులు - టేబుల్ స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. కడాయిని వేడిచేసి.. నూనె లేకుండా దాల్చినచెక్క, బిర్యానీ ఆకులు, స్టార్ మొగ్గలు, యాలకులు, జాజికాయ, జాపత్రి, మిరియాలు, లవంగాలు ఒక్కొక్కటిగా వేసి వేయించాలి. వాటిని తీసి.. ధనియాలు, జీలకర్ర, ఎండుమిర్చిలను కూడా వేయించాలి. అన్నీ చల్లారిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. చివరగా డ్రై జింజర్, గార్లిక్ పౌడర్లు, పసుపు చేర్చి.. కొన్ని క్షణాల పాటు గ్రైండ్ చేయాలి. ఈ పౌడర్‌ను గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. దీంతో చికెన్ వంటలకు మంచి రంగు, రుచి, ఘాటు వస్తాయి. అరకిలో చికెన్ కూరకు టేబుల్ స్పూన్ మసాలా సరిపోతుంది.

» వారెవా.. మటన్ దో ప్యాజా! «

షెఫ్ స్పెషల్



మటన్ వెరైటీల్లో 'దో ప్యాజా' ఒకటి. ఇది మరీ ఘాటుగానూ ఉండదు. అలాగని చప్పగానూ ఉండదు. మంచి రుచి, చక్కటి ఘుమాయింపుతో అందర్నీ ఆకట్టుకుంటుంది.

కావలసినవి: మటన్ - అర కిలో, ఉల్లిపాయలు - నాలుగు, పెరుగు - అర కప్పు, ఉప్పు - రుచికి తగినంత, పచ్చిమిర్చి - మూడు, టొమాటో ప్యూరీ - రెండు టేబుల్ స్పూన్లు, కశ్మీరీ కారం - స్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్, ధనియాల పొడి - 2 స్పూన్ల చొప్పున, పసుపు, జీలకర్ర పొడి, గరం మసాలా - అర స్పూన్ చొప్పున, నూనె - మూడు టేబుల్ స్పూన్లు, బిర్యానీ ఆకులు - రెండు, లవంగాలు - నాలుగు, యాలకులు - మూడు, దాల్చిన చెక్క - అంగుళం ముక్క, కొత్తిమీర తరుగు - పావు కప్పు

తయారీ: మటన్ ముక్కల్లో పెరుగు, కారం, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కలిపి.. అరగంట నానబెట్టాలి. ఉల్లిపాయలను రెండు విధాలుగా కట్ చేయాలి. అంటే.. రెండింటిని పొడుగ్గా స్లైసులుగా, మిగిలిన రెండింటిని పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి.. బిర్యానీ ఆకులు, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు వేయాలి. మంచి వాసన వస్తుండగా ఉల్లి స్లైసులు వేసి.. బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్, సగానికి చీల్చిన పచ్చిమిర్చి, టొమాటో ప్యూరీ చేర్చి.. కలియబెడుతుండాలి. అది ఉడికాక.. మ్యారినేట్ చేసిన మటన్ జోడించి మధ్యస్థమైన సెగ మీదుంచాలి. ఐదారు నిమిషాల తర్వాత.. ధనియాలు, జీలకర్ర పొడులు, ఉప్పు, తగినన్ని నీళ్లు జతచేసి.. మూత పెట్టి ఉడికించాలి. మటన్ మెత్తబడ్డాక.. పెద్ద ముక్కలుగా కట్ చేసిన ఉల్లిపాయలు వేసి రెండు మూడు నిమిషాలు మాత్రమే ఉడికించాలి. ఇవి కాస్త పచ్చిగానే ఉండాలి. అదే 'దో ప్యాజా' ప్రత్యేకత. చివర్లో గరం మసాలా, కొత్తిమీర వేసి సెగ తీసేస్తే సరిపోతుంది. ఈ టేస్టీ కర్రీ రోటీ, నాన్, కుల్చాల్లోకి ఎంతో బాగుంటుంది.

అదిరే ఆరెంజ్ క్యాండీ



అల్లం, ఉసిరితోనే కాదు.. నారింజపండ్లతోనూ క్యాండీ చేయొచ్చు. అది కూడా ఎంతో సులువైన రీతిలో..

కావలసినవి: నారింజ తొనలు, పంచదార - కప్పు చొప్పున, పంచదార పొడి - స్పూన్, నిమ్మరసం - టేబుల్ స్పూన్, సన్నగా తరిగిన ఆరెంజ్ ఫుడ్ కలర్ - కొద్దిగా, నెయ్యి - అర స్పూన్

తయారీ: నారింజ తొనల్లో గింజలు తీసేయాలి. వాటిల్లో కొన్ని వేడి నీళ్లు పోసి.. రెండు మూడు నిమిషాలు మరిగించి, ఆ నీటిని వడకట్టాలి. తొనలు చల్లారాక గ్రైండ్ చేయాలి. పంచదారలో కప్పు నీళ్లు పోసి తీగపాకం వచ్చే వరకూ వేడిచేయాలి. అందులో నారింజ గుజ్జు, ఫుడ్ కలర్ వేసి కలియబెడుతూ సన్న సెగ మీద ఉడికించాలి. పావు గంట తర్వాత సెగ తీసేసి.. నిమ్మరసం జోడించాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన ప్లేట్‌లో సమంగా సర్దాలి. చల్లారిన తర్వాత నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కోసుకోవాలి. వాటి మీద పంచదార పొడి చల్లితే క్యాండీలు ఒకదానికొకటి అంటుకోవు. పూర్తిగా చల్లారాక గాలి చొరబడని సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. మరింత తీపి కావాలంటే పంచదార ఇంకొంచెం ఎక్కువ వేసుకోవచ్చు.

మష్రూమ్.. మ్..!



మాంసాహారం తినని వాళ్లకి పుట్టగొడుగులు మంచి పోషకాహారం. వీటితో వెరైటీ కూరలు చేయొచ్చు. పకోడీ, టిక్కా, టోస్ట్, చాక్లెట్ వంటి తినుబండారాలూ చేయొచ్చు. మీ కోసం మరింత ప్రత్యేకమైన మష్రూమ్ రెసిపీలు..

మష్రూమ్ పెప్పర్ ఫ్రై



కావలసినవి: పుట్టగొడుగులు - 300 గ్రా, ఉల్లి కాడల తరుగు, కొత్తిమీర- గుప్పెడు చొప్పున, ఉప్పు - రుచికి తగినంత, అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి ముద్ద - స్పూన్ చొప్పున, కరివేపాకు - 2 రెబ్బలు, మిరియాలు - ఒకటిన్నర స్పూన్లు, గరం మసాలా, కారం, పసుపు, ఆవాలు, జీలకర్ర - అర స్పూన్ చొప్పున, నిమ్మరసం - ముప్పావు స్పూన్, నూనె - రెండున్నర టేబుల్ స్పూన్లు

తయారీ: మష్రూమ్స్‌ను కడిగి సగానికి కట్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పచ్చిమిర్చి, ఉల్లికాడల తరుగు వేయాలి. అవి కాస్త వేగాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్, మష్రూమ్స్, పసుపు, ఉప్పు జతచేసి కలియబెడుతుండాలి. ముక్కలు మెత్తగా అయ్యాక.. కారం, కచ్చాపచ్చా దంచిన మిరియాలు జోడించాలి. చివర్లో నిమ్మరసం, కొత్తిమీర చల్లి సెగ తీసేస్తే.. స్పైసీ మష్రూమ్ పెప్పర్ ఫ్రై రెడీ. ఇది అన్నం, రొట్టెల్లోకి సైడ్ డిష్‌గానే కాదు.. టీ టైమ్ స్నాక్‌గానూ బాగుంటుంది.

మష్రూమ్ బాల్స్



కావలసినవి: మష్రూమ్స్ - 200 గ్రాములు, బంగాళదుంపలు - 2, చీజ్ - అర కప్పు, ఉల్లి తరుగు - పావు కప్పు, ఉప్పు - రుచికి తగినంత, జీడిపప్పుల పొడి - 2 స్పూన్లు, మిరియాల పొడి, కారం, గరం మసాలా, సోంపు - అర స్పూన్ చొప్పున, కచ్చాపచ్చాగా దంచిన పచ్చిమిర్చి - ముప్పావు స్పూన్, అల్లం పేస్ట్ - ఒకటిన్నర స్పూన్లు, కొత్తిమీర - గుప్పెడు, బ్రెడ్ పౌడర్ - అర కప్పు, మైదా - 3 టేబుల్ స్పూన్లు, నూనె - వేయించడానికి సరిపడ

తయారీ: రెండు స్పూన్ల నూనెలో ఉల్లి తరుగును దోరగా వేయించాలి. అందులో అల్లం పేస్టు, దంచిన పచ్చిమిర్చి, పుట్టగొడుగులు, సోంపు జతచేయాలి. అవి వేగాక.. మిరియాలు, జీడిపప్పుల పొడులు, కారం, గరం మసాలా, కొత్తిమీర, ఉప్పు జోడించి అర నిమిషం కలియబెట్టి దించేయాలి. అందులో ఉడికించి పొట్టు తీసిన బంగాళదుంపల ముద్ద జతచేసి కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న రొట్టెలు చేసి.. మధ్యలో తగినంత చీజ్ ఉంచి.. అంచులు మూసేయాలి. మైదాలో కొన్ని నీళ్లు పోసి పిండి కలపాలి. మష్రూమ్ బాల్స్‌ను మొదట మైదాలో ముంచి, తర్వాత బ్రెడ్ పౌడర్‌లో దొర్లించి కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. చిల్లీ లేదా టొమాటో సాస్‌తో తింటే.. బయట కరకరలాడుతూ లోపల కరిగిన చీజ్ తగులుతూ టేస్టీగా ఉంటాయి.

కట్లెట్

కావలసినవి: పుట్టగొడుగులు - పావు కిలో, బంగాళ దుంపలు - 3, ఉల్లి తరుగు - పావు కప్పు, ఉప్పు - రుచికి తగినంత, బ్రెడ్ పొడి - ముప్పావు కప్పు, పచ్చిమిర్చి - 2, కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర - స్పూన్ చొప్పున, కరివేపాకు - 2 రెబ్బలు, మొక్కజొన్నపిండి, కొత్తిమీర - మూడు టేబుల్ స్పూన్ల చొప్పున, ధనియాల పొడి, గరం మసాలా - అర స్పూన్ చొప్పున, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: బంగాళదుంపలను ఉడికించి పొట్టు తీసి మెదపాలి. ప్యాన్‌లో కొద్దిగా నూనె వేడిచేసి ఉల్లితరుగును వేయించాలి. అందులో పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాలి. పచ్చి వాసన పోయాక.. తరిగిన పుట్టగొడుగులు జతచేయాలి. అవి వేగాక.. జీలకర్ర, కారం, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు జోడించాలి. చివర్లో కొత్తిమీర చేర్చి సెగ తీసేయాలి. చల్లారాక.. మెదిపిన బంగాళదుంపల ముద్ద వేసి కలపాలి. ఈ మిశ్రమంతో గుండ్రంగా లేదా కోడిగుడ్డు ఆకారంలో కట్లెట్లు చేయాలి. మరో పాత్రలో కొన్ని నీళ్లతో మొక్కజొన్నపిండి కలపాలి. ఇది మరీ గట్టిగా లేదా జారుగా ఉండకూడదు. కట్లెట్లను ఇందులో ముంచి తీసి, బ్రెడ్ పొడిలో దొర్లించి.. కాగుతున్న నూనెలో వేయించాలి. టొమాటో సాస్ లేదా పుదీనా చట్నీతో సర్వ్ చేస్తే వహ్వా అనేస్తారు.



మష్రూమ్ 65



కావలసినవి: పుట్టగొడుగులు - 300 గ్రాములు, ఉప్పు - రుచికి తగినంత, కారం, నిమ్మరసం, అల్లం వెల్లుల్లి పేస్ట్ - స్పూన్ చొప్పున, పచ్చిమిర్చి ముద్ద, గరం మసాలా, మిరియాలు, ధనియాల పొడులు, పసుపు - అర స్పూన్ చొప్పున, జీలకర్ర పొడి - ముప్పావు స్పూన్, మొక్కజొన్నపిండి - 3 టేబుల్ స్పూన్లు, బియ్యప్పిండి, మైదా - టేబుల్ స్పూన్ చొప్పున, కరివేపాకు - 4 రెబ్బలు, నూనె - వేయించేందుకు సరిపడా

తయారీ: కడిగిన మష్రూమ్స్‌ను వస్త్రం మీద పరిచి, తడి లేకుండా చేయాలి. వాటిని వెడల్పాటి పాత్రలోకి తీసి.. పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, మిరియాలు, ధనియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా, పసుపు, ఉప్పు, నిమ్మరసం వేసి కలిపి.. కొంతసేపు నాననివ్వాలి. మరో పాత్రలో మొక్కజొన్నపిండి, కొన్ని నీళ్లు, బియ్యప్పిండి, మైదా వేసి.. పిండి కలపాలి. ఇది జారుగా ఉండకూడదు. ఇందులో మసాలా దట్టించిన మష్రూమ్స్ వేసి కలియబెట్టి.. కొన్ని కొన్ని చొప్పున కాగుతున్న నూనెలో వేయించాలి. బంగారు రంగులోకి మారాక.. టిష్యూ పేపర్ మీదికి తీస్తే.. అదనపు నూనెను పీల్చేసుకుంటుంది. అన్నీ అయ్యాక కరివేపాకు వేయించి పైన చల్లాలి. పుదీనా చట్నీతో వడ్డిస్తే.. మష్రూమ్ 65 రుచి అద్దిరిపోతుంది.

బిర్యానీ



కావలసినవి: బాస్మతి బియ్యం - 2 కప్పులు, పుట్టగొడుగులు - అర కిలో, ఉప్పు - రుచికి తగినంత, టొమాటో, ఉల్లిపాయ ముక్కలు - అర కప్పు చొప్పున, పచ్చిమిర్చి - 4, జీడిపప్పులు - 20, అల్లం వెల్లుల్లి పేస్ట్ - టేబుల్ స్పూన్, పెరుగు - అర కప్పు, పుదీనా, కొత్తిమీర తరుగు, గరం మసాలా - పావు కప్పు చొప్పున, నిమ్మరసం - ఒకటిన్నర స్పూన్లు, కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర - స్పూన్ చొప్పున, దాల్చినచెక్క - రెండంగుళాల ముక్క, బిర్యానీ ఆకులు - 2, బిర్యానీ పువ్వు - కొద్దిగా, లవంగాలు - 5, యాలకులు - 3, నూనె, నెయ్యి - 2 టేబుల్ స్పూన్ల చొప్పున

తయారీ: బియ్యం కడిగి అరగంట నానబెట్టాలి. కుక్కర్‌లో నూనె వేడిచేసి బిర్యానీ ఆకులు, దాల్చినచెక్క, యాలకులు, లవంగాలు, బిర్యానీ పువ్వు, జీలకర్రలను వేయించాలి. మంచి వాసన వస్తుండగా.. ఉల్లితరుగు వేసి బంగారురంగులోకి మారే వరకూ వేయించాలి. తర్వాత జీడిపప్పులు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పుదీనా, పచ్చిమిర్చి, టొమాటో ముక్కలు, సగానికి కట్ చేసిన పుట్టగొడుగులు, కారం, పసుపు, ధనియాల పొడి జోడించాలి. అవి మెత్తగా అయ్యాక పెరుగు, ఉప్పు వేసి కలపాలి. ఇప్పుడు నానబెట్టిన బియ్యం, తగినన్ని నీళ్లు, నెయ్యి, గరం మసాలా జతచేసి రెండు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. మూత తీశాక.. కొత్తిమీర తరుగు, నిమ్మరసం చల్లాలి. నోరూరించే మష్రూమ్ బిర్యానీకి కీరా రైతా సూపర్ కాంబినేషన్.



బ్యాచిలర్స్ కిచెన్

విసిరేయడానికా వండింది?



నేను హాస్టల్లో ఉండి డిగ్రీ చదువుకుంటున్నాను. ఆ పుడ్డుతో విసిగిపోయి ఫ్రెండ్స్‌తో కలిసి అద్దెకు ఇల్లు తీసుకోవాలనుకున్నాను. చాలా వెతికాక.. 'టులెట్' కనిపించింది. కానీ పక్కనే తాటికాయంత అక్షరాలతో 'వెజిటేరియన్లకి మాత్రమే' అనుంది. మాకు నచ్చనిదే శాకాహారం. సర్లే 'సీక్రెట్ ఆపరేషన్' చేయొచ్చన్న ధీమాతో లోనికి వెళ్లాం. ఇంటాయన మమ్మల్ని తల నుంచి పాదం వరకూ స్కాన్ చేసి- 'బోర్డు చదివారా?' అనడిగారు. మూకుమ్మడిగా తలలూపాం. 'ఆమ్లెట్ కూడా వేయకూడదు!' అని ఎగ్జామ్ హాల్లో ఇన్విజిలేటర్లా మా ముఖాల్ని పరిశీలిస్తున్నారాయన. అంతలో హోమ్‌మినిస్టర్ ఎంట్రీ ఇచ్చి 'నాన్‌వెజ్ కాదుగా?' అంది. మళ్లీ తలూపాం. మర్నాడే మేడ మీద గదిలో చేరిపోయాం. వారంరోజులు ఆకులూ అలాలతో సరిపెట్టుకున్నాం. మా నాలుకలు భయంకరంగా ప్రొటెస్ట్ చేస్తున్నాయి. 'ఇక లాభంలేదు.. సీక్రెట్‌గా చింతచిగురు-ఎండుచేపలు చేద్దాం' అంది తేజస్వి. 'వామ్మో.. దొరికిపోతాం' అన్నాను. మరేం పర్లేదు- అనేశారంతా. కాసేపట్లో అవసరమైనవన్నీ కొని తెచ్చాం. వారం నుంచీ వెజ్‌తో విసిగిపోయి ఉత్సాహంగా రంగంలోకి దిగాం. తలుపులూ కిటికీలూ మూసేశాం. రెండో మూడో కాదు.. అర ప్యాకెట్ అగరొత్తులు వెలిగించాం. కర్రీ చేస్తున్నట్టు లేదు, భయంకరమైన క్రైమ్ ప్లాన్ చేస్తున్నట్టుంది. ఇంత చేసినా.. ఎండుచేపల వాసన వైఫై సిగ్నల్లా గోడలు దాటేసినట్టుంది. 'ఏంటమ్మాయిలూ?!' కింది నుంచి ఓనరాంటీ అరుపు మేడ మీదికి ఎగిరొచ్చింది. ఆమె ముక్కు పోలీస్ డాగ్ కంటే షార్ప్ కాబోలు. 'నాన్‌వెజ్ వండకూడదని చెప్పానుగా' అని ఆవిడ గయ్యిమంటే.. తలుపు తీసి- 'వండలేదు ఆంటీ! ఒక ఫ్రెండ్ తెచ్చిచ్చింది' నసిగింది సన. 'ముందా కూర బయటకు విసిరికొట్టండి' ఆర్డర్ జారీచేసిందావిడ. 'ఇన్ని తంటాలుపడి వండింది విసిరేయడానికా?' అనుకుని.. 'ఎమర్జెన్సీ రీలోకేషన్' ఇచ్చినట్టు కూరను ఇంకో చోటుకు షిఫ్ట్ చేసేశా. ఆవిడెలానూ గిన్నెలోకి తొంగిచూడదు కాబట్టి.. ఉల్లిపాయ తొక్కలు పడేసి వచ్చాం. ఆంటీ గట్టిగా వార్నింగిచ్చేసి వెళ్లిపోయింది. ఓ గంట ఇన్‌స్టాతో కాలక్షేపం చేసి.. వాళ్లు పడుకున్నాక ఎంచక్కా ఎండుచేపల కూరను ఎంజాయ్ చేశాం. ఆ తర్వాత చికెనూ, మటనే తప్ప మమ్మల్ని ఎండగట్టే ఎండుచేపల జోలికి పోలేదు.



- నార్లకంటి రాజశ్రీ, వేములపల్లి, మిర్యాలగూడ

చిత్రంగా..

రంగుల విందు

దేశమంతా రంగులు చిందించే పండుగ హోలీ. వయసుతో సంబంధం లేకుండా చిన్నా పెద్దా అందరూ ఆడిపాడే ఆనందాల కేళి. ఆ ఉత్సాహాన్ని పదార్థాలకూ రంగరించి రంగులమయం చేశారు. నోటికే కాదు.. కంటికీ విందు చేసేలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తోంటే భలే ఉంది కదూ!



మిక్స్‌డ్ ఫ్రూట్ కాన్సన్‌ట్రేట్ ఇలా!



ఒక్కో వారం ఒక్కో రకమైన పండ్లరసం తయారుచేసుకుంటున్నాం కదా.. ఈ క్రమంలో వివిధ పండ్లతో 'మిక్స్‌డ్ ఫ్రూట్ కాన్సన్‌ట్రేట్' తయారీ చూడండి..

మిక్స్‌డ్ ఫ్రూట్ కాన్సన్‌ట్రేట్ కోసం... యాపిల్ పండ్లు - 2, నారింజ పండు - ఒకటి, అనాసపండు - సగం ముక్క, సీడ్‌లెస్ ద్రాక్ష - అర కప్పు, దానిమ్మ గింజలు - ముప్పావు కప్పు, నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు, పంచదార - మూడు కప్పులు తీసుకోవాలి. ఎలా చేయాలంటే... పండ్లను కడిగి చెక్కు, విత్తనాలు తొలగించి ముక్కలుగా కోసుకోవాలి. వాటికి దానిమ్మ గింజలు జోడించి.. రెండు మూడు విడతలుగా జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పండ్ల గుజ్జును అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలోకి తీసి సన్న సెగ మీద వేడిచేయాలి. అందులో కప్పు నీళ్లు, పంచదార జోడించి ఉడికించాలి. ఈ మిశ్రమాన్ని కలియబెడుతూనే ఉండాలి. లేకుంటే అడుగంటుతుంది. పండ్లు చక్కగా ఉడికి, మిశ్రమం కాస్త చిక్కగా అవడానికి సుమారుగా పావుగంట పడుతుంది. ఇప్పుడు సెగ తీసేసి.. నిమ్మరసం జతచేసి కలపాలి. అంతే.. చిక్కటి పానీయం తయారైపోతుంది. పూర్తిగా చల్లారిన తర్వాత శుభ్రమైన పొడి సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు.. గ్లాస్ నీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల మిక్స్‌డ్ ఫ్రూట్ కాన్సన్‌ట్రేట్ కలిపితే సరిపోతుంది. పండ్లు బాగా పండిన వాటిని ఎంచుకుంటే.. రుచి, వాసన బాగుంటుంది. అనాస ఎక్కువైతే పులుపు వస్తుంది కాబట్టి తగిన మోతాదు లోనే వేయాలి.

ఆహారం ఆరోగ్యం

హిమోగ్లోబిన్ తగ్గకూడదంటే...

రక్తంలో తగినంత హిమోగ్లోబిన్ ఉండటం చాలా అవసరం. అందుకోసం మంచి పోషకాహారం తీసుకోవాలి. తగినన్ని నీళ్లు తాగాలి. నడక, వ్యాయామాలను నిర్లక్ష్యం చేయకూడదు.

జీర్ణ సమస్యలు, పోషకాహారం తీసుకోకపోవం, విటమిన్ బీ12, ఐరన్ లోపించడం, రక్తస్రావం వంటివి హిమోగ్లోబిన్ తగ్గడానికి కారణాలు. ఉదయం లేవగానే నిమ్మరసం కలిపిన గోరువెచ్చని నీరు తాగాలి. తేలికపాటి అల్పాహారం, రాగి లేదా ఓట్స్ జావ, ఏదైనా ఒక పండు, రెండు ఖర్జూరాలు తీసుకోవాలి. మధ్యాహ్నం అన్నం లేదా జొన్నరొట్టె పప్పు, ఆకుకూరలు, బీట్‌రూట్ వంటి కూర, మజ్జిగ, సలాడ్‌తో భోజనం చేయాలి. సాయంత్రం నానబెట్టిన పల్లీలు లేదా ఉడికించిన శనగలు, స్ప్రౌట్స్ ఛాట్ వంటివి కొద్ది మోతాదులో తీసుకోవాలి. చపాతీ లేదా పుల్కాలు, కూర, చారు, పెరుగుతో రాత్రి భోజనం చేసి, కొంతసేపు వాకింగ్ చేయాలి.



హిమోగ్లోబిన్ తక్కువైతే..

త్వరగా అలసిపోతారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురవుతుంది. చర్మం పాలిపోయినట్లు తెల్లగా అవుతుంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది. రోగనిరోధక శక్తి తగ్గుతుంది. తల తిరగటం, జుట్టు రాలడం, ఏకాగ్రత తగ్గడం లాంటి సమస్యలెన్నో వస్తాయి.


హిమోగ్లోబిన్ పెరగాలంటే..

పాలకూర, మెంతికూర, బీట్‌రూట్, ఖర్జూరం, దానిమ్మ, ఎండుద్రాక్ష, రాగులు, జొన్నలు, శనగ, కందిపప్పులు, నువ్వులు, బెల్లం వంటివి తింటే హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. పిల్లలకు చాక్లెట్లు జంక్‌ఫుడ్ ఇచ్చే బదులు వీటితో రుచికరమైన వంటకాలు అంటే డ్రైఫ్రూట్స్ లడ్డు, పాలకూర పరోటా, నువ్వుండలు, జొన్న కిచిడీ వంటివి అందిస్తే ఇష్టంగా తింటారు. డ్రై ఫ్రూట్స్ పొడిని పాలలో కలిపి ఇవ్వవచ్చు. ఆహారంతో పాటు వ్యాయామం కూడా అవసరం. పండ్లు, కూరగాయలు తాజావి తీసుకోవాలి. చిన్న పనికే అలసిపోవడం వంటి ఇబ్బందులు ఎదురైతే.. వెంటనే రక్తపరీక్ష చేయించుకోవాలి. హిమోగ్లోబిన్ తక్కువైతే నిర్లక్ష్యం కూడదు. డాక్టర్ సూచనతోనే ఆహారం, మందులు తీసుకోవాలి.

పాఠక వంట

నోరూరించే చీజీ బ్రోకలీ బైట్స్

బ్రోకలీ.. బోన్సాయ్ చెట్టులా భలే ఉంటుంది కదూ.. ఖరీదు కొంచెం ఎక్కువే అయినా ఆరోగ్యానికెంతో మంచిది. దీంతో కూర, ఫ్రైడ్ రైస్ ఏది చేసినా సూపరే. మరి 'చీజీ బ్రోకలీ బైట్స్' ఎప్పుడైనా తిన్నారా? ఇలా చేసి చూడండి..



కావలసినవి: బ్రోకలీ - ఒకటి, చీజ్ - 100 గ్రాములు, ఒరెగానో - తగినంత, చిల్లీ ఫ్లేక్స్ - ఒకటిన్నర స్పూన్లు, మిరియాల పొడి - అర స్పూన్, వెన్న - 2 స్పూన్లు

తయారీ: చీజ్‌ను తురిమి పక్కనుంచాలి. శుభ్రం చేసిన బ్రోకలీని చిన్న పువ్వులుగా కట్ చేసి.. సన్న సెగ మీద ఉడికించాలి. పది నిమిషాల తర్వాత దించేసి అదనంగా ఉన్న నీటిని వడకట్టాలి. బేకింగ్ పేపర్ మీద కొంత చీజ్ పరిచినట్లు వేసి.. బ్రోకలీ పూలను ఉంచాలి. వాటిపై ఇంకాస్త చీజ్ వేసి.. గిన్నెతో అదిమినట్లు చేయాలి. అప్పుడు బ్రోకలీకి చీజ్ అంటుకుంటుంది. ఇప్పుడు ఒరెగానో, చిల్లీఫ్లేక్స్, మిరియాల పొడి చల్లాలి. చీజ్‌లో సాల్ట్ ఉంటుంది కాబట్టి అదనంగా ఉప్పు వేయాల్సిన అవసరం లేదు. వీటిని 200 డిగ్రీల వద్ద ప్రీహీట్ చేసిన అవెన్‌లో ఆరు నిమిషాలు బేక్ చేయాలి. స్టవ్వు మీద చేసేట్లయితే.. వెన్న రాసిన ప్యాన్‌లో బ్రోకలీ పూలను సన్న సెగ మీదుంచి, ఐదు నిమిషాల తర్వాత దించేస్తే సరిపోతుంది. ఈ 'చీజీ బ్రోకలీ బైట్స్' పిల్లలకు నచ్చడమే కాదు, వాళ్లకి మంచి పోషకాహారం అందించినట్లవుతుంది.



- సి. సౌమీ, హైదరాబాద్



తెలుగు మహాసభలకు హాజరైన కవులు, విద్యార్థులు, జనం



తెలుగు మహాసభల వేదికపై కుడి నుంచి ఎడమకు.. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తనికెళ్ల భరణి, చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావు, అయ్యన్నపాత్రుడు, హరిబాబు, చైతన్యరాజు, ఎమ్మెల్యేలు బుచ్చిబాబు, ఆనందరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద

ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలి

- ఒడిశా గవర్నర్ హరిబాబు
- ఘనంగా ప్రారంభమైన మూడో ప్రపంచ తెలుగు మహాసభలు

అమలాపురం కలెక్టరేట్, గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమిక విద్య మాతృభాషలో కొనసాగితేనే ఫలితం ఉంటుందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. భూమి మీద మానవాళి ఉన్నంత కాలం తెలుగు భాష ఉంటుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కిమ్స్ ప్రాంగణంలో నందమూరి తారకరామారావు పేరుతో ఏర్పాటు చేసిన సభా వేదికపై తెలుగు అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలను పలువురు ప్రముఖులు వివరించారు. డిగ్రీ వరకు తెలుగు బోధన తప్పనిసరి చేయాలని, తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసం చేసిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, కిమ్స్ ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) తీర్మానాలు ప్రవేశ పెట్టారు.

ఎంతో మంది కృషి ఫలితం

– కంభంపాటి హరిబాబు, ఒడిశా గవర్నర్



తెలుగు భాష అభ్యున్నతికి ఎంతో మంది కవులు, సినీ గేయ రచయితలు ఎనలేని కృషి చేస్తున్నారు. వారందరి ప్రోత్సాహంతో నేడు తెలుగు మహోన్నతంగా వెలుగొందుతోంది. మనం రోజువారీ వాడుక భాషలో ఆంగ్ల పదాలను తగ్గించి తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి. సంప్రదాయాలు, ఆచారాలు తు.చ. తప్పకుండా పాటిస్తూ భావి తరాలకు వారసత్వంగా అందిస్తే తెలుగు మరింతగా విరాజిల్లుతుంది.

ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరి

– చింతకాయల అయ్యన్న పాత్రుడు, శాసనసభ స్పీకర్



రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఇంటర్మీడియట్ వరకు తెలుగు బోధన కచ్చితంగా ఉండాలి. ఈ అంశంపై అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదం తీసుకుంటాం. ఇతర దేశాల్లో తెలుగు మాట్లాడుతున్నా.. ఇక్కడివారు మాత్రం చిన్నతనంగా భావిస్తున్నారు. పిల్లలు మనస్ఫూర్తిగా అమ్మా, నాన్న అని పిలవడం దాదాపు మరిచిపోయారు. ప్రస్తుతం అసెంబ్లీలో అందరూ తెలుగులోనే మాట్లాడాలనే నిబంధన విధించాం.

ఇంటి నుంచే ప్రారంభం కావాలి

– తనికెళ్ల భరణి, సినీ రచయిత, నటుడు



తెలుగు సంస్కరణ, ఆదరణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి. మమ్మీ అని పిలవనందుకు చిన్నారులకు వాతలు పెట్టిన తల్లులు ఉన్న ప్రస్తుత కాలంలో తెలుగు ఎలా మనుగడ సాగిస్తుంది. నేను 50 ఏళ్లుగా తెలుగులోనే సంతకం చేస్తున్నా.

గత ప్రభుత్వ చారిత్రక తప్పిదం

– తులసిరెడ్డి, 20 సూత్రాల అమలు కమిటీ మాజీ ఛైర్మన్



రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టి వైకాపా ప్రభుత్వం చారిత్రక తప్పిదం చేసింది. అప్పటి జీవో 85ను తక్షణం రద్దు చేయాలి. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాల్లో 2శాతం ప్రత్యేక కోటా ప్రకటించాలి. మాతృభాష పునాదులపై ఏర్పడిన అంతస్తులు ఇతర భాషలు.

తెలుగుకు శత్రువులం మనమే

– యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



సభా వేదికలపై ప్రసంగాలే తప్ప క్షేత్ర స్థాయిలో ఆచరణ కనిపించడం లేదు. నేటి కాలంలో తెలుగు భాషకు ప్రధాన శత్రువులు తల్లిదండ్రులు, తాత ముత్తాతలే. ఆంగ్లం చదవాలి, ఇతర దేశాలకు వెళ్లి మంచి ఉద్యోగాల్లో ఉండాలనే కోరికతోనే నేడు ఈ పరిస్థితి తలెత్తింది. ఇంటి నుంచే మార్పు రావాలి.

రాష్ట్రం పేరును తెలుగునాడుగా మార్చాలి

– గరికపాటి నరసింహారావు



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు పూర్తిగా ఆంగ్ల భాషను రద్దు చేయాలి. బోధనంతా తెలుగులోనే సాగాలి. ఈ మేరకు చట్టం చేయాలి. రాష్ట్రం పేరును తెలుగునాడుగా మార్చాలి. కేరళ రాష్ట్ర ప్రజలు తమ భాషపై ఉన్న మక్కువతో ఇటీవల కేరళంగా మార్చుకున్నారు.

తెలుగుకు విశేష లక్షణం ఉంది

– చాగంటి కోటేశ్వరరావు



ప్రపంచంలో ఏ భాషకూ లేని విశేష లక్షణం ఒక్క తెలుగుకు మాత్రమే ఉంది. కొన్ని భాషల్లోని పదాల్లో అక్షరాలు ఉన్నా వాటిని పలకకుండానే పదం పూర్తవుతుంది. ఆంగ్లంలో ఉచ్చారణకు, అర్థానికి, భావానికి పోలిక ఉండదు. తెలుగులో మాత్రం ఏది పలుకుతామో అదే అర్థం వస్తుంది.

కొత్త పదాల సృష్టి జరగాలి

– రామ్ మాధవ్, భాజపా నాయకుడు



తెలుగు భాష పరిఢవిల్లాలంటే కొత్త పదాల సృష్టి జరగాలి. 3వేల ఏళ్ల ఘన చరిత్ర ఉన్న భాష తెలుగు. ఎంతో మంది మహానుభావులు ఈ భాష అభ్యున్నతికి పాటుపడ్డారు. తెలుగులో పూర్తి అర్థాలతో నిఘంటువు రూపుదిద్దుకుని 50 ఏళ్లు కావస్తోంది. భాషావేత్తలు, పండితులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భాషపై సమయం వెచ్చించి సంస్కరణలు చేపట్టక పోతే మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది.



శ్రీవారి పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి. తిలకిస్తున్న భక్తులు

తెప్పపై శ్రీమలయప్పస్వామి వైభవం



తెప్పపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో మూడో రోజు శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి తెప్పపై విహరించారు. ముందుగా సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ మాడవీధుల మీదుగా పుష్కరిణి వద్దకు చేరుకోగా.. స్వామి, అమ్మవార్లు మూడుసార్లు తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. జీయంగార్లు, తితిదే ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ, తితిదే బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, సుచిత్ర ఎల్ల, తితిదే అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు శ్రీవారి ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: ఈ నెల 3న చంద్రగ్రహణం కారణంగా 2, 3వ తేదీలకు సంబంధించిన శ్రీవారి స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లను రద్దు చేసినట్లు తితిదే శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. అంటే 3కి ముందు 1, 2వ తేదీల్లో తిరుపతిలో టోకెన్లు జారీ చేయరు. తిరిగి 4వ తేదీ దర్శనానికి సంబంధించిన టోకెన్లను 3న జారీ చేస్తారు. 3న వీఐపీ బ్రేక్ దర్శనాలు కూడా రద్దు చేయడంతో 2న ఆ సిఫార్సు లేఖలు స్వీకరించరు.

సునీల్‌కుమార్ వర్సెస్ రఘురామకృష్ణరాజు

వ్యంగ్యాస్త్రాలు, వాగ్బాణాలతో మాటల యుద్ధం

ఈనాడు, అమరావతి: ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ సామాజిక, ప్రసార మాధ్యమాల వేదికగా వాగ్బాణాలు, వ్యంగ్యాస్త్రాలు సంధించుకుంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యేల క్రీడాపోటీల్లో రఘురామ క్రికెట్ ఆడుతూ కిందపడడంతో ఆయన చేతి మణికట్టుకు గాయమైంది. దానిపై సునీల్‌కుమార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 'కస్టోడియల్ టార్చర్ కథ అబద్ధం.. ఆటలో పడిపోతేనే రెండు ఎముకలు విరిగే వ్యక్తిని నిజంగా కొట్టి ఉంటే? ఎన్ని ఎముకలు విరిగేవి అధ్యక్షా' అంటూ వ్యంగ్యంగా ప్రకటన చేశారు. దీనిపై రఘురామ ఘాటుగా స్పందించారు..'సర్వీస్ కాల సస్పెన్షన్‌లో ఉన్న సునీల్‌కుమార్ ఒప్పుకొంటే అరగంట చాలు.. కస్టడీలో నన్ను కొట్టినట్లుగా ఎముకలు విరక్కుండా కాళ్లు కట్టేసి పాదాలపై కర్ర, రబ్బర్ బెల్ట్‌తో రక్తపు చారల మచ్చలు పడేలా కొట్టగలను.. సునీల్‌కుమార్ వచ్చి, కొట్టించుకుని, నిరూపించుకుంటాను అంటే బహిరంగంగానే ఈ కార్యక్రమం పెడతా' అంటూ శనివారం ఒక ప్రకటనలో సవాల్ చేశారు. 'న్యాయవ్యవస్థపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. నాపై కస్టోడియల్ హింసకు పాల్పడిన సునీల్‌కుమార్ అరెస్ట్ తథ్యం' అని ఆయన హెచ్చరించారు. ఆ వెంటనే.. ఈ ప్రకటనతో ఆర్ఆర్ఆర్ సెల్ఫ్‌గోల్ అంటూ సునీల్ కుమార్ ఒక వీడియో సందేశాన్ని ఫేస్‌బుక్‌లో పెట్టారు. 'ఏ కేసులో ఎవరేమవుతారని చెప్పేందుకు మీరెవరు? మీ ఈగోని సంతృప్తి పరిచేందుకే దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయి' అని ఆరోపించారు.

శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, బోర్డు సభ్యులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. స్థానిక అన్నమయ్య భవనంలో శనివారం తితిదే ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. ధర్మప్రచారంలో భాగంగా తితిదే ఏటా ఉగాది నాటికి పంచాంగాలను ముద్రించి భక్తులకు అందిస్తోందన్నారు. పంచాంగం ధర రూ.75గా నిర్ణయించామని.. తిరుమల, తిరుపతిల్లో ఆదివారం నుంచి భక్తులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మిగతా తితిదే సమాచార కేంద్రాల్లో వచ్చేవారం నుంచి అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల బుక్‌లెట్..

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్రతో కలిసి ఆవిష్కరించారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఏప్రిల్ 1న రాష్ట్ర పండుగగా శ్రీసీతారాముల కల్యాణాన్ని తితిదే వైభవంగా నిర్వహించనుందని చెప్పారు. సమావేశంలో తితిదే బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు వీరబ్రహ్మం, డాక్టర్ ఎ.శరత్, సీవీఎస్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జంగా కృష్ణమూర్తి రాజీనామా తిరస్కరణ

తితిదే ధర్మకర్తల మండలి బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి పంపిన రాజీనామా లేఖను ధర్మకర్తల మండలి సమావేశంలో ఛైర్మన్ బీఆర్ నాయుడు తిరస్కరించారు. తిరుమల బాలాజీనగర్‌లో అతిథిగృహం నిర్మాణానికి స్థలం కేటాయింపు విషయంలో తనపై వచ్చిన ఆరోపణలకు మనస్తాపం చెందిన కృష్ణమూర్తి జనవరిలో తితిదే బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

రూ.5,456 కోట్లతో తితిదే వార్షిక బడ్జెట్

- హుండీ ఆదాయం రూ.1,880 కోట్ల అంచనా

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయ నిర్వహణ, భక్తుల సౌకర్యార్థం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తితిదే రూ.5,456.26 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించింది. స్థానిక అన్నమయ్య భవనంలో శనివారం తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడి అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. వచ్చే ఏడాది హుండీ ద్వారా రూ.1,880 కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనా వేశారు. వివిధ బ్యాంకుల్లో భక్తులు సమర్పించిన నగదు, బంగారం డిపాజిట్లపై వడ్డీ ద్వారా రూ.1,205 కోట్లు లభిస్తుందని పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.650 కోట్ల ఆదాయాన్ని ఆశిస్తున్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల కోసం రూ.1,859.75 కోట్లు కేటాయించారు. సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాల కోసం రూ.127 కోట్లు కేటాయించారు. గత ఏడాదితో (రూ.98 కోట్లు) పోలిస్తే ఇది గణనీయంగా పెరిగింది. తిరుమల భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు విజిలెన్స్ విభాగానికి రూ.245 కోట్లు కేటాయించారు.

విద్య, భద్రత, భక్తుల సౌకర్యాలకే పెద్దపీట

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తితిదే విద్యాసంస్థల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.118.89 కోట్లు కేటాయిస్తూ తితిదే ధర్మకర్తల మండలి నిర్ణయం తీసుకున్నట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. శనివారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. తితిదే చరిత్రలో విద్యారంగానికి ఈ స్థాయిలో నిధులు కేటాయించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. విద్య, భద్రత, భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేసినట్లు తెలిపారు.

- భక్తుల సౌకర్యార్థం 'శ్రీవారి ముడుపు పత్రం' అనే వినూత్న పథకాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. శ్రీవారికి మొక్కులు చెల్లించుకునే క్రమంలో నగదు, నాణేలు తీసుకురావడంలో భక్తులు పడుతున్న ఇబ్బందులను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.
- వకుళమాత ఆలయంలో 'అక్షర గోవిందం' పేరుతో నూతనంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.
- పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీవేంకటేశ్వర దివ్యక్షేత్రం నిర్మాణానికి రూ.11.25 కోట్లు కేటాయించారు. కోయంబత్తూరు, గువాహటి, బెలగావి, పట్నా సమీపంలోని మోకామ నగరంలో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ఆయా ప్రభుత్వాలు కేటాయించిన భూములను తీసుకునేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

మార్చి 2 లేదా 3న నిజనిర్ధారణ కమిటీ రాక

శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదంపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీ ఇప్పటికే తమను సంప్రదించిందని, మార్చి 2 లేదా 3వ తేదీన వారు తిరుమలకు రానున్నట్లు సమాచారం ఉందని తితిదే ఈవో రవిచంద్ర వెల్లడించారు.

ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి శంకుస్థాపన నేడు

- హాజరుకానున్న సీజేఐ, సీఎం చంద్రబాబు, న్యాయమూర్తులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏపీ జ్యుడిషియల్ అకాడమీ కార్యాలయ నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన జరగనుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, హైకోర్టు న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రస్తుత హైకోర్టుకు సమీపంలో నిర్మించనున్న ఏపీ హైకోర్టు అతిథి గృహం, క్లబ్ భవనాల నిర్మాణాలకు సైతం శంకుస్థాపన చేయనున్నారు. హైకోర్టు న్యాయమూర్తుల నివాస భవనాల సముదాయాన్నీ ప్రారంభించనున్నారు. అనంతరం విజయవాడలో మధ్యవర్తిత్వంపై జరిగే రాష్ట్రస్థాయి సదస్సులో జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

- వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సుప్రీంకోర్టు జడ్జీలు పలువురు ఆదివారం రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు రాజధాని అమరావతిలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు, మధ్యవర్తిత్వంపై జరిగే సదస్సులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ పాల్గొననున్నారు.

తిరుమలకు చేరుకున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు స్వాగతం పలుకుతున్న తితిదే ఈవో రవిచంద్ర

తిరుమల, తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. స్థానిక శ్రీపద్మావతి అతిథిగృహం వద్ద ఆయనకు తితిదే ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి, బస ఏర్పాట్లు చేశారు.

- తిరుపతి కలెక్టరేట్ సమీపం రేణిగుంట-తిరుచానూరు మార్గం మధ్యలో తిరుపతి కోర్టుల నూతన సముదాయం నిర్మాణానికి ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేయనున్నారు.

యుద్ధ జ్వాల



ఇరాన్ దాడితో ఉత్తర ఇజ్రాయెల్‌లోని హైఫా సముద్రంలో పేలుడు



అమెరికా, ఇజ్రాయెల్ దాడితో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో పేలుడు అనంతరం అలముకున్న పొగ

(మొదటి పేజీ తరువాయి)

మహమ్మద్ పాక్‌పౌర్ మృతి చెందినట్లు రాయిటర్స్ పేర్కొంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దక్షిణ ఇరాన్‌లోని ఓ పాఠశాలపై బాంబులు పడటంతో 86 మంది విద్యార్థినులు మరణించారు. వారితో పాటు ఇరాన్‌లో మొత్తం 201 మంది మరణించారు. 747 మంది గాయపడ్డారని రెడ్ క్రెసెంట్ వెల్లడించింది. తమపై దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల కారణంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో (యూఏఈ) ఒకరు మృతి చెందారు. ఇజ్రాయెల్‌లో 94 మంది స్వల్పంగా గాయపడ్డారు. యుద్ధం మొదలు కావడంతో పశ్చిమాసియాకు వేలకొద్దీ విమానాలు రద్దయ్యాయి. దేశాన్ని 1979 నుంచి పాలిస్తున్న ఇస్లామిక్ నాయకత్వం నుంచి మీ దేశాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ ప్రజలు తమ తలరాతను తామ చేతుల్లోకి తీసుకునేందుకు ఈ దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. దేశం ఇటువంటి దాడులను ఉపేక్షించబోదని, దేశాన్ని రక్షించుకునే సమయం వచ్చిందని, శత్రువు సైన్యాన్ని ఎదుర్కొనే అవకాశం వచ్చిందని ఇరాన్ విదేశాంగశాఖ ప్రకటించింది. రెండు పక్షాలు సమన్వయం పాటించాలని ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి. యుద్ధాన్ని విరమించి, చర్చలు జరపాలని భారతదేశం పిలుపునిచ్చింది.

పగలే..: గతానికి భిన్నంగా ఈసారి పగటి వెలుగులోనే అమెరికా దాడులకు దిగింది. శుక్రవారం వారాంతపు సెలవు అనంతరం ఇరాన్‌లో లక్షల మంది శనివారం ఉదయం యథావిధిగా పనులకు, పాఠశాలలకు వెళ్లారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.27 గంటల సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగాయి. తొలుత సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఇళ్లు, కార్యాలయాల చుట్టుపక్కల దాడులు జరిగాయి. దీంతో టెహ్రాన్ వ్యాపార కేంద్రంలోని ఖమేనీ ప్రాంగణానికి వెళ్లే దారులన్నింటినీ మూసివేశారు. ఆ తర్వాత దేశమంతా బాంబుల వర్షం కురిసింది. ఇరాన్ సైన్యం, ప్రభుత్వ, నిఘా కార్యాలయాలపై దాడులు జరిగాయి. 8 నెలల్లో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగడం ఇది రెండోసారి.

- కెర్మన్‌షా, ఖోమ్, తబ్రీజ్, ఇస్ఫహాన్, ఇలాం, కరజ్ ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.
- ఇరాన్ హార్మోజ్‌గన్ ప్రావిన్సులోని మినాబ్‌లో బాలికల పాఠశాలపై అమెరికా బాంబులు పడ్డాయి. ఈ ఘటనలో 86 మంది విద్యార్థినులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఈ ప్రాంతంలో ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్స్ స్థావరం ఉంది.



అమెరికా, ఇజ్రాయెల్ దాడితో టెహ్రాన్‌లోని ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ నివాసం వద్ద పేలుడు

- ఉత్తర టెహ్రాన్‌లోని 30 ప్రాంతాల్లో ఒకేసారి ఇజ్రాయెల్ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్ అధ్యక్ష భవనం, కీలక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే ఈ దాడులు జరిగాయి. ఆ సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని, అప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సైతం సురక్షితంగా ఉన్నట్లు టెహ్రాన్ మీడియా వెల్లడించింది.
- ఖమేనీ, పెజెష్కియాన్ సురక్షితంగానే ఉన్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ధ్రువీకరించారు. అమెరికా దాడులు అక్రమమని, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకునే హక్కు తమకు ఉందని స్పష్టం చేశారు.
- శనివారం సాయంత్రం టెహ్రాన్‌లోని నిఘా కార్యాలయం సమీపంలో 3 పేలుళ్లు సంభవించాయి.
- 200 యుద్ధ విమానాలతో ఇరాన్‌లోని 500 లక్ష్యాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

తీవ్రంగా స్పందించిన ఇరాన్

అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేసిన కొద్ది గంటల తర్వాత ఇరాన్ స్పందించింది. తొలుత ఇజ్రాయెల్‌పై 200 కుపైగా డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపించింది. అందులో 35 ఇజ్రాయెల్ గగనతలంలోకి ప్రవేశించాయి. ఈ దాడుల్లో 94 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఆ తర్వాత బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈసహా 7 దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్, యూఏఈ, ఇరాక్‌తో పాటు పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి.

- బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై ఇరాన్ దాడులు జరిపింది. మనామాలోని బహుళ అంతస్తుల భవనం మంటల్లో చిక్కుకుంది.
- కువైట్‌లోని అల్ సలేం అమెరికా ఆర్మీ సెంట్రల్‌పై ఇరాన్ విరుచుకుపడింది.
- ఖతార్‌లోని అల్ ఉదైద్ వైమానిక స్థావరంపై ఇరాన్ క్షిపణులు పేల్చింది.
- యూఏఈలోని అల్-ధఫ్రా ఎయిర్‌బేస్‌పై దాడులు చేసింది. దుబాయ్‌లో గగనతల రక్షణ వ్యవస్థను మోహరించారు. బాంబు ముక్క ఒకటి పడటంతో దుబాయ్‌లో ఒకరు మరణించారు. ప్రఖ్యాత పామ్ జుమేరియా ప్రాంతంలోని అంతర్జాతీయ పర్యాటకుల హోటల్ మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు.
- జోర్డాన్‌లోని కింగ్ హుసేన్ వైమానిక స్థావరాన్నీ ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది.
- తమ దేశంలోని రియాద్‌పై ఇరాన్ దాడులు చేయడాన్ని సౌదీ అరేబియా ఖండించింది.
- ఇరాన్‌కు మద్దతుగా యెమెన్‌లోని హూతీ రెబల్స్. ఎర్ర సముద్రంలోని నౌకలపై దాడులకు దిగారు. ఇజ్రాయెల్‌పైనా డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించారు.
- ఖతార్, యూఏఈ, ఇజ్రాయెల్‌లలోని అమెరికా ఎంబసీల్లో సిబ్బందిని షెల్టర్లకు వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు.

ఇజ్రాయెల్‌లో అత్యవసర పరిస్థితి

ఇజ్రాయెల్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అంతటా ఎయిర్ రైడ్ సైరన్లు మోగుతున్నాయి. బంకర్లలో దాక్కోవాలంటూ ప్రజలకు ప్రభుత్వం సందేశాలను పంపుతోంది. డజన్లకొద్దీ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్‌పై సంయుక్తంగా శక్తిమంతమైన దాడులు చేశామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది.



టీసీసీఎల్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, నటుడు శ్రీకాంత్, రవినాయుడు, మాపూరి వెంకటరమణ తదితరులు

తెలుగు సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ప్రారంభం

విశాఖపట్నం (పీఎంపాలెం), న్యూస్‌టుడే: విశాఖ నగరంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పీఎంపాలెం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో తెలుగు సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, నటుడు శ్రీకాంత్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. గంటా మాట్లాడుతూ.. మ్యాచ్‌ల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద విద్యార్థులు, క్రీడాకారులకు ఇవ్వాలన్న నిర్వాహకుల ఆలోచన అభినందనీయమన్నారు. కొమ్మాదిలో 25 ఎకరాల్లో 'ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్' రానుందన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక స్టేడియం అదే ప్రాంతంలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత సంబంధిత జట్లకు చెందిన జెర్సీలు, లీగ్ ట్రోఫీని గంటా ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు, సీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత మాపూరి వెంకటరమణ, నిర్వాహకులు రాంబాబు, కాశీ తదితరులు పాల్గొన్నారు.



అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో అలముకున్న పొగ



టెహ్రాన్‌లో కాలిపోతున్న వాహనాలు



ఇరాన్ దాడి చేయడంతో దుబాయ్‌లోని పామ్ జుమేరియా ప్రాంతంలో పేలుడు అనంతరం మంటల్లో చిక్కుకున్న ఓ హోటల్

ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండటానికి వీల్లేదు

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు



ఇరాన్‌పై అమెరికా సేనలు దాడిని ప్రారంభించాయి. ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న ముప్పును నిర్మూలించి అమెరికా ప్రజలను రక్షించడమే ఈ చర్య ప్రధానోద్దేశం. ఇరాన్ గత 47 ఏళ్లుగా అమెరికా వినాశనాన్ని కాంక్షిస్తోంది. అమెరికా ప్రజలు, సైన్యంతోపాటు అనేక దేశాల్లో అమాయక ప్రజల్ని నిరంతరం రక్తపాతానికి, సామూహిక హత్యాకాండకు గురిచేసే కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్‌లో జరిగిన అక్టోబరు 7 నాటి దాడిలో ఇరాన్‌తో సంబంధం ఉన్న ఉగ్రవాద సంస్థ హమాస్ వెయ్యిమంది అమాయక ప్రజల్ని చంపింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల్లో ఇరాన్ మొదటిది. ఈ మధ్యే వేలాది సొంత పౌరుల్ని కూడా అక్కడి ప్రభుత్వం హతమార్చింది. అణు కార్యక్రమం నిలిపివేయాల్సిందిగా మనమిచ్చిన అవకాశాలన్నిటినీ వాళ్లు జారవిడుచుకున్నారు. ఇరాన్ అణ్వాయుధం కలిగి ఉండటానికి వీల్లేదని చెప్పడమే ప్రస్తుత దాడి ద్వారా మనమిచ్చే సందేశం. అమెరికాకు సవాలు విసిరితే ఏమవుతుందో ఇరాన్ ప్రభుత్వానికి త్వరలో తెలుస్తుంది. ఇరాన్ దేశ ప్రజలకు ఇది స్వేచ్ఛ లభించే ఘడియ. వారు అమెరికా సాయం కోసం చిరకాలంగా ఎదురుచూస్తున్నారు.

తక్షణం దాడులు ఆపండి

- చర్చలు తిరిగి ప్రారంభించండి
- ఇరాన్, అమెరికాలకు భారత్ సహా ప్రపంచదేశాల పిలుపు

బ్రసెల్స్/దిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై భారత్ సహా పలు దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. తక్షణం దాడులు, ప్రతిదాడులు ఆపాలని అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌లకు విజ్ఞప్తి చేశాయి. అణు చర్చలు తిరిగి ప్రారంభించాలని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ పిలుపునిచ్చాయి. ఇరాన్‌పై అమెరికా దాడిని రష్యా, చైనా తీవ్రంగా ఖండించాయి. చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ సూచించింది.

> ఈ ఉద్రిక్తతలు ప్రమాదకరం. తక్షణం దాడులు ఆపాలి. చర్చలు తప్ప మరో మార్గం లేదని ఇరాన్ అర్థం చేసుకోవాలి. ఆ దేశం తమ అణు, బాలిస్టిక్ కార్యక్రమాలను నిలిపివేయాలి. పశ్చిమాసియా ప్రాంతాన్ని అస్థిరం చేసే పనులను కూడా ఆపాలి
> – ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

> ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. అన్ని పక్షాలూ సంయమనం పాటించాలి. ఉద్రిక్తతలు తీవ్రతరం కాకుండా.. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. చర్చలు, దౌత్య మార్గాలను కొనసాగించాలి. అన్ని దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలను గౌరవించాలి
> – భారత్

> ఇరాన్‌పై దాడి విస్మయానికి గురిచేసింది. తీవ్ర స్థాయిలో చర్చలు జరుగుతున్న సమయంలో ఇలా చేయడం సరికాదు. యుద్ధంలోకి కూరుకుపోవద్దని అమెరికాకు విజ్ఞప్తి చేస్తున్నా"
> – ఒమన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్బూసైది

> ఉద్రిక్తతలు మరింత పెరిగి ఈ ఘర్షణ ప్రాంతీయ యుద్ధంగా మారాలని మేం కోరుకోవడం లేదు. మా భాగస్వాములపై ఇరాన్ దాడులను ఖండిస్తున్నాం. ప్రాంతీయ రక్షణ ఆపరేషన్‌లో భాగంగా మా ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి మా విమానాలు ఈ రోజు ఆకాశంలో ఉన్నాయి. బ్రిటన్ స్థావరాలను రక్షణకు ఏర్పాట్లు చేశాం
> – బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

> ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా ఐక్యరాజ్యసమితిలోని సభ్య దేశంపై దాడి చేయడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధం
> – రష్యా

> ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇరాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలి
> –చైనా

> "ఇరాన్ అణుబాంబు తయారుచేయకుండా చేసేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు మేం మద్దతు ఇస్తున్నాం. ఇరాన్ ప్రస్తుత నాయకత్వం పశ్చిమాసియాలో అస్థిరత సృష్టిస్తోంది"
> – ఆస్ట్రేలియా

> అన్ని పక్షాలూ నియంత్రణ పాటించాలి. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను గౌరవించాలి. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
> – ఐరోపా యూనియన్

అప్రమత్తంగా ఉండండి

గల్ఫ్ దేశాల్లో భారత పౌరులను హెచ్చరించిన కేంద్రం

దిల్లీ: ఇరాన్, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాల్లో భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు పౌరులకు అడ్వైజరీలు జారీ చేశాయి. అనవసర ప్రయాణాలు చేయొద్దని సూచించాయి.

ఎవరి బలమెంత?



పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్‌లు ఒకవైపు.. ఇరాన్ మరోవైపు నిలిచి పరస్పరం నిప్పుల వర్షం కురిపించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ దేశాల సైనికపాటవం చర్చనీయాంశంగా మారింది. ఆయా దేశాల సైనిక సామర్థ్యాల తీరు ఇలా ఉంది...

పశ్చిమాసియాలో అమెరికా సైనికశక్తి



ప్రపంచవ్యాప్తంగా 51 దేశాల్లో 128 సైనిక స్థావరాలు కలిగిన అమెరికా.. తన ప్రయోజనాలకు అత్యంత కీలకమైన పశ్చిమాసియాలో గణనీయ స్థాయిలో సైనిక శక్తిని మోహరించింది. ఈ ప్రాంతంలో అగ్రరాజ్యానికి దాదాపు 40వేల మంది సైనికులు ఉన్నారు. ఇరాన్‌పై దాడి ఉద్దేశంతో కొన్నివారాలుగా ఇక్కడ సైనిక శక్తిని అమెరికా పెంచుతూ వస్తోంది. విమానవాహకనౌకలు యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్, యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌లను ఈ ప్రాంతానికి తరలించింది.

ఈ రెండు విమానవాహక నౌకల నేతృత్వంలో రెండు క్యారియర్ స్ట్రైక్ విభాగాలు ఉన్నాయి. ఒక్కో విభాగంలో ఒక విమాన వాహకనౌకతోపాటు భారీగా ఆయుధాలు కలిగిన మూడేసి గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ యుద్ధనౌకలు ఉన్నాయి. అబ్రహాం లింకన్, జెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌లలో ఎఫ్-18 ఫైటర్ జెట్‌లు, ఈ-2 గగనతల ముందస్తు హెచ్చరిక విమానాలు, రవాణా విమానాలు ఉన్నాయి. జెరాల్డ్ ఫోర్డ్‌లో ఎఫ్-35 స్టెల్త్ యుద్ధవిమానాలూ మోహరించాయి. వీటికితోడు పెద్ద సంఖ్యలో ఫైటర్ జెట్‌లను ఈ ప్రాంతంలోని తన స్థావరాలకు అమెరికా పంపింది. పశ్చిమాసియాలో అగ్రరాజ్యానికి 8 శాశ్వత స్థావరాలు, 11 ఇతర సైనిక కేంద్రాలు ఉన్నాయి. ప్రత్యర్థి గగనతల దాడులను కాచుకోవడానికి అదనంగా టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్ (థాడ్), పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను మోహరించింది.

స్థావరాలు..

బహ్రెయిన్: ఈ దేశంలోని జుఫెయిర్‌లో అమెరికా నౌకాదళ ఐదో ఫ్లీట్ ప్రధాన కార్యాలయం ఉంది. పశ్చిమాసియాలో అమెరికా నేవీ కార్యకలాపాలకు ఇదే కీలక స్థావరం. ఇక్కడ నాలుగు మైన్ కౌంటర్ మెజర్ యుద్ధనౌకలు, ఒక ఎక్స్‌పిడీషనరీ సపోర్ట్ యుద్ధనౌక, రెండు సైనిక సరకు రవాణా నౌకలు మోహరించాయి. బహ్రెయిన్‌లో సముద్ర గస్తీ విమానాలు పి-8 పొసైడాన్, ఈపీ-3ఈ ఏరీస్ 2 నిఘా విమానాలు, పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఈ దేశంలో 9 వేల మంది అమెరికన్ సైనికులు ఉండొచ్చని అంచనా.

ఖతార్: ఈ దేశ రాజధాని దోహా నగర వెలుపల ఉన్న అల్ ఉదైద్ స్థావరం.. అమెరికా సైన్యంలోని సెంట్రల్ కమాండ్‌కు ప్రధాన కార్యాలయం. ఈ స్థావరంలో 10 వేల మంది అమెరికన్ సైనికులు మోహరించారు. ఇక్కడ నిఘా విమానాలు, ఫైటర్ జెట్‌లకు ఇంధనం నింపే ట్యాంకర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, సి-17ఎ గ్లోబ్‌మాస్టర్ వంటి సైనిక రవాణా విమానాలు, పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, వీటికి తోడ్పాటు కోసం ఏఎన్/టీపీవై-2 ఎక్స్-బ్యాండ్ రాడార్ ఉన్నాయి.

కువైట్: ఈ దేశంలో అమెరికాకు అనేక స్థావరాలు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైంది క్యాంప్ ఆరిఫ్‌జాన్. ఇరాక్ సరిహద్దుకు 40 కిలోమీటర్ల దూరంలో అలీ అల్ సలేం స్థావరం ఉంది. ఇరాక్, సిరియాలో మోహరించే సైనిక విభాగాలకు క్యాంప్ బ్యూరింగ్.. విడిది కేంద్రంగా ఉంటోంది. కువైట్‌లో అమెరికా ఎంక్యూ-9 డ్రోన్లు సహా మానవరహిత నిఘా విమానాలు, సైనిక రవాణా విమానాలను నిర్వహిస్తోంది.

యూఏఈ: రాజధాని అబుధాబికి దక్షిణాన ఉన్న అల్ ధఫ్రా వైమానిక స్థావరాన్ని యూఏఈతోపాటు అమెరికా కూడా ఉపయోగించుకుంటోంది. ఇక్కడ అగ్రరాజ్యానికి చెందిన 380వ ఎయిర్ ఎక్స్‌పిడీషనరీ విభాగం ఉంది. అందులో 10 విమాన స్క్వాడ్రన్లు, ఎంక్యూ-9 రీపర్ వంటి డ్రోన్లు ఉన్నాయి. శిక్షణ కేంద్రం కూడా ఉంది. యూఏఈలో గగనతల ముందస్తు హెచ్చరిక విమానాలు మోహరించాయి. దుబాయ్‌లోని జెబెల్ అలీ పోర్ట్‌ను అమెరికా విమాన వాహకనౌకలు, ఇతర యుద్ధనౌకలు సందర్శిస్తుంటాయి.

ఇరాక్: ఈ దేశంలోని అయిన్ అల్ అసద్ వైమానిక స్థావరంలో అమెరికా మోహరింపులు ఉన్నాయి. ఉత్తర ఇరాక్‌లోని కుర్దిస్థాన్‌లో ఉన్న ఎర్బిల్ వైమానిక స్థావరం.. అమెరికా, దాని మిత్రపక్షాలకు శిక్షణ కార్యక్రమాలు, యుద్ధవిన్యాసాలకు హబ్‌గా ఉంది. బాగ్దాద్, ఉత్తర కుర్దిష్ ప్రాంతం, పశ్చిమ ఎడారిలో 2,500 మంది అమెరికన్ సైనికులు ఉన్నాయి. ఈ దేశంలో అపాచీ పోరాట హెలికాప్టర్లు, చినూక్, ఎంహెచ్-60ఎం బ్లాక్ హాక్ హెలికాప్టర్లు, మానవరహిత నిఘా విమానాలు ఉన్నాయి.

సౌదీ అరేబియా: ఈ దేశంలో అమెరికా సైనికులు 2,500 మంది ఉండొచ్చని అంచనా. అమెరికా సైనిక విమానాల కార్యకలాపాలకు తోడ్పాటు అందిస్తున్నాయి. వీరు రియాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌లో పనిచేస్తున్నారు. అక్కడ అమెరికాకు చెందిన పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, థాడ్ వ్యవస్థలు ఉన్నాయి.

జోర్డాన్: ఈ దేశంలోని మువాఫాక్ అల్ సల్తీ వైమానిక స్థావరంలో అమెరికా సైన్యానికి చెందిన 332వ ఎయిర్ ఎక్స్‌పిడీషనరీ విభాగం ఉంది. అక్కడ ఎఫ్-35 యుద్ధవిమానాలు ఉన్నాయి. మొత్తం మీద ఈ దేశంలో 3,188 మంది అమెరికా సైనిక సిబ్బంది ఉన్నట్లు అంచనా.

ఈజిప్ట్, సిరియా, యెమెన్, ఇజ్రాయెల్‌లో అమెరికాకు పరిమిత స్థాయిలో సైనిక ఉనికి ఉంది.



ఇరాన్ డ్రోన్ దాడితో బహ్రెయిన్‌లోని మనామాలలో ఓ బహుళ అంతస్తుల భవనంలో చెలరేగిన మంటలు

ఇరాన్



సైన్యం: సంఖ్యాపరంగా ఇరాన్ సైన్యం చాలా పెద్దది. దీర్ఘకాలం నుంచి ఆంక్షలను ఎదుర్కొంటున్న ఇరాన్.. దేశీయ ఆయుధ ఉత్పత్తి, క్షిపణుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ దేశ సైన్యంలో 6.1 లక్షల మంది క్రియాశీల సైనికులు ఉన్నారు. ఇంకా వేల మంది రిజర్వు, పారామిలటరీ దళాలు ఉన్నాయి.

- ఇరాన్ భూతల సైన్యం ప్రధానంగా సంఖ్యాబలంపైనే ఆధారపడుతోంది. ఈ దేశం వద్ద దాదాపు 2వేల ట్యాంకులు, వేల సంఖ్యలో సాయుధ శకటాలు ఉన్నాయి. 1,500 సంచార రాకెట్ లాంచర్లు ఉన్నాయి. వీటితో భారీగా విరుచుకుపడగల సత్తాను కలిగి ఉంది. ఇరాన్ వద్ద 3 వేలకుపైగా బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు అంచనా. వీటిలో 1,300 కిలోమీటర్ల పరిధి కలిగిన హజ్ ఖాసిం, ఖైబర్ షెకాన్ తరగతి అస్త్రాలు, 1,350 నుంచి 1,950 కిలోమీటర్ల పరిధి కలిగిన గాదర్-హెచ్ వేరియంట్లు, 2వేల కిలోమీటర్ల పరిధి కలిగిన సెజ్జిల్ మిసైల్ వ్యవస్థలు ఉన్నాయి. వీటికితోడు 2లక్షల మందితో కూడిన సుశిక్షిత ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దళం ఇరాన్ బలం.

వాయుసేన: ఇరాన్ వైమానిక దళంలో 551 విమానాలు ఉన్నాయి. వీటిలో చాలావరకూ పాతవే. ఈ లోటును అధిగమించడానికి ఇరాన్.. క్షిపణి, డ్రోన్లు, బహుళ అంచెలంచెల గగనతల రక్షణ వ్యవస్థలపై ఆధారపడుతోంది.

నౌకాదళం: ఈ దేశం వద్ద జలాంతర్గాములు, ఫాస్ట్ ఎటాక్ క్రాఫ్ట్, క్షిపణులతో కూడిన గస్తీ నౌకలు ఉన్నాయి. సన్నగా ఉన్న సముద్ర మార్గాల్లో కార్యకలాపాలు సాగించడం వీటి ప్రధాన ఉద్దేశం. అక్కడ యుద్ధనౌకల మూకుమ్మడి దాడి సామర్థ్యం, తీర ప్రాంతంలోని క్షిపణి వ్యవస్థలు.. బలమైన ప్రత్యర్థికీ సవాళ్లు రువ్వగలవు. అలాగే ఇరాన్ వద్ద దాదాపు 6వేల వరకూ నౌకాదళ మందుపాతరలు ఉన్నాయి. వీటి సాయంతో హోర్ముజ్ జలసంధిని తాత్కాలికంగా మూసేయవచ్చు.

ఇజ్రాయెల్



సైన్యం: సంఖ్యాపరంగా ఇరాన్‌తో పోలిస్తే ఇజ్రాయెల్ సైనికశక్తి తక్కువే. అయితే అధునాతన పరిజ్ఞానం, మెరుపు వేగంతో బలగాలను మోహరించగల సత్తాపై ఇజ్రాయెల్ ఆధారపడుతోంది. ఈ దేశం వద్ద 1.7 లక్షల మంది సైనికులు, 4.65 లక్షల మంది రిజర్వు దళాలు ఉన్నాయి.

ట్యాంకులు, సాయుధ శకటాల్లో వేగం, ఆధునిక టార్గెటింగ్ వ్యవస్థలు ఉన్నాయి. స్వయంచాలిత శతఘ్ని దళాలూ ఉన్నాయి.

వాయుసేన: ఇజ్రాయెల్ వద్ద 600 యుద్ధవిమానాలు, హెలికాప్టర్లు ఉన్నాయి. వీటిలో ఎఫ్-16, ఎఫ్-35 వంటి ఫైటర్ జెట్‌లు ఉన్నాయి. వీటికితోడు అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకోగల, నిఘా సేకరణ సామర్థ్య విమానాలు ఇజ్రాయెల్ సొంతం. అత్యంత కచ్చితత్వంతో దాడి చేయగల సామర్థ్యం, నెట్‌వర్క్ ఆధారిత యుద్ధ వ్యవస్థనూ ఈ దేశం కలిగి ఉంది.

నౌకాదళం: ఇజ్రాయెల్ నేవీలో దాదాపు 100 యుద్ధనౌకలు ఉన్నాయి. ఇందులో ఆరు జలాంతర్గాములు, 7 కార్వెట్‌లు, గస్తీ నౌకలు ఉన్నాయి. ఇవి తీర రక్షణతోపాటు వేగంగా దాడులు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

ఇజ్రాయెల్ వద్ద శక్తిమంతమైన ఐరన్ డోమ్, డేవిడ్ స్లింగ్, యారో, థాడ్ క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇవి గగనతలంలోనే శత్రు క్షిపణులు, రాకెట్లను నేలకూల్చగలవు. ప్రత్యర్థిపై నిఘా వేసేందుకు శక్తిమంతమైన రాడార్లు, అవాక్స్ వంటి వ్యవస్థలు ఉన్నాయి. అలాగే 6,500 కిలోమీటర్ల పరిధి కలిగిన జెరికో-3 క్షిపణులతోపాటు 3,500 కిలోమీటర్ల పరిధి కలిగిన జెరికో-2 క్షిపణులను ఇజ్రాయెల్ కలిగి ఉంది. లోరా, పాప్‌ఐ, డెలైలా, గాబ్రియేల్, స్పైక్ తరగతి క్షిపణులను తన అమ్ములపొదిలో చేర్చింది. ఈ దేశం వద్ద 90కి పైగా అణ్వాస్త్రాలు ఉన్నాయి.

– ఈనాడు ప్రత్యేక విభాగం

ఆయతుల్లా నుంచి ముప్పు తప్పించడానికే

- నెతన్యాహు, ఇజ్రాయెల్ ప్రధాని



ఇరాన్‌పై 'ఆపరేషన్ లయన్స్ రోర్' పేరుతో ఇజ్రాయెల్, అమెరికా సమష్టి దాడిని ప్రారంభించాయి. ఇరాన్‌లో ఆయతుల్లా ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న ముప్పును తప్పించడమే ఈ దాడి లక్ష్యం. ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్‌లోని దౌర్జన్యకర ప్రభుత్వానికి చెందిన అనేక సైనిక లక్ష్యాలపై దాడి చేస్తున్నాయి. ఇజ్రాయెల్, అమెరికాలకు ముప్పుగా పరిణమించగల ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల స్థావరాలనూ లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తున్నాం. ఈ ఆపరేషన్ అవసరమైనన్ని రోజులు కొనసాగిస్తాం. ఇరాన్ ప్రభుత్వం తన సొంత ప్రజానీకాన్నీ అణచివేతకు గురిచేసింది. అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తూ ఉగ్రవాదాన్ని ప్రపంచవ్యాప్తం చేసింది. అణుబాంబులను, లక్షలాది మిసైళ్లను తయారుచేయడానికి భారీస్థాయిలో వనరుల్ని వెచ్చించింది. ప్రపంచపటం నుంచి ఇజ్రాయెల్‌ను తుడిచివేయాలని చూసింది. మన దేశానికి చుట్టూ ఉన్న గాజా, లెబనాన్, సిరియా, ఇరాక్, యెమెన్, జూడియా, సమారియా ప్రాంతాల్లోని ఉగ్రవాదులకు ఆయుధాలు అందించి మన రక్తాన్ని కళ్లజూసింది. ప్రస్తుత దాడి ఇరానియన్లు తమ విధిరాతను, భవితవ్యాన్ని తామే నిర్దేశించుకునేందుకు ఉపయోగపడుతుంది.

దురాక్రమణదారులకు గుణపాఠం చెబుతాం

- అబ్బాస్ అరాఘ్చీ, ఇరాన్ విదేశాంగ మంత్రి



దురాక్రమణదారులకు ఇరాన్ బలగాలు గుణపాఠం నేర్పుతాయి. ట్రంప్, నెతన్యాహు ఇరాన్‌పై నిష్కారణంగా, చట్టవ్యతిరేకంగా, అక్రమంగా దాడికి పాల్పడ్డారు. ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని ఇజ్రాయెల్ ఫస్ట్‌గా మార్చేశారు. ఈ క్రమంలో అమెరికా లాస్ట్‌గా మిగిలిపోతుంది. ఈ ఘడియ కోసం శక్తిమంతమైన మా సాయుధ బలగాలు ఎప్పటినుంచో సిద్ధంగా ఉన్నాయి. స్వీయరక్షణ మాకున్న హక్కు. ఇందుకోసం సైనికంగా మాకున్న అన్ని అవకాశాలనూ ఉపయోగించుకుంటాం. మమ్మల్ని మేము రక్షించుకోడానికి సైనిక సామర్థ్యాలన్నిటినీ ఉపయోగించుకుంటామని అమెరికా స్థావరాలను ఏర్పాటుచేసుకున్న సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఇరాక్ దేశాల ప్రభుత్వాలకు ఫోను ద్వారా తెలియజేశాం. అమెరికా మీ భూభాగాలను దురుపయోగం చేస్తోందని ఆయా దేశాలకు తెలియజేశాం.

పశ్చిమాసియాకు ఆగిన విమానాలు

- గగనతలాలను మూసివేసిన గల్ఫ్ దేశాలు
- అంతర్జాతీయ విమానయాన సర్వీసుల నిలిపివేత

దిల్లీ: ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్న దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలోని పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎమిరేట్స్, ఖతార్ ఎయిర్‌వేస్, కేఎల్ఎం, వర్జిన్ అట్లాంటిక్ తదితర అంతర్జాతీయ విమానయాన సంస్థలు పశ్చిమాసియాకు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి. ఇరాన్, ఇజ్రాయెల్‌తో పాటు.. యూఏఈ, ఖతార్ కూడా తమ గగనతలాలను మూసివేశాయి. ప్రపంచంలోనే అతి రద్దీ విమానాశ్రయాల్లో ఒకటైన దుబాయ్‌లోనే ఏకంగా 700కు పైగా విమానాలు రద్దయ్యాయి. విమానాశ్రయాన్ని మూసివేస్తున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే ముందు ఫ్లైట్ స్టేటస్‌ను తనిఖీ చేసుకోవాలని ప్రయాణికులకు విమానయాన సంస్థలు సూచించాయి. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఇండిగో ప్రకటించింది. ఎయిరిండియా కూడా గల్ఫ్ దేశాలకు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగింది. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పరిస్థితిని సమీక్షించారు.



అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ప్రజల ఆందోళన

పశ్చిమబెంగాల్ 'సర్'లో 63.66 లక్షల ఓట్ల తొలగింపు

కోల్‌కతా: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) లో భాగంగా పశ్చిమబెంగాల్ జాబితా నుంచి 63.66 లక్షల ఓట్లు తొలగించినట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) మనోజ్ కుమార్ అగర్వాల్ శనివారం ప్రకటించారు. మొత్తం ఓటర్ల సంఖ్యలో ఇది 8.3 శాతం. మృతులు, వలసపోయినవారు, రెండు చోట్ల పేర్లు నమోదైనవారు, ఆచూకీ లేనివారు అనే కేటగిరీల కింద మొత్తం కలిపి 58 లక్షలకు పైగా ఓట్లు తొలగించారు. ఫాం 7 ఆధారంగా మరో 5,46, 053 ఓట్లు తొలగించారు. సర్ కసరత్తు ప్రారంభానికి పూర్వం రాష్ట్రంలో 7.66 కోట్ల మంది ఓటర్లున్నారని, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 7.04 కోట్లకు తగ్గిందని సీఈవో తెలిపారు. ఈ కసరత్తులో 1.82 లక్షల కొత్త ఓటర్లను ఫాం 6, ఫాం 6ఏ సాయంతో జాబితాకు చేర్చామని సీఈఓ అన్నారు. రాష్ట్రంలోనే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన 6,671 మంది ఓటర్ల పేర్లను ఫాం 8 ద్వారా జాబితాకు జతచేశామని వెల్లడించారు. పేర్లు తొలగించినవారిలో 24.16 లక్షల మంది మరణించినవారు, 12.20 లక్షల మంది ఆచూకీ లేనివారు, 19.88 లక్షల మంది శాశ్వతంగా చిరునామా మారినవారు ఉన్నారని తెలిపారు.

దేశవ్యాప్తంగా మొదలైన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

- అజ్‌మేర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

జైపుర్: దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం రాజస్థాన్‌లోని అజ్‌మేర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా హ్యూమన్ ప్యాపిలోమావైరస్(హెచ్‌పీవీ)ని ఇది అరికడుతుంది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలికలకు సింగిల్ డోస్ 'గార్డాసిల్-4' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది.

'కాంగ్రెస్ ఇప్పుడు 'ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్'గా మారింది'

అజ్‌మేర్‌లో కాంగ్రెస్‌పై మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) ఇప్పుడు ముస్లిం లీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌గా మారిందని విమర్శించారు. ముస్లిం లీగ్‌కు భారత్‌పై ఉన్న ద్వేషమే నాడు విభజనకు కారణమైందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఏఐ సదస్సులో కాంగ్రెస్ యువజన విభాగం చేసిన అర్ధనగ్న నిరసనపై మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని కించపరచడానికి దొరికిన ఏ అవకాశాన్నీ కాంగ్రెస్ వదులుకోదని మండిపడ్డారు.



అజ్‌మేర్‌లో జరిగిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడికి బెయిలు.. కొన్ని గంటల్లోనే స్టే

దిల్లీ: దేశ రాజధానిలో ఇటీవల నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో అర్ధనగ్న నిరసన ప్రదర్శనలకు దిగిన కేసులో ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌కు శనివారం మెజిస్ట్రేట్ కోర్టు బెయిలు మంజూరు చేయగా.. దీనిపై కొన్ని గంటల వ్యవధిలోనే సెషన్స్ కోర్టు స్టే విధించింది. తొలుత నాటకీయ పరిణామాల మధ్య దిల్లీ కోర్టు డ్యూటీ మెజిస్ట్రేటు వంశికా మెహతా శనివారం తెల్లవారుజామున ఉదయ్ భానుకు బెయిలు మంజూరు చేశారు. పోలీస్ కస్టడీని పొడిగించాలన్న దిల్లీ పోలీసుల అభ్యర్థనను తోసిపుచ్చుతూ కోర్టు ఈ నిర్ణయం తీసుకొంది. ఉదయ్ భానుకు కొన్ని షరతులను కోర్టు విధించింది. పాస్‌పోర్టు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలతోపాటు రూ.50 వేలు విలువైన వ్యక్తిగత పూచీకత్తును కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక 1:30 గంటలకు ఈ విచారణ ప్రారంభమైంది. కాగా, మెజిస్ట్రేట్ కోర్టు జారీ చేసిన బెయిలు ఉత్తర్వులను దిల్లీ పోలీసులు సెషన్స్ కోర్టులో సవాలు చేశారు. విచారణ జరిపిన అదనపు సెషన్స్ జడ్జి అమిత్ బన్సాల్.. ఉదయ్ భాను బెయిలుపై స్టే విధించారు.

బొలీవియాలో కరెన్సీ తరలిస్తూ కూలిన కార్గో విమానం

20 మంది మృతి, 31 మందికి గాయాలు

లాపాజ్: బొలీవియా రాజధాని లాపాజ్ సమీపంలోని ఎల్ ఆల్టో నగరంలో కరెన్సీ తరలిస్తున్న కార్గో విమానం కుప్పకూలింది. శాంటాక్రూజ్ నుంచి శుక్రవారం రాత్రి 8 మంది సిబ్బందితో బయలుదేరిన హెర్క్యులెస్ సీ-130 కార్గో విమానం రన్‌వేపై నుంచి జారి పక్కనే రద్దీగా ఉన్న రోడ్డు పైకి దూసుకెళ్లడంతో దాదాపు 15 వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో 20 మంది మృతిచెందగా, 31 మంది వరకు గాయపడ్డారు.

EENADU Vol: 52, Issue: 200 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్ వారాంతం

భారత్ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందేనా?

అమెరికా ఇరాన్ ఉద్రిక్తతలు

ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన మెరుపు దాడులు పశ్చిమాసియాలో భద్రతాపరమైన ఆందోళనలను మరింత తీవ్రతరం చేశాయి. ఈ భౌగోళిక రాజకీయ పరిణామాలు కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఇంధన మార్కెట్లతో పాటు భారత చమురు భద్రత, ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపనున్నాయి.



హోర్ముజ్‌తోనే ఇబ్బందంతా..

ఇజ్రాయెల్-అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. భారత్ తన ముడి చమురు దిగుమతుల్లో సగానికి పైగా ఈ మార్గంలోనే చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇక్కడ రవాణాకు ఏమాత్రం ఆటంకం ఏర్పడినా ఇంధన, సరకు రవాణా వ్యయాలు పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెను భారం మోపడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

20% వాణిజ్యానికి ఇదే కీలకం..

ఇరాన్‌ను ఒమన్, యూఏఈల నుంచి వేరు చేసే ఈ హోర్ముజ్ జలసంధి నుంచే ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం సాగుతోంది. కేప్లర్ నివేదిక ప్రకారం, 2025 చివరి నాటికి 40 శాతంగా ఉన్న భారత చమురు దిగుమతులు, 2026 జనవరి-ఫిబ్రవరి నాటికి 50 శాతానికి పెరిగాయి. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో రష్యన్ చమురు కొనుగోళ్లను తగ్గించి, మధ్యప్రాచ్య దేశాలపై ఆధారపడటం పెరగడం దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల ముడి చమురును ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ నుంచి ఈ మార్గం నుంచే దిగుమతి చేసుకుంటోంది. సగటున రోజుకు 74,000 బ్యారెళ్ల శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులనూ భారత్ ఈ జలసంధి నుంచే ఎగుమతి చేస్తోంది.

చమురు ధర పైపైకి..

అమెరికా బలగాల మోహరింపుతోనే ముడిచమురు ధరలు సుమారు 10 శాతం మేర పెరిగాయి. ఈక్విరస్ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం, ఒకవేళ రోజుకు 33 లక్షల బ్యారెళ్ల ఇరాన్ చమురు ఉత్పత్తికి అంతరాయం కలిగితే బ్యారెల్ ధర 9-15 శాతం పెరిగి, 76-81 డాలర్లకు చేరుకోవచ్చు. హోర్ముజ్ జలసంధికి పాక్షిక ఆటంకం ఏర్పడితే అదనంగా 20-40 శాతం పెరిగి, ఏకంగా 95-110 డాలర్లకు చేరుకునే ముప్పు ఉందని ఆ నివేదిక స్పష్టం చేసింది.

మనకు ప్రతికూల అంశాలివీ..

తాజా పరిణామంతో భారత్‌పై పలు అంశాల్లో ప్రతికూలతలు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. అవేంటంటే..

☛ **కరెంటు ఖాతా లోటు:** మనం వినియోగించే చమురులో 85 శాతం ఇతర దేశాల నుంచే కొనుగోలు చేస్తున్నాం. కాబట్టి, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు కొద్దిగా పెరిగినా, దేశం చెల్లించాల్సిన మొత్తం దిగుమతి బిల్లు అమాంతం పెరుగుతుంది. యుద్ధ భయాలతో మార్కెట్లో ముడి చమురు బ్యారెల్ ధర 90 డాలర్లు దాటితే.. మనకు ఇబ్బందే. చమురు ధరలు స్థిరంగా పెరిగితే, దిగుమతి బిల్లు భారీగా పెరిగి, కరెంట్ ఖాతా లోటు మరింత తీవ్రమవుతుంది.

☛ **రూపాయి పతనం:** మనం విదేశాల నుంచి చమురు కొనుగోలు చేసినప్పుడు, దానికి చెల్లింపులు అమెరికన్ డాలర్లలో చేయాల్సి ఉంటుంది. చమురు ధరలు పెరిగినప్పుడు, ఎక్కువ డాలర్లను వెచ్చించాల్సి వస్తుంది. దీనివల్ల డాలర్లకు గిరాకీ పెరుగుతుంది. రూపాయిపై ఒత్తిడి పడి విలువ పతనం అవుతుంది.

☛ **ఎగుమతులపైనా ప్రభావం:** భారత్ నుంచి ఇరాన్‌కు ఎగుమతి అయ్యే బాస్మతీ బియ్యం, ఫార్మా, టీ, సుగంధద్రవ్యాలు తదితరాలపై ప్రభావం పడొచ్చు.

☛ **వీటి ధరలు పెరగొచ్చు:** చమురు ధరలు పెరిగితే, దేశీయంగా పెట్రోలు, డీజిల్ ధరలపై ఆ ప్రభావం ఉంటుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా సరకు రవాణా ఖర్చులు అధికం అయ్యే అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో భద్రత లేకపోతే, నౌకలు ఆఫ్రికా మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. దీనివల్ల సరకు రవాణా సమయం 15-20 రోజులు, ఖర్చులు 40-50 శాతం పెరుగుతాయి. ఇవన్నీ అంతిమ వినియోగదారుడిపై భారం మోపుతాయి. ఇదేకాకుండా ఇరాన్, ఇజ్రాయెల్, కువైట్ తదితర దేశాల గగనతలాలు పాక్షికంగా మూతపడటంతో ఎయిరిండియా, ఇండిగో విమానయాన సంస్థలు అమెరికా, ఐరోపా రూట్లను మళ్లించాయి. దీంతో ఇంధన ఖర్చులపై ప్రభావం పడుతుంది. ఫలితంగా విమాన టికెట్ల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది.

☛ **స్టాక్‌మార్కెట్‌పైనా:** ఇప్పటికే టారిఫ్ అనిశ్చితుల మధ్య డీలా పడ్డ మార్కెట్లకు తాజా పరిణామాలు రుచించకపోవచ్చు. ఈ ఉద్రిక్తతలు ఎంత కాలం కొనసాగితే అంతకాలం మార్కెట్‌పై ప్రభావం ఉండొచ్చు. ఈ నేపథ్యంలో ఎంత త్వరగా యుద్ధ మేఘాలు వీడితే మార్కెట్లకు అంత మేలు. యుద్ధ భయాల నుంచి రక్షణ పొందేందుకు భారత్ ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

పసిడి, వెండి ధరలు మరింత పైకి?

అమెరికా-ఇరాన్ పరస్పర దాడుల ప్రభావంతో పసిడి, వెండి ధరలు దూకుడు కనబర్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తత పరిస్థితులున్నప్పుడు మదుపర్లు సురక్షిత పెట్టుబడి మార్గాలపై ఆసక్తి చూపడమే ఇందుకు కారణం. తాజా పరిణామాలతో పసిడి, వెండి ధరలు జనవరిలో నమోదైన జీవనకాల గరిష్ఠాలను సమీపించే అవకాశాలున్నాయని అభిప్రాయ పడుతున్నారు. సమీపకాలంలో ఎంసీఎక్స్ ఫ్యూచర్స్‌లో పసిడి కాంట్రాక్టు 10 గ్రాములు రూ.1.70 లక్షలు, కిలో వెండి రూ.3 లక్షలకు చేరొచ్చని ఎస్ఎమ్‌సీ గ్లోబల్ సెక్యూరిటీస్ అంచనా వేసింది.

స్కైరూట్ నుంచి ధావన్-3 క్రయోజెనిక్ ఇంజిన్



ఈనాడు, హైదరాబాద్: అంతరిక్ష రంగంలోని స్కైరూట్ ఏరోస్పేస్ అత్యంత ఆధునిక 'ధావన్-3' క్రయోజెనిక్ రాకెట్ ఇంజిన్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. దాదాపు 145 సెకన్లపాటు నిర్వహించిన సామర్థ్య పరీక్ష.. సత్ఫలితాలను ఇచ్చిందని సంస్థ వెల్లడించింది. పునర్వినియోగ సామర్థ్యం, పర్యావరణ అనుకూల సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తూ ధావన్-3 ఇంజిన్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొంది.

గెయిల్ రూ.1,736 కోట్ల పెట్టుబడి

మహారాష్ట్రలో పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు..

దిల్లీ: 2035 నాటికి నికర శూన్య ఉద్గారాలను లక్ష్యంగా చేసుకున్నందున, పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను విస్తరించడంలో సాయపడే పవన విద్యుత్ ప్రాజెక్టును మహారాష్ట్రలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ యాజమాన్యంలోని గెయిల్ ఇండియా రూ.1,736.25 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపింది. ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని నియంత్రణ సంస్థలకు సమాచారమిచ్చింది. 178.2 మెగావాట్ పవన విద్యుత్ సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది.

✦ కాంట్రాక్ట్ ఇచ్చిన 24 నెలల్లో పూర్తి కానున్న ఈ ప్రాజెక్ట్, ప్రస్తుత పోర్ట్‌ఫోలియో 117.95 మెగావాట్లకు అదనంగా జతవుతుందని సంస్థ తెలిపింది. ఇవే కాకుండా ఈ సంస్థకు రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 27 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. దీని పవన విద్యుత్ ప్రాజెక్టులు గుజరాత్ (19.2 మెగావాట్), కర్ణాటక (38.1 మెగావాట్) తమిళనాడు (60.65 మెగావాట్)లలో ఉన్నాయి.

జనవరిలో విమాన ప్రయాణికులు 1.52 కోట్లు



ముంబయి: 2026 జనవరిలో దేశీయ విమాన ప్రయాణికులు 2025 జనవరితో పోలిస్తే 4.36 శాతం పెరిగి 1.529 కోట్లకు చేరారని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) వెల్లడించింది. ఇండిగో, ఎయిరిండియా గ్రూప్, స్పైస్ జెట్, ఆకాశ ఎయిర్ విమానాల్లో దేశీయ మార్గాల్లో 2025 జనవరిలో మొత్తం 1.461 కోట్ల మంది ప్రయాణించారని డీజీసీఏ తెలిపింది. గత డిసెంబరులో ఇండిగోలో తలెత్తిన సంక్షోభంతో మార్కెట్ వాటా 4 శాతం కోల్పోయినా జనవరిలో మళ్లీ మార్కెట్ వాటా 63.6 శాతానికి చేరింది. 97.04 లక్షల మంది దేశీయ ప్రయాణికులు ఈ కంపెనీ విమానాల్లో ప్రయాణించారు. ఎయిరిండియా గ్రూప్ 3 శాతం మార్కెట్ వాటా కోల్పోయి 26.5 శాతానికి (40.34 లక్షల మంది) పరిమితమైంది.

✦ ప్రయాణికుల భర్తీ సామర్థ్యంలో ఆకాశ ఎయిర్ 93.2 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. ఇండిగో 87.7 శాతంతో రెండో స్థానం దక్కించుకుంది. సమయ పాలనలో ఇండిగో 70.9 శాతం పని తీరుతో ప్రథమ స్థానంలో నిలిచింది. దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో విమానాశ్రయాలను పరిగణనలోకి తీసుకుని డీజీసీఏ ఈ గణాంకాలు విడుదల చేసింది.

హార్డ్‌వేర్‌లోనూ బలమైన శక్తిగా భారత్

● మైక్రాన్ సెమీ కండక్టర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ

● రూ.22,516 కోట్ల పెట్టుబడులు పెట్టిన సంస్థ



సనంద్: గుజరాత్‌లోని సనంద్‌లో మైక్రాన్ టెక్నాలజీకి చెందిన సెమీ కండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్‌లో బలమైన శక్తిగా ఎదిగిన తర్వాత, హార్డ్‌వేర్ రంగంలో కూడా దేశం తన గుర్తింపును దృఢంగా నిర్మిస్తోందని ఆయన తెలిపారు. అమెరికాకు చెందిన ఈ కంపెనీ ఏటీఎంపీ (అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్) ప్లాంట్ మన దేశంలో ప్రారంభం కావడం రెండు దేశాల మధ్య లోతైన భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తోందని మోదీ పేర్కొన్నారు. మన దేశం సమర్థవంతం, పోటీతత్వంతో ఉండాలనే సందేశం ప్రపంచానికి స్పష్టంగా చేరిందని తెలిపారు. గత శతాబ్దంలో చమురు కీలకంగా వ్యవహరిస్తే, ఈ శతాబ్దంలో ఆ పనిని మైక్రోచిప్‌లు చేస్తున్నాయని వెల్లడించారు. మన దేశం వేగంగా ప్రపంచ సెమీ కండక్టర్ వాల్యూ చైన్‌లో అంతర్భాగంగా మారుతోందని వివరించారు. ఈ ప్లాంట్ ఎస్ఎస్‌డీ (సాలిడ్ స్టేట్ డ్రైవ్) నిల్వ పరికరాలతో పాటు ఆర్ఏఎం రకం డీఆర్ఏఎం, ఎన్ఏఎన్‌డీ ఉత్పత్తులను తయారు చేస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఈ ప్లాంట్‌లో మైక్రాన్ టెక్నాలజీ రూ.22,516 కోట్ల పెట్టుబడి పెట్టిందని పేర్కొంది.

ప్రయాణాల్లో మార్పులకు సిద్ధపడాల్సిందే

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో గగనతలంపై ఆంక్షల నేపథ్యం



దిల్లీ: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో, గగనతల ఆంక్షలు, మార్గ మళ్లింపుల వల్ల విమాన కార్యకలాపాలకు అంతరాయాలు చోటుచేసుకుంటున్నాయి. అందుకు తగ్గట్లుగా ప్రయాణ ప్రణాళికల్లో మార్పులకు ప్రయాణికులు సిద్ధంగా ఉండాలని ఈజ్‌మైట్రిప్ సహవ్యవస్థాపకుడు రికాంత్ పిట్టి తెలిపారు. విమానయాన సంస్థలు అందించే సమాచారాన్ని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. 'అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రం కావడంతో ఇరు దేశాలు పౌర విమాన కార్యకలాపాలకు గగనతలాన్ని మూసివేశాయి. ఈ దేశాల ద్వారా, వాటి చుట్టుపక్కల నుంచి ప్రయాణాలు సాగించాల్సిన విమాన ప్రయాణికులకు ఈ పరిణామాల వల్ల ప్రయాణ సమయం మరింత పెరిగే అవకాశం ఉంది. విమాన రాకపోకల సమయాల్లోనూ మార్పులు చోటుచేసుకోవచ్చు'ని తెలిపారు. అంతర్జాతీయ పరిణామాలు వేగంగా మారుతుండటంతో, విమానయాన సంస్థల అధికారిక వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అంతర్జాతీయ ప్రయాణికులు తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు. పరిస్థితులను బట్టి తిరుగు ప్రయాణ ప్రణాళికల్లో మార్పులకు సన్నద్ధమవ్వాలని సూచించారు. 'ఈజ్‌మైట్రిప్‌లో మా బృందం కూడా ఈ పరిణామాలను సునిశితంగా గమనిస్తోంది. ప్రయాణికులకు ఏమైనా సహకారం కావాల్సి వస్తే.. అందించేందుకూ సిద్ధంగా ఉన్నామ'ని పిట్టి వివరించారు.

కోడి గుడ్డు

మార్చి 1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయల్లో)

హైదరాబాద్	450
వరంగల్	452
విజయవాడ	500
తూ/ప గోదావరి	458
విశాఖపట్నం	465
చిత్తూరు	513

ఆంథ్రోపిక్‌కు ట్రంప్ షాక్

● సంస్థ ఏఐ సాంకేతికతను వాడొద్దంటూ ప్రభుత్వ శాఖలకు ఆదేశం

● ఆంథ్రోపిక్‌తో ఒప్పందాన్ని రద్దు చేసిన అమెరికా అధ్యక్షుడు



కృత్రిమ మేధ(ఏఐ) టూల్స్‌తో ప్రపంచాన్నే ఆకర్షించిన అమెరికా కంపెనీ ఆంథ్రోపిక్‌కు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకిచ్చారు. ఆంథ్రోపిక్‌కు చెందిన ఏఐ సాంకేతికతను వినియోగించడాన్ని ఆపాలని అన్ని అమెరికా ప్రభుత్వ విభాగాలను ఆయన ఆదేశించారు. ఆ కంపెనీపై పలు జరిమానాలనూ విధించారు. 'మాకు ఆంథ్రోపిక్ వద్దు. మేం మళ్లీ వాళ్లతో కలిసి వ్యాపారం చేసేది లేద'ని ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ వెల్లడించారు. ఏకంగా అమెరికా రక్షణ విభాగం (పెంటగాన్)పైనే బల ప్రయోగం చేసేందుకు ఆంథ్రోపిక్ యత్నించిందని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు అమెరికా సైన్యానికి సంబంధించిన ఆన్‌లైన్ వేదికల్లో ఎంబెడ్ చేసిన ఆంథ్రోపిక్ ఏఐ టెక్నాలజీని తొలగించేందుకు పెంటగాన్‌కు 6 నెలల గడువు ఇచ్చానని ట్రంప్ తెలిపారు. వామపక్ష అతివాదం, జాతి వివక్ష భావం కలిగిన కంపెనీకి అమెరికా సైనిక వ్యూహాలు, యుద్ధ రహస్యాలు ఎలా ఉండాలనే దానిపై మాట్లాడే అవకాశాన్ని ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక పోస్టును పూర్తిగా ఆంగ్లంలో పెద్ద అక్షరాలతో ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పెట్టడం గమనార్హం.

సప్లై చైన్ రిస్క్ కేటగిరీలో ఆంథ్రోపిక్‌ను చేరుస్తాం: అమెరికా రక్షణ మంత్రి

'మేం అమెరికా సైన్యం కోసం చట్టబద్ధంగానే ఆంథ్రోపిక్ క్లాడ్ ఏఐ టూల్స్‌ను వాడతాం. ఆ టూల్స్‌పై మాకు పూర్తిస్థాయి యాక్సెస్‌ను ఇవ్వాలని అడుగుతున్నాం. కానీ ఆంథ్రోపిక్ ససేమిరా అంటోంది. ఏకంగా అమెరికా రక్షణ శాఖకే ఆంథ్రోపిక్ కంపెనీ సహకరించడం లేదు. ఇలాంటప్పుడు సప్లై చైన్ రిస్క్ కేటగిరీలో దాన్ని చేర్చాల్సి ఉంటుంది' అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తాజా హెచ్చరిక చేశారు.

అమెరికా రక్షణ శాఖను కోర్టులో సవాలు చేస్తాం: ఆంథ్రోపిక్

'మా కంపెనీపై సప్లై చైన్ రిస్క్ ఆరోపణలు చేసినందుకు అమెరికా రక్షణ శాఖను కోర్టులో సవాలు చేస్తాం. సప్లై చైన్ రిస్క్ కేటగిరీ అనేది అమెరికాతో విరోధం కలిగిన దేశాల కోసం రూపొందించినది. ఆ కేటగిరీలోకి ఒక అమెరికన్ కంపెనీని ఎలా చేరుస్తారు? చట్టబద్ధంగా అలా చేయడం కుదరదు కదా? అమెరికా ప్రభుత్వంతో ఒప్పందాలను కుదుర్చుకునే అమెరికా కంపెనీలు ఇలాంటి పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుండటం ఆందోళనకరం. అమెరికన్లపై నిఘా కోసం, అటానమస్ ఆయుధాల వినియోగం కోసం మా ఏఐ చాట్‌బోట్ క్లాడ్ టెక్నాలజీని వినియోగించం అనే స్పష్టమైన హామీని అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) ఇవ్వడం లేదు. అందుకే వాళ్లకు మేం ఏఐ టూల్స్‌పై పూర్తి యాక్సెస్‌ను ఇవ్వడం లేదు' అని తాజాగా ఓ ప్రకటనలో ఆంథ్రోపిక్ వెల్లడించింది.

ఆంథ్రోపిక్ స్థానంలో ఓపెన్ ఏఐ వినియోగం: ఆల్ట్‌మన్

ఆంథ్రోపిక్ ఏఐ వినియోగాన్ని ఆపేసిన వెంటనే, తమ ఏఐ టూల్స్‌ను వాడటాన్ని అమెరికా రక్షణ శాఖ మొదలు పెట్టిందని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ప్రకటించారు. దీనిపై శుక్రవారం రాత్రే అమెరికా రక్షణ శాఖ, ఓపెన్ ఏఐ మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఇక తమ ఏఐ మోడల్స్‌ను అమెరికా రక్షణ శాఖకు చెందిన క్లాసిఫైడ్ నెట్‌వర్క్‌లలో ఉపయోగిస్తామని చెప్పారు. ఏఐ భద్రతకు కట్టుబడి ఉంటామని అమెరికా ప్రభుత్వం నుంచి తమకు హామీ లభించిందని ఆల్ట్‌మన్ వెల్లడించారు. అమెరికన్లపై నిఘా కోసం, మనుషులపై బలప్రయోగం కోసం, అటానమస్‌గా పనిచేసే ప్రాణాంతక ఆయుధాల కోసం ఏఐను వినియోగించకూడదు అనేవి ఏఐ భద్రత పరిధిలోకి వస్తాయన్నారు. వీటికి లోబడి పనిచేస్తామని అమెరికా రక్షణశాఖ తమకు హామీ ఇచ్చిందన్నారు. ఈ వివరాలను ఒప్పందంలో కూడా చేరుస్తామని ఆల్ట్‌మన్ స్పష్టం చేశారు.

ఎలాన్‌మస్క్‌కు కలిసొస్తుందా?

ఆంథ్రోపిక్ కంపెనీ అమెరికా ప్రభుత్వ కాంట్రాక్టులను కోల్పోతుండటం, ఎలాన్ మస్క్‌కు చెందిన చాట్‌బోట్ గ్రోక్‌కు కలిసొచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే గ్రోక్ ఏఐకు అమెరికా క్లాసిఫైడ్ మిలిటరీ నెట్‌వర్క్‌లోకి యాక్సెస్ ఇస్తారని తెలుస్తోంది. తమ ఏఐ టెక్నాలజీని, టూల్స్‌ను అమెరికా సైన్యానికి అందించే కాంట్రాక్టులను కుదుర్చుకునే ప్రక్రియలో ఉన్న గూగుల్, ఓపెన్ ఏఐ కంపెనీలకు ఇదొక హెచ్చరికలా ఉంటుందని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది.

ఈ ఏడాది వేతనాల్లో 9.1% వృద్ధి

ఏఓఎన్ సర్వే వెల్లడి



ముంబయి: ప్రస్తుత సంవత్సరం(2026)లో వేతనాలు సగటున 9.1 శాతం పెరిగే అవకాశం ఉందని ఓ సర్వేలో వెల్లడైంది. గత సంవత్సరంలో నమోదైన 8.9% వేతన పెంపు కంటే ఇది ఎక్కువే. వార్షిక వేతన పెంపు అంశంపై అంతర్జాతీయ వృత్తి నిపుణుల సేవల సంస్థ ఏఓఎన్ ఈ సర్వేను నిర్వహించింది. ఇందులో దేశంలోని 45 రంగాలకు చెందిన 1,400కి పైగా సంస్థలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశాయి. దీని ప్రకారం..

❑ వేతన పెంపు అంచనాలు ఒక్కో రంగానికి ఒక్కోలా ఉండనున్నాయి. అత్యధికంగా స్థిరాస్తి, మౌలిక రంగాల్లోని ఉద్యోగులకు సగటున 10.2% పెరిగే అవకాశం ఉంది. ఆ తర్వాతి స్థానంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఉండనున్నాయి. ఈ సంస్థల్లో పనిచేసే వారికి వేతనాలు 10.1 శాతం పెరగొచ్చు.

❑ ఆటోమోటివ్, వాహన తయారీ రంగాల్లోని ఉద్యోగులకు 9.9 శాతం వేతన పెంపు ఉండొచ్చు. ఇంజినీరింగ్ డిజైన్ సేవల్లోని సిబ్బందికి కూడా ఇదే స్థాయిలో వేతనాలు పెరిగే అవకాశం ఉంది.

❑ ఇంజినీరింగ్, తయారీ, రిటెయిల్ రంగంలో పనిచేసే సిబ్బందికి సగటున 9.5 శాతం ఇంక్రిమెంట్ లభించొచ్చు.

❑ సాంకేతికత, ఇంజినీరింగ్, వినియోగదారు ఆధారిత విభాగాల సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయని సర్వే తెలిపింది. పోటీతో కూడిన పరిస్థితులు నెలకొన్నందున ప్రత్యేక నైపుణ్యం ఉన్న వారిని ఆకర్షించేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని వివరించింది.

❑ 'పటిష్ఠ సూక్ష్మ ఆర్థిక మూలాల అండతో భారత్ తదుపరి వృద్ధి దశలో పయనిస్తోంది. దేశీయంగా బలమైన గిరాకీ పరిస్థితులు, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, కొత్త వాణిజ్య ఒప్పందాల వల్ల మధ్యకాలంలో వేతనాల పెంపునకు సానుకూల పరిస్థితులే కనిపిస్తున్నాయ'ని ఏఓఎన్ పార్ట్‌నర్, రివార్డ్స్ కన్సల్టింగ్ లీడర్ రూపాంక్ చౌధ్రి తెలిపారు.

వలసల రేటు కిందకు..: గత మూడేళ్లుగా వలసల రేటు తగ్గుతూ వస్తోందని సర్వే తెలిపింది. 2023లో వలసల రేటు 18.7 శాతం కాగా.. 2024లో 17.7 శాతానికి పరిమితమైంది. 2025లో మరింత తగ్గి 16.2 శాతానికి దిగివచ్చిందని వెల్లడించింది. దీంతో ఇంచుమించుగా కొవిడ్-19 పరిణామాలకు ముందున్న స్థాయికి చేరిందని పేర్కొంది. కంపెనీలు తమ ఉద్యోగులను అట్టేపెట్టుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయనడానికి వలసల రేటు క్రమేపి తగ్గుతుండటమే నిదర్శనమని సర్వే అభిప్రాయపడింది. కొత్త కార్మిక చట్టాల అమలు.. కొన్ని దశాబ్దాల కాలంలోనే కంపెనీలు ఎదుర్కొంటున్న అతిపెద్ద నియంత్రణపరమైన మార్పుల్లో ఒకటని ఏఓఎన్ ఇండియా అసోసియేట్ పార్ట్‌నర్ అమిత్ తెలిపారు.

షెల్ కంపెనీలను వాడిన ఫినో పేమెంట్స్ బ్యాంక్!

దిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా వచ్చిన అక్రమ నిధులను మళ్లించడానికి షెల్ కంపెనీలు, చెల్లింపు అగ్రిగేటర్లను ఫినో పేమెంట్స్ బ్యాంక్ వినియోగించిందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. జీఎస్‌టీ ఎగవేత ఆరోపణలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్(డీజీజీఐ) ఈ సంస్థపై దర్యాప్తు చేస్తోన్న సంగతి తెలిసిందే. 'మోసంలో పాలుపంచుకున్న ఒక సీనియర్ బ్యాంక్ అధికారిని అరెస్టు చేసినట్లు' కూడా ఆ వర్గాలు తెలిపాయి. జీఎస్‌టీ చట్టాల ఉల్లంఘనకు గాను కంపెనీ ఎండీ, సీఈఓ రిషి గుప్తాను జీఎస్‌టీ అధికారులు అరెస్టు చేసినట్లు ఫినో పేమెంట్స్ బ్యాంక్ తెలిపిన విషయం విదితమే.

సెబీ ఛైర్మన్‌తో కెనడా మంత్రి చర్చ

దిల్లీ: భారత్, కెనడా మధ్య సంస్థాగత పెట్టుబడులను పెంచేందుకు ఉన్న మార్గాలపై సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే, కెనడా ఆర్థిక మంత్రి ఫ్రాంకోయిస్ ఫిలిప్ చర్చించారు. నియంత్రణపరమైన సహకారాన్ని మరింతగా విస్తరించడంతో పాటు ఇరు దేశాలకు ఆసక్తి ఉన్న మరికొన్ని అంశాల పైనా చర్చ జరిగిందని సెబీ తెలిపింది. ఇందులో సెబీ పూర్తి కాల సభ్యుడు సందీప్ ప్రధాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మణిందర్ చీమ పాల్గొన్నారు.

భారత ఈవీ రంగంలోకి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు

గత ఐదేళ్లపై ఐఈఈఎఫ్ఏ నివేదిక




దిల్లీ: గత ఐదేళ్లలో భారత విద్యుత్ వాహన (ఈవీ) రంగం రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనర్జీ ఎకనామిక్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలసిస్ (ఐఈఈఎఫ్ఏ) నివేదిక తెలిపింది. అయితే 2030కి భారత్ నిర్దేశించుకున్న లక్ష్యం సాకారం కావాలంటే.. మరిన్ని పెట్టుబడులు అవసరం అవుతాయని పేర్కొంది. 2030 కల్లా దేశంలో మొత్తం కార్ల విక్రయాల్లో 30%, వాణిజ్య వాహన విక్రయాల్లో 70%, బస్సుల అమ్మకాల్లో 40%, ద్వి-త్రిచక్ర వాహనాల అమ్మకాల్లో 80 శాతం మేర ఈవీలే ఉండాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. 2020-2025 మధ్య కాలంలో అన్ని రూపాల్లో ఈవీ రంగంలోకి వచ్చిన పెట్టుబడులపై ఈ నివేదికను ఐఈఈఎఫ్ఏ రూపొందించింది. అలాగే దేశీయ ఈవీ రంగ మలివిడత వృద్ధికి అవసరమయ్యే పెట్టుబడులను సమీకరించే మార్గాలనూ ఇందులో ప్రస్తావించింది. 2020-2025 మధ్య వచ్చినట్లు చెబుతున్న రూ.2.23 లక్షల కోట్లలో అధిక భాగం తయారీ సామర్థ్యాల అభివృద్ధి కోసం రాగా.. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాల రూపేణా, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల కోసం మిగతావి వచ్చినట్లు నివేదిక వివరించింది. 'కేవలం ఐదేళ్లలోనే రూ.2.23 లక్షల కోట్ల మూలధన నిధుల సమీకరణ జరిగింది. అయితే 2030 నాటికి కావాల్సిన రూ.12,50,000 కోట్లలో ఇది 18 శాతమేన'ని ఐఈఈఎఫ్ఏలో క్లైమేట్ ఫైనాన్స్ విశ్లేషకులు శుభమ్ శ్రీవాస్తవ తెలిపారు. మిగతా రూ.10.2 లక్షల కోట్లను సమీకరించాలంటే రుణ సంస్కరణలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. 2020-25 మధ్య ఎలక్ట్రిక్ త్రిచక్ర విభాగంలోకి అత్యధికంగా (78%) పెట్టుబడులు వచ్చాయని నివేదిక తెలిపింది. విద్యుత్ కార్లకు గిరాకీ పెరుగుతుండటంతో 2024, 2025లో ఈ విభాగంలోకి కూడా పెట్టుబడుల రాక పెరగడం ప్రారంభమైందని వివరించింది.

వజ్రపుటుంగరం కొనేద్దాం

● యువతలో పెరుగుతున్న ఆసక్తి

● కలిసొస్తున్న 30% ధర క్షీణత



భారత వజ్రాల మార్కెట్ రూ.80,000-90,000 కోట్లుగా ఉండొచ్చని అంచనా.

అసలే పెళ్లిళ్ల సీజను. ఆభరణాలు కొనకుండా ఉండలేని పరిస్థితి. అయితే బంగారం ఉంగరం బదులుగా వజ్రపుటుంగరం వైపు దృష్టి పెట్టేందుకు వజ్రాల ధరలు వీలు కల్పిస్తున్నాయి. ముఖ్యంగా 1 క్యారట్ ఎంగేజ్‌మెంట్ ఉంగరం ధర గత ఆర్థిక సంవత్సరంలో రూ.7-8 లక్షల వరకు ఉండగా, ఇపుడు రూ.5-5.5 లక్షలకు దిగివచ్చిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నారు.

తగ్గిన ధర.. పెరిగిన గిరాకీ: 28-40 ఏళ్ల వయసు వినియోగదార్లలో సొలిటైర్స్‌పై ఆసక్తి పెరిగిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ధరలు దిగిరావడంతో గత ఏడాదితో పోలిస్తే విక్రయాలు సైతం 25-35% శాతం మేర పెరిగాయంటున్నారు. పసిడి ధర భారీగా పెరిగిన నేపథ్యంలో రూ.2 లక్షలకు అటూ ఇటూగా ధర ఉన్న సొలిటైర్స్‌కు భారీ గిరాకీ కనిపిస్తోంది.

ఇవీ కారణాలు..: ఎగుమతులకు గిరాకీ తగ్గడంతో సహజ వజ్రాల ధరలు కిందకు వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు కూడా ఇందుకు దోహదం చేశాయి. భారత్ నుంచి అధికంగా కట్, పాలిష్డ్ వజ్రాలను తీసుకునే చైనా కూడా వాటి పరిమాణాన్ని తగ్గించుకోవడం దేశీయ ధరలపై ఒత్తిడిని పెంచింది. 20 గ్రాముల పసిడి ఉంగరం లేదా చెయిన్‌తో పోలిస్తే రూ.2 లక్షల విలువైన సొలిటైర్స్‌ను కొనుగోలు చేయడం చౌక కావడంతో మిలేనియల్స్‌లో ఎక్కువ మంది తమ ఎంగేజ్‌మెంట్, వార్షికోత్సవాలకు వీటివైపే మొగ్గుచూపుతున్నారు. ధరలు కిందకు రావడంతో తొలిసారి కొనుగోలు చేసే వారి సంఖ్య 35-40% వరకు పెరిగింది. ముఖ్యంగా 28-40 ఏళ్ల వయసున్న వారిలో ఎక్కువ ఆసక్తి కనిపించింది.

9 క్యారట్, 14 క్యారట్ పసిడిపైనా..: సంప్రదాయ, భారీ డిజైన్‌లకు బదులుగా సింపుల్‌గా ఉండేవాటిపై యువత దృష్టి సారిస్తున్నారు. 9 క్యారట్, 14 క్యారట్ పసిడి ఆభరణాలతో పాటు తేలికపాటి సహజ వజ్రాభరణాల వైపు మొగ్గుచూపుతున్నారని క్యారట్‌లేన్ సీఈఓ అతుల్ సన్హా అంటున్నారు. 9 క్యారట్ పసిడికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ కూడా వినియోగదారు విశ్వాసాన్ని బలోపేతం చేస్తోందన్నారు. నెలవారీగా జరిగే 9 క్యారట్ అమ్మకాలు 200% మేర పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.

ఈనాడు సినిమా



ఏందయ్య సామీ... ఇట్టగాస్తాంది ఎన్నెల..

కలిసి ఏడడుగులు వేసిన విజయ్ దేవరకొండ, రష్మిక జంటకు శుభాకాంక్షలు చెబుతూ 'రణబాలి' బృందం పెళ్లి పాటని విడుదల చేసింది. విజయ్, రష్మిక జంటగా... రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమే 'రణబాలి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీ-సిరీస్ ఫిల్మ్స్‌తోపాటు గుల్షన్‌కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రణబాలి పాత్రలో విజయ్, జయమ్మగా రష్మిక నటిస్తున్నారు. ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట నిజ జీవితానికి అద్దం పట్టేలా సాగే పెళ్లి పాట ప్రోమోని శనివారం విడుదల చేసింది చిత్రబృందం. 'ఏందయ్య సామీ... ఇట్టగాస్తాంది ఎన్నెల.. ఉసిస్సో ఉంది సిత్తరా ఉయ్యాలా... వీచే గాలికీ అత్తరద్దినదెవ్వరో... మారే జాముకీ మత్తు పెట్టిందెవ్వరో... మాయదారి మనస్సాగ జాగారమయ్యారా...' అంటూ సాగే ఈ పాటని అజయ్ - అతుల్ స్వరపరిచారు. ఈ పాటలో విజువల్స్‌తోపాటు, విజయ్ - రష్మిక జోడీ కనిపించిన విధానం ఎంతో ప్రత్యేకంగా ఉంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

మంగాపురం వెంకటప్పయ్య నాయుడు


మోహన్‌బాబు

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం... 'శ్రీనివాస మంగాపురం'. సీనియర్ కథానాయిక రవీనాటాండన్ కుమార్తె రాషా తడానీ కథానాయికగా నటిస్తోంది. అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. చందమామ కథలు పతాకంపై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. సి. అశ్వినీదత్ సమర్పకులు. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు మోహన్‌బాబు ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఆ పాత్రని పరిచయం చేస్తూ శనివారం లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. వెంకటప్పయ్య నాయుడుగా ఆయనకే శక్తిమంతమైన పాత్రని పోషిస్తున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. గాఢమైన కథ, కథనాలతో, అజయ్ భూపతి శైలి బలమైన భావోద్వేగాలతో రూపొందుతున్న చిత్రమిదని, నాయకా నాయికలుగా నటిస్తున్న కొత్త జంటతోపాటు, మోహన్‌బాబు పాత్ర సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: జయకృష్ణ.




ఈటీవీ విన్ వినోదాల జాతర

మనసుకు హత్తుకునే కథలతో ప్రేక్షకుల్ని విశేషంగా అలరిస్తోంది ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్. వైవిధ్యమైన కంటెంట్‌తో నాన్‌స్టాప్‌గా వినోదాలు పంచుతున్న ఈ సంస్థ ఇటీవలే మూడేళ్లు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా 'విన్ జాతర' పేరుతో పలు సిరీస్‌లు, సినిమాల్ని ప్రకటిస్తూ.. వాటికి సంబంధించిన పోస్టర్లను పంచుకుంది ఈటీవీ విన్.

పేరు	నటీనటులు	దర్శకత్వం	నిర్మాణం
'పాకశాల పంతం'	రమ్యకృష్ణ, ఐశ్వర్య రాజేశ్	కరణ్ తుమ్మకొమ్మ	కొల్లా ప్రవీణ్
'పాపం ప్రతాప్'	తిరువీర్	ఎస్.పి.దుర్గా నరేష్	రాకేష్ రెడ్డి, రుద్రదేవ్
'కానిస్టేబుల్ కనకం 3'(సిరీస్)	వర్ష బొల్లమ్మ	ప్రశాంత్ కుమార్ దిమ్మల	కె.ఎస్ సాయిబాబా, వి.హేమంత్ కుమార్
'న్యూటన్స్ థర్డ్‌లా'	సుమంత్, జగపతిబాబు, రవి వర్మ	రాజేష్ కర్ర	హరీశ్
'మండువలోగిలి'	----	సుధీర్ వర్మ పెరిచర్ల	జనని బండ్ల
'#డీఎమ్'	జేడీ చక్రవర్తి	సురేశ్ గడిపర్తి	సతీశ్ వర్మ, సీతారామరాజు రాజశేఖర్
'సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్'	ఆది సాయికుమార్	రాఘవేంద్ర కరాని	ప్రదీప్ జూలూరు
'జిలేడు చెట్టు'	----	శ్రవణ్	సాయి కిశోర్ పొన్నం, సుహృత్(క్రియేటివ్ ప్రొడ్యూసర్)
'ద అన్‌టోల్డ్ టేల్ ఆఫ్ బ్లడ్-వై గోదావరి'	----	అశోక్ కోటిపల్లి	ఫణి అడపాక, జయలక్ష్మి
'#బాలు గీత'	----	ప్రతాప్ కొల్లా రెడ్డి	సుప్రియ యార్లగడ్డ
'గుర్తుకొస్తున్నాయి' (సిరీస్)	విరాజ్ అశ్విన్	వినోద్ గాలి	శరత్ చంద్రనాయుడు
'లిటిల్ థింగ్స్' (తెలుగు, ఇంగ్లిష్)	----	కార్తికేయ కరెడ్ల	సాయి కిశోర్ పొన్నం, సుహృత్(క్రియేటివ్ ప్రొడ్యూసర్)
'మాయ'	----	దినూ థామస్	కె.సాయి కృష్ణా రెడ్డి
'జీఎన్‌కే'	----	ఆరే జశ్వంత్ రెడ్డి	రాజీ సుహాస్
'కాఫీ అండ్ క్యాపుచినో'	----	ప్రశాంత్ బసిరెడ్డి	వెంకట్, బ్రహ్మారెడ్డి
'ప్రొడక్షన్ నంబర్ 9'	----	సురేశ్ నరెడ్ల	రాజేశ్ దండా
'ప్రొడక్షన్ నంబర్ 13'	----	బద్దం రాజశేఖర్ రెడ్డి	శరత్ మరార్
కొత్త చిత్రం	----	ప్రణయ్ వల్లూరిపల్లి, గిరి పెమ్మసాని	వంశీ నందిపాటి

ఏటిగట్టున ఆఖరి పోరాటం



మహాభారతంలోని కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించేలా పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు తెలిపింది 'ఎస్.వై.జి (సంబరాల ఏటిగట్టు)' చిత్రబృందం. సాయిదుర్గా తేజ్ కథానాయకుడిగా... రోహిత్.కె.పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. 'హను-మాన్'తో విజయాన్ని అందుకున్న నిర్మాతలు కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి సంయుక్తంగా ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిస్తున్నారు. ప్రస్తుతం పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 35 రోజులపాటు రూ.20 కోట్ల వ్యయంతో ఆ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు తెలిపాయి సినీ వర్గాలు. "ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచాలనే లక్ష్యంతో విజువల్ హంగులతో, యుద్ధభూమిని తలపించేలా పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నాం. ఈ సినిమాలో 18 పోరాటఘట్టాలు ఉంటాయి. స్టంట్ కొరియోగ్రాఫర్ కెవిన్ నేతృత్వంలో వాటిని తెరకెక్కిస్తున్నాం. సాయి దుర్గా తేజ్ ఓ సరికొత్త లుక్‌లో, తన కెరీర్‌లోనే ఎంతో క్లిష్టమైన పాత్రని ఇందులో చేస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో భారీస్థాయిలో చిత్రాన్ని విడుదల చేస్తున్నామ"ని నిర్మాతలు తెలిపారు. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల తదితరులు నటిస్తున్నారు.

డిసెంబరులోనే మా సినిమా లీక్ అయ్యింది!


నయన్ సారిక, శ్రీవిష్ణు

"మా సినిమా డిసెంబరు నెలలోనే లీక్ అయిపోయింది. పైరసీదారులు విడుదలకు ముందు రోజు వరకూ నిర్మాతల్ని బ్లాక్ మెయిల్ చేస్తూనే ఉన్నారు. లీకేజీ అయిందేదీ బయటకు రాకుండా అరికడుతూనే... మిగిలిన సినిమాని పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. మంచి స్పందనతో... నా కెరీర్‌లోనే చెప్పుకోదగ్గ వసూళ్లు రావడం ఎంతో తృప్తినిచ్చింది" అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా, యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విష్ణు విన్యాసం'. నయన్ సారిక కథానాయిక. సుమంత్ నాయుడు.జి, సుబ్రహ్మణ్యం నాయుడు నిర్మించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి లభిస్తున్న స్పందనపై సినీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తూ శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ "నవ్వించాలనే ప్రయత్నంతో చేసిన ఈ సినిమా లక్ష్యం నెరవేరినట్టైంది. అమెరికాలోనూ ప్రేక్షకుల నుంచి గొప్ప ఆదరణ లభిస్తోంది. ఈ సినిమాని వేగంగా విడుదల చేయడానికి కారణం లీక్ కావడమే. బృందమంతా మంచి సహకారం అందించడంతో ఇంత వేగంగా పూర్తి చేశాం" అన్నారు. నిర్మాత సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ "కుటుంబంతో కలిసి చూడాల్సిన సినిమా ఇది. ప్రతీ షోకీ వసూళ్లు పెరుగుతున్నాయి. 'మృత్యుంజయ్' కంటే ముందే ఈ సినిమాని విడుదల చేయడానికి కారణం పైరసీనే. మా సినిమాని వీడియోలుగా నాకు పంపుతూ బెదిరించారు. మా బృందం నుంచే సినిమా లీక్ అయ్యింది. దీనిపై వెంటనే చలన చిత్ర వాణిజ్య మండలికీ, పోలీసు అధికారులకీ ఫిర్యాదు చేశాం. పరిస్థితి అదుపు తప్పుతుందేమో అని వెంటనే సినిమాని పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం" అన్నారు.

ముత్తు వచ్చాడు మీ కోసం!


విజయ్ సేతుపతి

"ఊర్లో వెతుకు.. అడవిలో వెతుకు.. సముద్రంలో కూడా చూడు.. ఎన్ని చోట్లా వెతికినా ఈ ముత్తు దొరుకుతాడు అనుకుంటున్నారా? అయినా మీరు అతని కోసం వెతకాల్సిన అవసరం లేదు.. ముత్తునే మీ కోసం వచ్చాడు" అని అంటున్నారు విజయ్ సేతుపతి. మరి ఈ ముత్తు ఎవరు? అతని కోసం అంతగా వెతకాల్సిన పనేంటి? అనేది తెలియాలంటే 'కట్టాన్' సిరీస్ చూడాల్సిందే. ఇటీవలే 'గాంధీ టాక్స్' లాంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిన విజయ్ ప్రధాన పాత్రలో ఎమ్.మణికందన్, బి.అజిత్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న సిరీస్ ఇది. తాజాగా ఈ సిరీస్ ఈ నెల 27న రాబోతున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది ఓటీటీ సంస్థ జియోహాట్‌స్టార్. 'ఒక పెట్టె.. ఒక రహస్యం' అనే వ్యాఖ్యను జోడించింది. రూరల్ యాక్షన్ డ్రామాగా ఈ సిరీస్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ముత్తు అలియాస్ కట్టాన్ పాత్రలో కనిపించనున్నారు విజయ్ సేతుపతి. ప్రస్తుతం ఆయన ఖాతాలో 'స్లమ్ డాగ్', 'ట్రైన్'తో పాటు తదితర చిత్రాలున్నాయి.

స్ఫూర్తిని నింపే మహిళా కబడ్డీ


పూజ నర్వాల్, సుమన్

ఒక పల్లెటూరికి చెందిన పేద యువతి కబడ్డీ క్రీడలో రాణించేందుకు ఎన్ని కష్టాల్ని ఎదుర్కొంది? దేశం గర్వపడేలా ఎదిగిన ఆమెకు ఎదురైన సవాళ్లు ఎలాంటివో తెలియాలంటే మా 'మహిళా కబడ్డీ' చిత్రం చూడాల్సిందే అంటున్నారు ఆర్.కె.గౌడ్. ఆయన ఆర్కే ఫిల్మ్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రమిది. పూజ నర్వాల్, శ్రీనివాసరెడ్డి, రాధిక రెడ్డి సహా మొత్తం ఏడుగురు నిజమైన కబడ్డీ క్రీడాకారులు ఇందులో ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. సుమన్, ఆక్సాఖాన్, తులసి ఇతర కీలక పాత్రధారులు. దర్శకనిర్మాత మాట్లాడుతూ 'నేను కూడా కబడ్డీ క్రీడాకారుడినే. మన దేశంలో క్రికెట్ తర్వాత అంత ఆదరణ ఉన్న క్రీడ ఇది. ఆ నేపథ్యంలో స్ఫూర్తిని నింపే ఓ మంచి కథని సిద్ధం చేశా. యువతరం తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది. తెలుగుతోపాటు, హిందీ భాషల్లోనూ తెరకెక్కిస్తున్నా. పాటలు ఇప్పటికే పూర్తయ్యాయి. త్వరలోనే చిత్రాన్ని పూర్తి చేస్తాం" అన్నారు. క్రీడానేపథ్యంలో సాగే ఓ మంచి చిత్రమిదనీ, కబడ్డీలో రాణిస్తున్న యువతికి తండ్రిగా నటిస్తున్నానని చెప్పారు సుమన్. ఈ కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారులు రాధికరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పూజ నర్వాల్, నటి తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి యువకుడికి దగ్గరయ్యేలా


శ్రీధర్, నవ్య, జగన్

జగన్ యోగిరాజు, నవ్య చిట్యాల జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. రఘువర్ధన్ కోట్ల దర్శకుడు. శ్రీహన్సిక పెద్దిరెడ్డి నిర్మాత. దేవీ ప్రసాద్ ముఖ్యభూమిక పోషిస్తున్నారు. ప్రేమ, డ్రామాతో కూడిన ఈ చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి శ్రీధర్ పెద్దిరెడ్డి క్లాప్‌నిచ్చారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "ప్రతి యువకుడి మనసుకు దగ్గరయ్యే భావాలు, ప్రతి కుటుంబం ఆస్వాదించే వినోదం ఇందులో ఉంటాయి" అన్నారు.

పాప కోసం... 'మృత్యుంజయ్'

'కచ్చితంగా నువ్వు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తా' అంటూ ఓ పాపకి మాట ఇచ్చాడు శ్రీవిష్ణు. అదంతా 'మృత్యుంజయ్' సినిమాలో భాగమే. ఇంతకీ ఆ పాప అడిగిన ప్రశ్న ఏమిటో, అతనికి దొరికిన సమాధానమేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. శ్రీవిష్ణు కథానాయకుడిగా, హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. మార్చి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ శనివారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'సన్నీ నా జీవితంలో భాగం. మా 18 ఏళ్ల స్నేహంలో సన్నీలో నేనెన్నో గమనించా. ప్రత్యేకమైన కథల్ని గుర్తించే స్వభావం తనలో ఉంది. ఒక విభిన్నమైన కథతో రూపొందుతున్న ఈ సినిమాతో నిర్మాణంలోకి అడుగు పెడుతుండడం ఆనందంగా ఉంది. ట్రైలర్ ఉత్కంఠభరితంగా, థ్రిల్లింగ్‌గా ఉంద"ంటూ సామాజిక మాధ్యమాల్లో అభినందనలు చెప్పారు ఎన్టీఆర్.

అనగా అనగా అమెరికాలో....


అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ

అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా ఉద్భవ్ రఘు తెరకెక్కిస్తోన్న చిత్రం 'వీసా: వింటారా సరదాగా'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని 'అనగా అనగా అమెరికా...కథ మొదలిక.. మది గదులని తెరవగా...' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. సనారె సాహిత్యం అందించిన ఈ పాటకు విజయ్ బుల్గానిన్ స్వరాలు అందించారు. ఈ చిత్రం ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

'రుక్మిణి' ఎవరు?


మనోజ్

విభిన్నమైన హారర్ కామెడీ కథతో రూపొందిన మా 'రుక్మిణి' అందరినీ అలరిస్తుందన్నారు నిరంజన్. ఆయన కథానాయకుడిగా... సింహాచలం గుడుపూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. గ్రీష్మ నేత్రిక, ప్రియ జస్పర్, దీప్తి శ్రీరంగం ప్రధాన పాత్రధారులు. నేలబల్లి సుబ్రమణ్యంరెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని ఇటీవల హీరో మంచు మనోజ్ విడుదల చేశారు. కథానాయకుడు మాట్లాడుతూ "మా సినిమాలో రుక్మిణి ఎవరు? ఆమె కథేమిటన్నది ఆసక్తికరం" అన్నారు.

అదొక పెద్ద కథ


శ్రీనాథ్, గాయత్రి

శ్రీనాథ్ మాగంటి కథానాయకుడిగా... బాల సతీశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మల్లేశ్'. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల కథానాయికలు. రాజేశ్ నిర్మాత. ఈ చిత్రం మార్చి 6న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శనివారం ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. అదొక పెద్ద కథ... అంటూ మొదలయ్యే ట్రైలర్ తెలంగాణలోని ఓ పల్లెటూరి నేపథ్యంలో సరదా సరదాగా సాగుతుంది. మురళీధర్‌గౌడ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, సాయిప్రసన్న తదితరులు నటించారు.

సంఘర్షణే ఈ చిత్రానికి బలం


మీరారాజ్, సాయిసింహాద్రి

ప్రేక్షకులపై బలమైన ప్రభావం చూపిస్తున్న 'సన్ ఆఫ్' తరహా మంచి చిత్రాలు మరిన్ని తెరకెక్కాల్సిన అవసరం ఉందన్నారు నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్. ఆయన ముఖ్య అతిథిగా ఇటీవల హైదరాబాద్‌లో 'సన్ ఆఫ్' విజయోత్సవం జరిగింది. సాయి సింహాద్రి కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా నిర్మించిన చిత్రమిది. బత్తుల సతీశ్ దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి టి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "సాయిసింహాద్రి ఎంతో తపన కలిగిన నటుడు, నిర్మాత. తన తొలి సినిమాకే మంచి స్పందన రావడం ఆనందంగా ఉంది" అన్నారు. తండ్రీకొడుకుల మధ్య భావోద్వేగ బంధం, సంఘర్షణ ఈ సినిమాకి ప్రధాన బలం అన్నారు పంపిణీదారులు శోభారాణి. అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న తాను, సినిమాపై ఆసక్తితో ఏడాదిన్నరగా ఇక్కడే ఉంటూ ఈ చిత్రాన్ని పూర్తి చేశానని, విడుదల చేయడమే విజయంగా భావిస్తున్నానని సాయిసింహాద్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కథానాయిక మీరారాజ్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

ఈసారి ఖమేనీ.. కాచుకుంటారా?

• ఇరాన్‌లో చిచ్చుకు 47 ఏళ్లుగా సీఐఏ కుట్రలు

ఇరాన్‌ను విచ్ఛిన్నం చేయాలనే అమెరికా ప్రయత్నాలు ఈనాటివి కావు. 1979లో ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌ను సైనికంగా, నైతికంగా దెబ్బతీసే కుట్రలను యూఎస్ ఉద్ధృతంచేసింది. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ దశాబ్దాలుగా ఇరాన్‌లోని ప్రభుత్వాలను బలహీనపరిచే ప్రయత్నాల్లో నిమగ్నమైంది. ఇజ్రాయెల్ గూఢచారసంస్థ మొస్సాద్‌తో కలిసి సంయుక్త ఆపరేషన్లను నిర్వహించింది. అయితే వారి ప్రయత్నాలు ఏవీ పూర్తిస్థాయి ఫలితాలనివ్వలేదు.

1980 ఆపరేషన్ ఈగిల్ క్లా: ఇస్లామిక్ విప్లవం సమయంలో ఇరాన్ వద్ద బందీలుగా ఉన్న వివిధ దేశాల రాయబార కార్యాలయాల సిబ్బందిని రక్షించడానికి సీఐఏ-అమెరికా సైన్యం సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఇందులో పాల్గొన్న హెలికాప్టర్లు ఇసుక తుపానులు, యాంత్రిక లోపాలతో లక్ష్యాన్ని సాధించలేకపోయాయి. ఒక హెలికాప్టర్, సీ-130 విమానాన్ని ఢీకొట్టడంతో ఎనిమిది మంది అమెరికా సైనికులు మరణించారు. ఈ దాడి విఫలమవడంతో అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీకార్టర్ అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సివచ్చిందని చెబుతారు.

1980–88: అమెరికా ఇరాన్‌పై పరోక్ష దాడులను ఉద్ధృతంచేసింది. ఇరాన్‌పై పోరాడుతున్న సద్దాం హుస్సేన్ నాయకత్వంలోని ఇరాక్ ప్రభుత్వానికి అన్నిరకాల ఆయుధాలను అందించింది. గూఢచార సమాచారాన్ని, ఉపగ్రహ చిత్రాలను, ఆయుధ మద్దతును కూడా అందించి ఇరాక్‌తో యుద్ధంలో ఇరాన్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నించింది. ఇరాన్ ఆ యుద్ధాన్ని తట్టుకుని నిలబడటంతో పాటు, అంతర్గతంగానూ బలపడింది.

1980–90: సీఐఏ దేశంలో ఇరాన్‌పై మరింతగా దృష్టిపెట్టింది. ఇరాన్ పాలనా వ్యవస్థలను దెబ్బతీసి, ప్రభుత్వాన్ని పతనం చేసేందుకు విశ్వప్రయత్నం చేసింది. అయితే ఇరాన్ వీటిని సమర్థంగా అడ్డుకోగలిగింది. ఇదే సమయంలో ఇరాన్‌లో ఉన్న సీఐఏ నెట్‌వర్క్ గుట్టుకూడా బట్టబయలైంది. వాటిని స్థానిక ప్రభుత్వం నిర్వీర్యం చేసింది.

2010– 2020: పశ్చిమాసియాలో సైనికశక్తిగా బలపడుతున్న ఇరాన్ మెడలు వంచేందుకు అమెరికా - ఇజ్రాయెల్ సంయుక్తంగా నడుంకట్టాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవాలనే లక్ష్యంతో 2010లో వారు నిర్వహించిన స్టక్స్‌నెట్ సైబర్‌దాడి ఇరాన్ అణు సెంట్రిఫ్యూజ్‌లను తీవ్రంగా దెబ్బతీసింది. ఇది ఇరాన్‌పై తాత్కాలికంగా ప్రభావం చూపినా, వ్యూహాత్మక విజయం మాత్రం అమెరికాకు దక్కలేదు. అదే సమయంలో ఇరాన్ అణు శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం మొదలుపెట్టారు. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొస్సాద్ పలు ఆపరేషన్లను నిర్వహించింది. 2020లో మొహసెన్ ఫక్రిజాదే హత్య సంచలనం సృష్టించింది. మరోవైపు ఆర్థిక ఆంక్షలు, ఇతర దేశాలతో సంబంధాలలో ఒత్తిడి తేవడం ద్వారా ఇరాన్‌ను దిగ్బంధం చేసే వ్యూహాలను అమలుచేసింది. అంతర్గతంగా నిరసనలు, ప్రజా ఉద్యమాలను రెచ్చగొట్టే ప్రయత్నాలూ అగ్రరాజ్యం చేసింది. వీటన్నిటిలో సీఐఏ ముఖ్యపాత్ర పోషించింది. అయితే ఇరాన్ ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలను అభివృద్ధి చేసుకుని చిక్కుముడుల నుంచి బయటపడగలిగింది. పశ్చిమాసియాలో కాకుండా ఇతర దేశాలతో మంచి సంబంధాలను పెంపొందించుకుంది.



ఇరాన్ ఈసారి గట్టెక్కుతుందా?

అలుపెరగకుండా అమెరికా దాడులను తట్టుకొని నిలుస్తున్న ఇరాన్ ఈసారి కూడా గట్టెక్కుతుందా? అనేది ఆసక్తికరం! ఎందుకంటే... ఈసారి ఇరాన్‌పై దాడి గతంలో వాటికంటే కొంత ప్రత్యేక పరిస్థితుల్లో జరుగుతోంది. అంతర్గతంగా ఇరాన్‌లో రాజకీయ, సామాజిక, ఆర్థిక స్థితిగతులు ఖమేనీ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారాయి. ముఖ్యంగా ఆర్థికస్థితి దిగజారడంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. కొద్దినెలల కిందటే... దేశవ్యాప్తంగా ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా... ఆందోళనల రూపంలో ప్రజాగ్రహం వ్యక్తమైంది. ఈ ఆందోళనలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసినట్లు కనిపించినా... పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది. దీనికి అమెరికా, ఇజ్రాయెల్‌లు అన్నివిధాలుగా ఆజ్యం పోస్తున్నాయి. ప్రభుత్వాన్ని మీ చేతుల్లోకి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగానే పిలుపు ఇస్తున్నారు. ఇలా... ఒకవైపు లోపలి వ్యతిరేకత... మరోవైపు బయటి నుంచి శత్రువుల దాడులను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ ఈసారి ఎలా తట్టుకుంటారన్నది ఆసక్తికరం!

- ఈనాడు ప్రత్యేక విభాగం

గల్ఫ్‌లో గందరగోళం

• ఇరాన్ దాడులతో ఉక్కిరిబిక్కిరి

దుబాయ్: గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడులతో అక్కడ ఉంటున్న భారతీయులతోపాటు స్థానికుల్లో భయాందోళన నెలకొంది. ప్రముఖ వ్యాపార, పర్యాటక కేంద్రమైన దుబాయ్‌సహా పలు నగరాల్లో గందరగోళం నెలకొంది. పలువురు అక్కడి నుంచి సామాజిక మాధ్యమాల్లో భయాందోళన వ్యక్తం చేస్తూ పోస్టులు పెడుతున్నారు. తమను ఇంట్లో నుంచి బయటకు రావొద్దని సూచిస్తున్నారని వివరిస్తున్నారు.

దుబాయ్‌లో నివాసముంటున్న మాయా తనేజా శనివారం ఉదయం భారీ పేలుడు శబ్దం విన్న క్షణం నుంచీ తన బంధువులు, స్నేహితులకు నిరంతరం పోస్టు చేస్తున్నారు. 'మా బంధుమిత్రులు ఎలా ఉన్నారో తెలుసుకునేందుకు అనేక పోస్టులు చేశా. బహ్రెయిన్‌లోనూ భారీ పేలుళ్లు జరిగినట్లు మా బంధువు ఒకరు ఫోన్ ద్వారా తెలిపారు. మొత్తం గల్ఫ్ ప్రాంతమంతా మంటల్లో ఉన్నట్లు భావన కలుగుతోంది' అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా జరుగుతుందని పశ్చిమాసియా వాసులు గడచిన కొన్ని నెలలుగా ఊహిస్తున్నా, తొలిసారిగా దాడుల్ని ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఇరాన్ ఏక కాలంలో అమెరికా స్థావరాలున్న యూఏఈ, బహ్రెయిన్, ఖతార్‌లపై క్షిపణులను ప్రయోగించడంతో సాధారణ పౌరులు భయపడుతున్నారు. తాను నివాసముంటున్న ప్రాంతంలో జెట్ యుద్ధ విమానాలు ఎగురుతున్నాయని అబుదాబిలో నివసిస్తున్న భారతీయుడు సయ్యద్ తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 'మేం నివసిస్తున్న భవనం కిటికీలు కదిలిపోయాయి' అని తెలిపారు. ఇరాన్ దాడుల అనంతరం అనేక దేశాల్లో సైరన్ మోత ప్రజల్ని మరింత గందరగోళానికి గురిచేసింది. ఇరాన్ ప్రయోగించిన అనేక క్షిపణులను గాల్లోనే పేల్చేశామని యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. పేలిపోయిన క్షిపణి శిథిలాలు ఒక నివాస ప్రాంతంలో పడి ఓ వ్యక్తి మరణించారు.

ప్రపంచంపై తీవ్ర ప్రభావం!

• పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మరోసారి అనిశ్చితి

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగడంతో ప్రపంచంపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది అమెరికా, ఇజ్రాయెల్ కలిసి చేసిన దాడిలో ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయి. ఆ దేశం బలహీనపడిపోయిన ఈ సమయాన్నే అవకాశంగా తీసుకుని అక్కడ ప్రభుత్వాన్ని కూల్చేయాలని రెండు దేశాలు నిశ్చయించాయి. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలకు, ఒప్పందాలకు భంగకరమనే సంగతిని అవి పట్టించుకోవడం లేదు. యుద్ధాన్ని ఒక రాజకీయ చర్యగా భావిస్తున్నాయి తప్పితే ఒకసారి మొదలైతే దాన్ని ఆపడం కష్టమనే వాస్తవాన్ని విస్మరిస్తున్నాయి.

ఇజ్రాయెల్ నిరంతరం యుద్ధం చేస్తుంటేనే తాను రాజకీయంగా బలపడతానని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నమ్ముతున్నారు. హమాస్‌తో జరిగిన యుద్ధం తనకు లాభిస్తోందని భావిస్తూ వస్తున్న ఆయన ఈ ఏడాది ఇజ్రాయెల్‌లో ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఇరాన్‌వల్ల ఇజ్రాయెల్ అస్తిత్వానికే ప్రమాదమని ఓటర్లకు చాటుతున్నారు. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌లో అయతుల్లాల పాలనపై ఉద్యమించిన వారికి సాయం అందబోతోందని జనవరిలో ఊరించారు. అంతలో ఆయన దృష్టి వెనెజువెలాపైకి మళ్లింది. అక్కడ మదురో సర్కారును కూల్చేసిన తరువాత మళ్లీ ఇరాన్‌పైకి దృష్టి మళ్లించారు. ఇరాన్ ప్రజలు స్వేచ్ఛావాయువులను పీల్చే సమయం వస్తోందని అభయమిచ్చి క్షిపణి దాడులకు దిగారు. ఇస్లామిక్ ప్రభుత్వం కూలిపోనున్నదని నెతన్యాహు ప్రకటించారు.

కేవలం యుద్ధ విమానాలు, క్షిపణి దాడులతోనే ప్రభుత్వాలు కూలిపోతాయనడానికి ఎక్కడా రుజువులు లేవు. అమెరికా, నాటో 2003లో ఇరాక్‌పై పూర్తి స్థాయి యుద్ధం చేయడంవల్లే సద్దాం హుసేన్ ప్రభుత్వం కూలిపోయింది. అమెరికా, నాటోల యుద్ధ విమానాల అండతో లిబియాలో తిరుగుబాటుదారులు చెలరేగిపోయి గడాఫీ ప్రభుత్వాన్ని కూల్చేశారు. ఈ రెండు యుద్ధాల తరువాత ఆ దేశాల్లో అంతర్యుద్ధాలు చెలరేగి వేలమంది హతులయ్యారు.



ఇరాన్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో సురక్షిత ప్రాంతంలో తలదాచుకున్న పౌరులు

యుద్ధం కారణంగా ఖమేనీ ప్రభుత్వం కూలిపోతుందనుకున్నా కొత్తగా ఏర్పడే ప్రభుత్వం మానవ హక్కులను రక్షిస్తుందని ఆశపెట్టుకోలేం. మరోవైపు ఖమేనీని చంపినంత మాత్రాన ఇస్లామిక్ ప్రభుత్వం కూలిపోదని గమనించాలి. ఆయన హతమైతే వేరొక ఆయతుల్లా అధికారం చేపట్టవచ్చు. ఆయనకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అండదండలు పూర్తిగా ఉంటాయి. యుద్ధం అనివార్యమని ఇరాన్‌కు ముందే తెలిసినా అమెరికా, ఇజ్రాయెల్‌లతో చర్చలకు ప్రయత్నించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్. . ఇరాన్‌తో తమ పూర్వ ప్రభుత్వాలు కుదుర్చుకున్న సామరస్య ఒప్పందాలను తుంగలో తొక్కి యుద్ధాన్ని తెచ్చిపెట్టారు. అది దీర్ఘకాలం సాగితే పశ్చిమాసియాపైనే కాదు.. యావత్ ప్రపంచంపైనా విస్తృత ప్రభావం చూపకమానదు.

- నేషనల్ డెస్క్

భయం గుప్పిట్లో బతుకుతున్నాం

• త్వరగా స్వదేశానికి తీసుకెళ్లండి
• మోదీకి ఇరాన్‌లోని భారతీయ విద్యార్థుల విన్నపాలు

ఈటీవీ భారత్: 'భయం గుప్పిట్లో బతుకుతున్నాం, మమ్మల్ని త్వరగా భారత్‌కు తీసుకెళ్లండి' అని ప్రధాని మోదీని కోరుతూ ఇరాన్‌లోని భారత విద్యార్థులు సోషల్ మీడియా సందేశాలను పెట్టారు. ఇదే అంశంపై ప్రధానికి చాలా మంది విజ్ఞప్తులు చేస్తున్నారు. "ఇరాన్‌లో ఇప్పుడు పరిస్థితి దారుణంగా ఉంది. ఏం జరుగుతుందో మేం ఊహించలేకపోతున్నాం. మమ్మల్ని వీలైనంత త్వరగా భారత్ తీసుకెళ్లమని కోరుతున్నాం" అని టెహ్రాన్‌లో ఉంటున్న ఓ భారతీయ విద్యార్థిని వీడియో సందేశాన్ని విడుదల చేసింది. ఆమె గొంతులో ఆందోళన, భయం, వణుకు స్పష్టంగా కనిపించాయి. ఆ విద్యార్థిని రికార్డు చేసిన వీడియోలో భారీ పేలుళ్ల శబ్దాలు కూడా వినిపించాయి.




అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్‌లో ధ్వంసమైన భవనం

భయంభయంగా బతుకుతున్నాం కాపాడండి

"ఇరాన్‌లో మేం అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బతుకుతున్నాం. టెహ్రాన్‌లో చాలాచోట్ల బాంబుదాడులు జరిగాయి. ఉదయం నుంచీ దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్ నుంచి వెళ్లిపొమ్మని గతంలోనే మాకు భారతీయ ఎంబసీ అడ్వైజరీ ఇచ్చింది. కానీ ఇక్కడి యూనివర్సిటీ వాళ్లు పరీక్షలు పూర్తయ్యాకే వెళ్లమని అంటున్నారు. అందువల్లే ఇరాన్‌లో ఉండిపోయాం. మమ్మల్ని భారత్ తీసుకెళ్లండి" అని పేర్కొంటూ ఇరాన్‌లోని ఉర్మియా యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మెహక్ హుస్సేన్ తెలిపారు.

నా కూతురితో మాట్లాడటం అదే చివరిసారి

"నా కూతురు ఇరాన్‌లోనే చదువుతోంది. గత నెలలో ఇరాన్‌లో బాగా అల్లర్లు జరిగాయి. చాలామంది చనిపోయారు. దీంతో అక్కడి భారత ఎంబసీ అడ్వైజరీ ప్రకారం, నా బిడ్డ జనవరి నెలలోనే ఇండియాకు వచ్చింది. గతవారమే మళ్లీ ఇరాన్‌కు వెళ్లింది. అప్పటి నుంచి నా కూతురితో మాట్లాడదామంటే ఫోన్ కలవడం లేదు. అక్కడ మొబైల్ ఫోన్ సర్వీసులను తరచుగా బంద్ చేస్తున్నారట. నిన్ననే నా బిడ్డతో మాట్లాడాను. ఆమెతో మాట్లాడటం అదే చివరిసారి. ఇప్పుడు యుద్ధం మొదలైంది కదా. ఇరాన్‌కు ఫోన్ కాల్స్ కలవడం లేదు. చాలా టెన్షన్‌గా ఉంది. భయంగా ఉంది. భారత ప్రభుత్వం మా పిల్లలను కాపాడి ఇండియాకు తీసుకొస్తే రుణపడి ఉంటాం" అని జమ్మూకశ్మీరులోని శ్రీనగర్‌కు చెందిన ఓ విద్యార్థిని తండ్రి హైదర్ చెప్పుకొచ్చారు.



మా మాట వినకుంటే ఇరాన్‌ను నాశనం చేస్తాం. ఆ దేశంపై దాడుల నేపథ్యంలో ట్రంప్ హెచ్చరిక

మోదీ ఇజ్రాయెల్ పర్యటన సిగ్గుచేటు : కాంగ్రెస్

• భారతీయుల్ని కాపాడండి: ఖర్గే, రాహుల్
• పిల్లచేష్టల ప్రకటనలు మానండి: భాజపా

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఇజ్రాయెల్‌లో పర్యటించడాన్ని కాంగ్రెస్ పార్టీ సందర్భ ఔచిత్యం లేని చర్యగా అభివర్ణించింది. ప్రధాని పర్యటన పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పెరుగుదలకు భారత్ మద్దతు తెలుపుతోందన్న భావన కలిగిస్తోందని, ఇది సిగ్గుచేటని ఆ పార్టీ విదేశీ వ్యవహారాల ఛైర్మన్ సల్మాన్ ఖుర్షీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడికి పాల్పడటాన్ని కాంగ్రెస్ పార్టీ శనివారం ఖండించింది. భారత ప్రభుత్వం ఇరుపక్షాల మధ్య ఉద్రిక్తతల్ని నిర్మూలించేందుకు కృషి చేసి పశ్చిమాసియాలో ఉన్న భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేయాలని ఆ పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఇరాన్‌లో, ఇతర పశ్చిమాసియా దేశాల్లో నివాసం ఉంటున్న భారతీయుల భద్రతపై తమకు ఆందోళన కలుగుతోందని సోషల్ మీడియా పోస్టుల్లో వారు పేర్కొన్నారు. అక్కడ నివసిస్తున్న భారతీయుల భద్రతకు మన ప్రభుత్వం సాధ్యమైన అన్ని చర్యలూ చేపట్టాలని కోరారు. ఇరాన్‌పై జరిగిన దాడికి కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తప్పుపట్టడాన్ని భాజపా ఖండించింది. కాంగ్రెస్‌ను ఎలుకల సైన్యంగా అభివర్ణించింది. సున్నితమైన ప్రతి అంశంపై ప్రతికూలంగా వ్యాఖ్యానించడం కాంగ్రెస్ నైజంగా మారిందని దుయ్యబట్టింది. కాంగ్రెస్, దాని నాయకులు పిల్లచేష్టల ప్రకటనలు చేయడం మానుకోవాలని భాజపా అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా సూచించారు.

భారత్-అమెరికాల వాణిజ్య ఒప్పందం రైతులకు ముప్పు

• రాహుల్‌గాంధీ



బర్నాలా: భారత్-అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం దేశీయ రైతాంగాన్ని దెబ్బతీస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. శనివారం పంజాబ్‌లోని బర్నాలాలో నిర్వహించిన మజ్దూర్ కిసాన్ మహార్యాలీలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని విదేశీ మార్కెట్లకు అనుకూలంగా మార్చే అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందన్నారు. 'ప్రధాని నాలుగు నెలలుగా చేయని పనిని, 15 నిమిషాల్లో ఎలా చేశారు? ఆకస్మికంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని ఆయన ప్రశ్నించారు. ఏటా అమెరికా నుంచి సుమారు రూ.తొమ్మిది లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్‌నకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, ఇది దేశ రైతులను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకం గురించి మాట్లాడాలని అనుకున్నానని, కానీ, అవకాశం ఇవ్వలేదని రాహుల్ తెలిపారు. అలాగే పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి భారతీయుల భద్రతకు సంబంధించి కేంద్రం వెంటనే ముందస్తు చర్యలు తీసుకోవాలని రాహుల్ 'ఎక్స్' వేదికగా కోరారు. మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం (ఈసీహెచ్ఎస్)కు నిధులు కేటాయించడంతో పాటు వికలాంగుల పెన్షన్లపై పూర్తి ఆదాయపు పన్ను మినహాయింపును పునరుద్ధరించాలని కోరుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు రాహుల్ తెలిపారు.

పాఠశాలకు గైర్హాజరైతే మ్యూజిక్ మోత

ఈటీవీ భారత్: విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరైతే ఉపాధ్యాయులు దండించడం వంటి ఘటనలు తరచూ చూస్తుంటాం. బిహార్‌లోని గయా జిల్లాలో ఉన్న కొర్మతు గ్రామంలో మాత్రం ఇందుకు భిన్నంగా మ్యూజిక్ మోత మోగుతుంది. గ్రామంలోని మహాదళిత్ టోలా వాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇమ్రోజ్ అలీ వినూత్న ఆలోచన అందరినీ ఆకట్టుకుంటోంది. 80కి పైగా కుటుంబాలు నివసిస్తున్న ఈ ప్రాంతంలో... పాఠశాలలో రెండేళ్ల క్రితం 100కు లోపు ఉన్న విద్యార్థుల సంఖ్య ఆయన కృషి వల్ల ప్రస్తుతం 138కి పెరిగింది. చదువును మధ్యలోనే ఆపేసిన విద్యార్థుల ఇళ్లకు తోటి ఉపాధ్యాయులతో కలిసి ఇమ్రోజ్ వెళ్లేవారు. మొదట్లో ఆ పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చేవారు. కొంతకాలానికి విద్యాశాఖ నుంచి పాఠశాలకు సంగీత పరికరాలు అందాయి. అన్ని తరగతుల నుంచి 15 మంది పిల్లలతో ఓ బృందాన్ని ఏర్పాటుచేసిన ఇమ్రోజ్ వారికి సంగీత పరికరాలను వాయించడం నేర్పారు. పాఠశాలకు ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైతే ఈ బృందం ఆ పిల్లల ఇళ్లకు వెళ్లి, సంగీత పరికరాలను వాయిస్తూ వారిని స్కూలుకు తీసుకువస్తుంది. ఒకవేళ పెద్దసంఖ్యలో విద్యార్థులు స్కూలుకు రాకపోతే మెడలో డోలు వేసుకొని స్వయంగా ఇమ్రోజ్ తన బృందంతో బయలుదేరుతారు. గైర్హాజరైన విద్యార్థులను మేళతాళాలతో తిరిగి పాఠశాలకు తీసుకువస్తారు. ఈ విధంగా చేయడాన్ని అక్కడ గౌరవ చిహ్నంగా భావిస్తారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉంటున్నప్పటికీ, పిల్లల కోసం ఇంటింటికీ వెళ్తూ వారికి చదువును చేరువ చేస్తున్నారు. ఇమ్రోజ్ వల్ల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని ప్రధానోపాధ్యాయులు సురేశ్ చౌదరీ తెలిపారు. తన ఆలోచనతో పిల్లల తల్లిదండ్రులు మార్పు వచ్చి వారంతా చదువు ప్రాధాన్యతను గ్రహించారంటూ ఇమ్రోజ్ హర్షం వ్యక్తంచేశారు.



రాజ్యసభకు ఎన్నిక కానున్న ఎల్‌జీబీటీక్యూ మహిళ మేనక



ఇంటర్నెట్ డెస్క్: మార్చి 16న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్ నుంచి నాలుగు స్థానాలకు తృణమూల్ ప్రకటించిన అభ్యర్థుల్లో మేనకా గురుస్వామి ఎంపిక అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అయిన మేనక తెలంగాణలోని హైదరాబాదులో పుట్టి, ప్రాథమిక విద్యను అక్కడే పూర్తి చేశారు. స్వలింగ సంబంధాల గురించి 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఆ బంధాలను నేరంగా పరిగణించే ఐపీసీ సెక్షన్ 377ను కొట్టివేయడంలో కీలకపాత్ర పోషించిన న్యాయవాదుల్లో మేనక కూడా ఒకరు. ఈ కేసు వాదించిన మేనకా గురుస్వామి కూడా ఎల్‌జీబీటీక్యూ (లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్) వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. రాజ్యసభకు ఎన్నికైతే పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించే తొలి ప్రకటిత ఎల్‌జీబీటీక్యూ ఎంపీగా ఆమె రికార్డు సృష్టించనున్నారు.

తీర రక్షకదళం రిటైర్మెంటు వయసుపై కమిటీ వేయండి: సుప్రీం

దిల్లీ: కోస్ట్‌గార్డ్ (తీర రక్షకదళం) పదవీ విరమణ వయసుపై పరిశీలనకు నిపుణుల సంఘాన్ని నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి శనివారం సుప్రీంకోర్టు సూచించింది. కోస్ట్‌గార్డ్‌లో ఎగువ, దిగువస్థాయి అధికారులకు ఒకే విధమైన పదవీ విరమణ వయసును వర్తింపజేయాలంటూ దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. కౌంటర్ అఫిడవిటు దాఖలుకు రెండు వారాల గడువు ఇస్తున్నామని తెలిపింది. కోస్ట్‌గార్డ్‌లో కమాండెంటు, అంతకు దిగువస్థాయి అధికారులు 57 ఏళ్లకు, కమాండెంటు పైస్థాయి అధికారులు 60 ఏళ్లకు పదవీ విరమణ చేయాలని 1986 నాటి కోస్ట్‌గార్డ్ (జనరల్) నిబంధనావళి నిర్దేశిస్తోంది. ఇలా భేదం పాటించడం రాజ్యాంగం భరోసా ఇచ్చిన సమానత్వ హక్కుకు భంగకరమని కొందరు కోస్ట్‌గార్డ్ అధికారులు వేసిన పిటిషనుతో దిల్లీ హైకోర్టు ఏకీభవించింది. 60 ఏళ్ల పదవీ విరమణ వయసును అన్ని ర్యాంకులకూ సమంగా వర్తింపజేయాలని నవంబరు 24న తీర్పు చెప్పింది. దీన్ని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

అమెరికాను కొల్లగొడుతోన్న దేశాలకు డబ్బులివ్వాలా?: ట్రంప్

ఇంటర్నెట్‌డెస్క్: ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లవని అక్కడి సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై ట్రంప్ మరోసారి స్పందించారు. సుప్రీం తీర్పుతో విదేశాలకు, కంపెనీలకు పెద్ద మొత్తంలో డబ్బులు తిరిగి చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. 'ఇటీవల సుప్రీం ఇచ్చిన తీర్పు.. ఎన్నో సంవత్సరాలుగా అమెరికాను కొల్లగొడుతోన్న దేశాలు, కంపెనీలకు వందల బిలియన్ డాలర్లు తిరిగి చెల్లించేందుకు దారితీస్తుంది. ఇది అర్థరహితం. న్యాయస్థానం దీన్ని పరిగణనలోకి తీసుకోలేదని నేను బలంగా విశ్వసిస్తున్నా. ప్రపంచం ఇంతకు ముందు ఎన్నడూ ఇలాంటి తీర్పును చూడలేదు. ఇది నన్ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ కేసును తిరిగి విచారించడం సాధ్యమేనా?' అని ట్రంప్ రాసుకొచ్చారు.

దృశ్య స్పష్టత సాధారణం కంటే తక్కువ


• రన్‌వేపై కంకర ఉంది
• అజిత్ పవార్ విమాన ప్రమాదంపై ఏఏఐబీ ప్రాథమిక నివేదిక

దిల్లీ: బారామతిలో మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణానికి కారణమైన ప్రమాదంపై విమాన ప్రమాద విచారణ బ్యూరో (ఏఏఐబీ) శనివారం తన ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. జనవరి 28న జరిగిన ఆ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు మరణించిన సంగతి తెలిసిందే. ప్రమాద సమయంలో రన్‌వేపై విమానం నుంచి కంటికి కనిపించే దృశ్య స్పష్టత సాధారణం కన్నా తక్కువగా ఉందని ప్రకటించింది. రన్‌వేపై చెరిగిపోతున్న గుర్తులు, కంకర ఉన్న విషయాన్ని ఏఏఐబీ ప్రస్తావించింది. విమానం ప్రమాదానికి గురై బారామతి విమానాశ్రయం రన్‌వే ఎడమవైపున పడిపోవడానికి ముందు ఓ..ష్ అన్న మాటలు విమానం నుంచి ప్రసారమయ్యాయని గుర్తించింది. విమానాన్ని నడుపుతున్న పైలట్ 61 సంవత్సరాల వయసు కలిగివున్నారని, విమానం నడపడానికి ముందు 34 గంటలు విశ్రాంతి తీసుకున్నారని ఏఏఐబీ నివేదిక పేర్కొంది.

బోట్స్‌వానా నుంచి కునోకు 9 చీతాలు

షియోపూర్: బోట్స్‌వానా నుంచి 9 చీతాలు మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కుకు శనివారం సురక్షితంగా చేరాయి. వాటిలో ఆరు ఆడ చీతాలు, 3 మగ చీతాలున్నాయి. దీంతో భారత్‌లో మొత్తం చీతాల సంఖ్య 48కి చేరింది. భారత్‌లో చీతాల సంఖ్యను పునరుద్ధరించే ప్రణాళికలో భాగంగా ఆఫ్రికా నుంచి 3వ బ్యాచ్ చీతాలను భారత వైమానిక దళం (ఐఏఎఫ్)కు చెందిన విమానం సహాయంతో మొదట గ్వాలియర్‌కి చేర్చారు. ఆపై ఐఏఎఫ్ హెలికాప్టర్లలో శనివారం కునో జాతీయ పార్కుకు చేర్చినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖల మంత్రి భూపేందర్ యాదవ్ ఈ చీతాలను పార్కులో వాటి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆవరణలలో వదిలారు. మొదటి రెండు బ్యాచ్‌ల చీతాలను నమీబియా, దక్షిణ ఆఫ్రికా దేశాల నుంచి భారత్‌కు చేర్చిన సంగతి తెలిసిందే. వీటిలో మూడు చీతాలను గాంధీ సాగర్ వన్యప్రాణ అభయారణ్యంలో వదిలారు.

ఇరాన్ ప్రతిదాడి చేసింది ఈ దేశాల్లోని అమెరికా స్థావరాలపైనే..



పట్టభద్రులు వికసిత్ భారత్‌కు రూపశిల్పులు

• ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

దిల్లీ: పట్టభద్రులు వికసిత్ భారత్ రూపశిల్పులని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అభివర్ణించారు. భారతీయ వాస్తవాలకు అనుకూలంగా, ప్రపంచస్థాయిలో పోటీతత్వాన్ని పెంచేలా పరిశోధన, ఆవిష్కరణలను విశ్వవిద్యాలయాలు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దిల్లీ విశ్వవిద్యాలయం(డీయూ) 102వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో మహిళల శాతం పెరగడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది బంగారు పతక విజేతల్లో 70% కంటే ఎక్కువ మంది మహిళలేనని పేర్కొన్నారు. డీయూ ప్రపంచంలోనే నంబర్ వన్ విశ్వవిద్యాలయంగా ఎదగాలని రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. విద్యార్థులు నేర్చుకోవడాన్ని నిరంతర ప్రక్రియగా పరిగణించాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాకు బానిసలుగా మారకుండా నిర్మాణాత్మకంగా దాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 1.2 లక్షలకు పైగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు.

పంజాబ్‌లోని విశ్వవిద్యాలయం నుంచి రాజీవ్ గాంధీ పేరు తొలగింపు

• ఎన్నికల ఎత్తుగడ అంటూ కాంగ్రెస్ విమర్శ

పటియాలా: పంజాబ్‌లోని పటియాలాలో ఉన్న 'రాజీవ్ గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా' విశ్వవిద్యాలయం పేరు నుంచి రాజీవ్ గాంధీ పేరును తొలగించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఈ పేరును 'నేషనల్ లా యూనివర్సిటీ, పంజాబ్'గా మార్చాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని వర్సిటీ అకడమిక్ కౌన్సిల్ ఆమోదించిందని శనివారం అధికారులు తెలిపారు. ఈ ప్రతిపాదనను కార్యనిర్వాహక మండలికి పంపినట్లు పేర్కొన్నారు. మండలి ఆమోదం తర్వాత ఉన్నత విద్యాశాఖకు పంపుతామని తెలిపారు. ఈ నిర్ణయాన్ని పటియాలా కాంగ్రెస్ ఎంపీ ధర్మవీర గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్లను విభజించేందుకు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నాల్లో భాగమని ఆయన పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఉన్న పటియాలా ప్రాంతం ఎమ్మెల్యే, పంజాబ్ ఆరోగ్యశాఖ మంత్రి బల్బీర్ సింగ్ తనకు ఈ ప్రతిపాదన గురించి ఏమీ తెలియదని, పూర్తి వాస్తవాలు వచ్చేవరకు దీనిపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేనని పేర్కొన్నారు.

పాక్‌కు ప్రశంసలు.. మనకు సుంకాలా?

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. గతేడాది పహల్గాంలో ఉగ్ర దాడులకు కారణమైనవారిని ట్రంప్ కొనియాడటమేంటని ప్రశ్నించింది. వాణిజ్య ఒప్పందం తర్వాత కూడా భారత్ నుంచి దిగుమతి చేసుకొనే సోలార్ మాడ్యూల్స్‌పై ట్రంప్ భారీ సుంకాలు విధించారని తెలిపారు. మన వ్యూహాత్మక దౌత్యానికి ట్రంప్ పదే పదే అడ్డంకులు సృష్టిస్తున్నా మోదీ నోరు మెదపడం లేదని జైరాం రమేశ్ నిలదీశారు.

రాష్ట్రపతి - అధికారాలు

భారతదేశానికి రాష్ట్రపతి రాజ్యాంగబద్ధమైన అధిపతి. త్రివిధ దళాలకు సర్వసైన్యాధ్యక్షుడు. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడటంలో కీలకంగా వ్యవహరిస్తారు. పార్లమెంట్‌లో అంతర్భాగంగా ఉంటారు. భారత రాజ్యాంగం కార్యనిర్వాహక అధికారాలను రాష్ట్రపతికి నామమాత్రంగానే కల్పించింది. వాస్తవానికి ప్రధానమంత్రి, మంత్రిమండలి సభ్యులు రాష్ట్రపతి పేరుమీద అధికారాలు చెలాయిస్తారు. రాష్ట్రపతికి చాలా సందర్భాల్లో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అధికారం లేదు.

పార్లమెంట్‌లో అంతర్భాగం..
భారత సర్వసైన్యాధిపతి!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

అధికారాలు - విధులు

▼ రాష్ట్రపతికి సాధారణ, అత్యవసర సంబంధ అధికారాలు ఉంటాయి.

సాధారణ అధికారాలు:
- కార్యనిర్వహణ అధికారాలు
- శాసనాధికారాలు
- ఆర్థికాధికారాలు
- న్యాయాధికారాలు
- సైనికాధికారాలు
- దౌత్యాధికారాలు
- విచక్షణాధికారాలు

అత్యవసర అధికారాలు:
- జాతీయ అత్యవసర పరిస్థితి
- రాజ్యాంగ అత్యవసర పరిస్థితి
- ఆర్థిక అత్యవసర పరిస్థితి


ప్రస్తుత రాష్ట్రపతి - ద్రౌపదీముర్ము

శాసనాధికారాలు

79వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి పార్లమెంట్‌లో అంతర్భాగం. పార్లమెంట్ అంటే రాజ్యసభ, లోక్‌సభ, రాష్ట్రపతిని కలిపి పార్లమెంట్‌గా పరిగణిస్తారు.

- పార్లమెంట్ రూపొందించే బిల్లులు ఆర్డినెన్స్ అన్నీ రాష్ట్రపతి ఆమోదంతోనే చట్టాలుగా మారతాయి. కాబట్టి రాష్ట్రపతిని పార్లమెంట్‌లో భాగంగానే పరిగణిస్తారు.
- పార్లమెంట్ ప్రారంభ, వార్షిక సమావేశాలను ప్రారంభిస్తారు.
- 80(3) నిబంధన ప్రకారం రాజ్యసభకు సాహిత్య, సైన్స్, కళా రంగాల్లో, సాంఘిక సేవల్లో విశిష్టమైన సేవలందించిన 12 మందిని రాష్ట్రపతి నియమిస్తారు.
- 85(1) ప్రకారం పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరిచే అధికారాన్ని రాష్ట్రపతి కలిగి ఉంటారు.
- 85(2) ప్రకారం పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేయడం, దీర్ఘకాలిక వాయిదా (ప్రోరోగ్) చేయడం.
- 85(2) (బి) ప్రకారం లోక్‌సభను రద్దు చేయవచ్చు.
- 86వ నిబంధన ప్రకారం లోక్‌సభ, రాజ్యసభలకు సంయుక్తంగా లేదా విడివిడిగా సందేశాలను పంపవచ్చు.
- 103 నిబంధన ప్రకారం పార్లమెంట్ సభ్యుల అనర్హతలను కేంద్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదించి నిర్ణయిస్తారు.
- 108 నిబంధన ప్రకారం ఏదైనా ఒక సాధారణ బిల్లుపై లోక్‌సభ, రాజ్యసభల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. దీనికి లోక్‌సభ స్పీకర్ అధ్యక్షత వహిస్తారు.
- 110, 117 నిబంధన ప్రకారం ద్రవ్య, ఆర్థిక బిల్లులు లోక్‌సభలో ప్రవేశపెట్టాలంటే రాష్ట్రపతి పూర్వానుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- 111 నిబంధన ప్రకారం పార్లమెంట్ రూపొందించిన బిల్లులు రాష్ట్రపతి ఆమోదంతోనే చట్టాలుగా మారతాయి.



- 123 నిబంధన ప్రకారం పార్లమెంట్ సమావేశంలో లేనప్పుడు రాష్ట్రపతి ఆర్డినెన్స్‌లను జారీ చేస్తారు. ఈ ఆర్డినెన్స్‌లకు సాధారణ చట్టాలకు ఉన్నంత విలువ ఉంటుంది. ఈ ఆర్డినెన్స్ చట్టాలుగా కొనసాగాలంటే తిరిగి పార్లమెంట్ సమావేశమైన ఆరు వారాల్లోగా ఆమోదించాల్సి ఉంటుంది.
- 201 నిబంధన ప్రకారం రాష్ట్ర శాసనసభల్లో ప్రవేశపెట్టిన బిల్లుల్లో ఏదైనా సందిగ్ధత ఉందని భావించినప్పుడు గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపినప్పుడు ఆమోదించడం/తిరస్కరించడం చేయవచ్చు.
- 91(1) నిబంధన ప్రకారం రాజ్యసభ సమావేశాలు నిర్వహించడానికి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సభాధ్యక్షులు లేనప్పుడు తాత్కాలిక సభాధ్యక్షులను రాష్ట్రపతి నియమిస్తారు.

సాధారణ అధికారాలు

కార్యనిర్వహణ అధికారాలు

53వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వహణాధికారాలన్నీ నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని కార్యనిర్వహణ నిర్ణయాలు రాష్ట్రపతి పేరు మీదనే అమల్లోకి వస్తాయి. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వంలో అత్యున్నతమైన పదవులు, కమిటీలు, కమిషన్ల నియామక అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. అంటే రాష్ట్రపతే సర్వోన్నత కార్యనిర్వహణాధికారి.

- 58(2) నిబంధన ప్రకారం భారతదేశ సర్వసైన్యాధిపతి.
- 74(1) నిబంధన ప్రకారం దేశ పరిపాలనా నిర్వహణలో రాష్ట్రపతికి సలహాలు, సహాయం అందించేందుకు ప్రధానమంత్రి అధ్యక్షతన కేంద్ర మంత్రిమండలి ఉంటుంది.
- 75(1) నిబంధన ప్రకారం ప్రధానమంత్రిని రాష్ట్రపతి నియమిస్తారు. ప్రధానమంత్రి సలహాలను అనుసరించి రాష్ట్రపతి మంత్రిమండలిని నియమిస్తారు.
- 76(1) నిబంధన ప్రకారం కేంద్ర ప్రభుత్వ ప్రధాన న్యాయ సలహాదారుడు, న్యాయవాది అయిన అటార్నీ జనరల్‌ను రాష్ట్రపతి నియమిస్తారు.
- 77 నిబంధన ప్రకారం కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలన్నీ రాష్ట్రపతి పేరు మీదే జరగాలి.
- 78 నిబంధన ప్రకారం కేంద్ర మంత్రిమండలి చేసిన అన్ని నిర్ణయాలను ప్రధానమంత్రి రాష్ట్రపతికి తెలియజేయాలి.
- 124(2) నిబంధన ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు.
- 148 నిబంధన ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చులను, ఖాతాలను తనిఖీ చేసే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ (CAG)ను నియమిస్తారు.
- 155 నిబంధన ప్రకారం రాష్ట్రాలకు గవర్నర్లను నియమిస్తారు.
- 217 నిబంధన ప్రకారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులను నియమిస్తారు.
- 239 నిబంధన ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లను నియమిస్తారు.
- 262 నిబంధన ప్రకారం కేంద్ర జలవనరుల సంఘాన్ని నియమిస్తారు.
- 280 నిబంధన ప్రకారం ఆర్థిక సంఘం, సభ్యులను నియమిస్తారు.
- 316 నిబంధన ప్రకారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ అధ్యక్షుడు, సభ్యులను నియమిస్తారు.
- 324(2) నిబంధన ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం ఛైర్మన్, ఇతర సభ్యులను నియమిస్తారు.
- 338 నిబంధన ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్, సభ్యులను నియమిస్తారు.
- 338(ఎ) నిబంధన ప్రకారం జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్, సభ్యులను నియమిస్తారు.
- 338(బి) నిబంధన ప్రకారం జాతీయ ఓబీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులను నియమిస్తారు.
- 340 నిబంధన ప్రకారం దేశంలో వెనుకబడిన తరగతుల స్థితిగతులను అధ్యయనం చేయడానికి బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తారు.
- 344 నిబంధన ప్రకారం కేంద్ర అధికార భాషా సంఘం ఛైర్మన్‌ను నియమిస్తారు.
- ఇస్రో ఛైర్మన్‌ను, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఇండియా ఛైర్మన్‌ను, రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ ఛైర్మన్‌ను, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఛైర్మన్‌ను, రైల్వే బోర్డు ఛైర్మన్‌ను, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు.

రాష్ట్రపతి వీటో అధికారాలు

వీటో (Veto) పదాన్ని లాటిన్ నుంచి గ్రహించారు. వీటో అంటే తిరస్కరించడం, నిరోధించడం, నిలుపుదల చేయడం అని అర్థం. ఏదైనా సాధారణ బిల్లు లేదా ప్రతిపాదనను పార్లమెంట్ ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఆమోదానికి పంపితే 111 నిబంధన ప్రకారం రాష్ట్రపతి కింది చర్యలు తీసుకోవచ్చు.

- బిల్లును ఆమోదించవచ్చు.
- బిల్లుపై ఆమోదాన్ని నిరాకరించవచ్చు.
- బిల్లును పునఃపరిశీలనకు పంపవచ్చు.
- బిల్లుపై మౌనం వహించవచ్చు.

✦ కేంద్ర మంత్రిమండలి లేదా పార్లమెంట్ ఆమోదించి పంపిన బిల్లుల విషయంలో రాష్ట్రపతి మూడు రకాల వీటో అధికారాలను కలిగి ఉంటారు.

అబ్సల్యూట్ వీటో: కేంద్ర మంత్రిమండలి లేదా పార్లమెంట్ ఆమోదించి పంపిన బిల్లులను రాష్ట్రపతి తన ఆమోదం తెలపకుండా లేదా కారణం లేకుండా తిరస్కరించడాన్ని అబ్సల్యూట్ వీటో అంటారు.

▼ రాష్ట్రపతి వీటోను పార్లమెంట్ లేదా మంత్రిమండలి రద్దు చేయవచ్చు. అంటే అదే బిల్లును సవరణలతో లేదా మార్పులు లేకుండా రెండోసారి ఆమోదించి పంపితే రాష్ట్రపతి తప్పనిసరిగా ఆ బిల్లును ఆమోదించాలి.

సస్పెన్సివ్ వీటో: పార్లమెంట్ లేదా కేంద్ర మంత్రిమండలి బిల్లులకు రాష్ట్రపతి తన ఆమోదం తెలపకుండా అనేక సవరణలు, సలహాలు, సూచనలు చేస్తూ పునఃపరిశీలనకు వెనక్కి పంపడమే సస్పెన్సివ్ వీటో.

పాకెట్ వీటో: పార్లమెంట్ లేదా కేంద్ర మంత్రిమండలి బిల్లుల విషయంలో రాష్ట్రపతి తన ఆమోదాన్ని తెలపకుండా లేదా తిరస్కరించకుండా అంటే ఎలాంటి నిర్ణయం తెలపకుండా బిల్లులను తన వద్ద అట్టి పెట్టుకోవడాన్నే పాకెట్ వీటో అంటారు.


రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

936 Word of the Day

Overwrought

Telugu meaning: అలసిపోయిన, బెదిరిపోయిన

English meaning: The word overwrought (ఓవర్‌రాట్) is an adjective that describes someone who is extremely emotional, anxious, or stressed to an excessive degree.

Synonyms: Agitated, Distressed

Antonyms: Calm, Composed

Usage: 1. After working continuously for several days without proper rest, she became overwrought and started worrying about even the smallest issues.

2. The overwrought parents rushed to the hospital in panic, fearing the worst despite the doctor's earlier reassurance.

Current Affairs



India and Israel inked 16 Memorandum of Understanding (MoUs) on 26 February 2026, formally elevating bilateral relations to a Special Strategic Partnership during the two-day state visit of Prime Minister Narendra Modi to Israel. The pacts, exchanged in the presence of PM Modi and Israeli Prime Minister Benjamin Netanyahu, covered a wide range of sectors including artificial intelligence, cybersecurity, fintech, labour mobility, education, fisheries, and cultural exchanges.

The Unique Identification Authority of India (UIDAI) has partnered with Google to enable the display of authorised Aadhaar centres on Google Maps, in a move aimed at improving accessibility and convenience for residents across the country. With this initiative, residents will soon be able to locate their nearest verified Aadhaar centres through Google Maps and check the services offered at each location.

The R&D Centre of NMDC, Responsible Miner has signed a Memorandum of Understanding (MoU) with Indian Institute of Technology Hyderabad (IITH), a significant step towards shaping the future of India's mineral and metals sector. The MoU aimed at advancing indigenous technology in mineral processing and allied areas.


◆ This partnership represents a strong collaboration between field expertise and academic excellence.

The Government of India has launched a Central Bank Digital Currency (CBDC)-based Digital Food Currency pilot for Direct Benefit Transfer (DBT) under Pradhan Mantri Garib Kalyan Anna Yojana (PMGKAY) in Puducherry on 26 February 2026. The introduction of CBDC in the Public Distribution System marks a transformative milestone in India's food security architecture.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

పాలిమర్లు



ఒకే పదార్థం లేదా రెండు, మూడు పదార్థాలకు చెందిన అల్ప అణుభారం, సరళ అణునిర్మాణం కలిగిన అణువులు ఒకదానితో మరొకటి పుంఖాను పుంఖాలుగా కలిసి ఏర్పర్చే అత్యధిక అణుభారమున్న అణువులే పాలిమర్లు. పాలిమరీకరణ చర్యలో అనేక అణువుల కలయిక వల్ల పాలిమర్ అణువులు ఏర్పడతాయి.

- పాలిమర్ అంటే అనేక చిన్న భాగాలు లేదా అణువులను కలిగిన బృహదణువు. గ్రీకు భాషలో పాలి (poly) అంటే అనేకం, మెర్ (mer) అంటే భాగం అని అర్థం.

పాలిమరీకరణం

- మోనోమర్ నుంచి పాలిమర్ ఏర్పడే విధానాన్ని పాలిమరీకరణం అంటారు. అనేక అణువుల కలయికతో పాలిమర్లు ఏర్పడతాయి.

పాలిమర్ల వర్గీకరణ

- మూలాల ఆధారంగా వర్గీకరణ
- పాలిమర్ గొలుసుల్లోని ప్రధాన మూలకాల ఆధారంగా వర్గీకరణ
- నిర్మాణం ఆధారంగా వర్గీకరణ
- అంతరణుక బలాల ఆధారంగా వర్గీకరణ
- ఉష్ణ స్పందన ఆధారంగా వర్గీకరణ

పాలిమరీకరణం రకాలు

- అనువైన, తగిన ఉష్ణోగ్రత, పీడనం, ఉత్ప్రేరకం, ద్రావణి, ఇతర కారకాల సమక్షంలో మోనోమర్ అణువులు చర్య జరిపి పాలిమర్లను ఏర్పరుస్తాయి.

పాలిమరీకరణ అవధి, పాలిమరీకరణం - సాంకేతిక పద్ధతుల్లోని అనుకూలతలు, ప్రతికూలతలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జీరో డిస్క్రిమినేషన్ డే

మార్చి 1
చరిత్రలో ఈనాడు

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంది. అలా కాకుండా పేదరికం, కులం, తెగ, లింగం, ప్రాంతీయ భేదాలు, ఆరోగ్యం లాంటి కారణాలతో సమాజంలో ప్రజలు, వర్గాల మధ్య భేదభావాన్ని చూపడాన్ని వివక్ష అంటారు. దీని వల్ల ఎందరో వ్యక్తులు తమ హక్కులను కోల్పోతున్నారు. దీన్ని అధిగమించి సమాజంలోని ప్రతి వ్యక్తికి గౌరవం, సమన్యాయం దక్కాలనే లక్ష్యంతో ఏటా మార్చి 1న 'జీరో డిస్క్రిమినేషన్ డే'గా నిర్వహిస్తారు. వివక్షకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు పోరాడాల్సిన ఆవశ్యకతను తెలియజేయడంతోపాటు సమసమాజ ఏర్పాటును ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

వివక్ష అంటే?

వ్యక్తులకు సంబంధించిన కొన్ని నిర్దిష్ట విషయాలను పరిగణనలోకి తీసుకుని వాటి ఆధారంగా వారిపట్ల అన్యాయంగా లేదా భిన్నంగా వ్యవహరించడాన్ని వివక్ష అంటారు. ఇది ఉద్దేశపూర్వకంగా లేదా అనుకోకుండా జరగొచ్చు.

- ఒకేలాంటి సామర్థ్యాలు ఉన్న వ్యక్తులను వారి గుర్తింపు లేదా సామాజిక నేపథ్యాల కారణంగా భిన్నంగా చూసినప్పుడు వివక్ష ఏర్పడుతుంది.
- ఇది విద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ, నివాసం లాంటి సమాజంలోని అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది.

చారిత్రక నేపథ్యం

హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై ఐక్యరాజ్యసమితి ఉమ్మడి కార్యక్రమం 'యూఎన్ఎయిడ్స్' చొరవ ఫలితంగా 'జీరో డిస్క్రిమినేషన్ డే' ఉనికిలోకి వచ్చింది. 2013, డిసెంబరు 1న 'వరల్డ్ ఎయిడ్స్ డే' నాడు ప్రారంభించిన జీరో డిస్క్రిమినేషన్ ప్రచారం నుంచి ఈ రోజు ఆవిర్భవించింది.



వివక్షలో రకాలు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ వివక్ష గురించి ఏం పేర్కొన్నాయి? ఎస్ఎస్‌సీ సీజీఎల్, ఏపీపీఎస్సీ తదితర పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబులతో రూపొందించిన ఉచిత ఈబుక్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (ఇంజినీరింగ్) పోస్టులు

పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత ప్రభుత్వ సంస్థ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), 2026-27 సంవత్సరానికి ఇంజినీరింగ్ విభాగాల్లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 250. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 10 మార్చి 2026.

ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్ - I ఉద్యోగాలు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (పీజీఐఎంఈఆర్), పీడియాట్రిక్స్ విభాగంలోని నియోబోర్న్ యూనిట్ ఒక పరిశోధన ప్రాజెక్ట్ కోసం ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-1, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 8. అర్హులైన అభ్యర్థులు 2026 మార్చి 6లోగా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని మినీరత్న సంస్థ అయిన బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేయడానికి సిబ్బంది కోసం దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. అర్హులైన అభ్యర్థులు 2026, మార్చి 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (మార్చి 1) చివరి తేదీ

- ఐఐటీ బీహెచ్‌యూలో ప్రాజెక్టు అసిస్టెంట్ ఉద్యోగాలు. డిప్లొమా/ఐటీఐ/డిగ్రీలో ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Seating Arrangement

Railway Exams
Reasoning

1. Five persons J, L, M, N, K are sitting around a circular table all facing outwards. J sits opposite to N. L sits opposite to K. M is in the middle of L and N. K is immediate left of N.
Who is sitting to the immediate right of J?
A) M B) L C) K
D) Cannot be determined

2. R, S, T and U are standing at four points around a circular table. R is facing towards the centre, while S, T and U are facing outward. S is to the immediate left of R. T is opposite S.
Who is to the second to the left of R?
A) S B) T C) U
D) Cannot be determined

3. R, S, T, C and P are sitting around a circular table all are facing the centre. S is to the immediate left of R. T is to the second to the right of R. C is in between S and T. P is sitting opposite to C. Who is sitting between R and T?
A) R B) P C) T
D) Cannot be determined

4. Joy, Roy, Sai, Klai and Nai are sitting at the four corners and Klai is sitting on one side of a square, all facing outwards. Joy is sitting immediate left of Roy. Klai is sitting in between Sai and Nai. Sai is immediate left of Joy.
Who is to the immediate right of Sai?
A) Joy B) Klai C) Nai D) Roy

5. A, B, C, D, E and F are sitting around a circular table all facing the centre. B is to the immediate right of A. D is in between A and E. E is to the left of D. F is between C and E. Who is to the right of F?
A) A B) C C) D D) E

6. C, O, T, M, P and R are sitting around a square table. O is in between C and T. P is in between M and R. T is immediate right of R. All are facing the centre. Who is to the right of M?
A) P B) R C) C D) T

7. Mala, Rama, Siri and Kiri are sitting around a circular table. Mala is to the left of Rama. Siri is to the right of Rama. Kiri is to the left of Mala. All are facing away from the centre. Who is to the right of Mala?
A) Rama B) Kiri C) Siri
D) Cannot be determined

8. L, G, H, J and K are sitting around a square table. L is to the left of G. H is to the right of G. J is between K and H K is to the left of J. All are facing towards the centre except J facing outwards. Who is to the right of K?
A) L B) G C) H D) J

9. C, Q, S, P, T and L are sitting in a straight row, all facing in north direction. L is to the right of T. S is between Q and P. C is sitting first from the left. Q is immediate right to C. Who is sitting second to the right of Q?
A) P B) T C) S D) L

10. M, N, O, P and Q are sitting in a straight row, all facing in north direction. N is to the right of M. O is to the right of N. P is to the right of O. Q is to the right of P.
Who is sitting third to the left of Q?
A) M B) N C) O D) P

11. S, T, U, V, W and X are sitting in a straight row, all facing south direction. T is to the right of S. U is to the right of T. V is to the right of U. W is between V and X.
Who is sitting third to the right of T?
A) V B) W C) X D) U

12. Moy, Soy, Roy, Loy and Toy are sitting in a straight row, all facing the same south direction. Soy is between Moy and Roy. Roy is to the right of Soy. Loy is between Roy and Toy.
Who is sitting second to the left of Loy?
A) Soy B) Moy
C) Roy D) None

13. L, G, P, R and T are sitting in a straight row. L and G are facing north. P and R are facing south. T is facing north. G is to the right of L. P is to the right of G. R is between P and T.
Who is to the left of R?
A) P B) G C) T D) L

14. Klo, Slo, Rlo, Plo and Tlo are sitting in a straight row. Klo and Slo are facing south. Rlo and Plo are facing north. Tlo is facing south. Slo is in between Klo and Rlo. Rlo is to the left of Slo. Plo is to the right of Rlo. Tlo is to the right of Plo.
Who is to the left of Plo?
A) Rlo B) Slo
C) Tlo D) Klo

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



❖ 2025–26 విజయ్ హజారే ట్రోఫీని ఏ జట్టు గెలుచుకుంది?
(బెంగళూరులో జరిగిన ఫైనల్లో ఈ జట్టు సౌరాష్ట్ర జట్టును 38 పరుగుల తేడాతో ఓడించి తొలిసారిగా విజయ్ హజారే ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకుంది.) జ: విదర్భ

❖ న్యూజిలాండ్‌లో భారత నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
జ: మువాన్ పుయి సాయావి (ఈమె 2005 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారిణి. జార్జియాలో నూతన భారత రాయబారిగా 2004 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి అమిత్ కుమార్ మిశ్రా నియమితులయ్యారు.)

❖ ఆసియా మ్యానుఫ్యాక్చరింగ్ ఇండెక్స్–2026లో భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది?
(డెజాన్ షిరా అండ్ అసోసియేట్స్ 11 ఆసియా దేశాలతో విడుదల చేసిన ఈ సూచిక ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, శ్రామిక శక్తి, ఆవిష్కరణ, వాణిజ్యాలకు సంబంధించి ఈ దేశాల స్థితిని అంచనా వేసింది. ఈ సూచికలో చైనా అగ్రస్థానంలో నిలిచింది.) జ: 6వ

❖ దేశంలోనే మొదటి ఓపెన్ – సీ సముద్ర చేపల పెంపకం పైలట్ ప్రాజెక్టును ఇటీవల ఎక్కడ ప్రారంభించారు?
జ: అండమాన్ సముద్రం (ఫిన్‌ఫిష్, సముద్రపు పాచి సాగును ప్రోత్సహించడానికి ఈ ప్రాజెక్టును ప్రారంభించారు.)

మరింత సమాచారం


TENTH Maths — Triangles

Final Exams-2026 IMPORTANT Q & A

8 Marks

1. **ABCD is a trapezium in which AB || DC and its diagonals intersect each other at the point O. Show that $\frac{AO}{BO}=\frac{CO}{DO}$.**

Sol: Given, ABCD is a trapezium where AB || DC and diagonals AC and BD intersect each other at O.



We have to prove, $\frac{AO}{BO}=\frac{CO}{DO}$

From the point O, draw a line EO touching AD at E, in such a way that,

EO || DC || AB, In ΔADC, we have OE || DC

∴ by using Basic Proportionality Theorem

$\frac{AE}{ED}=\frac{AO}{CO}$ .... (i) ⇒ Now, In ΔABD, OE || AB

∴ by using Basic Proportionality Theorem

$\frac{DE}{EA}=\frac{DO}{BO}$ .... (ii)

From equation (i) and (ii), we get,

$\frac{AO}{CO}=\frac{BO}{DO} \Rightarrow \frac{AO}{BO}=\frac{CO}{DO}$ Hence, proved.

2 Marks

1. **State S.S.S. similarity criterion.**

Sol: If in two triangles, corresponding sides are in the same ratio, then their corresponding angles are equal and hence the triangles are similar

2. **State Basic proportional theorem.**

Sol: If a line is drawn parallel to one side of a triangle to intersect the other two sides in distinct points, the other two sides are divided in the same ratio.

3. **State A.A.A. similarity criterion.**

Sol: If in two triangles, corresponding angles are equal, then their corresponding sides are in the same ratio and hence the two triangles are similar.

4. **State converse of Thales theorem.**

Sol: If a line divides any two sides of a triangle in the same ratio, then the line is parallel to the third side.

More Imp Q & A




Writer: Dr. T.S.V.S. Suryanarayana Murty

భారత అంతరిక్ష నౌకల్లో బాహుబలి!

జీఎస్ఎల్‌వీ

ఇస్రో అభివృద్ధి చేసిన అత్యంత శక్తిమంతమైన రాకెట్ జీఎస్ఎల్‌వీ. టన్నుల బరువుండే భారీ సమాచార ఉపగ్రహాలను కూడా మోసుకెళ్లగలిగిన ఈ వాహక నౌక ఇప్పటికే స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలను ఎన్నింటినో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. భారత రాకెట్లలో బాహుబలిగా ప్రసిద్ధికెక్కింది. దీనికి సంబంధించిన అత్యంత క్లిష్టమైన క్రయోజెనిక్ సాంకేతికతలో దేశం స్వయంసమృద్ధిని సాధించింది. అంతరిక్ష ప్రయోగాల్లో వ్యూహాత్మక ఆధిపత్యంతో పాటు బహుళ ప్రయోజనాలను అందిస్తున్న జీఎస్ఎల్‌వీతో ఇస్రో ఇప్పటి వరకు సాధించిన విజయాలు, చేపట్టిన మిషన్ల గురించి విద్యార్థులు పరీక్షల కోణంలో చదువుకోవాలి. సమీప భవిష్యత్తులో మానవ సహిత యాత్రలను సాధ్యం చేయగలిగే జీఎస్ఎల్‌వీ ఆధునిక వెర్షన్ అయిన ఎల్‌వీఎం-3 రాకెట్ల గురించి తెలుసుకోవాలి.




జీఎస్ఎల్‌వీ వాహకనౌక అభివృద్ధి చేయడం ఇస్రో సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీక. దీనిలో ఘన, ద్రవ, క్రయోజెనిక్ దశలు ఉన్నాయి. చివరి దశలో క్రయోజెనిక్ ఇంజిన్ ఉంటుంది. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రయోగించిన అన్ని జీఎస్ఎల్‌వీ మిషన్‌లలో స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన క్రయోజెనిక్ ఇంజిన్‌ను వాడుతున్నారు. జీఎస్ఎల్‌వీలో ఎంకే-II, ఎంకే-III అనే రెండు రకాలను ప్రస్తుతం ఇస్రో ఉపయోగిస్తోంది. వీటిలో ఎంకే-II 2,250 కిలోల బరువు ఉన్న ఉపగ్రహాలను జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో లేదా 6000 కిలోల బరువు ఉన్న ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెట్టగలదు. ఎంకే-III వాహక నౌకను 'భారతదేశ బాహుబలి రాకెట్' అంటారు. దీనిలో శక్తిమంతమైన CE-20 క్రయోజెనిక్ ఇంజిన్ ఉంటుంది. ఇది 4,000 కిలోల ఉపగ్రహాలను జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో లేదా 8,000 కిలోల ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెట్టగలదు. జీఎస్ఎల్‌వీ-ఎంకే-III వాహకనౌకను ఎల్‌వీఎం3 అని కూడా పిలుస్తారు.

ఎల్‌వీఎం3 వాహక నౌక



1) ఎల్‌వీఎం3–ఎక్స్ మిషన్: దీనిని జీఎస్ఎల్‌వీ-ఎంకే-III-ఎక్స్ మిషన్ అంటారు. ఎల్‌వీఎం3-ఎక్స్ అనే వాహక నౌకను ఉపయోగించి 'క్రూ మాడ్యూల్ అట్మాస్ఫియరిక్ రీఎంట్రీ ఎక్స్‌పరిమెంట్' నిర్వహించారు. ఇది ఎల్‌వీఎం3 వాహక నౌకను ఉపయోగించి మొదటిసారిగా విజయవంతంగా చేపట్టిన ప్రయోగం. కేర్ మిషన్ అనేది గగన్‌యాన్ మిషన్ విజయవంతంగా చేయడానికి చేపట్టే ప్రయోగాల్లో ఒకటి. దీనిని 2014, డిసెంబరు 18న నిర్వహించారు.



2) ఎల్‌వీఎం3–ఎం1 మిషన్: 2019, జులై 22న ఎల్‌వీఎం3-ఎం1 అనే వాహక నౌకను ఉపయోగించి చంద్రయాన్-2 ప్రయోగం నిర్వహించారు. ఆర్బిటర్ (ఉపగ్రహం) ల్యాండర్, రోవర్‌లను వాహక నౌక మోసుకెళ్లి చంద్రుడి కక్ష్యలో ఉంచింది.


3) ఎల్‌వీఎం3–ఎం2 మిషన్: ఈ ప్రయోగాన్ని 2022, అక్టోబరు 23న నిర్వహించారు. ఎల్‌వీఎం3-ఎం2 అనే రాకెట్‌ను ఉపయోగించి యూకేకు చెందిన వన్ వెబ్ అనే సంస్థ, వారి 36 ఉపగ్రహాలను దిగువ భూకక్ష్య (లోఎర్త్ ఆర్బిట్)లో ప్రవేశపెట్టారు. సాధారణంగా ఎల్‌వీఎం-3 రాకెట్‌ను ఉపగ్రహాలను జియోసింక్రోనస్ కక్ష్యలో ప్రవేశపెట్టడానికి వాడతారు. కానీ ఈ ప్రయోగంలో ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇది ఎల్‌వీఎం3 ఉపయోగించి చేపట్టిన మొదటి వాణిజ్య ప్రయోగం. ఒకేసారి 36 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టిన మొదటి ప్రయోగం. దాదాపు ఆరు టన్నుల బరువును మోసుకెళ్లిన మొదటి రాకెట్ ప్రయోగం కూడా. ఎల్‌వీఎం3 ద్వారా ఎన్ఎస్ఐఎల్ (న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్) చేపట్టిన మొదటి ప్రయోగం.

జీఎస్ఎల్‌వీ విజయాలు



1) జీఎస్ఎల్‌వీ–డీ1 మిషన్: ఇది భారతదేశ తొలి జీఎస్ఎల్‌వీ వాహక నౌక. దీనిని 2001, ఏప్రిల్ 18న ప్రయోగించి, జీశాట్-1 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఇందులో రష్యా అందించిన క్రయోజెనిక్ ఇంజిన్ వాడారు. అయితే ఈ వాహకనౌక ఉపగ్రహాన్ని అనుకున్న దానికంటే తక్కువఎత్తున్న కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

2) జీఎస్ఎల్‌వీ–ఎఫ్01 మిషన్: దీనిని 2004, సెప్టెంబరు 20న నిర్వహించారు. ఇందులో జీఎస్ఎల్‌వీ-ఎఫ్01 వాహకనౌక ద్వారా జీశాట్-3 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఈ ఉపగ్రహాన్నే ఎడ్యుశాట్ అంటారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని తరగతులకు దూరవిద్య కోసం దీనిని కేటాయించారు.



3) జీఎస్ఎల్‌వీ–ఎఫ్09 మిషన్: 2017, మే 5న జీఎస్ఎల్‌వీ-ఎఫ్09 వాహక నౌకను ఉపయోగించి జీశాట్-9 అనే ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. జీశాట్-9 ఉపగ్రహాన్ని సార్క్ ఉపగ్రహం లేదా 'సౌత్ ఏషియన్ శాటిలైట్' అంటారు. దీని ద్వారా దక్షిణాసియా దేశాలకు సమాచార సేవలు అందుతాయి.

జనరల్ స్టడీస్
సైన్స్ అండ్ టెక్నాలజీ




4) జీఎస్ఎల్‌వీ–డీ5 మిషన్: ఈ ప్రయోగంలో జీఎస్ఎల్‌వీ-డీ5 వాహక నౌకను ఉపయోగించి జీశాట్-14 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ కక్ష్యలో ప్రవేశపెట్టారు. 2014, జనవరి 5న ప్రయోగించిన ఈ వాహక నౌకలో భారతదేశం స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్‌ను ఉంచి విజయం సాధించింది.





5) జీఎస్ఎల్‌వీ–ఎఫ్12 మిషన్: దీనిని 2023, మే 29న నిర్వహించారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్12 వాహక నౌక ద్వారా ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇది నావిగేషన్ ఉపగ్రహం. భారతదేశ నావిగేషన్ వ్యవస్థ అయిన నావిక్‌లో ఎన్‌వీఎస్-01 అనేది రెండోతరం ఉపగ్రహాల్లో మొదటిది. ఈ వ్యవస్థలో భాగంగా ఇప్పటికే మొదటితరం ఉపగ్రహాలైన ఐఆర్ఎన్ఎస్ఎస్ ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.



6) జీఎస్ఎల్‌వీ–ఎఫ్14 మిషన్: దీనిని 2024, ఫిబ్రవరి 17న నిర్వహించారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 వాహక నౌకను ఉపయోగించి ఇన్‌శాట్-3Dఎస్ ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఈ ఉపగ్రహం మూడోతరం వాతావరణ పరిశీలనా ఉపగ్రహం. దీనిని నేలపై, సముద్రంపై, వాతావరణాన్ని గుర్తించడానికి, విపత్తు నిర్వహణకు ఉపయోగిస్తారు.



7) జీఎస్ఎల్‌వీ–ఎఫ్16 మిషన్: ఈ మిషన్‌లో భాగంగా జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 అనే రాకెట్‌ను వినియోగించి 'నిసార్' అనే ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. 2025, జులై 30న ఈ ప్రయోగం జరిగింది. నిసార్ పూర్తి పేరు 'నాసా ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్'. ఇది అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా, ఇస్రోల సంయుక్త ఉపగ్రహం. ఇది మైక్రోవేవ్ ఇమేజింగ్ ఉపగ్రహం. భూ ఉపరితలం, మంచు కప్పి ఉన్న ప్రాంతాలు, ద్వీపాలు, సముద్రంలోని మంచు లాంటి వాటిని గుర్తిస్తుంది.



రచయిత: డాక్టర్ బి.నరేష్

కేంద్ర బడ్జెట్ 2026-27


ఆర్థిక పునాదుల బలోపేతానికి మూడు కర్తవ్యాలు!


స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తాజా కేంద్ర బడ్జెట్ రూపుదిద్దుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌తో వరుసగా తొమ్మిదిసార్లు కేంద్ర పద్దు ప్రవేశపెట్టిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పారు. దీర్ఘకాలిక పురోగతి, తయారీ రంగంలో అధిక ఉద్యోగాల కల్పన, ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం, యువశక్తి కేంద్రంగా రూపుదిద్దుకున్న సరికొత్త బడ్జెట్‌లోని ప్రధాన అంశాలు, అందులో ప్రాధాన్యం ఇచ్చిన రంగాలు, లక్ష్యాలు, ప్రవేశపెట్టిన కొత్త పథకాలు, మినహాయింపులు, రాయితీలు, ప్రోత్సాహకాల గురించి పోటీ పరీక్షార్థులు సమగ్రంగా చదువుకోవాలి. రూపాయి రాక, పోక లెక్కలు; బడ్జెట్ లోటు గణాంకాలు, వివిధ రంగాలకు చేసిన కేటాయింపులు, సుంకాలకు సంబంధించిన మార్పులు, ప్రాధాన్య పథకాల్లో ప్రస్తావించిన ప్రాంతాల పేర్లనూ గుర్తుంచుకోవాలి.



నిర్మలా సీతారామన్

ఇండియన్ ఎకానమీ

(ముఖ్యాంశాలు)

1. 2025–26 బడ్జెట్‌తో పోలిస్తే 2026–27 బడ్జెట్‌లో ద్రవ్యలోటుకు సంబంధించి సరైన మార్పును గుర్తించండి.
   1) పెరిగింది 2) తగ్గింది
   3) స్తబ్దత 4) రుణాత్మకం
2. 2026–27 బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులు గత సంవత్సరంతో పోలిస్తే ఎంత శాతం పెరిగాయి?
   1) 10% 2) 12% 3) 15% 4) 16.5%
3. 2047 నాటికి జీడీపీలో సేవల రంగం వృద్ధి ఎంత శాతానికి పెంచాలని తాజా బడ్జెట్‌లో ప్రకటించి, నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు?
   1) 18% 2) 15% 3) 12% 4) 10%
4. 2026–27 బడ్జెట్‌లో ప్రకటించిన హైస్పీడ్ రైల్ కారిడార్లలో కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   1) ముంబయి - పుణె 2) హైదరాబాద్ - చెన్నై
   3) దిల్లీ - వారణాసి
   4) బెంగళూరు - అమరావతి
5. 2026–27 బడ్జెట్‌లో ద్రవ్యలోటు భర్తీకి రానున్న ఆర్థిక సంవత్సరంలో ఎంత మొత్తం రుణం సేకరించాలని బడ్జెట్‌లో పేర్కొన్నారు?
   1) రూ.11.7 లక్షల కోట్లు 2) రూ.17.2 లక్షల కోట్లు
   3) రూ.18.2 లక్షల కోట్లు 4) రూ.14.6 లక్షల కోట్లు
6. 2026–27 బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యం దేనికి ఇస్తున్నారు?
   
   1) ఉన్నత విద్య 2) డిజిటల్ విద్య
   3) ప్రాథమిక విద్య 4) మాధ్యమిక విద్య
7. 2026–27 బడ్జెట్‌లో బాలికా విద్యను ప్రోత్సహించడానికి ఏ అంశానికి ప్రాధాన్యం ఇస్తున్నారు?
   1) బేటీ బచావో - బేటీ పఢావో పథకం విస్తరణ
   2) ప్రతి జిల్లాకు బాలికా వసతి గృహాల ఏర్పాటు
   3) బాలికల ఉన్నత విద్యకు ప్రోత్సాహకాలు
   4) బాలికలకు ఉపకార వేతనాలు మంజూరు
8. కింది వాటిలో 2026–27 బడ్జెట్‌లో పేర్కొన్న 'పీఎమ్–సేతు పథకం' ప్రధాన లక్ష్యాన్ని గుర్తించండి.
   1) ఇంజినీరింగ్ కాలేజీలను ఐటీలుగా మార్చడం.
   2) అత్యాధునిక సాంకేతికతతో ఐటీఐల ఆధునీకరణ.
   3) అన్ని కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టడం.
   4) క్వాంటమ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడం.
9. విదేశాల నుంచి సుంకాల భారం లేకుండా ఎంత విలువైన వస్తువులు తీసుకురావొచ్చని ఈ బడ్జెట్ పేర్కొంది?
   1) రూ.50,000 2) రూ.60,000
   3) రూ.75,000 4) రూ.85,000
10. సమర్థ్–2.0 పథకాన్ని ఏ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు?
    1) కేంద్ర పరిశ్రమలు - వాణిజ్య శాఖ
    2) కేంద్ర ఆర్థిక శాఖ
    3) కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ
    4) కేంద్ర జౌళీ మంత్రిత్వ శాఖ
11. 2026–27 బడ్జెట్‌లో రైల్వేకు సంబంధించిన వ్యయంలో అత్యధిక భాగం దేనికి జరుగుతుంది?
    
    1) రైల్వేస్టేషన్ల ఆధునీకరణ
    2) కొత్త రైల్వే ట్రాక్‌ల నిర్మాణం
    3) రైల్వే ఉద్యోగుల పింఛన్లు
    4) కొత్త భవనాల నిర్మాణం
12. భారతీయ డేటా సెంటర్ల ద్వారా గ్లోబల్ క్లౌడ్ సేవలు అందించడానికి విదేశీ కంపెనీలకు ఏ సంవత్సరం వరకు ట్యాక్స్ హాలిడే ప్రకటించారు?
    1) 2035 2) 2030 3) 2045 4) 2047
13. ఎగుమతులు పెంచడానికి 2030 నాటికి ఏ పంటలకు గ్లోబల్ బ్రాండ్ హోదా కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం?
    1) జీడిపప్పు, మామిడి 2) కోకో, సోయాబీన్
    3) కోకో, బాస్మతి బియ్యం 4) జీడిపప్పు, కోకో
14. 2026–27 బడ్జెట్‌లో మహిళా భద్రత కోసం సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసేలా 'మిషన్ శక్తి'కి ఎంత మొత్తం కేటాయించారు?
    1) రూ.3,605 కోట్లు 2) రూ.4,900 కోట్లు
    3) రూ.4,600 కోట్లు 4) రూ.1,750 కోట్లు
15. తాజా బడ్జెట్‌లో భారతదేశ ఆర్థిక పునాదిని బలోపేతం చేయడానికి మూడు కర్తవ్యాలను రూపొందించారు. అందులోని మొదటి కర్తవ్యంలో కింది వాటిలో లేనిదాన్ని గుర్తించండి.
    1) పారిశ్రామిక ఆధునీకరణ
    2) ఎంఎస్ఎంఈల సాధికారిత
    3) మౌలిక సదుపాయాల్లో పెట్టుబడి
    4) క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే 'ఖేలో ఇండియా మిషన్' ఏర్పాటు.
16. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్ర వనరుల్లో వాటా అందుకునే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ (వెయిటేజీ) ఎన్నో స్థానంలో ఉంది?
    1) 10వ 2) 16వ 3) 8వ 4) 5వ
17. 2026–27 బడ్జెట్‌లో ఏ చికిత్సకు సంబంధించిన 17 రకాల ఔషధాలపై కస్టమ్స్ సుంకం నుంచి మినహాయింపు ఇచ్చారు?
    
    1) గుండె
    2) క్యాన్సర్
    3) హెచ్ఐవీ
    4) ఎనీమియా
18. 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (వీబీ–జీ రామ్ జీ)'కి తాజా బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయించారు?
    1) రూ.72,450 కోట్లు 2) రూ.95,692 కోట్లు
    3) రూ.90,000 కోట్లు 4) రూ.86,500 కోట్లు
19. 2026–27 బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు కేటాయింపులు గత బడ్జెట్ కంటే ఎంత శాతం ఎక్కువ?
    1) 7.12% 2) 8.14% 3) 7.61% 4) 9%
20. 2026–27 బడ్జెట్‌లో ఆహారం, ఇంధనం, ఎరువులకు ఇస్తున్న రాయితీల్లో ఎంతమేర కోత విధించారు?
    1) 5.12% 2) 4.47% 3) 3.21% 4) 4.12%
21. 16వ ఆర్థిక సంఘం సిఫార్సులతో రాష్ట్రాలకు ఇచ్చే వనరులకు వెయిటేజీ ఇవ్వడంలో కింది ఏ అంశానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు?
    1) డెమోగ్రాఫిక్ పనితీరు 2) ఏరియా
    3) జనాభా (2011 సెన్సస్)
    4) ట్యాక్స్ అండ్ ఫిస్కల్ ఎఫెక్ట్
22. భారత చారిత్రక కట్టడాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ఉద్దేశించిన సజీవ సాంస్కృతిక గమ్యస్థానాలుగా ఎంపికైన లోదల్ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఉత్తర్‌ప్రదేశ్ 2) హరియాణా
    3) రాజస్థాన్ 4) గుజరాత్
23. 2026–27 బడ్జెట్‌లో ప్రత్యేక నగర ఆర్థిక మండలికి ఎంపికైన ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణం?
    1) తిరుపతి 2) విజయవాడ
    3) గుంటూరు 4) విశాఖపట్టణం
24. 2026–27 బడ్జెట్‌లో రూపాయి పోకకు సంబంధించి అధికవ్యయం వేటిలో జరుగుతుంది?
    1) వడ్డీ చెల్లింపులు
    2) పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటా
    3) కేంద్ర రంగ పథకాలు 4) సబ్సిడీలు
25. 2026–27 బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త ఆదాయ పన్ను చట్టం– 2025 ఎప్పటినుంచి అమల్లోకి వస్తుంది?
    

    1) 2026, ఆగస్టు 15
    2) 2026, ఏప్రిల్ 1
    3) 2026, మార్చి 15
    4) 2026, అక్టోబరు 2
26. 2026–27 బడ్జెట్ ప్రకారం వ్యక్తిగత ఉపయోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకం రేటు 20% నుంచి ఎంతకు తగ్గించారు?
    1) 5% 2) 10% 3) 15 % 4) 17%
27. ప్రపంచస్థాయి యాత్రా/ట్రెక్కింగ్ కేంద్రంగా ఎంపికైన 'పొధిగయి' ప్రదేశం ఏ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉంది?
    1) కేరళ - కర్ణాటక 2) బిహార్ - ఉత్తరాఖండ్
    3) తమిళనాడు - కేరళ
    4) అరుణాచల్‌ప్రదేశ్ - సిక్కిం
28. 2026–27 బడ్జెట్‌లో రూపాయి రాకకు సంబంధించి ప్రత్యక్ష పన్నుల ద్వారా ఎంత మేర సమకూరుతోంది?
    1) 39 పైసలు 2) 21 పైసలు
    3) 19 పైసలు 4) 34 పైసలు
29. కింది వాటిలో 2026–27 బడ్జెట్‌లో ప్రకటించిన బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధిలో లేని రాష్ట్రాన్ని గుర్తించండి.
    1) సిక్కిం 2) అస్సాం
    3) నాగాలాండ్ 4) మిజోరం
30. వివిధ రంగాల్లో కర్బన ఉద్గారాల నియంత్రణ కోసం కార్బన్ క్యాప్చర్ అండ్ యుటిలైజేషన్ పథకాన్ని ఎంత మొత్తంతో ప్రవేశపెట్టనున్నారు?
    1) రూ.15,000 కోట్లు 2) రూ.20,000 కోట్లు
    3) రూ.30,000 కోట్లు 4) రూ.21,000 కోట్లు
31. కింది వాటిలో 2026–27 బడ్జెట్‌కు సంబంధించిన లక్ష్యాల్లో సరికానిది గుర్తించండి.
    1) వనరుల కేటాయింపు 2) ఆర్థిక స్థిరీకరణ
    3) ఆదాయ పునఃపంపిణీ
    4) రాష్ట్రాలకు అధిక మొత్తం కేటాయింపులు
32. బడ్జెట్‌కు సంబంధించి రాజ్యాంగ నిబంధనల్లో కింది వాటిలో సరికానిది గుర్తించండి.
    1) ఆర్టికల్ 112 - వార్షిక ఆర్థిక నివేదిక
    2) ఆర్టికల్ 114 - కేటాయింపు బిల్లులకు సంబంధించి
    3) ఆర్టికల్ 110 - ద్రవ్యబిల్లు నిర్వచనం
    4) ఆర్టికల్ 265 - భారత అగంతుక నిధి
33. 2026–27 బడ్జెట్‌లో జీడీపీలో మొత్తం రుణాల నిష్పత్తి, 2025–26 బడ్జెట్ కంటే...
    1) తగ్గింది 2) పెరిగింది
    3) ఎలాంటి మార్పు లేదు 4) రుణాత్మకం
34. 2022లో ప్రారంభించిన మిషన్ అమృత్ సరోవర్ అనేది..
    

    1) నీటి సంరక్షణ పథకం
    2) బహుళార్థ సాధక ప్రాజెక్టు
    3) వరద నీటిని నిల్వ చేసే కాలువలు
    4) ఏదీకాదు
35. ఒకే ప్రధాని హయాంలో కేంద్ర బడ్జెట్‌ను తొమ్మిది సార్లు ప్రవేశపెట్టిన ఘనత ఎవరికి దక్కింది?
    1) ప్రణబ్ ముఖర్జీ 2) మొరార్జీ దేశాయ్
    3) నిర్మలా సీతారామన్ 4) పి. చిదంబరం
36. 7.7 కోట్ల మందికి ప్రయోజనం చేకూర్చే కిసాన్ క్రెడిట్ కార్డుల పథకంలో లేని వారిని గుర్తించండి?
    1) మత్స్యకారులు 2) రైతులు
    3) పాడి రైతులు 4) ఉద్యానవనాల సాగుదారులు
37. తాజా కేంద్ర బడ్జెట్‌లో జాతీయ ప్రాజెక్టుగా పోలవరానికి ఎంత మొత్తం కేటాయించారు?
    
    1) రూ.4,730 కోట్లు 2) రూ.3,320 కోట్లు
    3) రూ.4,318 కోట్లు 4) రూ.5,512 కోట్లు
38. 2026–27 బడ్జెట్ లోటుకు సంబంధించి కింది వాటిలో సరైంది గుర్తించండి?
    ఎ) రెవెన్యూ లోటులో ఎలాంటి మార్పు లేదు
    బి) వాస్తవ రెవెన్యూ లోటు తగ్గింది
    సి) ప్రాథమిక లోటు తగ్గింది
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి

సమాధానాలు

1-2, 2-3, 3-4, 4-4, 5-2, 6-1, 7-2, 8-2, 9-3, 10-4, 11-3, 12-4, 13-4, 14-1, 15-4, 16-3, 17-2, 18-2, 19-1, 20-2, 21-3, 22-4, 23-4, 24-2, 25-2, 26-2, 27-3, 28-1, 29-3, 30-2, 31-4, 32-4, 33-1, 34-1, 35-3, 36-4, 37-2, 38-3.

ప్రాణాలు పోతున్నా... పాఠాలు నేర్వరా?

- బాణసంచా తయారీ కేంద్రాల్లో తరచూ పేలుళ్లు
- 12 ఏళ్లలో 70 మందికి పైగా మృతి
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఈనాడు, అమరావతి: బాణసంచా తయారీ కేంద్రాల్లో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన... అధికార యంత్రాంగం పర్యవేక్షణ లోపం ఫలితంగా తరచూ భారీ పేలుళ్లు చోటుచేసుకుని.. ఆ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో కార్మికుల ప్రాణాలు పోతున్నా ఆ ఘటనల నుంచి అటు అధికార యంత్రాంగం, ఇటు నిర్వాహకులు ఎవరూ పాఠాలు నేర్వట్లేదు. గత 12 ఏళ్లలో రాష్ట్రంలో జరిగిన ఇలాంటి ప్రమాదాల్లో దాదాపు 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. గతేడాది ఏప్రిల్‌లో అనకాపల్లి జిల్లాలో జరిగిన ప్రమాదం మరవక ముందే.. అక్టోబరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం చోటుచేసుకుని పలువురు మరణించారు. వాటి నుంచి బయటపడకముందే శనివారం కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన మరో దుర్ఘటన మరోసారి వ్యవస్థాగత లోపాల్ని ఎత్తిచూపుతోంది.

లైసెన్సు జారీ చేసేసి.. చేతులు దులిపేసుకుంటున్నారు..

అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ, కార్మిక శాఖలు, స్థానిక సంస్థలు, కాలుష్య నియంత్రణ మండలి వంటి సంబంధిత విభాగాలన్నింటి నుంచి నిరభ్యంతర పత్రాలు అందిన తర్వాత బాణసంచా తయారీ కేంద్రాల ఏర్పాటుకు ఐదేళ్ల కాలపరిమితితో జిల్లా కలెక్టర్ లైసెన్సులు జారీ చేస్తున్నారు. ఒకసారి ఆ లైసెన్సు ఇచ్చేసిన తర్వాత ఇక ఆ తయారీ కేంద్రాల వైపు అధికారులు కన్నెత్తి చూడట్లేదు. లైసెన్సు జారీ చేసిన సమయంలో నిర్దేశించిన నిబంధనలు పాటిస్తున్నారా? భద్రతా చర్యలు అమలవుతున్నాయా? అనేది పరిశీలించే దిక్కే ఉండట్లేదు. ఎప్పటికప్పుడు తమకు అందాల్సిన లంచాలు అందుతున్నాయా? లేదా? అనేది మాత్రమే చూసుకుంటున్నారనే ఫిర్యాదులున్నాయి. దీంతో బాణసంచా తయారీ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు పాతరేస్తున్నారు.

● నిబంధనల ప్రకారం రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ సహా సంబంధిత విభాగాల అధికారులందరూ కలిసి ఎప్పటికప్పుడు ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలి. రాష్ట్రంలోని ఏ ఒక్క జిల్లాలోనూ ఈ ఉమ్మడి తనిఖీలు సరిగ్గా నిర్వహించట్లేదు. నిజంగా తనిఖీలు చేసి ఉల్లంఘనలు గుర్తిస్తే ప్రారంభంలోనే అడ్డుకట్ట వేసి ప్రమాదాలు నియంత్రించేందుకు వీలుండేది. అధికార యంత్రాంగానికి అవేవీ పట్టకపోవటం పెను ప్రమాదాలకు దారితీస్తోంది.

● అనుమతులు పొందే సమయంలో ఒక్కో బాణసంచా తయారీ కేంద్రంలో 5-6 మంది కార్మికులే పని చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నా..... ఒక్కో చోట కనీసం 20 నుంచి 40 మంది వరకూ ఈ కేంద్రాల్లో పనిచేస్తుంటారు. 10 మందికి మించి కార్మికులు పనిచేస్తే కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలి. కానీ వారు పట్టించుకోవట్లేదు.

● బాణసంచా తయారీ కేంద్రాల్లో గరిష్ఠంగా అన్ని రకాల ముడిపదార్థాలు కలిపి 50 కిలోల వరకే నిల్వ ఉంచాలి. అది పూర్తిగా ఖాళీ అయిపోయిన తర్వాతే మళ్లీ ముడిసరుకు తెచ్చుకోవాలి. నిర్వాహకులెవరూ ఈ నిబంధన పాటించట్లేదు. ఒకేసారి వందల కిలోల ముడిపదార్థాలు కొనుగోలు చేసేసి నిల్వ చేస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు తీవ్రత పెరగటానికి, భారీ ప్రాణనష్టానికి ఇదే కారణమవుతోంది.

● బాణసంచా పేల్చేటప్పుడు భారీ శబ్దాలు రావాలనే ఉద్దేశంతో చాలా మంది నిర్వాహకులు కొన్ని రకాల రసాయనాలు వాడుతున్నారు. బాణసంచా తయారీలో ఏయే ముడి పదార్థాలు, ఎంతెంత మోతాదులో వాడుతున్నారో గుర్తించే వ్యవస్థ అందుబాటులో లేకపోవటంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

● ఈ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికులంతా నైపుణ్యం లేని వారే. వారు రోజు కూలీలు... ఏ రసాయనాన్ని ఎంత మోతాదులో, ఎలా మిశ్రమంలో దట్టించాలో తెలియని పరిస్థితి. ఈ క్రమంలో చిన్న తేడా వచ్చినా భారీ ప్రమాదాలకు దారితీస్తోంది.

కఠిన చర్యలు తీసుకుంటేనే...

● రాష్ట్ర వ్యాప్తంగా 93 బాణసంచా తయారీ యూనిట్లు, 152 గోడౌన్లున్నాయి. వీటిల్లో అత్యధికం డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల పరిధిలోనే ఉన్నాయి. ఇవి అధికారికంగా అనుమతి పొందినవి. అసలు అనుమతులే లేకుండా నడుస్తున్నవి అనేకమున్నాయి. వాటిల్లో ఇంకా దారుణ పరిస్థితులున్నాయి. ఇప్పటికైనా మేల్కొని.. కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.



కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో పేలుడు ధాటికి పరిశ్రమలోని రేకులషెడ్‌లో ఎగసిపడుతున్న మంటలు

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన

● అదనంగా కూలీలు.. అడ్డగోలుగా నిల్వ

ఈనాడు, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రాల్లో ఏటా పేలుళ్ల పదుల సంఖ్యలో కూలీలు, సామాన్యులు బలైపోతున్నారు. గతేడాది అక్టోబరు 8న మండపేట నియోజకవర్గం రాయవరంలోని ఓ తయారీ కేంద్రంలో జరిగిన బాణసంచా విస్ఫోటంలో 10 మంది దుర్మరణం పాలయ్యారు. అప్పుడు బాణసంచా తయారీ కేంద్రాలన్నింటినీ అధికారులు మూసివేయించారు. పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించి, కార్మికులకు బీమా తదితర సదుపాయాలు కల్పించాకే తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ, అధికారులు తనిఖీలను విస్మరించిన ఫలితంగా.. అదే తరహా ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి.

తాజాగా వేట్లపాలెం ఘటన రాయవరం ప్రమాదానికి రెండింతల ప్రాణనష్టాన్ని కలిగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 బాణసంచా తయారీ కేంద్రాలుండగా ఒక్కోచోట గరిష్ఠంగా 15 కిలోల సామర్థ్యంతో మాత్రమే టపాసుల తయారీకి అనుమతి ఉంది. వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్ క్రాకర్స్ తయారీ కేంద్రంలో వందల కిలోల బాణసంచా తయారీ ఆనవాళ్లు కనిపించాయి. ఆ ప్రాంగణంలో, సమీప పొలాల్లో 15 పటాస్ పీపాలు కనిపించాయి. ఎక్కడపడితే అక్కడ బాంబులు, భాస్వరం, పొటాషియం పొడి పోగుపడ్డాయి. సాధారణంగా టపాసుల తయారీ పూర్తయ్యాక నిల్వలు ఇక్కడ ఉంచకూడదు.

● ఒక్కో కేంద్రంలో పది మందికి మించి కార్మికులు పని చేయకూడదన్న నిబంధన ఉన్నా, ఇక్కడ 50 మంది వరకు పనిచేస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ● తయారీ కేంద్రంలో 4 షెడ్లు (మిక్సింగ్ యూనిట్, డ్రైయింగ్, మేకింగ్, ముడిసరకు నిల్వ) ఉండి, వాటిలో రెండుచోట్ల మాత్రమే నలుగురు చొప్పున కూలీలు ఉండాలి. తయారైన బాణసంచాను అక్కడ నిల్వ ఉంచకూడదు. దాదాపు ఎకరన్నర విస్తీర్ణంలో ఉన్న ఈ కేంద్రంలో ఏడు షెడ్లుండగా, పేలుడు ధాటికి నాలుగు నేలమట్టమయ్యాయి. మిగతావి దెబ్బతిన్నాయి. బాణసంచా నిల్వలు భారీగా ఉండడం వల్లే తీవ్రత పెరిగింది. ● ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్ సేఫ్టీ నిబంధనల మేరకు నీటిట్యాంకు, పైపులైన్లు, ఇతర అగ్నిమాపక పరికరాలు పని చేయాల్సి ఉండగా.. ఆ స్థాయిలో నిర్వహణ లేదు. ప్రమాద నివారణ చర్యలు మొక్కుబడిగా కన్పించాయి.

దుర్ఘటన విచారకరం

● స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుర్ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

బాణసంచా పేలుడు ఘటనపై వైద్యారోగ్య శాఖ మంత్రి దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: వేట్లపాలెంలో బాణసంచా పేలుడు ఘటనపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. ఘటనాస్థలానికి అంబులెన్సులు, సూపర్ స్పెషాలిటీ వైద్యులు, సిబ్బందిని పంపాలని సూచించారు.

పేలుడు ఘటన దురదృష్టకరం

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

ఈనాడు, అమరావతి: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటన దురదృష్టకరమని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఈ ఘటనలో అనేకమంది మృతి చెందడం తనను కలచి వేసిందని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని కోరారు.

కృత్రిమ మేధపై అధ్యాపకులకు ఐదు రోజుల కార్యశాల

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల అధ్యాపకులకు 'డిసిప్లేన్- స్పెసిఫిక్ అప్లికేషన్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అంశంపై ఐదు రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ సెల్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీలో ఈ నెల 2 నుంచి 6 వరకు ఈ కార్యశాల జరగనుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, కళాశాల విద్య కమిషనరేట్ సహకారం, రూసా నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నూతన జాతీయ విద్యా విధానం, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 200 మంది అధ్యాపకులకు ఈ శిక్షణ ఇస్తారు. వాణిజ్యం, లైఫ్ సైన్సెస్, ఫిజికల్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్, కంప్యూటర్ సైన్స్ తదితర విభాగాలకు అన్వయించేలా కోడ్ అవసరం లేకుండా వినియోగించే ఏఐ సాధనాలపై అవగాహన కల్పిస్తారని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి బి.తిరుపతిరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ వైకాపా

● మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత

ఈనాడు, అమరావతి: కుట్రలు, కుతంత్రాలకు వైకాపా కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత విమర్శించారు. చట్టసభల్లో కల్తీ నెయ్యి గురించి చర్చించే దమ్ములేక.. 'సాక్షి' పత్రికలో ప్రజారోగ్యంపై తప్పుడు కథనాలు రాయిస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. "గత ప్రభుత్వంలో నీటి కాలుష్యంతో ఏలూరులో వందల మంది ఆసుపత్రుల పాలయ్యారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా తాగి 25 మంది కన్నుమూశారు. నంద్యాల, రామతీర్థం, కాకినాడ తదితర ప్రాంతాల్లో అతిసారం ప్రబలి ప్రజలు పిట్టల్లా రాలిపోయారు" అని సుజాత విమర్శించారు.



ఏడాదికి ఒకసారైనా ఈ 11 పరీక్షలు చేయించుకోండి

చికిత్స కన్నా నివారణ ఉత్తమం. అందుకే ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యస్థితిని తెలుసుకోవడం మేలు. కనీసం ఏడాదికి ఒకసారైనా చేయించుకోవాల్సిన పరీక్షలివీ. **1.**కంప్లీట్ బ్లడ్ కౌంట్ **2.**లిపిడ్ ప్రొఫైల్ **3.**కిడ్నీ ఫంక్షన్ కౌంట్ **4.**లివర్ ఫంక్షన్ కౌంట్ **5.**థైరాయిడ్ ప్యానెల్ **6.** హెబీఏ1సీ **7.**ఫాస్టింగ్ ఇన్సులిన్ **8.**సి-రియాక్టివ్ ప్రొటీన్ **9.**విటమిన్ బీ12 **10.**ఐరన్ స్టడీస్ **11.**విటమిన్ డీ3

– శ్రేయా షా, న్యూట్రీషనిస్ట్

అగ్నిమాపక నిబంధనలన్నీ గాలికి..

● ఎక్కడా అమలు చేస్తున్న దాఖలాల్లేవు

ఈనాడు- అమరావతి: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం రాయవరంలో గత ఏడాది అక్టోబరు 8న బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం తర్వాత అగ్నిమాపకశాఖ కొన్ని నియమ నిబంధనలు నిర్దేశించింది. అవి కచ్చితంగా పాటించాలని ఆదేశించింది. తాజాగా ప్రమాదం నేపథ్యంలో పరిశీలిస్తే రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల్లో ఈ నిబంధనలన్నీ గాలికొదిలేశారు.

● బాణసంచా తయారీ కేంద్రాలు ఒకే అంతస్తు నిర్మాణంగా ఉండాలి. ఇతర నిర్మాణాలకు దూరంగా ఉండాలి. బలహీనమైన గోడలు ఉండాలి. పేలుడు సంభవిస్తే ఆ ప్రభావం బయటకు వెళ్లేలా ఉండాలి.

● లైసెన్సు పొందిన కర్మాగారాల్లో మాత్రమే బాణసంచా తయారు చేయాలి. ఉత్పత్తి షెడ్లు జనావాసాలకు దూరంగా ఉండాలి.

● మండే వ్యర్థాలు పేరుకుపోకుండా చూసుకోవాలి. దుమ్ము కూడా ఉండకూడదు. పగుళ్లలో దుమ్ము పేరుకుపోకుండా మండే స్వభావం లేని పదార్థాలను ఉపయోగించాలి.

● తయారీ కేంద్రాల్లో నిప్పు రాజేసే ఏ పనులూ చేయకూడదు. విద్యుత్తు హీటర్లు వాడకూడదు. ధూమపానం అనుమతించకూడదు. విద్యుత్తు వైర్లు, లైనింగ్‌బీ పేలుడు నిరోధకంగా ఉండాలి.

● రసాయన మిక్సింగ్ వంటి ప్రమాదకరమైన ప్రక్రియల్లో ఆటోమేషన్ ఉపయోగించాలి.

● రాత్రి వేళల్లో బాణసంచా తయారీ నిషేధం. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5.30 వరకు మాత్రమే తయారీ కార్యకలాపాలు అనుమతించాలి.

పదార్థాలు ఎక్కువ నిల్వ తగదు

● ఒక రోజు ఉత్పత్తికి అవసరమైన రసాయన మిశ్రమాన్ని మాత్రమే తయారీ గదుల్లోకి తీసుకువెళ్లాలి.

● రసాయనాలను కలిపిన వెంటనే ఫిల్లింగ్ ఆపరేషన్లు చేయాలి. ● ప్రతికూల రసాయనాలను ఒకే చోట నిల్వ చేయకూడదు. ● ఉపయోగించిన రసాయన మిశ్రమాలను, ఇతర అవశేష వ్యర్థాలను గుంతల్లో పోసి, సురక్షితంగా కాల్చివేయాలి.

● బాణసంచాను బహిరంగంగా ఎండలో ఎండబెట్టకూడదు. అగ్ని నిరోధక ఫ్లోరింగులు ఉన్న చోట మాత్రమే ఆరబెట్టాలి.

● ఉత్పత్తి చేసిన బాణసంచాను ఆ ప్రాంతానికి దూరంగా ప్రత్యేక రక్షణ వ్యవస్థతో నిల్వ చేయాలి. లైసెన్సు పొందిన పరిమితి మేరకు నిల్వ చేయాలి.

● అక్కడ ధూమపానం వద్దు, మొబైల్ ఫోన్లు వాడవద్దు అన్న బోర్డులు ప్రముఖంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి.

● పేలుడు పదార్థాలు తయారుచేసే చోటకు మొబైల్ ఫోన్లు, టెలివిజను, రేడియో రిమోట్ కంట్రోల్, బ్లూటూత్ పరికరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకూడదు.

● జిల్లా మేజిస్ట్రేట్ జారీ చేసిన చెల్లుబాటు అయ్యే లైసెన్సుతోనే పని చేయాలి.

● శబ్దం, కాలుష్య ప్రమాణాలకు అనుగుణంగా ఉండే గ్రీన్ టపాసులను మాత్రమే తయారు చేయాలి.

అగ్ని గుర్తింపు అలారాలు ముఖ్యం

● బాణసంచా తయారీ ప్రాంతాల్లో వేడి, పొగ డిటెక్టర్లతో సహా ఆటోమేటిక్ అగ్ని గుర్తింపు వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.

● తగిన అగ్నిమాపక యంత్రాలను సులభంగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. స్ప్రింక్లర్లు, వాటర్ మిస్ట్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి.

● అత్యవసర ప్రతిస్పందన ప్రణాళికలు తరలింపు విధానాలను రూపొందించి, క్రమం తప్పకుండా సాధన చేయించాలి.

● పేలుడు సంభవిస్తే వెంటనే ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలి. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించకూడదు.

కార్మికుల భద్రతకూ చర్యలు

● బాణసంచా తయారీ కేంద్రాల్లో కార్మికులు భద్రతాపరమైన పరికరాలు వినియోగించాలి. గాగుల్స్, అగ్ని నిరోధక కాటన్ దుస్తులు, పాదరక్షలు వంటివి వాడాలి. వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించాలి.


● ఇత్తడి కత్తులు, చెక్క వస్తువులు వంటి స్పార్క్‌కు అవకాశం లేని పరికరాలు మాత్రమే వినియోగించాలి.

● మద్యం సేవించిన ఉద్యోగులను లోపలికి అనుమతించకూడదు.

● సురక్షిత పని పద్ధతులపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలి. సర్టిఫైడ్, శిక్షణ పొందిన పనివారితో మాత్రమే రసాయనాలు కలిపే ప్రమాదకర పనులకు అనుమతించాలి.

● పని ప్రాంతాల్లో ఉద్యోగుల సంఖ్యను పరిమితం చేయాలి.

● రోజువారీగా కార్మికుల భద్రతా విధానాలు పాటించేలా చూడాలి. 18 ఏళ్లలోపు వారిని అనుమతించకూడదు.



హైకోర్టు న్యాయమూర్తుల కోసం అమరావతిలో నిర్మించిన నివాస సముదాయం ఇది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం వీటిని ప్రారంభించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రాణం పోయినా.. నలుగురికి ఆయువయ్యాడు

- లండన్ అగ్నిప్రమాదంలో గాయపడిన.. నిజామాబాద్ యువకుడి జీవన్మృతి
- అక్కడే అవయవదానానికి అంగీకరించిన తల్లిదండ్రులు



సాయిశ్రీకర్

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: లండన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న నిజామాబాద్ యువకుడు సాయిశ్రీకర్‌ను వైద్యులు శుక్రవారం జీవన్మృతుడిగా ప్రకటించారు. అంతకష్టంలోనూ కన్నీళ్లు దిగమింగుకున్న అతని తల్లిదండ్రులు కుమారుడి అవయవాలను దానం చేశారు. వివరాలివీ... నిజామాబాద్ నగరంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన కామినేని ఆంజనేయ ప్రసాద్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సాయిశ్రీకర్(26) ఉన్నారు. ఎంఎస్ చదివేందుకు సాయిశ్రీకర్ 2024 ఫిబ్రవరి 4న లండన్ వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి క్రొయిడాన్‌లోని డుప్పాస్ హిల్స్ టెర్రాస్ రెండో అంతస్తులో నివాసముంటున్నాడు. కొద్ది వారాల క్రితమే చదువు పూర్తికాగా దేశానికి త్వరలో తిరిగి రావాల్సి ఉంది. అంతలోనే గత నెల 24వ తేదీ అర్ధరాత్రి భవనంలో అగ్నిప్రమాదం జరిగి... ఏపీలోని కాకినాడ జిల్లా కొండయ్యపేటకు చెందిన యువకుడు గొంతి అభిషేక్(28) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా... తీవ్ర గాయాలైన సాయిశ్రీకర్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం రాత్రి అతను బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు బాధిత తల్లిదండ్రులను వైద్యులు ఫోన్లో సంప్రదించగా సాయిశ్రీకర్ అవయవదానానికి వారు అంగీకరించారు. అతని గుండె, కాలేయం, మూత్రపిండాలను ఇతరులకు అమర్చినట్లు లండన్ వైద్యులు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



'విజ్ఞాన్ వైభవ్'లో ప్రదర్శనలు తిలకిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి

ఆవిష్కరణల కేంద్రంగా భారత్

● 'విజ్ఞాన్ వైభవ్'లో జి.కిషన్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రపంచానికే ఆవిష్కరణల కేంద్రంగా భారత్ వృద్ధి చెందుతోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. పురాతన కాలం నుంచే భారతీయులు ప్రకృతి రహస్యాలను ఛేదించి, మానవాళికి మేలు చేసే ఆవిష్కరణల్లో ముందున్నారని గుర్తుచేశారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ (కేవైఈ) ఆధ్వర్యంలో 'విజ్ఞాన్ వైభవ్-2026' పేరిట గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మేధోశక్తి దేశ సార్వభౌమాధికారానికి ప్రతీక అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో దేశం సాధించిన పురోగతి ప్రపంచానికి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డా.జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం సాధించిన శాస్త్రీయ విజయాల వేడుకగా విజ్ఞాన్ వైభవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యోమగామి కెప్టెన్ శుభాన్షు శుక్లా మాట్లాడుతూ.. సైన్స్ గురించి చర్చించడం, దాన్ని పండగలా జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇస్రో హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ డా.డి.కె.సింగ్, ఐఐటీ హైదరాబాద్ అకడమిక్స్ డీన్ ప్రొఫెసర్ అశోక్‌కుమార్ పాండే తదితరులు పాల్గొన్నారు.

'జల వివాదాల కమిటీ'కి ఎజెండా పంపండి

● తెలంగాణ, ఏపీలకు కేంద్ర జలసంఘం లేఖ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సంబంధించిన వివాదాలు, సమస్యల ఎజెండాలను వెంటనే పంపాలని కేంద్రం రెండు రాష్ట్రాలను తాజాగా కోరింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ, ఏపీ జలవనరుల శాఖలకు వేర్వేరుగా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) లేఖలు రాసింది. అందిన సమాచారం మేరకు...జనవరి 30న దిల్లీలో రెండు రాష్ట్రాల నీటిపారుదల, జలవనరుల శాఖల ముఖ్య అధికారులు, గోదావరి, కృష్ణా బోర్డుల ఛైర్మన్లతో సీడబ్ల్యూసీ జల వివాదాల కమిటీ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు.. వారంలోగా రెండు రాష్ట్రాలు ఎజెండాలను ఖరారు చేయాల్సి ఉంది. అయినప్పటికీ రాష్ట్రాలు మిన్నకుండి పోయాయి. 'ఎజెండాలను సిద్ధం చేసుకుని వాటిని పరస్పరం పంపించుకుని చర్చించుకోవాలి. రాష్ట్రాలు ఎజెండాలపై అభిప్రాయాలు పంచుకున్న తరువాత 15 రోజుల్లో కేంద్రానికి అభిప్రాయాలు అందజేయాలి. అనంతరం సీడబ్ల్యూసీ రెండు రాష్ట్రాలతో ఆయా అంశాలపై సమావేశాన్ని నిర్వహిస్తుంది' అని నాటి సమావేశంలో నిర్ణయించారు. ఈ విషయాన్ని సమావేశ మినిట్స్‌లోనూ సీడబ్ల్యూసీ పేర్కొంది. నెల రోజులు గడిచినా రెండు రాష్ట్రాలు ఎజెండాలు పంపకపోవడంపై తాజాగా సీడబ్ల్యూసీ స్పందించింది. సమావేశం నాటి నిర్ణయాలను రాష్ట్రాలకు గుర్తు చేస్తూ లేఖ రాసింది. వీలైనంత త్వరగా ఎజెండాలను అందజేయాలని పేర్కొంది.

పాత సీఎస్‌కు వీడ్కోలు.. కొత్త సీఎస్‌కు స్వాగతం..

● సత్కరించిన ఉద్యోగ సంఘాల నేతలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా విజయానంద్ ఉద్యోగుల సంక్షేమానికి, పరిపాలనలో పారదర్శకత పెంపునకు కృషిచేశారని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు అన్నారు. పదవీ విరమణ పొందిన విజయానంద్‌ను సంఘ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో శనివారం సత్కరించారు. నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన సాయిప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఆర్ఎస్ఏ, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపీ గవర్నమెంట్ వెహికల్ డ్రైవర్స్ సెంట్రల్ అసోసియేషన్, ఏపీ క్లాస్-4 ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం, ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసోసియేషన్, ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్, అగ్నిమాపక, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్, ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త సీఎస్‌ను కలిసిన ఏపీ ఎన్జీవో నేతలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సాయిప్రసాద్‌ను ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, కోశాధికారి భారతి ప్రసాద్, ఉపాధ్యక్షులు షరీఫ్, జానీబాషా తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధికి సంఘం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

ఉన్నత విద్యను పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యా శాఖను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల విద్య కమిషనరేట్ (సీసీఈ) స్థానంలో కొత్తగా ఉన్నత విద్య కమిషనరేట్ (సీహెచ్ఈ)ను ఏర్పాటు చేసింది. గతంలో సీసీఈ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మాత్రమే ఉండగా.. ప్రస్తుతం సీహెచ్ఈ పరిధిలోకి వీటితోపాటు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను తీసుకొచ్చింది. నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ పరిధిలో ఉన్న సాంకేతిక విద్యాశాఖ కమిషనరేట్ (సీటీఈ)ను ప్రభుత్వం రద్దుచేసింది. దీని పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలను సీహెచ్ఈలోకి తెచ్చింది. ఇంజినీరింగ్ కళాశాలలకు నిరభ్యంతర పత్రాలు, కొత్త కోర్సులు, ఫీజుల నిర్ణయం, యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు సైతం ఈ పరిధిలో ఉంటాయి. ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను ఉన్నత విద్యా మండలికి, ప్రవేశాల ప్రక్రియను సీహెచ్ఈకి అప్పగించింది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, బీఈడీ, బీపీఈడీ, పీజీ కళాశాలల కోర్సుల అనుమతులు సీహెచ్ఈ ఇస్తుంది. ఇప్పటివరకు సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న విధులు సైతం ఈ పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలలు, సాంకేతిక విద్య శిక్షణ మండలి సీహెచ్ఈ కొత్త కమిషనరేట్ పరిధిలో కొనసాగుతాయి. ఈఏపీసెట్, ఐసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్, డిగ్రీ కళాశాలల ప్రవేశాల కౌన్సెలింగ్‌ను సైతం నిర్వహిస్తుంది. సీహెచ్ఈ కమిషనర్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ హోదాలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సైతం పర్యవేక్షిస్తారు. అపార్ ఐడీ, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్, డిజిలాకర్ వంటి విధులు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ ఈ కమిషనరేటే చూస్తుంది. ఉన్నత విద్యలో నాణ్యత, విద్యా ప్రణాళిక (కరిక్యులం) సంస్కరణలు, పరిశోధన, ఆవిష్కరణలు, ప్రణాళిక, సమన్వయం ఉన్నత విద్యా మండలి పర్యవేక్షిస్తుంది. ఉన్నత విద్యా మండలి చట్టంలోని అధికారాలు, విధుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు.

పసిగుడ్డును నీటితొట్టెలో వేసి హత్య

బిజినేపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలో దారుణం చోటుచేసుకొంది. మూడు నెలల పసిగుడ్డును నీటి తొట్టెలో వేసి హత్య చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం... పాలెం గ్రామానికి చెందిన నాగయ్య, నర్సమ్మల కుమార్తె నీలమ్మను ఏడేళ్ల క్రితం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం షాగాపూర్‌కు చెందిన నరేందర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు సంతానం. మూడేళ్లుగా దంపతుల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా నీలమ్మ తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. భర్త నరేందర్ అప్పుడప్పుడు భార్య వద్దకు వస్తుండేవాడు. ఇదే క్రమంలో నీలమ్మ మూడోసారి గర్భం దాల్చి రెండు నెలల కిందట మగబిడ్డకు జన్మనిచ్చారు. కాగా, శుక్రవారం సాయంత్రం నరేందర్ గ్రామానికి వచ్చి భార్యను తన వెంట పంపించాలని కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అందుకు నీలమ్మ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అదేరోజు రాత్రి నీలమ్మ చిన్నారితో కలిసి ఇంట్లో నిద్రించారు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో తల్లికి మెలకువ వచ్చి చూడగా... బాలుడు కన్పించలేదు. ఇంటి ఆవరణలో చిన్నారి కోసం వెతుకుతుండగా.. నీటితొట్టెలో మృతదేహం కనిపించింది. బాలుడిని హతమార్చింది తన భర్త నరేందరేనని, బిడ్డ తనకు పుట్టలేదని వాదించేవాడని నీలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.